సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 350

బుధవారం 12-3-2025


SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'



విజయంతో ముగించిన బెంగళూరు.. -12లో



గరిమెళ్ల గళంలో అన్నమయ్య అమృతం -11లో



రాజ్యసభలో ఖర్గే క్షమాపణ

రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో చివరకు ఆయన క్షమాపణ చెప్పారు.

- వివరాలు 6లో



మరో 25% టారిఫ్ వేస్తున్నాం

కెనడా నుంచి స్టీల్, అల్యూమినియం దిగుమతులపై మరో 25% టారిఫ్‌ను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

- వివరాలు 6లో



నాగపూర్ ప్లాన్ అంగీకరించం

జాతీయ విద్యావిధానం విధ్వంసకర నాగపూర్ ప్లాన్ అని.. దాన్ని అంగీకరించబోమని తమిళనాడు సీఎం స్టాలిన్ తేల్చిచెప్పారు.

- వివరాలు 6లో



టారిఫ్‌లు తగ్గిస్తామనలేదు

అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు తగ్గిస్తామని ఎవరికీ హామీ ఇవ్వలేదని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ తెలిపారు.

- వివరాలు 6లో

అనుభవం, జ్ఞానం లేదు..

కామన్‌సెన్స్ వాడరు

సీఎం రేవంత్, మంత్రి వర్గం పనితీరు గుడ్డెద్దు చేలో పడినట్టు ఉంది

బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష భేటీలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్య

- పార్టీ సీనియర్ సభ్యులు 'షాడో కేబినెట్'లా వ్యవహరించాలి
- గత ఏడాది కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలైంది
- ప్రభుత్వ అప్పులు, బడ్జెట్ లెక్కలపై అధ్యయనం చేయాలి
- ప్రతి అంశంపై ఆధారాలతో ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలి
- రైతాంగ సమస్యలే కేంద్రంగా నిలదీయాలి
- బీఆర్‌ఎస్‌పై నిందలను బలంగా తిప్పికొట్టాలని దిశానిర్దేశం



వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

సాక్షి, హైదరాబాద్: ''ముఖ్యమంత్రికి అనుభవం, జ్ఞానం లేకున్నా కనీసం కామన్ సెన్స్‌ను కూడా ఉపయోగించడం లేదు. సీఎంకు అనుభవం లేని సందర్భంలో మంత్రివర్గంలో ఒకరిద్దరు అనుభవజ్ఞులు దిశానిర్దేశం చేసి ప్రభుత్వాన్ని నడుపుతారు. కానీ రాష్ట్రంలో సీఎం, మంత్రివర్గం పనితీరు గుడ్డెద్దు చేలో పడినట్లుగా ఉంది. హామీలు, పథకాల అమలును పక్కనపెడితే ప్రజల కనీస అవసరాలైన సాగు, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటివి కూడా అందించలేకపోతున్నారు. రేవంత్ ప్రభుత్వం కేవలం ఏడాదిలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని వాటిని అసెంబ్లీలో ఎత్తిచూపడమే మన మీద ఉన్న అతి పెద్ద బాధ్యత'' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పార్టీ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్‌రావు దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న అవాస్తవాలు, వేస్తున్న నిందలను తిప్పికొట్టాలని సూచించారు. బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మంగళవారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ శాసనసభాపక్షం సమావేశమైంది. 3 గంటల పాటు జరిగిన ఈ భేటీలో బీఆర్‌ఎస్ తరఫున అసెంబ్లీలో లేవనెత్తాల్సిన అంశాలు, అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.

అప్పులు సహా.. అన్నీ అబద్ధాలే!

''రాష్ట్ర అప్పుల లెక్కలపై రేవంత్, మంత్రులు అబద్ధాలు చెప్తున్నారు. గత ఏడాదికాలంలో రాష్ట్ర ఆర్థిక రంగం కుదేలైంది. బడ్జెట్‌తోపాటు సవరించిన అంచనాలను కూడా ప్రభుత్వం సభ ముందు పెడుతుంది. ఆదాయ లోటు కూడా భారీగా ఉండబోతోంది. అందువల్ల

మిగతా 10వ పేజీలో ▶

ఆరు గ్యారంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటి అమల్లో అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కేసీఆర్ సూచించారు. వాయిదా తీర్మానాలు, స్వల్పకాలిక చర్చల్లో లేవనెత్తాల్సిన అంశాలు వ్యూహాత్మకంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వినూత్న రీతిలో నిరసన తెలుపుతూ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలన్నారు. సభ్యులు మొక్కుబడిగా కాకుండా, సమావేశాలు జరిగే రోజుల్లో ఉదయం 9.30కు బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష కార్యాలయానికి చేరుకోవాలని ఆదేశించారు.



బలూచ్ ప్రాంతంలో వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ (ఫైల్)

పాక్‌లో రైలు హైజాక్

బలూచీ వేర్పాటువాదుల దుశ్చర్య

30 మంది కాల్చివేత, బందీలుగా 215 మంది

మృతులు, బందీల్లో అత్యధికులు సైనికులే.. సైనిక చర్యకు దిగితే వారందరినీ చంపేస్తాం

పాక్ ప్రభుత్వానికి బీఎల్‌ఏ హెచ్చరికలు.. తమ నేతల విడుదలకు డిమాండ్

షహబాజ్ షరీఫ్ సర్కారుకు 48 గంటల డెడ్‌లైన్..

6లో

పాక్‌లో బలూచ్ భగభగలు

- తమను పాక్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటున్న బలూచ్ తెగ ప్రజలు
- సాయుధ ఉద్యమపంథాలో కొనసాగుతున్న బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ
- తరచూ సైన్యం, ప్రభుత్వ ఆస్తులపై దాడులు
- సైన్యం, బీఎల్‌ఏ ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోతున్న అమాయక ప్రజలు

6 లో



రైలులోని తమ ఆప్తుల గురించి క్వెట్టా స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న కుటుంబ సభ్యులు..

న్యూస్‌రీల్

కొండపర్తి దేశానికి రోల్‌మోడల్ కావాలి



ములుగు జిల్లాలోని కొండపర్తి గ్రామం అభివృద్ధిలో దేశానికి రోల్‌మోడల్ కావాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆకాంక్షించారు. మంగళవారం ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని కొండపర్తిలో ఆయన పర్యటించారు.

- వివరాలు 5లో

రంగంలోకి రోబోలు



ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో గల్లంతైన కార్మికుల జాడ కనిపెట్టేందుకు ఏఐ ఆధారిత రోబోలను బుధవారం నుంచి రంగంలోకి దింపనున్నారు. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన ఎన్వీ రోబోటిక్స్ బృందం మంగళవారం సొరంగం వద్దకు చేరుకుంది.

- వివరాలు 5లో

మన నీళ్లలో నైట్రేట్



రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాల్లో ప్రమాదకరమైన నైట్రేట్లు అధిక మోతాదులో ఉన్నట్లు సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ నీరు శుద్ధి చేయకుండా తాగడం ఏమాత్రం సురక్షితం కాదని తెలిపింది.

- వివరాలు 5లో

గిరిజన వర్సిటీ తొలి వీసీగా వైఎల్ శ్రీనివాస్



రాష్ట్రంలోని సమ్మక్క-సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ తొలి వైస్‌చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ యెడవల్లి లక్ష్మీ శ్రీనివాస్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నియమించారు. ఈ మేరకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది.

- వివరాలు 3లో



రాష్ట్ర బడ్జెట్

రూ. 3.20 లక్షల కోట్లు?

నేటి నుంచే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మరూ..

ఉదయం 11 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్

- అనంతరం సభ వాయిదా.. బీఏసీ భేటీ.. సభ నిర్వహణ షెడ్యూల్ ఖరారు
- రేపు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం.. సభలో ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల బిల్లులు
- ఈ నెల 19 లేదా 20న 2025-26 బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు..
- నిరసనలు, ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదంటున్న పోలీసులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభం అవుతున్నాయి. ఉదయం 11 గంటలకు పాత అసెంబ్లీ భవనంలో అసెంబ్లీ, మండలి భేటీతో ఈ సమావేశాలు మొదలవుతాయి. తొలిరోజు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం సభ వాయిదాపడనుంది. ఆ తర్వాత శాసనసభా వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) భేటీ నిర్వహిస్తారు. బడ్జెట్ సమావేశాలను ఎప్పటివరకు నిర్వహించాలి, ఏయే అంశాలను చేపట్టాలన్న దానిపై అందులో నిర్ణయం తీసుకుంటారు. గురువారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అసెంబ్లీలో చర్చ జరగనుంది. గవర్నర్ ప్రసంగానికి ఆమోదం తెలిపిన తరువాత సభ వాయిదా పడనుంది. శుక్రవారం హోలీ పండుగ కావడంతో సెలవు ఉంటుందని, శనివారం వీలును బట్టి అసెంబ్లీ నిర్వహిస్తారని లేదంటే మళ్లీ సోమవారం అసెంబ్లీ ప్రారంభమవుతుందని సమాచారం. కాగా.. గత బడ్జెట్ కన్నా సుమారు పది శాతం అదనంగా రూ.3.20 లక్షల కోట్లతో ఈసారి బడ్జెట్ ఉండవచ్చని అధికారవర్గాలు చెబుతున్నాయి.

సభ ముందుకు రెండు బిల్లులు..

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ ముగిసిన అనంతరం.. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఆ బిల్లులపై చర్చించి ఆమోదించనున్నారు. తర్వాత ఈనెల 19న లేదా 20న 2025-26 బడ్జెట్‌ను అసెంబ్లీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మండలిలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రవేశపెడతారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలు, శాఖల వారీ పద్దులపై చర్చిస్తారు. అనంతరం బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించే ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెడతారు. ఇందుకోసం ఈనెల 27 లేదా 29వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

నిరసనలకు నో..!

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అటు అసెంబ్లీ, ఇటు ప్రభుత్వ, పోలీసు వర్గాలు

మిగతా 10వ పేజీలో ▶

గ్రూప్-2 టాపర్ హరవర్ధన్‌రెడ్డి



600 మార్కులకు 447.088 మార్కులు..

అభ్యర్థుల జనరల్ ర్యాంకులు వెల్లడించిన టీజీపీఎస్సీ

కమిషన్ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల ఓఎంఆర్ స్కాన్డ్ కాపీలు

టాప్ 31 ర్యాంకుల్లో అందరూ పురుష అభ్యర్థులే

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) విడుదల చేసిన గ్రూప్-2 పరీక్ష ఫలితాల్లో నారు వెంకట హరవర్ధన్‌రెడ్డి నంబర్ వన్ ర్యాంకు సాధించాడు. మొత్తం 600 మార్కులకుగాను అతడు 447.008 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. గ్రూప్-2 జనరల్ ర్యాంకింగ్ లిస్టును టీజీపీఎస్సీ మంగళవారం విడుదల చేసింది. జీఆర్‌ఎల్‌ను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. మంగళవారం మధ్యాహ్నం టీజీపీఎస్సీ కార్యాలయంలో చైర్మన్ బుర్రా వెంకటేశం అధ్యక్షతన కమిషన్ సమావేశం జరిగింది. సభ్యులు అమీర్‌ఉల్లా ఖాన్, ప్రొఫెసర్ యాదయ్య, యం.రామ్మోహన రావు, పాల్వాయి రజిని సంబంధిత అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రూప్-2 జీఆర్‌ఎల్, ఫైనల్ కీ విడుదలకు నిర్ణయం తీసుకున్నారు. అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ స్కాన్డ్ కాపీలను కూడా వ్యక్తిగత లాగిన్‌లో అందుబాటులో ఉంచారు. కాగా, టాప్ 31 ర్యాంకుల్లో మహిళలు ఎవరూ లేకపోవటం గమనార్హం.

13 వేలమంది అనర్హత

గ్రూప్-2 సర్వీసులకు సంబంధించి 18 కేటగిరీల్లో 783 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ 29 డిసెంబర్ 2022లో నోటిఫికేషన్ జారీ చేసింది. 2023 జనవరి 18 నుంచి ఫిబ్రవరి 16వ తేదీ వరకు... దాదాపు నెలరోజుల పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. 5,51,855 మంది

మిగతా 3వ పేజీలో ▶

గ్రూప్-1 విజేత జిన్నా తేజస్వినిరెడ్డి, గ్రూప్-2 టాపర్ హరవర్ధన్ రెడ్డి ఇంటర్వ్యూలు


13 లో



మినీ ఇండియా.. మారిషస్

- భారత్‌కు, గ్లోబల్ సౌత్‌కు మధ్య ఒక వంతెన
- భారతదేశ కుటుంబంలో ఒక అంతర్భాగం
- ప్రవాస భారతీయుల సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- మోదీ రెండు రోజుల మారిషస్ పర్యటన ప్రారంభం
- మోదీకి ఘన స్వాగతం పలికిన మారిషస్ ప్రభుత్వం
- తరలివచ్చిన ప్రధానమంత్రి, మంత్రివర్గం

- వివరాలు 6లో ▶



కొత్త సార్లు, క్రమబద్ధీకరణలు..

అయినా ఖాళీలు!

- నేడు 1,292 ఇంటర్ లెక్చరర్లకు నియామక పత్రాలు అందజేయనున్న సీఎం రేవంత్
- రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లో బోధనకు ఇబ్బంది
- మొత్తం పోస్టులు 6,008.. ఏడాది క్రితం వరకు ఉన్నది 900 మందే
- మరో 3,500 కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ
- ఇప్పుడు కొత్త నియామకాలు.. అయినా 316 పోస్టులు ఖాళీ
- వీటికితోడు కొత్త కాలేజీలకు కావాల్సిన పోస్టులు మరో 480

- వివరాలు 2లో ▶

ఇదండీ సంగతి



ఇక భూ మండలం మీద పాస్‌పోర్ట్ రాదని చంద్రమండలానికి ప్లాన్ వేస్తున్నాడు!

స్వయం ఉపాధికి రూ.6 వేల కోట్లు

రాజీవ్ యువ వికాసం పేరుతో కొత్త పథకం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు రూ.3 లక్షల ఆర్థిక సాయం

మార్చి 15న నోటిఫికేషన్.. అదే రోజు నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంజూరు పత్రాలు

చాకలి ఐలమ్మ వర్సిటీకి తక్షణమే రూ.115 కోట్లు

14 లో

ఎల్‌ఆర్‌ఎస్..

సర్కారు ఆశలు తుస్..

క్రమబద్ధీకరణకు అర్హత గల దరఖాస్తులు 20 లక్షలు.. ఆదాయం అంచనా రూ.20 వేల కోట్లు

ఇప్పటివరకు ఫీజు చెల్లించినది 30 వేల మంది మాత్రమే.. సర్కారుకు సమకూరినది రూ.50 కోట్లలోపే..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా సుమారు రూ.20 వేలకోట్ల ఆదాయం పొందాలని ఆశించిన రాష్ట్ర ప్రభుత్వానికి నిరాశే ఎదురవుతోంది. మార్చి నెలాఖరుకల్లా ఎల్‌ఆర్‌ఎస్ పూర్తి చేయాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం 2020లో ఎల్‌ఆర్‌ఎస్ పథకం



కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, నిర్ణీత ఫీజు ద్వారా క్రమబద్ధీకరించాలని తీసుకున్న నిర్ణయం ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. పురపాలక శాఖలోని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు సంబంధించిన పోర్టల్‌ను రిజిస్ట్రార్ కార్యాలయాల సర్వర్లతో అనుసంధానం చేసి.. స్థలాలను క్రమబద్ధీకరించే ప్రక్రియ ప్రారంభించారు. కానీ ఎల్‌ఆర్‌ఎస్‌కు కనీస స్పందన కూడా రావడం లేదు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించినవారు 336 మంది, వచ్చిన ఆదాయం రూ.1.16 కోట్లు మాత్రమే. హైదరాబాద్ జిల్లా పరిధిలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏలలో కలిపి సోమవారం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించినవారు 42 మంది, సమకూరిన మొత్తం రూ.34.25 లక్షలు మాత్రమేకావడం గమనార్హం.

11 రోజుల ఆదాయం రూ.47 కోట్లే!

రాష్ట్రంలో 2020లో వచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 25.67 లక్షలు.. అందులో 20లక్షల దరఖాస్తులను క్రమబద్ధీకరణకు అర్హమైనవిగా ప్రాథమికంగా గుర్తించారు. మరో 2.5 లక్షల దరఖాస్తులు చెరువులు, కుంటలకు 200 మీటర్ల పరిధిలో ఉన్నవికాగా, మిగతావాటిని ఇతర కారణాలతో తిరస్కరించారు. మొత్తం దరఖాస్తుల్లో జీహెచ్‌ఎంసీ మినహా రాష్ట్రంలోని 140 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి వచ్చిన దరఖాస్తులు 14.45 లక్షలు. ఇందులో 13,322 దరఖాస్తులకు

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

గద్దర్ సినీ అవార్డులకు ఎంట్రీల ఆహ్వానం

విధి విధానాలు ఖరారు చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులకు సంబంధించి విధి విధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సినిమా రంగానికి విశేష సేవలందించిన తెలంగాణ దిగ్గజాలు పైడి జయరాజ్, కాంతారావు పేర్లపై ప్రత్యేక అవార్డులు ఇవ్వాలని, నటుడు ఎం.ప్రభాకర్ రెడ్డి పేరుపై ఇప్పటికే ఉన్న అవార్డును కొనసాగించాలని నిర్ణయించింది. 2014 నుంచి 2023 వరకు అప్పటి తెలంగాణ ప్రభుత్వం చలన చిత్ర అవార్డులను ఇవ్వలేదు. ఆ సంవత్సరాలకు కూడా ఉత్తమ చలన చిత్ర అవార్డులు ఇవ్వాలని తాజాగా నిర్ణయించారు. గద్దర్ చలన చిత్ర అవార్డులకు సంబంధించిన దరఖాస్తులు ఏసీ గార్డ్స్‌లోని తెలంగాణ చలన చిత్ర పరిశ్రమాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఈ నెల 13 నుంచి స్వీకరిస్తారని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఫీచర్ ఫిల్మ్, జాతీయ సమైక్యతపై చలన చిత్రం, బాలల చలన చిత్రం, పర్యావరణం/హెరిటేజ్/ చరిత్రపై చలన చిత్రం, డెబ్యూ ఫీచర్ ఫిల్మ్, యానిమేషన్ ఫిలిం, సోషల్ ఎఫెక్ట్ ఫిల్మ్, డాక్యుమెంటరీ ఫిల్మ్, షార్ట్ ఫిల్మ్ కేటగిరీలతోపాటు తెలుగు సినిమాలపై పుస్తకాలు/విశ్లేషణాత్మక వ్యాసాలు, ఆర్టిస్టులు/ టెక్నీషియన్లకు వ్యక్తిగతంగా గద్దర్ అవార్డులు ప్రదానం చేస్తారు.

ఢిల్లీ వచ్చి వెళ్లిన ఉత్తమ్

రాజకీయ ప్రాధాన్యం లేదని సన్నిహితుల స్పష్టీకరణ



సాక్షి, న్యూఢిల్లీ: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఢిల్లీ వచ్చి వెళ్లారు. ఎయిర్‌ఫోర్స్ మాజీ ఉద్యోగుల గెట్‌టు గెదర్ కోసం మాత్రమే ఆయన ఢిల్లీ వచ్చినట్లు తెలిసింది. ఉత్తమ్ ఢిల్లీ పర్యటనకు ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని ఆయన సన్నిహిత వర్గాలు స్పష్టం చేశాయి. ఈ పర్యటనలో పార్టీ పెద్దలు ఎవరినీ మంత్రి కలవలేదని వెల్లడించాయి.

అసమగ్ర కులగణన వివరాలివ్వండి

బీజేపీ ఓబీసీ మోర్చాకు బీసీ కమిషన్ జాతీయ చైర్మన్ సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కులగణన సర్వే సరైన పద్ధతిలో నిర్వహించకపోతే.. ఆ వివరాలను తనకు అందజేయాలని బీజేపీ ఓబీసీ మోర్చాకు బీసీ కమిషన్ జాతీయ చైర్మన్ హన్స్ రాజ్ గంగారం అహిర్ సూచించారు. ఫిర్యాదు రూపంలో తన దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ కార్యాలయాన్ని మంగళవారం రాత్రి బీసీ కమిషన్ జాతీయ చైర్మన్ అహిర్ సందర్శించారు. ఈ సందర్భంగా.. కులగణన పేరిట అసమగ్రంగా అధ్యయనం చేసి ముస్లింలను 10 శాతం బీసీలుగా చేర్చడం తదితర అంశాలను.. అహిర్ దృష్టికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ తీసుకెళ్లారు. తెలంగాణలోని బీసీ గురుకులాల్లో సౌకర్యాలు లేవని, వాటి నిర్వహణ కూడా సరిగ్గా లేదని వివరించారు.

వాల్మీకి, బోయ తెగలను ఎస్టీలో చేర్చాలి

లోక్‌సభలో కేంద్రాన్ని కోరిన డీకే అరుణ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో వాల్మీకి, బోయ తెగలను ఎస్టీ జాబితాలో చేర్చాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బోయ, వాల్మీకి కులాలకు చెందిన వారు విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉన్నారని, పురాతన కాలంలో వేట మాత్రమే వారి వృత్తిగా ఉందని, ఇప్పుడు వారికి ఎలాంటి కుల వృత్తి లేదన్నారు. మంగళవారం లోక్‌సభలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఈ అంశాన్ని అరుణ సభ దృష్టికి తీసుకొచ్చారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక సహా ఇతర రాష్ట్రాల్లో వాల్మీకి, బోయ తెగలు ఎస్సీలుగా, ఎస్టీలుగా గుర్తింపు పొందుతున్నాయని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం వారింకా బీసీ జాబితాలోనే ఉన్నారన్నారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్

ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యను సంస్కరించేందుకు అందరి తోడ్పాటు అవసరమని ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్య సంఘాలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. డిగ్రీ సిలబస్‌లో మార్పులు, ఆన్‌లైన్ ప్రవేశాల విధానంపై పునఃసమీక్ష, ఫీజు రీయింబర్స్‌మెంట్, సెమిస్టర్, డిటెన్షన్ విధానంపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ డిజిటలైజేషన్ విద్యా బోధన, అభ్యాస పద్ధతులను అనుసరించాలన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మల్టీ డిసిప్లినరీ పాఠ్య ప్రణాళిక రూపొందించి, ఉపాధి అవకాశాలు పొందేలా తీర్చిదిద్దాలన్నది లక్ష్యమని చెప్పారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై పరిశ్రమ నిపుణులు, విద్యావేత్తలతో చర్చిస్తామన్నారు.

మాతృభూమికి తెలుగువారు

థాయ్‌లాండ్ నుంచి వచ్చిన రెండో విమానం

- దేశరాజధానిలో అడుగిడిన 270 మంది
- నేడు ఏపీ, తెలంగాణకు 42 మంది బాధితులు
- దిగిన వెంటనే అదుపులోకి తీసుకున్న సీబీఐ
- అర్ధరాత్రి వరకు సాగిన స్టేట్‌మెంట్ల రికార్డు
- బండి సంజయ్ కృషితో 578 మందికి విముక్తి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొలువుల కోసం వెళ్లి.. సైబర్ ఫ్రాడ్ కంపెనీల్లో చిక్కుకున్న వారి తరలింపు ప్రక్రియ పూర్తయ్యింది. మంగళవారం థాయ్‌లాండ్‌లోని మై సోట్ నుంచి రెండో ఆర్మీ విమానం 270 మంది భారతీయులతో భారత కాలమానం ప్రకారం.. మధ్యాహ్నం 2 గంటల సమయంలో బయల్దేరి సాయంత్రం 6.30 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరింది. దీంతో థాయ్‌లాండ్ కేంద్రంగా సాగిన మానవ అక్రమ రవాణాలో చిక్కుకున్న బందీలందరికీ విముక్తి లభించినట్టయ్యింది. రూ.లక్షల వేతనం పేరిట ఆశచూపి తీరా వెళ్లాక, మన భారతీయ యువతతో సైబర్ నేరాలు చేయిస్తున్న విషయాన్ని 'సాక్షి'దినపత్రిక వెలుగులోకి తీసుకురావడం, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవతో కేంద్రం వీరిని అక్కడి ఆర్మీ సాయంతో వారిని కాపాడింది. ఏకంగా రెండు విమానాలు పంపి సొంత ఖర్చులతో ఇండియాకు తీసుకొచ్చింది.

అసలేం జరిగింది?

కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం రంగపేట గ్రామానికి చెందిన మధుకర్‌రెడ్డి ఉద్యోగం వచ్చిందంటూ థాయ్‌లాండ్ వెళ్లాడు. అక్కడ మానవ అక్రమ రవాణా చేసే ముఠా అతన్ని మయన్మార్‌లోని మైవాడీ జిల్లాలోని చైనీస్ సైబర్ ఫ్రాడ్ కంపెనీకి 3,000 డాలర్లకు విక్రయించింది. అతను, తనతోపాటు బందీలుగా ఉన్న పలువురు భారతీయుల దయనీయ పరిస్థితిని సాక్షికి ఫిబ్రవరి 16న వివరించాడు. దీంతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జోక్యం చేసుకున్నాడు. 'సాక్షి'దినపత్రిక కూడా పలుమార్లు మయన్మార్‌లోని భారత దౌత్యకార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరిపింది. భారత్ సహా అంతర్జాతీయంగా కూడా ఒత్తిడి రావడంతో మయన్మార్ తన ఆర్మీతో ఫిబ్రవరి 22న భారతీయులను రక్షించి ఆశ్రయం కల్పించింది. కేంద్ర దౌత్యం ఫలించడంతో సోమవారం ఉదయం తొలివిమానం భారతీయులను ఇండియాకు తీసుకొచ్చింది. రెండో విమానంలో మంగళవారం మిగిలిన వారిని థాయ్‌లాండ్‌లోని మై సోట్ మీదుగా ఇండియాకు తరలించింది. దీంతో రిపాట్రియేషన్ ప్రక్రియ ముగిసింది.



ఇండియాకు చేరిన మధుకర్

సాక్షి చొరవ భేష్

578 మందిని మా ప్రభుత్వం సురక్షితంగా ఇండియాకు తీసుకొచ్చింది. అందరూ క్షేమంగా ఉన్నారు. థాయ్‌లాండ్ కేంద్రంగా జరిగిన ఈ ఉదంతాన్ని సాక్షి దినపత్రిక మా దృష్టికి తీసుకురావడం, బాధితుల కోసం పోరాడిన తీరు, ఆ చొరవ అభినందనీయం. మనవారిని ప్రత్యేక విమానాల ద్వారా ఇండియాకు తీసుకొచ్చాం.

– కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

నేడు హైదరాబాద్‌కు తెలుగువారు

బాధితుల్లో తెలంగాణకు చెందిన 23 మంది, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 19 మంది మొత్తం 42 మంది తెలుగువారు ఉన్నారు. 270 మందితో కూడిన విమానం మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు ఢిల్లీకి చేరుకుంది. విమానం దిగిన వెంటనే బాధితులను అందరినీ.. సీబీఐ అదుపులోకి తీసుకుంది. మీరు ఫారిన్ ఎలా వెళ్లారు? ఎవరి సాయంతో వెళ్లారు? అర్ధరాత్రి దాటినా బాధితుల నుంచి సీబీఐ స్టేట్‌మెంట్ తీసుకుంటూనే ఉంది. ఈ విషయంపై ఇప్పటికే జాతీయ దర్యాప్తు సంస్థ కూడా వివరాలు సేకరిస్తున్న సంగతి తెలిసిందే.

ఇది మాకు పునర్జన్మ

వాస్తవానికి మేం థాయ్‌లాండ్‌కు ఉద్యోగానికని వెళ్లాం. మాకు తెలియకుండా మాలో కొందరిని మయన్మార్‌కు అక్రమంగా పంపారు. అక్కడ పాస్‌పోర్టు లాక్కొని, మాతో నేరాలు చేయించడానికి ప్రయత్నించారు. కానీ, నేను మా బావ సాయంతో సాక్షిని ఆశ్రయించాను. మమ్మల్ని వెనక్కి రప్పించడంలో బండి సంజయ్, సాక్షి దినపత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు. ఇది మాకు పునర్జన్మ.

– మధుకర్‌రెడ్డి

కొత్త సార్లు, క్రమబద్ధీకరణలు.. అయినా ఖాళీలు!

- నేడు 1,292 ఇంటర్ లెక్చరర్లకు నియామక పత్రాలు అందజేయనున్న సీఎం రేవంత్
- మొత్తం పోస్టులు 6,008.. ఏడాది క్రితం వరకు ఉన్నది 900 మందే
- 3,500 కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ
- ఇప్పుడు కొత్త నియామకాలు.. అయినా 316 పోస్టులు ఖాళీ
- వీటికితోడు కొత్త కాలేజీలకు కావాల్సిన పోస్టులు మరో 480.. గత రెండేళ్లలో ఖాళీ అయినవీ లెక్కేస్తే భారీగానే ఖాళీ పోస్టులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కొత్తగా 1,292 మంది లెక్చరర్లు చేరబోతున్నారు. వారితోపాటు 240 మంది పాలిటెక్నిక్ లెక్చరర్లు కూడా బాధ్యతలు చేపట్టబోతున్నారు. వీరందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు రవీంద్ర భారతి వేదికగా నియామక ఉత్తర్వులు అందజేస్తారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. అయితే కొత్తగా నియామకాలు చేపట్టినా కూడా.. జూనియర్ కాలేజీల్లో గణనీయంగానే లెక్చరర్ పోస్టులు ఖాళీ ఉండే పరిస్థితి నెలకొంది.

రెండున్నరేళ్ల కిందే నోటిఫికేషన్..

ఇంటర్ బోర్డ్ మూడేళ్ల క్రితమే జూనియర్ కాలేజీల్లో ఖాళీలను గుర్తించి.. పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)కు వివరాలు అందజేసింది. టీజీపీఎస్సీ 2022 డిసెంబర్‌లో ఆ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. పలు కారణాలతో ఈ ప్రక్రియ ఆలస్యమైంది. చివరికి అర్హులను ఎంపిక చేసిన కమిషన్.. ఇటీవలే జాబితాను ఇంటర్ బోర్డుకు అందజేసింది. ప్రస్తుతం ఇంటర్ విద్యా సంవత్సరం ముగుస్తుండటంతో.. కొత్త వారికి శిక్షణ ఇచ్చి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విధులు అప్పగించాలని అధికారులు నిర్ణయించారు.

ఇంకా గణనీయంగానే ఖాళీలు

రాష్ట్రంలో 424 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో చాలా చోట్ల లెక్చరర్ల కొరతతో బోధనకు ఇబ్బంది నెలకొంది. నిజానికి జూనియర్ కాలేజీల్లో మొత్తం 6,008 పోస్టులు ఉండగా.. ఏడాది క్రితం వరకు 900 మంది మాత్రమే రెగ్యులర్ అధ్యాపకులు, ప్రిన్సిపాల్స్ ఉన్నారు. గత ఏడాది ప్రభుత్వం 3,500 మంది కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించే ప్రక్రియ చేపట్టింది. అది ఇంకా పూర్తవలేదు. వీరిని, ఇప్పుడు కొత్తగా నియమించబోతున్న వారిని కలిపితే.. 5,692 మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉంటారు. ఇంకా 316 ఖాళీలుంటాయి. ఇవన్నీ రెండేళ్ల క్రితం లెక్కలు. ఇప్పుడీ ఖాళీల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని అధ్యాపకులు చెబుతున్నారు.

కొత్త కాలేజీల మాటేంటి?

గత రెండేళ్లలో రాష్ట్రంలో 24 జూనియర్ కాలేజీలను కొత్తగా ఏర్పాటు చేశారు. కానీ అందులో 19 కాలేజీలకు ఇప్పటికీ పోస్టులు మంజూరు చేయలేదు. గెస్ట్ ఫ్యాకల్టీ, ఇతర కాలేజీల లెక్చరర్లతో బోధిస్తున్నారు. కొత్త కాలేజీలకు కనీసం 480 పోస్టులు అవసరమని ఇంటర్ బోర్డు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. అంటే ఇప్పటికే ఉన్న 316 ఖాళీలను కలుపుకుంటే.. మొత్తం ఖాళీల సంఖ్య 796కు చేరుతుంది. పైగా గత రెండేళ్లలో ఖాళీ అయిన పోస్టులు అదనం. దీనికి తోడు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ సిలబస్ మార్చి, జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీలకు సన్నద్ధం చేసేలా ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది. దానికోసం మరికొన్ని అధ్యాపక పోస్టులు అవసరం. ఇక ఇంగ్లిష్‌లో ప్రాక్టికల్స్‌ను కొత్తగా తీసుకొచ్చారు. మాట్లాడే స్కిల్, గ్రామర్ స్థాయిని పెంచారు. గ్రూప్ డిస్కషన్లు నిర్వహించి, విద్యార్థి రాతను పరిశీలించి ప్రాక్టికల్స్‌లో మార్కులు వేస్తున్నారు. వీటి ప్రామాణికత పెరగాలంటే ఆంగ్ల భాషా నిపుణుల పోస్టులు మరో 129 అవసరమని అంచనా వేశారు. రసాయన శాస్త్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రయోగాలు చేయగలగాలని బోర్డ్ తీర్మానించింది. ఆ ప్రాక్టికల్స్‌కు నిపుణులు అవసరం. ఇలా ప్రతీ విభాగంలోనూ అధ్యాపకుల కొరత ఏర్పడుతోంది.

సర్కారు ఆశలు తుస్

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించి రూ.103.13 కోట్లను గతంలోనే చెల్లించారు. వీటిలో ఈ నెల ఒకటో తేదీ నుంచి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులను స్వీకరిస్తుండగా.. ఇప్పటివరకు 7,188 దరఖాస్తులకు సంబంధించి రూ.47 కోట్లు మాత్రమే సమకూరడం గమనార్హం. దీనితో జీహెచ్ఎంసీ మినహా మిగతా పురపాలికల్లో.. 20,510 దరఖాస్తుల క్రమబద్ధీకరణతో ప్రభుత్వానికి రూ.151.31 కోట్లు అందాయి. ఇక హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీతోపాటు పట్టణాభివృద్ధి సంస్థలు, గ్రామ పంచాయతీల నుంచి కలిపి గతంలో 600 మంది వరకు ఫీజులు చెల్లించగా.. ఇప్పుడా సంఖ్య సుమారు 2వేల వరకు ఉండొచ్చని, సమకూరిన మొత్తం రూ.10 కోట్ల వరకే ఉంటుందని అంచనా.

భూముల విలువ, ఓపెన్ స్పేస్ చార్జీల్లో తేడాలతో..

జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏల పరిధిలో భూమి కొనుగోలు విలువ, ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నప్పటి విలువతోపాటు ఓపెన్ స్పేస్ చార్జీలకు సంబంధించి రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించిన ధరల్లో తేడాలు వస్తున్నాయని తెలిసింది. దీనితో దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించడం లేదని సమాచారం. అలాగే రెవెన్యూ గ్రామం పేరు, దరఖాస్తుదారు పేర్కొన్న కాలనీ, గ్రామం పేర్లు వేరుగా ఉండటం వల్ల రిజిస్ట్రేషన్ శాఖ దరఖాస్తులను తిరస్కరించడం లేదా ఫీజుల్లో తేడా చూపించడం జరుగుతోంది. ఈ సమస్యను అధికారుల దృష్టికి తేవడంతో.. ఆన్‌లైన్ ద్వారా కాకుండా మ్యాన్యువల్‌గా సమస్యను పరిష్కరిస్తున్నట్టు డీటీసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ పరిధిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ఇకపై వేగం పుంజుకుంటుందని చెప్పారు.

ఇంకా 20 రోజులే గడువు!: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్రమబద్ధీకరించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని.. మార్చి 31వ తేదీలోపు పూర్తి చేయాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, పురపాలికల కమిషనర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పరిష్కారానికి అర్హమైన దరఖాస్తులు 20 లక్షలకుపైనే ఉండగా.. ఇప్పటివరకు లక్ష దరఖాస్తులకు కూడా మోక్షం లభించలేదు. మరో 20 రోజుల గడువే ఉన్న నేపథ్యంలో రోజుకు లక్ష దరఖాస్తులను పరిష్కరిస్తే తప్ప ప్రభుత్వం ఆశించిన రూ.20 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అక్రమ లేఅవుట్లలోని స్థల యజమానులకు మంచి అవకాశం..



అక్రమ లేఅవుట్లలో కనీసం 10శాతం స్థలాల సేల్‌డీడ్స్ పూర్తయిన చోట్లలో మిగతా వారికి ఎల్ఆర్ఎస్ పథకం మంచి అవకాశం. వారు గతంలో ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోకపోయినా, ఇప్పుడు నేరుగా ఫీజు చెల్లించి తమ స్థలాలను క్రమబద్ధీకరించుకోవడంతోపాటు ఇళ్ల నిర్మాణానికి అనుమతులు పొందే అవకాశం ఉంది. అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొన్న వ్యక్తులు రెగ్యులరైజ్ చేసుకునేందుకు ముందుకు రావాలి. ఈ నెల 31లోపు క్రమబద్ధీకరించుకుంటే 25శాతం రాయితీ పొందవచ్చు.

– కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి
చైర్మన్, సుడా (కరీంనగర్)

భారత్‌లో స్టార్‌లింక్ సేవలు

ఎలాన్‌మస్క్ కంపెనీతో ఎయిర్‌టెల్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ: ఎలాన్ మస్క్ కంపెనీ స్టార్‌లింక్ ఎట్టకేలకు భారత్‌లో ప్రవేశిస్తోంది. ఇందుకోసం టెలికం దిగ్గజం ఎయిర్‌టెల్ తాజాగా స్టార్‌లింక్ మాతృ సంస్థ స్పేస్‌ఎక్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. భారత్‌లో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలను అందించడానికి ఇరు సంస్థలు చేతులు కలిపాయి. దీంతో స్టార్‌లింక్ భారత్‌లో చట్టబద్ధంగా అందుబాటులోకి వస్తుంది. కస్టమర్లు ఎయిర్‌టెల్ రిటైల్ స్టోర్స్ నుండి స్టార్‌లింక్ గేర్‌ను కొనుగోలు చేయవచ్చు. దేశంలోని మారుమూల, సుదూర ప్రాంతాలలో ఉపగ్రహ ఆధారిత హై–స్పీడ్ ఇంటర్నెట్ పొందేందుకు ఈ గేర్‌ను ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంటుంది. 'భారత్‌లో ఎయిర్‌టెల్ కస్టమర్లకు స్టార్‌లింక్ సేవలు అందించడానికి స్పేస్‌ఎక్స్‌తో కలిసి పనిచేయడం ఒక ముఖ్యమైన మైలురాయి. తదుపరి తరం ఉపగ్రహ కనెక్టివిటీకి మా నిబద్ధతకు నిదర్శనం'అని భారతీ ఎయిర్‌టెల్ ఎండీ, వైస్ చైర్మన్ గోపాల్ విట్టల్ అన్నారు. టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా నుండి కఠిన నియంత్రణ ఆంక్షలకుతోడు ప్రముఖ టెలికం ఆపరేటర్ల నుండి సవాళ్లను ఎదుర్కొంటూ భారత్‌లో ప్రవేశించేందుకు స్టార్‌లింక్ నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. ఉపగ్రహ స్పెక్ట్రమ్‌ను కేటాయించడానికి బదులుగా వేలం వేయాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ ప్రభుత్వాన్ని కోరారు. ఎయిర్‌టెల్ సైతం ఇదే విషయాన్ని వెల్లడించింది. అడ్మినిస్ట్రేటివ్ కేటాయింపుల విధానం అమలు చేయాలని స్టార్‌లింక్, ప్రాజెక్ట్ కైపర్ కోరుతున్నాయి.

కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు నిధులు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో బీసీలకు పెద్దఎత్తున నిధులు కేటాయించాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీల సమస్యలు తీరుస్తామన్న హామీ ఏమైందని నిలదీసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. బీసీలకు అరకొర నిధులు కేటాయించి అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిపై ఈనెల 15న అన్ని బీసీ సంఘాలు, కుల సంఘాలు, మేధావులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. బీసీలను చిన్నచూపు చూస్తే కేసీఆర్‌కు పట్టిన గతే సీఎం రేవంత్‌రెడ్డికి పడుతుందని హెచ్చరించారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు 42% నిధులు కేటాయించాలని కోరారు.

రెండు నెలల్లో ట్రిపుల్ ఆర్ ఆమోదం!

కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారన్న మంత్రి కోమటిరెడ్డి

- హైదరాబాద్–విజయవాడ ఆరులేన్ల రహదారి పనులు చేపట్టాలని గడ్కరీకి వినతి
- రెండు ప్యాకేజీలుగా ఈ రహదారి పనులు

సాక్షి, న్యూఢిల్లీ: రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) క్లియరెన్సులన్నీ త్వరలో పూర్తికానున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అనంతరం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగే కేంద్ర కేబినెట్ ఆమోదానికి వెళ్తుందని చెప్పారు. ఈప్రక్రియ అంతా రెండు నెలల్లో పూర్తి చేస్తామని కేంద్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. కోమటిరెడ్డి మంగళవారం ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందనలతో కలిసి గడ్కరీతో భేటీ అయ్యారు. ట్రిపుల్ ఆర్, హైదరాబాద్–విజయవాడ ఆరులేన్ల రోడ్డు, 12 ఆర్వోబీలు తదితర అంశాలపై గడ్కరీతో చర్చలు జరిపారు. ఆ తర్వాత రాష్ట్రంలో పలు విమానాశ్రయాల గురించి పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుతో భేటీ అయ్యారు. కొత్తగూడెం, రామగుండం, పెద్దపల్లి, ఆదిలాబాద్, నిజామాబాద్ ఎయిర్‌పోర్టుల అంశంపై చర్చించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.



ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

95 శాతం భూసేకరణ చేశాం

2018–19లో రీజినల్ రింగ్ రోడ్డు ప్రకటించగా.. అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని కోమటి రెడ్డి విమర్శించారు. తాము అధికారం చేపట్టిన నాటి నుంచి కేంద్రంతో టచ్‌లో ఉంటూ ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే జంగారెడ్డి–భువనగిరి–చౌటుప్పల్ వరకు టెండర్లు పిలిచామన్నారు. 95 శాతం భూసేకరణను క్లియర్ చేశామని, కేంద్రం నుంచి ఆమోదం వచ్చాక వారికి పరిహారమిస్తామని తెలిపారు. 'హైదరాబాద్–విజయవాడ ఆరులేన్ల రహదారిని మచిలీపట్నం వరకు పొడిగిస్తున్నామని, ఇందుకు కన్సల్టెంట్‌ను పిలిచినట్లు గడ్కరీ తెలిపారు. అయితే, హైదరాబాద్–విజయవాడ వరకు ఇప్పటికే భూసేకరణ పూర్తయినందున త్వరగా టెండర్లు పిలవాలని కోరాను. రెండు ప్యాకేజీలుగా ఈ రహదారిని నిర్మించేందుకు కేంద్రం సిద్ధమైంది. మొదటి ప్యాకేజీలో మల్కాపూర్–విజయవాడ, రెండో ప్యాకేజీలో విజయవాడ–మచిలీపట్నం వరకు నిర్మాణం జరిపేందుకు గడ్కరీ ఒప్పుకున్నారు. పర్వతమాల పథకం కింద యాదగిరిగుట్ట, భువనగిరి కోటకు, నల్లగొండ పట్టణంలోని హనుమాన్ కొండ, నాగార్జున సాగర్ ఆనకట్ట మీదుగా నాగార్జున కొండను కలుపుతూ, మంథనిలోని రామగిరి కోట ప్రాంతాల్లో రోప్‌వేలు అడిగాను. వీటిపై గడ్కరీ సానుకూలంగా స్పందించారు'అని కోమటిరెడ్డి చెప్పారు.

అనర్హత వేటు పడుతుందనే అసెంబ్లీకి కేసీఆర్

అనర్హత వేటు పడుతుందనే భయంతోనే బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు వస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ఇక లేనట్లేనని, ఆ పార్టీని బ్రహ్మదేవుడు కూడా కాపాడలేరని మీడియాతో చిట్‌చాట్‌లో అన్నారు. 'కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నిస్తానని కేసీఆర్ అంటున్నారు, ఒకవేళ కేసీఆర్ ఒక అంశాన్ని ఎత్తి చూపితే పది అంశాలను సభ ముందు పెడతాం. దళిత సీఎం నుంచి జర్నలిస్టుల వరకు కేసీఆర్ చేసిన మోసాలను ఎండగడతాం'అని అన్నారు. రేవంత్ రెడ్డి పదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని తెలిపారు. సీఎం మార్పు జరుగుతుందని వస్తున్నవన్నీ అసత్య ప్రచారాలేనంటూ కొట్టిపడేశారు.

యాదగిరి క్షేత్రంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

శృంగార డోలోత్సవంతో ముగింపు




శృంగార డోలోత్సవంలో భాగంగా ఊయలలో స్వామివారు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శ్రీస్వామి అమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేకం జరిపించారు. రాత్రి 9 గంటలకు ఆలయంలో శ్రీస్వామి వారికి శృంగార డోలోత్సవం ఘనంగా జరిపించి ఉత్సవాలకు ముగింపు పలికారు. ఇక శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రద్దు చేసిన నిత్య కల్యాణం, సుదర్శన నారసింహ హోమం వేడుకలు బుధవారం పునఃప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల చివరి రోజు వేడుకల్లో భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు.

దేవస్థానానికి ఐఎస్‌వో గుర్తింపు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ఐఎస్‌వో (అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ) గుర్తింపు లభించింది. ఈ మేరకు మంగళవారం ఆలయ అధికారులకు ఐఎస్‌వో సర్టిఫికెట్లు అందాయి. యాదగిరి క్షేత్రం ఆధ్యాత్మిక సేవలో అత్యుత్తమంగా ఉన్నందున ఐఎస్‌వో సర్టిఫికెట్ సాధించింది. ప్రసాదం తయారీలో, పంపిణీలో నాణ్యత, భద్రత ప్రమాణాలను పాటించినందుకు యాదగిరీశుడి ఆలయానికి మరో ఐఎస్‌వో సర్టిఫికెట్ దక్కింది. ఈ మేరకు ఐఎస్‌వో ప్రతినిధుల నుంచి మంగళవారం ఆలయంలో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ఈవో భాస్కర్ రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి సర్టిఫికెట్లను అందుకున్నారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో 'నవమి' టికెట్లు



భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఏప్రిల్ 6, 7 తేదీల్లో జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణం, మహా పట్టాభిషేకం ఉత్సవాలకు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయని ఆలయ ఈవో రమాదేవి తెలిపారు. కల్యాణానికి ఉభయదాతల టికెట్లు రూ.7,500, సెక్టార్ల టికెట్లు రూ.2,500, రూ.2,000, రూ.1,000, రూ.300, రూ.150, పట్టాభిషేక మహోత్సవానికి రూ.1,500, రూ.500, రూ.100 టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచామని వివరించారు. ఉత్సవాలకు రాలేని భక్తుల గోత్రనామాలతో కల్యాణం జరిపించే సేవల కోసం రూ.5,000, రూ.1,116 టికెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. https://bhadradritemple.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా భక్తులు టికెట్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. వారు ఈనెల 20వ తేదీ ఉదయం 11 గంటల నుంచి.. ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 6 గంటల వరకు దేవస్థానం సమీపంలోని తానీషా కల్యాణ మండపంలో ఒరిజినల్ గుర్తింపు కార్డు చూపించి టికెట్లు పొందాలని సూచించారు.

నేరుగా విక్రయానికి ప్రత్యేక కౌంటర్లు..

ఈనెల 20వ తేదీ నుంచి భద్రాచలంలో నేరుగా సెక్టార్ టికెట్లు విక్రయించనున్నారు. రామాలయం వద్ద మెయిన్ కౌంటర్, తానీషా కల్యాణ మండపం, సీఆర్వో కార్యాలయాల్లో కౌంటర్లు ఏర్పాటు చేశారు. భద్రాచలం ఆర్డీవో ఆఫీసు వద్ద వచ్చే నెల 1 నుంచి కౌంటర్ అందుబాటులో ఉంటుంది.

తెలంగాణ సిఫారసులను టీటీడీ పట్టించుకోవట్లేదు

ఏపీ సీఎంకు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ లేఖ



సాక్షి, హైదరాబాద్: తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులకు తెలంగాణ రాష్ట్ర ప్రజాప్రతినిధులు ఇచ్చే సిఫారసు లేఖలను టీటీడీ అధికారులు పరిగణించటం లేదని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. దీనిపై ఆమె ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖరాశారు. 'తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోవాలన్న తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తికి మీరు సానుకూలంగా స్పందించి, అధికారులకు ఆదేశాలు జారీ చేయటం సంతోషం కలిగించింది. కానీ అక్కడి అధికారులు మీ ఆదేశాన్ని సరిగా పాటించటం లేదు. ఇది భక్తుల్లో ఆందోళన రేపుతోంది. మీ ఆదేశాలను టీటీడీ అధికారులు పూర్తిస్థాయిలో పాటించేలా మళ్లీ ఆదేశించండి' అని కోరారు.

రేవంత్ పిటిషన్‌పై కౌంటర్ వేయండి

డ్రోన్‌ను ఎగరేసిన కేసులో పోలీసులను ఆదేశించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్ స్టేషన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి (నాడు ఎంపీ)పై 2020లో దాఖలైన కేసులో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. పోలీసులతోపాటు ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈ నెల 19కి వాయిదా వేసింది. 2020లో హైదరాబాద్ శివారులోని కేటీఆర్ ఫాంహౌస్‌పై అనుమతులు లేకుండా డ్రోన్ ఎగరేసి చిత్రీకరించిన ఆరోపణలపై నాటి ఎంపీ రేవంత్‌రెడ్డి అరెస్టయ్యారు. జీవో 111ను ఉల్లంఘించి కేటీఆర్ ఫాంహౌస్ నిర్మించుకున్నారని, ఆ విషయాన్ని నిరూపించేందుకు తాను డ్రోన్ ఎగరేసినట్లు రేవంత్ చెప్పారు. రాజకీయ ప్రేరేపితంగా తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, దాన్ని కొట్టివేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం మరోసారి విచారించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. డ్రోన్ ఎగరేసిన కేసులో రేవంత్‌ను గతంలోనే అరెస్టు చేశారని, 18 రోజులు జైలులో కూడా ఉన్నారన్నారు. రేవంత్ డ్రోన్ ఎగురవేసిన ఫామ్‌హౌస్ నిషేధిత ప్రాంతం కిందకు రాదని నివేదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. డ్రోన్ కేసుకు సంబంధించి ఐదుగురు సాక్షుల వాంగ్మూలాలతో పాటు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని పీపీ పల్లె నాగేశ్వర్‌రావును ఆదేశించారు.

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం
దరఖాస్తు 31 వరకు

సాక్షి, హైదరాబాద్: 'ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం'దరఖాస్తు ఈనెల 31 వరకు పొడిగించినట్లు పరిశ్రమలశాఖ సంచాలకుడు జి.మల్సూర్ తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్ పథకానికి 21 నుంచి 24 ఏళ్ల వయసు వారు అర్హులని, కుటుంబంలో ఎవరు కూడా ప్రభుత్వ ఉద్యోగులై ఉండొద్దని, టెన్త్, ఇంటర్, ఐటీఐ పాలిటెక్నిక్ డిప్లొమా, డిగ్రీ పూర్తయి ఉండాలని పేర్కొన్నారు. pminternship.mca.gov.inలో దర ఖాస్తు చేయాలని, గరిష్ఠంగా ఐదు ఇంటర్న్‌షిప్‌లను ఎంచుకోవాలని సూ చించారు. మరిన్ని వివరాల కోసం 1800116090లో సంప్రదించాలన్నారు.

తెలుగు వర్సిటీ పీహెచ్‌డీ ప్రవేశ ఫలితాలు వెల్లడి

నాంపల్లి (హైదరాబాద్): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పీహెచ్‌డీలో చేరడానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షల ఫలితాలను వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు మంగళవారం విడుదల చేశారు. ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆయా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సెంట్రల్ అడ్మిషన్ కమిటీ డైరెక్టర్ బి.రాధ ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారి జాబితాను తెలుగు వర్సిటీ వెబ్‌సైట్‌లో సందర్శించవచ్చని పేర్కొన్నారు.

సమ్మక్క-సారక్క గిరిజన వర్సిటీ తొలి వీసీగా వైఎల్ శ్రీనివాస్

నియామక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి


యెడవల్లి లక్ష్మీ శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలోని సమ్మక్క-సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ తొలి వైస్‌చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ యెడవల్లి లక్ష్మీ శ్రీనివాస్ (వైఎల్ శ్రీనివాస్)ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నియమించారు. మంగళవారం ఈ మేరకు కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ (ఉన్నత విద్యా విభాగం) డిప్యూటీ సెక్రటరీ శ్రేయ భరద్వాజ్ ఉత్తర్వులు జారీచేశారు. వీసీగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ఐదేళ్లు లేదా 70 ఏళ్లు వచ్చే వరకు ఏది ముందు వస్తే...అంతవరకు ఆయన వీసీగా కొనసాగుతారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. వైఎల్ శ్రీనివాస్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని అరోరా ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అకాడమీ (అరోరా యూనివర్సిటీ)లో వీసీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గిరిజన వర్సిటీ వీసీగా నియమించి తనపై పెద్ద బాధ్యత పెట్టారని వైఎల్ శ్రీనివాస్ 'సాక్షి'తో అన్నారు. తెలంగాణ, గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా వర్సిటీని తీర్చిదిద్దాల్సిన అవసరముందని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా బీఈ, బీబీఏ తదితర కోర్సులను ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తామని శ్రీనివాస్ తెలిపారు.

శ్రీనివాస్‌ది బోధన్

నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన వైఎల్ శ్రీనివాస్ అక్కడే గ్రాడ్యుయేషన్ వరకు చదివారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఏ ఇంగ్లిష్, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2017 వరకు కోఠిలోని యూనివర్సిటీ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో పనిచేశారు. అనంతరం ఓయూ ఆర్ట్స్ కాలేజీకి బదిలీ అయ్యారు. 2019 నుంచి 2021 వరకు ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్‌లో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఆ తర్వాత ఇంగ్లిష్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా కొనసాగారు. 2021 డిసెంబర్‌లో ఇఫ్లూ (ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ)లో చేరారు. స్కూల్ ఆఫ్ లిటరరీ స్టడీస్ ఇంగ్లిష్ లిటరేచర్ విభాగంలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ విశ్వవిద్యాలయ ఇంగ్లిష్ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా కూడా కొనసాగుతున్నారు. ఇంగ్లిష్‌లో భారతీయ రచనలు, ఫిల్మ్ అండ్ మీడియా స్టడీస్, ఇంగ్లిష్ భాష బోధన తదితర అంశాలపై పరిశోధనలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ఈయన రాసిన 34కు పైగా వ్యాసాలు ప్రచురితం కాగా, 10 పాఠ్యపుస్తకాలను కేంబ్రిడ్జి, మెక్ మిలన్, ఓరియంట్ బ్లాక్ స్వాన్ వంటి బహుళజాతి ప్రచురణ సంస్థలు ప్రచురించాయి.

తెలుగులో రాత... మార్కుల్లో కోత!

గ్రూప్-1 మెయిన్స్ మార్కులపై అభ్యర్థుల అనుమానం

- తెలుగులో రాసినవారికి తక్కువ మార్కులు వేశారని ఆరోపణ
- కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) విడుదల చేసిన గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలపై తెలుగు మీడియం అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రూప్-1లో అత్యధికంగా 530కి పైబడి మార్కులు వచ్చిన వారున్నారు. అయితే తెలుగు మీడియం కేటగిరీలో 400 మార్కులు దాటలేదని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా మాతృభాషలోని వారికి ఎక్కువ మార్కులు రావాలని, కానీ ఇంగ్లిష్‌లో పరీక్షలు రాసినవారు టాప్‌లో ఉన్నారని చెబుతున్నారు. మూల్యాంకనంలో ఇంగ్లిష్ మీడియంకు ప్రాధాన్యత ఇచ్చారని, తెలుగు మీడియంలో పరీక్షలు రాసిన వారికి తక్కువగా మార్కులు వేశారని ఆరోపిస్తున్నారు. చాలా అంశాల్లో తెలుగు మీడియం అభ్యర్థులకు మినిమమ్ మార్కులు వేయలేదని, ఫాక్ట్స్ రాసిన వాళ్లకు కొంత మేర మార్కులు ఇచ్చారని చెబుతున్నారు. విశ్లేషణాత్మకంగా జవాబులు రాసినవారికి తక్కువ మార్కులు వచ్చాయంటున్నారు. ప్రస్తుతం ఇచ్చిన మార్కులతో అంచనా వేస్తే... త్వరలో 1:2 నిష్పత్తిలో, ఆ తర్వాత తుది జాబితా విడుదలయ్యే నాటికి తెలుగు మీడియం అభ్యర్థులు పోటీలో ఉండే అవకాశం లేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంపై టీజీపీఎస్సీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

గ్రూప్-2 టాపర్ హరవర్ధన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు మూడుసార్లు వాయిదా పడ్డ ఈ పరీక్షలు ఎట్టకేలకు గతేడాది డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగాయి. 33 జిల్లాల్లోని 1,368 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 2,49,964 మంది అభ్యర్థులు మాత్రమే మొత్తం నాలుగు పేపర్లు రాశారు. తాజాగా 2,36,649 మంది అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ లిస్టు, ఫైనల్ కీలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. వివిధ కారణాలతో 13,315 మంది అభ్యర్థులు అనర్హతకు గురయ్యారు.


మంగళవారం గ్రూప్-2 ఫలితాలు విడుదల చేస్తున్న టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం

టాపర్ కోదాడ వాసి

గ్రూప్-2 పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన నారు వెంకట హరవర్ధన్‌రెడ్డి సూర్యాపేట జిల్లా కోదాడ వాసి. ఈయన తండ్రి రవణారెడ్డి కోదాడలోని కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. హరవర్ధన్ ఇటీవలే గ్రూప్-4లో మంచి ర్యాంకు సాధించి ఇంటర్‌బోర్డులో ఉద్యోగం పొందాడు. వీరిది ఆంధ్రప్రదేశ్ కాగా తండ్రి ఉద్యోగ రీత్యా ఖమ్మంలో స్థిరపడ్డారు. గత సంవత్సరమే రవణారెడ్డి కోదాడ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చారు.

టాపర్లు వీరే..

ర్యాంకు కేటగిరీ	పేరు	మార్కులు
1	నారు వెంకట హరవర్ధన్‌రెడ్డి	447.088 ఓసీ
2	వడ్లకొండ సచిన్	444.754 ఓసీ
3	బి.మనోహర్‌రావు	439.344 బీసీ-డి
4	శ్రీరామ్ మధు	438.972 బీసీ-బి
5	చింతలపల్లి ప్రీతమ్‌రెడ్డి	431.102 ఓసీ
6	అఖిల్ ఎర్ర	430.807 ఓసీ
7	జీ.అశోక్	425.842 బీసీ-బి
8	చిమ్ముల రాజశేఖర్	423.933 ఓసీ
9	మేకల ఉపేందర్	423.119 బీసీ-డి
10	కారింగు నరేశ్	422.989 బీసీ-బి

మహిళల కేటగిరీలో టాపర్లు

ర్యాంకు కేటగిరీ	పేరు	మార్కులు
32	లక్కిరెడ్డి వినిషారెడ్డి	408.713 ఓసీ
41	బాయికాడి సుష్మిత	406.499 బీసీ-బి
69	కాపు శ్రీవేణి	399.380 బీసీ-డి
93	వీరంరెడ్డి శ్రీలత	393.521 ఓసీ
113	గొట్టిముక్కల స్నేహ	390.556 బీసీ-బి
126	బిల్ల శ్రావణి	389.460 బీసీ-బి
144	యేరడ్ల నిఖిత	387.499 ఓసీ
152	స్రవంతి లింగం	386.564 ఓసీ
162	మిట్యాకరి సాయిచందన	386.113 బీసీ-డి
163	ధారావత్ అనూష	385.556 ఎస్టీ

ఐఏఎస్ సాధించి తీరుతా



సిద్దిపేట జోన్: రెండుసార్లు యూపీఎస్సీ పరీక్షలు రాసినప్పటికీ అర్హత సాధించలేక పోయా. అయినప్పటికీ ఎప్పటికైనా ఐఏఎస్ సాధిస్తా. గ్రూప్ - 2 రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు రావటం సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రులు వడ్లకొండ శ్రీనివాస్‌రెడ్డి, సుజాత ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైంది. నా ప్రాథమిక విద్య సిద్దిపేటలోనే పూర్తిచేశా. హైదరాబాద్‌లో ఇంటర్, ఇంజనీరింగ్ ఢిల్లీలో పూర్తి చేశాను. రెండేళ్లు ఐటీ ఉద్యోగం చేశాను. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదివి గ్రూప్ -2లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ సాధించాను.

– సచిన్‌రెడ్డి, 2వ ర్యాంకర్, సిద్దిపేట

సంతోషంగా ఉంది..



కొల్చారం(నర్సాపూర్): గ్రూప్-2లో మూడో ర్యాంకు రావటం ఆనందంగా ఉంది. ఇటీవల వెలువడిన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లోనూ ఎకనామిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు సాధించాను. ప్రస్తుతం మెదక్ జిల్లా కొల్చారం మండలం అంసాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నా.

–బి.మనోహర్ రావు, 3వ ర్యాంకర్, అంసాన్‌పల్లి, కొల్చారం మండలం, మెదక్ జిల్లా

కోచింగ్ లేకుండానే సాధించా



పెన్‌పహాడ్: ఎలాంటి కోచింగ్ తీసుకోకుండానే.. ఒకపక్క ఉద్యోగం చేస్తూనే స్వశక్తితో గ్రూప్-2 పరీక్షలకు సన్నద్ధమయ్యాను. రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు సాధించడం గర్వంగా ఉంది. పెన్‌పహాడ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివాను. కోదాడ క్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, కోదాడ అనురాగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాను. 2014లో వీఆర్వో ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం అనంతగిరి ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా. మున్సిపల్ కమిషనర్‌గా చేయాలనే ఆలోచనతో ఉత్తమ ర్యాంకు సాధించాను. నా తమ్ముడు శ్రీరామ్ నవీన్ కూడా నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూనే గ్రూప్-2లో 326వ ర్యాంకు సాధించాడు.

– శ్రీరామ్ మధు, 4వ ర్యాంకర్, మహ్మదాపురం, పెన్‌పహాడ్ మండలం, సూర్యాపేట జిల్లా

రోజుకు 15 గంటలు చదివాను



తలమడుగు: గ్రూప్-2లో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా రోజుకు 12 గంటల నుంచి 15 గంటలు చదివాను. నా విజయం వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది. ఒక లక్ష్యంతో చదివితే కచ్చితంగా ఉద్యోగం సాధించవచ్చు.

– చింతలపల్లి ప్రీతమ్‌రెడ్డి, 5వ ర్యాంకర్, కజ్జర్ల, తలమడుగు మండలం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

నా తల్లిదండ్రులే స్ఫూర్తి



లక్సెట్టిపేట: మాది వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్నలు గొడ్డటి కిష్టయ్య, దేవక్క ఎంతో కష్టపడి నన్ను చదివించారు. గ్రూప్-2లో ఏడో ర్యాంకు సాధించటం ఎంతో సంతోషంగా ఉంది. ఇటీవల గ్రూప్-4లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి మంచిర్యాల కలెక్టరేట్‌లో పని చేస్తున్నాను. ఉద్యోగం చేస్తూనే గ్రూప్-2కు సన్నద్ధమయ్యాను.

– గొడ్డటి అశోక్, 7వ ర్యాంకర్, మంచిర్యాల జిల్లా, గంపలపల్లి గ్రామం

ఉన్నత స్థానానికి ఎదగడమే లక్ష్యం



డోర్నకల్: సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన నేను ఉన్నత స్థానానికి ఎదగడమే లక్ష్యంగా చదివాను. అమ్మానాన్న వ్యవసాయం చేస్తారు. వాళ్లు కష్టపడి నన్ను చదివించడం, అన్నయ్య కానిస్టేబుల్ ఉద్యోగం సాధించటాన్ని స్ఫూర్తిగా తీసుకున్నా. ఇటీవల మహబూబాబాద్ కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాను. గ్రూప్-2 కోసం తీవ్రంగా కృషి చేశా.

– మేకల ఉపేందర్, 9వ ర్యాంకర్, ముల్కలపల్లి, డోర్నకల్, మహబూబాబాద్.

ఐఏఎస్ కావాలన్నదే నా లక్ష్యం



సాక్షి, హైదరాబాద్: ఐఏఎస్ కావాలన్నదే నా లక్ష్యం. సివిల్స్‌కు సిద్ధమవుతున్నాను. బీహెచ్ఎంఎస్ పూర్తి కాగానే పోటీ పరీక్షలపై దృష్టి సారించాను. అమ్మానాన్నల ప్రోత్సాహంతో మూడేళ్లుగా ఇంట్లోనే యూట్యూబ్‌లో పాఠాలు వీక్షిస్తూ గ్రూప్స్‌కు సిద్ధమయ్యాను. సీడీపీఓ పరీక్షల్లో కూడా టాపర్‌గా నిలిచాను. గ్రూప్-1లో మంచి మార్కులు సాధించాను. సివిల్స్ సాధించి పేదలకు సేవలందించాలన్నదే నా ప్రధాన లక్ష్యం.

–డాక్టర్ వినీషా రెడ్డి, 32వ ర్యాంకర్, హైదరాబాద్.

గ్రూప్-2కే ప్రాధాన్యం



పాపన్నపేట(మెదక్): గ్రూప్-2లో రాష్ట్ర స్థాయిలో 41వ ర్యాంకు సాధించాను. గ్రూప్-1 ఫలితాల్లో కూడా 401 మార్కులు వచ్చాయి. ప్రస్తుతం కొల్చారం గురుకుల పాఠశాలలో పీజీటీ (గణితం)గా పని చేస్తున్నాను. గ్రూప్-1లో ఎంపీడీఓ పోస్టు రావచ్చు. అయితే గ్రూప్-2కే ప్రాధాన్యత ఇస్తాను.

–బాయికాడి సుష్మిత, 41వ ర్యాంకర్, అబ్లాపూర్, పాపన్నపేట మండలం, మెదక్ జిల్లా

భర్త ప్రోత్సాహంతోనే..



తలమడుగు: నా భర్త నిమ్మల సాత్విక్‌రెడ్డి ప్రోత్సాహంతోనే గ్రూప్-2లో మంచి ర్యాంకు సాధించాను. మొదటిసారి పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించాను. తర్వాత అటవీ శాఖలో బీట్ ఆఫీసర్‌గా, మూడోసారి కమర్షియల్ ట్యాక్స్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు సాధించాను.

– నిమ్మల తేజశ్రీరెడ్డి, 190వ ర్యాంకర్, సుంకిడి, తలమడుగు మండలం, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

ఉద్దేశపూర్వకంగా ఏ మనిషినిగానీ,
సాధారణ కంటికి కనబడే ఏ ప్రాణినిగానీ చంపకూడదు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 12 మార్చి 2025

ఈసీకి జ్ఞానోదయం ఎప్పుడు?

తటస్థతకు తిలోదకాలొదిలి అవకతవకలకు అసలైన చిరునామాగా మారిన ఎన్నికల సంఘం(ఈసీ) సిగ్గుపడాల్సిన విషయమిది. ఆరోపణలొచ్చినప్పుడూ, ఫిర్యాదులందినప్పుడూ మౌనంతోనో, దబాయింపుతోనో తప్పించుకోజూస్తున్న ఈసీపై సోమవారం పార్లమెంటు ఉభయసభలూ దద్దరిల్లాయి. మహారాష్ట్రలో వోటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ ఆరోపణలు చేసి మూణ్ణెల్లవుతోంది. నెల క్రితం కూడా ఆ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ మీడియా సమావేశంలో ఈసీపై అభియోగాలు మోపారు. అయిదు నెలల వ్యవధిలో కొత్తగా 39 లక్షలమంది వోటర్లు ఎలా పుట్టుకొచ్చారని ప్రశ్నించారు. అవి ఆధార రహితం, తప్పుదోవ పట్టించే అభాండాలని చెప్పటం తప్ప నిర్దిష్టంగా ఫలానా చోట ఏం జరిగిందో, వోటర్ల సంఖ్య పెరగటానికి కారణమేమిటో వివరించే ప్రయత్నం ఈసీవైపు నుంచి లేదు! అటు బెంగాల్‌లో ఈ మాదిరి అవకతవకలే బయటపడి ఆ సంస్థ పరువు బజారుపాలు చేశాయి. వోటర్ల జాబితా అవకతవకలతోపాటు నకిలీ వోటరు కార్డులు రాజ్యమేలుతున్నాయని తృణమూల్ ఫిర్యాదు చేస్తే మూడు నెలల్లో సరిచేస్తామన్న జవాబొచ్చింది. వెనువెంటనే దర్యాప్తు చేసి దీనివెనక జరిగిందేమిటో తేల్చిచెప్పడానికి బదులు సరిచేస్తామనటంలో మర్మమేమిటి? అక్కడే కాదు... హరియాణా, గుజరాత్, ఒడిశా, యూపీల్లో సైతం ఇలాగే జరిగిందని విపక్ష సభ్యులు ఆరోపించారు. ఇటీవల ఎన్నికలు జరిగిన ఢిల్లీలోనూ ఇదే తంతు నడిచిందని ఆప్ ఆరోపణ. రాజ్యాంగ సంస్థగా ఎంతో హుందాగా, నియమ నిబంధనలకు లోబడి పనిచేయాల్సిన సంస్థ ఇలా అడుగడుగునా కంతలతో, లోపాయికారీ వ్యవహారాలతో ఎన్నికలు జరిపించటం సిగ్గుచేటు కాదా?

ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ నిష్పాక్షికంగా నిర్వహించాల్సిన క్రతువు. అది కాస్తా ఈమధ్య కాలంలో నవ్వుల పాలవుతున్న వైనం కనబడుతున్నా తనకేం సంబంధం లేనట్టు ఆ సంస్థ ప్రవర్తిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో నిరుడు ఎన్నికల సందర్భంగా కేంద్రంలోని అధికార ఎన్డీయే కూటమితో కొత్తగా చుట్టరికం కుదిరిందన్న ఏకైక కారణంతో అప్పటి విపక్ష నాయకులు చెప్పినట్టల్లా అధికారులను బదిలీలు చేశారు. పర్యవసానంగా ఇతర జిల్లాల్లో జరిగిన దారుణ ఉదంతాల సంగతలా ఉంచి పల్నాడు ప్రాంతం ఎంతటి హింసను చవిచూసిందో, ఎన్ని గ్రామాల ప్రజలు ఇళ్లూ వాకిళ్లూ వదిలి ప్రాణభయంతో పారిపోయారో మీడియా సాక్షిగా వెల్లడైంది. పోలింగ్ కేంద్రాల దురాక్రమణ, తెల్లారుజాము వరకూ పోలింగ్ తంతు కానివ్వటం వంటి అరాచకాలకు అంతులేదు. సాయంత్రం గడువు ముగిసే సమయానికి పోలింగ్ కేంద్రం గేట్లు మూసి ఆ ఆవరణలో ఉన్నవారికి మాత్రమే స్లిప్‌లిచ్చి వోటు వేయటానికి అనుమతించాలని నిబంధనలు చెబుతున్నాయి. క్యూలో చిట్టచివర గేటు దగ్గర ఉన్నవారికి ఒకటో నంబర్ స్లిప్ ఇవ్వటంతో మొదలెట్టి బూత్ సమీపంలో ఉన్నవారికి ఆఖరి స్లిప్ ఇవ్వాలి. ఓటేశాక ఆ స్లిప్‌లు భద్రపరచాలి. సీసీ టీవీ ఫుటేజ్‌లు భద్ర పరచాలి. ఇదంతా జరిగిందా? పోలింగ్ ముగిసిన నాలుగురోజుల తర్వాత 12.5 శాతం వోటింగ్ పెరిగినట్టు చూపటానికి ఈసీ ఏమాత్రం మొహమాట పడలేదు. ఇదంతా ఎక్కడ బయటపడుతుందోనన్న కంగారుతో పరాజితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించే సమయానికే ఈవీఎంల డేటా ఖాళీ చేశారు. వీవీప్యాట్ స్లిప్‌లు ధ్వంసం చేశారు. ఈవీఎంలలో రికార్డయిన ఓట్ల లెక్కలు బయటకు తీసి, అవి వీవీప్యాట్ స్లిప్‌లతో సరిపోల్చాలని కోరితే డమ్మీ గుర్తులతో కొత్తగా నమూనా వోటింగ్ నిర్వహించటానికి సిద్ధపడ్డారు! ఇక భద్రపరిచిన ఈవీఎంలలో చార్జింగ్ ఎలా పెరుగుతుందో ఇంతవరకూ చెప్పలేకపోయింది. వీటిపై వైఎస్సార్ కాంగ్రెస్ నిలదీస్తే జవాబివ్వటానికి ఈసీకి నోరు పెగలదు.

పార్లమెంటులో ఇంత దుమారం రేగాక డూప్లికేట్ కార్డులపైనా, వోటర్ల జాబితా అవకతవకలపైనా సాధికారికంగా, పద్ధతిగా జవాబివ్వడానికి బదులు వేరే మార్గం ఎంచుకుంది. 'ఈసీ వర్గాలు' అనే పేరుతో ఒక వివరణ బయటికొదిలింది. ఆ సంస్థ తనను తాను ఏమనుకుంటున్నదోగానీ ఇలా మీడియాకు లీకులివ్వటం మర్యాదైన సంగతి కాదు. ఒక పార్టీయో లేదా ప్రభుత్వమో తమ ఆలోచనలపై ప్రజాస్పందనేమిటో తెలుసుకోవటానికి లీకులిస్తుంటాయి. దాని ప్రయోజనం దానికుంటుంది. కానీ ఈసీ అలా చేయటంలో ఆంతర్యమేమిటి? ఉదాహరణకు డూప్లికేట్ వోటర్ కార్డులు వారసత్వపు సమస్యగా తేల్చిచెప్పింది. 2008–13 మధ్యే ఈ కార్డులు జారీ అయ్యాయన్నది. అదే నిజమనుకుంటే ఆ సంగతి ఈసీకి ఎప్పుడు తెలిసింది? తెలిశాక తీసుకున్న చర్యలేమిటి? ఇన్నాళ్లూ సరిచేయక పోవటానికి కారణాలేమిటి? అధికారికంగా ఇలాంటి తెలివితక్కువ జవాబులిస్తే మరిన్ని ప్రశ్నలు వచ్చిపడతాయన్న భయంతోనే ఆ సంస్థ లీకులతో సరిపెట్టింది.

ఎంతకాలం ఈ దాగుడుమూతలు? ఎన్నాళ్లు ఈ అవకతవకలు? ఎన్నికల ప్రక్రియపైనా, వివిధ దశల్లో చోటుచేసుకున్న అక్రమాలపైనా ఫిర్యాదులొస్తే నిమ్మకు నీరెత్తినట్టు కూర్చుని ఇప్పుడు పార్లమెంటులో పెద్ద రాద్ధాంతం జరిగాక లీకులివ్వటం, అవి మరిన్ని సందేహాలకు తావీయటం అప్రదిష్ట కాదా? ఇందువల్ల తమ విశ్వసనీయత దెబ్బతింటుందన్న ఇంగితజ్ఞానం కూడా లేదా? ఓడిన రాజకీయ పార్టీలు మాత్రమే కాదు... సాక్షాత్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన ఎస్‌వై ఖురేషీ సైతం గతంలోనూ, ఇప్పుడూ కూడా అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల సంఘం తీరు సవ్యంగా లేదన్న అభిప్రాయం ప్రజల్లో బలపడుతున్నదని హెచ్చరించారు. కనుక ఆ సంస్థ ఇప్పటికైనా పారదర్శకతతో వ్యవహరించటం నేర్చుకోవాలి. తప్పును తప్పుగా ఒప్పుకొనే నిజాయితీ ప్రదర్శించాలి. లేనట్టయితే ప్రజానీకం దృష్టిలో దోషిగా మిగలక తప్పదు.

ఆ గానానికి గమ్యం – శ్రీహరి సన్నిధే!



భూమన కరుణాకర రెడ్డి

సంగీతం ఆపాతమధురం. భావుకతతో, సమసమాజ భావనలతో, ప్రకృతి వర్ణనలతో... ఇలా హరివిల్లులా సంగీత జగత్తు నాదమయం. అలాగే భక్తి, ప్రపత్తి, శరణాగతులతో గానం చేసిన వారి కీర్తి అజరామరం. మన సమకాలంలో గానం చేస్తున్న, చేసిన సంగీత విద్వాంసులలో తనదైన విలక్షణ గాత్రంతో వెలిగిన ధ్రువతార శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్.

నాకు గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్‌తో దశాబ్దాల అనుబంధం. సౌజన్యం, సంస్కారం, వినమ్రత – పరిచయమైన క్షణంలోనే సూదంటురాయిలా ఆకర్షించిన అంశాలు. శక్తి, భక్తి, రక్తి కలిగిన తిరుమల ఆలయ కవి అన్నమయ్య కీర్తనలు పాడి తరించిన సంకీర్తన మహతి.

స్వామి పుష్కరిణీ తీరంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామిని గానం చేసిన భావ పుష్కరిణి అన్నమయ్య. ఆ కీర్తనలలోని రసాత్మకతను దర్శించి, అనుభవించి స్వర పరచిన మహనీయులలో ఆరాధ్యుడు, అనవద్యుడు శ్రీ గరిమెళ్ళ. ఒక వాగ్గేయకారుని సహస్ర కీర్తనలు స్వర పరిచి, పాడి, తన శిష్య ప్రశిష్యులతో పాడించిన కారణ జన్ముడు. స్వయంగా వాగ్గేయకారుడు. 'ఆంజనేయ కృతి మణిమాల', 'నవగ్రహ కీర్తనలు' వంటివి ఇందుకు మణిదర్పణం. లలిత సంగీత రచనల్లో 200 పాటల అందమైన బాలకృష్ణ భావలహరి అజరామరం.

గాయకుడిగా, వాగ్గేయకారుడిగా, స్వరకర్తగా, శిష్య ప్రశిష్యులను తీర్చిదిద్దిన సంగీత కులపతి ఆయన. ఉద్యాన వనంలో అనేకమైన పూలకుండే పరిమళంలా, ప్రతి పాటకు తాను చేసిన స్వర రచనలో ఎంతో వైవిధ్యం, ఎంతో శాస్త్రీయత ఉట్టిపడుతాయి. అయితే, అంతకన్నా ఎంత ఆర్ద్రత నిండుగా ఉంటుందో స్మరిస్తే పులకించిపోతాం.

సంగీత అక్షయ పుణ్యకోశమైన శ్రీ బాలకృష్ణ ప్రసాద్‌కు నాపై ఉండే ఆదరం నిరుపమానం. లెక్కకు మించిన సార్లు నా ఇంటికి వచ్చి నాకు నచ్చిన పాటలు వినిపించిన ఆత్మబంధువు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడిగా నేను రూపకల్పన చేసిన 'దళిత గోవిందం', 'కల్యాణమస్తు', ఇంకా, దేశ విదేశాల్లో జరిగిన కల్యాణాల్లో, ఇతర ధార్మిక కార్యక్రమ ప్రస్థానంలో, ఆయన నా సహచరుడు. దళిత గోవిందం, శ్రీనివాస కల్యాణాల్లో – 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే', 'ఇతడొక్కడే సర్వేశ్వరుడు' వంటి కీర్తనలు ఆయన ఆలపించిన తీరు నాలో చెరగని ముద్ర వేశాయి. బాలకృష్ణ ప్రసాద్ ఛాందసుడు కాడు. మానవత్వం మొగ్గ తొడగాలని, సమాజంలో అన్ని వర్గాల మధ్య మమతా బంధాలు బలపడాలనే తాత్వికుడు. ఈ సత్యాన్ని తెలిపే వారి లలిత గీతాలు – ఆకాశవాణిలో ఎన్నో ప్రసారం అయ్యాయి. సామ్యవాదాన్ని, సౌమ్యవాదాన్ని మేళవించుకొన్న స్థితప్రజ్ఞుడు.



నివాళి

గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్

(తి.తి.దే. ఆస్థాన విద్వాంసుడైన గరిమెళ్ల మార్చ్ 9న తుదిశ్వాస విడిచారు.)

రాజకీయ నాయకుల్లో మాట తప్పని, మడమ తిప్పని మహనీయుడు శ్రీ వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారితో చేయించిన సన్మానం తనకొక మధుర స్మృతిగా నాకు తరచూ చెప్పేవాడు. జన హృదయ నేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఆదేశిస్తే, తి.తి.దే. అధ్యక్షుడిగా ఆయనకు 'పద్మశ్రీ' ఇవ్వాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపించాను. కేంద్ర సంగీత నాటక అకాడమీ సన్మానితుడిగా, తి.తి.దే. ఆస్థాన పండితుడిగా, బిరుదులకే గౌరవాన్ని తెచ్చిన, లేదా పెంచిన ప్రజ్ఞాశాలి ఆయన. లాలిపాటల నుండి జోల పాటల వరకు కులశేఖరపడి వద్ద పాడిన అపర అన్నమయ్య.

శ్రీవారి సేవలో నాద విద్వాంసుడిగా జీవించిన పూర్ణకాముడు. ఆ గాత్రానికుండే ప్రత్యేకత ఆరు దశాబ్దాల కాలం, ఇలలో సౌగంధికా సౌరభాన్ని నింపింది. ఇక కోనేటి రాయుని కొలువులో నారద, తుంబురులతో గానం చేస్తాడు. అన్నమయ్య కీర్తనలను, తన కీర్తనలను కలిపి గానం చేస్తూ తాళ్ళపాక కవులను ఆనంద పారవశ్యంలో ముంచెత్తుతాడు. పులుకు తేనెల తల్లి అమృత హస్తాలతో ఆనందామృతాన్ని గ్రోలుతాడు. ఆ మహనీయుని ధర్మపత్ని శ్రీమతి రాధ, వారి పుత్రులైన శ్రీ అనిల్ కుమార్, శ్రీ పవన్ కుమార్‌లకు – జాలి గుండెలవాడైన ఏడుకొండలస్వామి నిండైన అండదండగా ఉంటాడని విశ్వసిస్తున్నాను.

◆ అన్నమయ్య కీర్తనలలోని రసాత్మకతను దర్శించి, అనుభవించి స్వర పరచిన మహనీయులలో ఆరాధ్యుడు, అనవద్యుడు గరిమెళ్ల.

◆ బాలకృష్ణ ప్రసాద్ ఛాందసుడు కాడు. మానవత్వం మొగ్గ తొడగాలని, సమాజంలో అన్ని వర్గాల మధ్య మమతా బంధాలు బలపడాలనే తాత్వికుడు. సామ్యవాదాన్ని, సౌమ్యవాదాన్ని మేళవించుకొన్న స్థితప్రజ్ఞుడు.

వ్యాసకర్త పూర్వ అధ్యక్షులు,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

సోషల్ మీడియా

అవీ ప్రమాదమే!



మామూలు సిగరెట్ల కన్నా ఎలక్ట్రానిక్ సిగరెట్లు తాగడం తక్కువ హానికరమని కొందరు భావిస్తుండవచ్చు. కానీ దాని పరిణామాలు మరింత తీవ్రంగా ఉంటాయి. వాటి మీద కూడా ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. సులభంగా అందుబాటులో ఉండటం ఆందోళనకరం.

– దీప్‌శిఖా ఘోష్, వైద్యురాలు

తగ్గిస్తే మంచిదే!



వేతనాలు తగ్గించకుండానే పని గంటలను వారానికి 40 నుంచి 36 గంటలకు తగ్గించింది ఐస్‌లాండ్. 2020–22 మధ్యలో దాదాపు సగానికి పైగా శ్రామిక శక్తి ఈ మార్పును స్వీకరించింది. ఇది ఉత్పత్తిని పెంచడమేగాక పని–జీవిత సమతుల్యతను మెరుగుపరిచింది. పైగా ఎన్నో యూరోపియన్ దేశాలకంటే ఎక్కువగా 2023లో 5 శాతం ఆర్థిక వృద్ధిని సాధించింది. దీనివల్ల యూరప్‌లోకెల్లా తక్కువ నిరుద్యోగితా రేటు 3.4 శాతం కూడా సాధ్యమైంది. భారత పారిశ్రామికవేత్తలకు దీని మీద భిన్నాభిప్రాయం ఉండొచ్చుగానీ, తక్కువ పనిగంటలు సృజనకూ, ఉత్పాదకతకూ, నాణ్యమైన జీవితానికీ కారణం అవుతున్నాయి.

– మనోజ్ అరోరా, ఫైనాన్సియల్ ప్లానర్

రెండు దేశాలు



చైనా భవిష్యత్‌లో జీవిస్తోంది. ఇండియా చరిత్రలో జీవిస్తోంది. అదీ తేడా!

– ముకేశ్ మిత్తల్, వ్యాఖ్యాత

మూల కేంద్రం



మనస్సే అన్ని యుద్ధాలకు, వ్యూహాలకు ప్రారంభ స్థానం. భావోద్వేగాలతో సులభంగా మునిగిపోయే మనసు; వర్తమానంలో ఉండక, గతంలో పాతుకుపోయిన మనసు; ప్రపంచాన్ని స్పష్టంగా, అత్యవసరంగా చూడలేని మనసు... ఎల్లప్పుడూ లక్ష్యాన్ని కోల్పోయే దారుల వైపే నడిపిస్తుంది.

– రాబర్ట్ గ్రీన్, బెస్ట్ సెల్లింగ్ రైటర్

'ఏనుగు' అంబారీ!



మళ్లీ ఎలాన్ మస్క్ 'ఎయిర్ ఫోర్స్ వన్' విమానంలో, 'మెరైన్ వన్' హెలికాప్టర్‌లో ప్రయాణించి వైట్ హౌస్‌కు తిరిగి వచ్చారు. ఆయన అమెరికా అధ్యక్షుడు కారు. అధ్యక్షుడి కుటుంబ సభ్యుడు కారు. ఆయన వైట్‌హౌస్‌లో నివసిస్తున్నారా? ఈ ఎన్నిక కాని 'దక్షిణాఫ్రికా అధికారి'ని సంతృప్తి పరచటానికి ఎంత చెల్లిస్తున్నామో అమెరికా ప్రజలు తెలుసుకోవాలి.

– క్రిస్ డి. జాక్సన్, రాజకీయ విశ్లేషకులు

ఎలా బతుకుతారు?



ఢిల్లీ రాజధాని ప్రాంతంలో యువతకు నెలకు 15,000–25,000 రూపాయల వేతనంతో 'వైట్ కాలర్' ఉద్యోగాలు ఇవ్వజూపుతున్నారని తరచుగా వింటున్నాను. అంటే రోజుకు 500–800 రూపాయలు. అదీ దేశంలోని అత్యంత ఖరీదైన నగరంలో. అలాంటి వేతనంతో ఎలాంటి జీవన ప్రమాణాలను మనం ఆశించవచ్చు?

– అనింద్యో చక్రవర్తి, ఫైనాన్స్ జర్నలిస్ట్

ఇన్ బాక్స్

సామాజిక శాస్త్రాల ప్రాధాన్యం

ప్రపంచంలో సామాజిక శాస్త్రాలకు ప్రాధాన్యత తగ్గిపోతోందని ఒక అభిప్రాయం ఉంది. అందుకే వాటిని అధ్యయనం చేసే విద్యార్థుల సంఖ్యా తగ్గుతోంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ గణిత శాస్త్రం వంటివాటి ప్రాధాన్యత, అధ్యయనం పెరిగిపోతోంది. దీనికి కారణం ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధి, సాంకేతిక పురోగతిని నడిపించడంలో కీలక పాత్ర వీటిదే కావడం. సమాజం, సంస్కృతి, మానవ ప్రవర్తనను అర్థం చేసుకోవడంలో సామాజిక శాస్త్రాలది కీలక పాత్ర. పాలన, ఆరోగ్యం, విద్య సమాజ శ్రేయస్సును మెరుగుపరచడానికి సామాజిక శాస్త్రాలు దోహదపడినప్పటికీ, సాంకేతిక విభాగాలతో పోలిస్తే ఇవి తక్కువ ఆచరణాత్మకమైనవి. పెరుగుతున్న సాంకేతికత–ఆధారిత ప్రపంచం యొక్క డిమాండ్లను తీర్చడానికి విద్యా వ్యవస్థలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నందున, సామాజిక శాస్త్రాల ప్రాధాన్యత తగ్గిపోతోందని ఒక అభిప్రాయం.

కానీ సామాజిక సమస్యలను అర్థం చేసుకోవడం, పరిష్కరించడం, ఆర్థిక అభివృద్ధి, సంక్షేమం కోసం సామాజిక శాస్త్రవేత్తల అవసరం ఉంది. ప్రపంచీకరణ, మార్పునకు అనుగుణంగా మారడం, సంఘర్షణా పరిష్కారం, శాంతి నిర్మాణం, స్థిరమైన సమాజాలకు సహాయం చేయడానికి సామాజిక శాస్త్రవేత్తలు అవసరం. ఈ విభాగాలు మానవ ప్రవర్తన సామాజిక గతిశీలతను, సామాజిక విలువలను అర్థం చేసుకోవడానికి సాధనాలను అందించడమే కాకుండా, సామాజిక నిబంధనలు, చట్టాలు, విధానాలను రూపొందించడానికి, ప్రభావితం చేయడానికి కూడా చురుకుగా పనిచేస్తాయి. 'ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం' సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో సామాజిక శాస్త్రాల కీలక పాత్రను నొక్కి చెబుతోంది. ప్రపంచ అవగాహనను రూపొందించడంలో, అసమానత, వాతావరణ మార్పు, మానవ హక్కులు వంటి సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడంలో సామాజిక శాస్త్రాలు కీలక పాత్ర పోషిస్తూనే ఉన్నాయి. సామాజిక శాస్త్ర అంశాలను సైన్స్–టెక్నాలజీలతో అనుసంధానించినప్పుడే మానవజాతికి నిజమైన ప్రయోజనం చేకూరుతుంది. ఈ దృష్టితో చూసినప్పుడు ప్రపంచ మనుగడకు సైన్స్, సాంకేతికలతో పాటు సామాజిక శాస్త్రాల ప్రాధాన్యతా ఉందనేది నిర్వివాదాంశం. ప్రభుత్వాలు ఈ దిశలో కృషి చేయాలి.

– ప్రొ॥ పి.ఎస్. చారి, తిరుపతి

చెప్పిందేమిటి... చేసేదేమిటి?

అభిప్రాయం



వి.వి.ఆర్. కృష్ణంరాజు

అమరావతి దేవతల రాజధాని అంటారు. ఆ పేరుతో నిర్మించాలనుకుంటున్న రాజధాని నగరం మాత్రం శాపగ్రస్త, వివాదాస్పద ప్రదేశంగా మారింది. విభజన చట్టం అమలు హామీల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి కేవలం రూ. 2,500 కోట్లు ఇచ్చి చేతులు దులిపేసుకుంది. అమరావతి సెల్ఫ్ సస్టెయినబుల్ ప్రాజెక్ట్ అని, దానిపై ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టక్కరలేదని చంద్రబాబు పదేపదే చెప్పారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 9 వేల కోట్లు ఖర్చు చేసింది. మరో రూ. 6 వేల కోట్లు ఖర్చు చేయడానికి తాజా బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేసింది. ఇవి కాకుండా అంతర్జాతీయ సంస్థల నుంచి రూ. 31 వేల కోట్ల రూపాయలు రుణాలుగా తీసుకుంటోంది. కేంద్రంలోని మోదీ సర్కార్ తమ మద్దతుతోనే మనగలుగుతోంది అంటూ, ఈ 31 వేల కోట్ల రూపాయల రుణంతో రాష్ట్రానికి సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వమే ఆ భారాన్ని మోస్తుందని చంద్రబాబు అండ్ కో ప్రచారం చేస్తున్నారు. అబద్ధాలను ఉద్యమం రూపంలో ప్రచారం చేస్తున్న తెలుగుదేశం పార్టీ తాజాగా మార్చి 10వ తేదీన తమ అధికారిక ఎక్స్ ఎక్కౌంట్లో 'రాజధాని అమరావతికి అప్పులు అంటూ, వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారానికి కేంద్రం చెక్ పెట్టింది. వైసీపీ ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్రం క్లారిటీ ఇచ్చింది. రాజధాని కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ఇచ్చే రుణాలు ఏపీ అప్పుల పరిధిలోకి రావని స్పష్టం చేసింది' అని పేర్కొంది. అబద్ధాలు చెప్పడంలో రాటు దేలిన ఆ పార్టీ ఈ రుణాల బాధ్యత తమది కాదు, కేంద్రానిదే అని చెప్పే ప్రయత్నం చేసింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రుణాలపై వివరణ ఇస్తూ 'మల్టీ లేటరల్ లోన్ అసిస్టెన్స్' పేరిట రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే అప్పులను ఆ ప్రభుత్వమే చెల్లించాలని చాలా స్పష్టంగా చెప్పింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మార్చి 10వ తేదీన మాట్లాడుతూ, 'అమరావతి సెల్ఫ్ సస్టెయినబుల్ ప్రాజెక్ట్, మెజార్టీ నిధులను సీఆర్‌డీఏనే సమకూర్చుకునే విధంగా ప్రాజెక్టును డిజైన్ చేశాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తాత్కాలికంగా సపోర్ట్ ఇస్తున్నాం అంతే. అది కూడా బయటి సంస్థల ద్వారా రుణాల రూపంలో నిధులను సమకూర్చి ఇస్తున్నాం. అమరావతి భూములు అమ్మేసి ఈ అప్పులన్నీ కట్టేసే విధంగా డిజైన్ చేస్తున్నాం' అంటూ వివరణ ఇచ్చారు. కేంద్రం అమరావతికి ఏ రూపంలోనూ నిధులు సమకూర్చడం లేదని, దానిపై కేంద్రానికి ప్రత్యేక శ్రద్ధ కూడా లేదనడానికి ఇదే నిదర్శనం.

అమరావతి నిర్మాణం, చంద్రబాబు ప్రభుత్వ చిత్తశుద్ధిపైనా సామాన్యులకే కాదు... అమరావతి ప్రాంత రైతులకు కూడా సందేహాలున్నాయి. అందుకే వారు భూ సమీకరణకు సీఆర్‌డీఏకి సహకరించడం లేదు. 38,581 ఎకరాల్లో రాజధానిని నిర్మించేందుకు 2015 జనవరిలో సీఆర్‌డీఏ ప్రారంభించిన భూ సమీకరణ ఇప్పటికీ పూర్తి కాలేదు. దీనిలో 33 వేల ఎకరాల భూమి సమీకరించాం అంటున్న సీఆర్‌డీఏ రైతులకు బదులుగా 65 వేల కమర్షియల్, రెసిడెన్షియల్ ప్లాట్లు ఇవ్వాలి. అయితే ఇప్పటి వరకూ 45 వేల ప్లాట్లను మాత్రమే రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. చంద్రబాబు ప్రభుత్వంపై నమ్మకం లేకపోవడంతో పాటు ఇతర కారణాల దృష్ట్యా ఇప్పటికి 20 వేల ప్లాట్లను రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. ఈ భూ సమీకరణ పూర్తి కానంత వరకూ రాజధాని విస్తీర్ణం నిర్ణయించడం సాధ్యం కాదు. సీఆర్‌డీఏ మరో ఐదు వేల ఎకరాలు రైతుల నుంచి సమీకరించడానికి ఎప్పటి నుంచో విఫలయత్నం చేస్తోంది. అయితే వారు తమ భూములను ఇవ్వడానికి ఏ మాత్రం అంగీకరించడం లేదు. 29 గ్రామాలతో కూడిన ప్రదేశంలో రాజధాని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తుండగా దానిలో భాగస్వామ్యం కావడానికి రెండు గ్రామాల ప్రజలు ఇప్పటికీ నిరాకరిస్తున్నారు. అమరావతి భూములపై ప్రస్తుతం వందలాది కోర్టు కేసులున్నాయి. ఇన్ని అడ్డంకులున్నా ప్రభుత్వం మాత్రం 47 సంస్థలకు భూములు కేటాయించింది. ఇప్పటికే రూ. 9 వేల కోట్లు అమరావతి నిర్మాణాలపై ఖర్చు చేసి మరో రూ. 48 వేల కోట్ల రూపాయలకు టెండర్లు పిలిచింది.



అమరావతిలో భూ సమీకరణ ఒక విఫల ప్రయోగం. భూ సమీకరణ పేరుతో అమాయక రైతులు ఎలా నష్టపోయారో బెంగళూరుకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ప్రొఫెసర్ కరోల్ ఉపాధ్యాయ తన 'అసెంబ్లింగ్ అమరావతి: స్పెక్యులేటివ్ ఎక్యుమిలేషన్ ఇన్ ఏ న్యూ ఇండియన్ సిటీ' అధ్యయన గ్రంథంలో కళ్ళకు కట్టినట్లు వివరించారు. జపాన్‌కు చెందిన మాకీ అసోసియేట్స్ సంస్థ 'అమరావతి' పేరుతో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చేస్తున్న అవినీతిని అంతర్జాతీయ వేదికల్లో ప్రస్తావించింది. 'హైటెక్ సిటీ' పేరుతో హైదరాబాద్‌లో చంద్రబాబు నాయుడు ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు ఎలా పాల్పడ్డారో ప్యారిస్ యూనివర్సిటీకి చెందిన 'దలేల్ బెన్‌బబాలి' కళ్ళకు కట్టినట్లు వివరించారు. అదే ప్రయోగాన్ని చంద్రబాబు నాయుడు అమరావతిలో కూడా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అమరావతిలో దళితులకు అన్యాయం, బలహీన వర్గాల జీవనోపాధికి భంగం కలుగుతుందన్న వాదనలు ఉన్నాయి.

శివరామకృష్ణన్ కమిటీ రాజధానికి అమరావతి అనువైన ప్రదేశం కాదని అభిప్రాయపడింది. ఆ తరుణంలో అమరావతిలో రాజధాని పెట్టాలని చంద్రబాబు నాయుడికి వెంకయ్యనాయుడు సలహా ఇచ్చారంటూ అప్పట్లో 'ఈనాడు' పత్రిక ఒక కథనం ప్రచురించింది. ఈ ప్రదేశానికి అమరావతి అని నామకరణం చేసిన వ్యక్తి చెరుకూరి రామోజీరావు. దీనిని అమలు చేస్తోంది చంద్రబాబు నాయుడు. ఈ పరిణామాల నేపథ్యంలో అప్పులతో నిర్మిస్తున్న అమరావతి అందరి రాజధానిగా ఉంటుందా? కొందరి రాజధానిగా ఉంటుందా? అన్న అనుమానాలు సామాన్యులకు రావడం సహజమే.

వ్యాసకర్త అధ్యక్షుడు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్
మొబైల్: 89859 41411

నిత్య శుభకరుడు

మన్మథుడిని భస్మంచేసి, బూడిదను శరీరంపై పులుముకుని, వృషభాన్ని వాహనంగా చేసుకుని; పాములు, కరిచర్మము, కపాలములు భూషణములుగా కలిగి; పిశాచగణంతో సాహచర్యాన్ని నెరపుతూ, శ్మశానాన్నే నివాసంగా చేసుకుని జీవిస్తున్నప్పటికీ గంగమ్మను శిరస్సుపై ధరించడం అన్న ఒక్క చర్యతో సదాశివుడయ్యాడు – అనగా అన్ని సమయాలలోనూ శుభాన్ని కలిగించేవాడు, మోక్షాన్ని ప్రసాదించేవాడు అయ్యాడట శంకరుడు! అయితే, శివుడికేనా ఈ ప్రయోజనం అంటే అలా కాదట!

జ్యోతిర్మయం

శివుడి తలపై చేరినందువలన గంగమ్మకు కూడ ఒక ప్రయోజనం చేకూరిందని కొఅవి గోపరాజు 'సింహాసన ద్వాత్రింశిక' షష్ఠాశ్వాసములోని ఒక పద్యంలో చెప్పాడు. అదేమిటంటే... శివుడి నుదుటిన మూడవ కన్ను ఉంటుంది కదా! ఆ మూడవ కన్ను ప్రభావం ఎటువంటిదో అందరికీ తెలిసినదే! శ్రీ మహావిష్ణువు కుమారుడైన మన్మథుడిని సైతం భస్మం చేయగలిగిన సామర్థ్యం కలది. శివుడు మూడవ కన్ను తెరిస్తే ఎదురుగా ఉన్నది ఎంతటిదైనా బూడిద కావలసిందే! అటువంటి మూడవ కన్ను ఉన్న నుదురుకు, కిరీటం వలె అలంకారంగా ఉన్న జటాజూటంలో గంగమ్మ కొలువై ఉంది. ఆ కారణంగానే – అనగా శివుడి మూడవ కంటికి సమీపంగా ఉన్న కారణంగా – గంగలో తల పూర్తిగా తడిసేలా ఎన్ని మార్లు మునకలు వేసినా చలి వెయ్యదు అన్నాడు కొఅవి గోపరాజు.

కం. మలినుడు మై గడగిన ని
ర్మలుడౌటది చెల్లు లోకమాతా! నీలో
దల దడిపిన జలి లేదని
వెలయుట యాహరుని నుదుటి వేడిమి జుమ్మీ!

'ఎవరైనా శరీరం మీద మురికితో నదిలో మునిగితే, ఆ నది చల్లని నీటిలో మురికి అంతా కొట్టుకుపోయి, శరీరం శుభ్రపడి నిర్మలుడు కావడం సహజంగా జరిగే పని. అలా జరిగినప్పటికీ, నది నీటిలో మునక వేయడానికి మాత్రం, నీటికి ఉండే చల్లదనం కారణంగా, సంకోచంగా ఉంటుంది. వణుకుతూనే మునక వేయాల్సి వస్తుంది. కానీ, గంగమ్మతల్లీ... నీ ప్రవాహంలో తల మునకలుగా ఎన్ని సార్లు మునిగి తేలినా చలి పుట్టదు అనే భావన భక్తుల మనసులలో స్థిరపడి ప్రసిద్ధం కావడానికి కారణం మాత్రం శంకరుడి నుదుటి మీది మూడవ కంటి వేడిమే సుమా!' అన్నది తాత్పర్యం.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.త్రయోదశి ఉ.9.41 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** మఖ తె.4.07 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.3.34 నుండి 5.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.48 నుండి 12.36 వరకు, **అమృతఘడియలు:** రా.1.41 నుండి 3.22 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.15, **సూర్యాస్తమయం:** 6.05.

9 మందికి ఈఎన్‌సీలుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో 9 మంది చీఫ్ ఇంజనీర్లకు ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ)లుగా పదోన్నతులు కల్పించడానికి శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన డీపీసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగింది. సీఎం ఆమోదం లభించిన వెంటనే పదోన్నతులు కల్పిస్తారు. ఈఎన్సీ (జనరల్), ఈఎన్సీ (రామగుండం), ఈఎన్సీ (గజ్వేల్), ఈఎన్‌సీ (ఓఅండ్ఎం), ఈఎన్సీ (కరీంనగర్) పోస్టులు ఖాళీగా ఉండగా, ఇన్‌చార్జి అధికారులు కొనసాగుతున్నారు. టి.శ్రీనివాస్, మహమ్మద్ అంజద్ హుస్సేన్, కేఎస్ఎస్ చంద్రశేఖర్, ఎల్.చక్రధరం, వై.శ్రవణ్‌కుమార్,ఓరుగంటి మోహన్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, పీపీఏ ప్రసాద్‌కు ఈఎన్సీలుగా పదోన్నతి లభించనున్నట్టు తెలిసింది. గాయపడిన జెడ్.శ్రీనివాసరావుకు ఈఎన్సీగా పదోన్నతి కల్పించినా, పోస్టింగ్ ఇచ్చే అవకాశం లేదని సమాచారం.

ఈఎన్సీ(జనరల్)గా అనిల్‌కుమార్ కొనసాగింపు

ఈఎన్‌సీ(అడ్మిన్) జి.అనిల్‌కుమార్ గత కొంత కాలంగా ఈఎన్సీ(జనరల్)గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, ఆయనకు ఇదే పోస్టులో పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ఇక ఈఎన్సీ(అడ్మిన్)గా అంజద్‌హుస్సేన్, ఈఎన్సీ(రామగుండం)గా టి.శ్రీనివాస్‌ను నియమించే అవకాశాలున్నాయి. రెండు ఈఎన్సీ సూపర్‌న్యూమరీ పోస్టులను సృష్టించి ఈఎన్సీ (ఓఅండ్ఎం) విజయభాస్కర్‌రెడ్డి, ఈఎన్సీ(గజ్వేల్) హరిరామ్‌ను కొనసాగించే అవకాశముంది. ఈ నెలాఖరుతో కేఎస్ఎస్ చంద్రశేఖర్, విజయభాస్కర్ రెడ్డి ఉద్యోగ విరమణ చేయనుండగా, ఆలోపే పదోన్నతి పొందనున్నారు. సూపరింటెండింగ్ ఇంజనీర్ల (ఎస్ఈ)కు సీఈలుగా పదోన్నతి కల్పించే ప్రతిపాదనలపై వారం రోజుల్లో మరోసారి డీపీసీ సమావేశమై నిర్ణయం తీసుకోనుంది.

మన నీళ్లలో నైట్రేట్

భూగర్భజలాలు శుద్ధి చేయకుండా తాగితే ప్రమాదకరం

సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ తాజా నివేదికలో వెల్లడి



రసాయన ఎరువుల అధిక వాడకంతో..

సాక్షి, హైదరాబాద్:

తెలంగాణలోని భూగర్భజలాలు శుద్ధిచేయకుండా తాగునీటికి ఉపయోగించడం ఏమాత్రం సురక్షితం కాదని తాజా అధ్యయనం తేల్చింది. సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ (సీజీడబ్ల్యూబీ) ప్రమాణాల కంటే కూడా రాష్ట్రంలోని 33 జిల్లాల్లోనూ అధిక నైట్రేట్ మోతాదులు ఉన్నట్లు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 27.48 శాతం మేర భూగర్భ నీటి నమూనాలను పరిశీలించగా నైట్రేట్ స్థాయిలు లీటర్‌కు 45 మిల్లీగ్రాముల నిర్దేశిత ప్రమాణాలకన్నా అధికంగా ఉన్నట్లు నేషనల్ కంపైలేషన్ ఆన్ డైనమిక్ గ్రౌండ్ వాటర్ రిసోర్సెస్ ఆఫ్ ఇండియా–2024 నివేదికలో వెల్లడైంది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పంటల ఉత్పాదకతను పెంచేందుకు అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడుతుండటం వల్ల నైట్రేట్స్ మోతాదు, గాఢత పెరుగుతోందని నివేదిక వెల్లడించింది. అదే సమయంలో హైదరాబాద్ సహా తెలంగాణలోని ఇతర నగరాలు, పట్టణాల్లో పూర్తిస్థాయిలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సౌకర్యాల్లేక మురుగు నీరు భూగర్భజలాల్లో చేరుతుండటం కూడా నైట్రేట్స్ మోతాదు పెరుగుదలకు కారణమవుతోందని నివేదిక విశ్లేషించింది. దేశవ్యాప్తంగా నైట్రేట్స్ మోతాదులు ఎక్కువగా ఉన్న 15 జిల్లాల్లో రంగారెడ్డి మూడో స్థానంలో నిలవగా ఆదిలాబాద్ 11వ స్థానంలో, సిద్దిపేట 12వ స్థానంలో నిలిచాయి.

రాష్ట్రంలో వరిసాగు అధికం కావడంతో అధిక మోతాదులో ఎరువు మందులు వాడుతున్నారని.. అందులో సుమారు 30 శాతం పంటలు పీల్చుకుంటే మిగతా 70 శాతం మాత్రం నీటినిల్వ కారణంగా నెమ్మదిగా భూగర్భజలాల్లో కలుస్తున్నాయని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ఇలా నైట్రేట్ అధికంగా ఉన్న నీరు తాగేందుకు అనువైంది కాదంటున్నారు. ఢిల్లీలోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్‌-సేట్ ఆఫ్ ఇండియా అగ్రికల్చర్–2024 నివేదిక ప్రకారం 2021–22లో తెలంగాణలో ప్రతి హెక్టార్‌కు 297.5 కిలోల ఎరువులను రైతులు వినియోగిస్తున్నారని వారు వెల్లడించారు. అలాగే ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా–2022–23 వార్షిక నివేదిక ప్రకారం తెలంగాణలో 2021–22 నుంచి 2022–23 మధ్య ఎరువుల వినియోగంలో 4.7 శాతం వృద్ధి నమోదైనట్లు తేలిందని చెప్పారు. నైట్రేట్లు భూగర్భ జలాల్లోకి చేరితే వాటిని శుద్ధి చేయడం మరింత కష్టమని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని చెరువులు, కాలువల్లోని కలుషితాలనే సరైన పద్ధతుల్లో శుద్ధి చేయలేకపోతున్న నేపథ్యంలో ఇక భూగర్భజలాల్లో కలిసే నైట్రేట్లను శుద్ధి చేయడం ఇబ్బందేనని అంటున్నారు. మిర్యాలగూడ లాంటి ప్రాంతాల్లో ఏటా పండిస్తున్న మూడు పంటల్లో ఎకరానికి 10–15 బస్తాల రసాయన ఎరువులను రైతులు వాడుతున్నారని వివరించారు. దీనివల్ల విత్తనం, నేల వంటివి బలహీనంగా ఉండటమే కాకుండా రసాయన ఎరువుల అవశేషాలు పంటల్లోకి చేరుతున్నాయని.. వాటిని మనం ఆహారంగా తీసుకుంటుండటంతో మన శరీరంలోకి సైతం కెమికల్స్ ప్రవేశిస్తున్నాయని వివరిస్తున్నారు.

మురుగు శుద్ధిపై పర్యవేక్షణ ఏదీ?



హైదరాబాద్ మహానగరంతోపాటు రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో పట్టణీకరణ శరవేగంగా పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకు తగ్గట్లుగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మురుగునీటి శుద్ధి మెరుగుపడట్లేదు. దీనిపై స్వతంత్ర సంస్థతో ఇప్పటిదాకా పర్యవేక్షణే లేదు. సివేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ల సంఖ్య పెరుగుతున్నా సమర్థంగా శుద్ధిచేయక మురుగునీరంతా భూగర్భజలాల్లో చేరడం వల్ల నైట్రేట్ శాతం పెరుగుతోంది.

– ప్రొఫెసర్ కె. పురుషోత్తంరెడ్డి, ప్రముఖ పర్యావరణవేత్త

నైట్రేట్లతో కేన్సర్ ముప్పు..



పంటల ఉత్పాదకతను పెంచేందుకు రసాయన ఎరువుల వాడకం విపరీతంగా పెరగడం వల్ల భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. అవే నీటిని పంటల సాగుకు ఉపయోగిస్తుండటంతో హెవీ మెటల్స్, కలుషితాలు నేరుగా వాటిలో కలుస్తున్నాయి. చేపల ద్వారా కూడా ఇవి మన శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. శరీరంలో నైట్రేట్ల శాతాలు పెరిగితే కేన్సర్‌కు దారితీస్తుంది. పంజాబ్‌లో కేన్సర్ కేసుల పెరుగుదలకు పంటల కోసం అధిక ఎరువులు, పురుగుమందుల వినియోగమే కారణమని తేలింది.

– డా. దొంతి నర్సింహారెడ్డి, వ్యవసాయరంగ నిపుణుడు

రూ.6,700 కోట్లతో 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం

- బీహెచ్‌ఈఎల్‌తో సింగరేణి సంస్థ ఒప్పందం
- 40 నెలల్లో పూర్తిచేయాలని కోరిన సీఎండీ



బలరామ్

సాక్షి, హైదరాబాద్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లో రూ.6,700 కోట్ల అంచనాలతో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)తో సింగరేణి సంస్థ మంగళవారం ఒప్పందం కుదుర్చుకుంది. జైపూర్‌లో సింగరేణి సంస్థకి చెందిన 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోనే ఈ కొత్త ప్లాంట్‌ను నిర్మించనున్నారు. టెండర్ల ద్వారా కాంట్రాక్టును దక్కించుకున్న బీహెచ్‌ఈఎల్ విద్యుత్ కేంద్రానికి సంబంధించిన బాయిలర్స్, టర్బైన్స్, జనరేటర్ల (బీటీజీ) నిర్మాణంతో పాటు సివిల్ పనులూ చేయనుంది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ ఎన్.బలరామ్, బీహెచ్‌ఈఎల్ జీఎం పార్థసారథి దాస్ సమక్షంలో ఈ మేరకు ఒప్పందం జరిగింది. విద్యుత్ కేంద్రాన్ని నాలుగేళ్లలో పూర్తి చేయాలని ఒప్పందంలో ఉన్నా, 40 నెలల్లోనే పూర్తి చేయాలని బీహెచ్‌ఈఎల్ అధికారులకు బలరామ్ సూచించారు. వచ్చే నెల నుంచే పనులు ప్రారంభించాలన్నారు. ఈ ప్రాజెక్టును ప్రాధాన్య ప్రాజెక్టుగా తమ బోర్డు నిర్ణయించిందని, తక్షణమే పనులు ప్రారంభిస్తామని బీహెచ్‌ఈఎల్ జీఎం పార్థసారథి దాస్ అన్నారు.

ఏటా రూ.300 కోట్ల లాభాలు..: సింగరేణి సంస్థ 2016లో పూర్తిచేసిన 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం ఏటా రూ.450 కోట్ల లాభాలను ఆర్జించి పెడుతోంది. కొత్త ప్లాంట్ పూర్తైతే ఏడాదికి మరో రూ.300 కోట్ల లాభాలు చేకూరే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, ఎల్.వి.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఈడీ ఎస్‌డీఎం సుభానీ, బీహెచ్‌ఈఎల్ జీఎం జోగేశ్ గులాటి పాల్గొన్నారు.

మైనింగ్‌లో పరస్పర సహకారం: సింగరేణి సంస్థ దేశ అవసరాల దృష్ట్యా క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లోకి అడుగు పెట్టబోతోందని సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ తెలిపారు. గత 60 ఏళ్లుగా ఖనిజాల ఉత్పత్తిలో అంతర్జాతీయ అనుభవం కలిగి ఉన్న జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ)తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్ఎండీసీ సీఎండీ అమితావ ముఖర్జీతో మంగళవారం ఇక్కడ ఆయన సమావేశమై రెండు సంస్థల మధ్య పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలపై చర్చించారు. క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లో మేధో విజ్ఞానాన్ని పంచుకునేందుకు ఐఐటీ– హైదరాబాద్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు.

ఉద్యోగం కోసం భర్తను చంపిన భార్య అరెస్ట్

నల్లగొండ: ప్రభుత్వ ఉద్యోగం కోసం భర్తను హత్య చేసిన భార్యను పోలీసులు అరెస్ట్ చేశారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌పురాలో నివాసముంటున్న మహ్మద్ ఖలీల్ నల్లగొండ మండలం చర్లగౌరారం జెడ్పీహెచ్ఎస్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి 2007లో అక్సర్ జహతో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. ఖలీల్ చేస్తున్న అటెండర్ ఉద్యోగం తనకు లేదా పిల్లలకు ఇవ్వాలని అతడిని భార్య అక్సర్ జహ వేధింపులకు గురిచేస్తోంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 24న ఖలీల్ అనారోగ్యంతో ఇంట్లో పడిపోయాడని చుట్టుపక్కల వారిని అక్సర్ జహ నమ్మించి, ఆటోలో నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. ఖలీల్‌కు ఎటువంటి వైద్యం చేయించకుండానే ఇంటికి తీసుకొచ్చింది. అదే రోజు రాత్రి ఖలీల్ మృతిచెందాడు. మరుసటిరోజు ఖలీల్ తల్లి అఫ్జాది బేగం తన కుమారుడి మృతికి కోడలే కారణమంటూ నల్లగొండ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ శంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోస్టుమార్టం రిపోర్ట్‌లో మృతుడి తలపై మారణాయుధాలతో కొట్టడంతో పాటు ముక్కు, నోటిని బలవంతంగా మూయడంతో ఊపిరాడక చనిపోయినట్లు తేలింది. దీంతో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అక్సర్ జహను అదుపులోకి తీసుకుని విచారించగా.. చేసిన నేరాన్ని అంగీకరించిందని డీఎస్పీ తెలిపారు. దీంతో ఆమెను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.

'గిట్టుబాటు' ధర ప్రకటించండి

- మెట్‌పల్లిలో పసుపు రైతుల ఆందోళన
- క్వింటాల్‌కు రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్



రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

మెట్‌పల్లి: పసుపు పంటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'గిట్టుబాటు ధర' ప్రకటించాలని డిమాండ్ చేస్తూ రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో రైతులు రోడ్డెక్కారు. పట్టణంలోని జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. వ్యవసాయ మార్కెట్ నుంచి ర్యాలీగా పాత బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. ముందుగా పసుపు పంట మద్దతు కోసం ఉద్యమించిన ముత్యాల మనోహర్‌రెడ్డి మృతికి రైతులు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం రైతునాయకులు మాట్లాడుతూ, రైతులకు గిట్టుబాటు ధర అందించని పార్టీలు.. తమవి రైతు ప్రభుత్వాలని చెప్పుకోవడం బాధాకరమన్నారు. పసుపు పంటకు మద్దతు ధర ను అందించి ఆదుకోవాలని కొన్నాళ్లుగా రైతులు కోరుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పసుపును మద్దతు ధర పంటల జాబితాలో చేర్చి క్వింటాల్‌కు రూ.15వేల చొప్పున అందించాలన్నారు. లేకుంటే మార్కెట్ ఇంటర్వెన్షన్ కింద పసుపును కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతుల వద్దకు చేరుకుని సముదాయించారు. ఉన్న తాధికారులు వచ్చి హామీ ఇస్తే తప్ప కదలబోమంటూ రైతులు భీష్మించుకుని కూర్చున్నారు. ఆర్డీవో శ్రీనివాస్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో శాంతించారు. కార్యక్రమంలో రైతు వేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండపర్తి దేశానికి రోల్‌మోడల్ కావాలి

- ఉపాధి యూనిట్లతో గుజరాత్‌లోని అమూల్ స్థాయికి వెళ్లాలి
- అటవీ గ్రామంలో డిజిటల్ తరగతుల ప్రారంభం సంతోషంగా ఉంది : గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- మేడారంలో సమ్మక్క–సారలమ్మలకు నిలువెత్తు మొక్కుల సమర్పణ
- తెలంగాణలో ఏడు ఆదివాసీ గ్రామాలను దత్తత తీసుకున్నట్టు వెల్లడి



సమ్మక్క–సారలమ్మలకు నిలువెత్తు బంగారం సమర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ. చిత్రంలో సీతక్క

సాక్షిప్రతినిధి, వరంగల్/ములుగు/ఎస్ఎస్ తాడ్వాయి: మారుమూలన ఉన్న ములుగు జిల్లాలోని కొండపర్తి గ్రామం అభివృద్ధిలో దేశానికి రోల్‌మోడల్ కావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆకాంక్షించారు. కొండపర్తిలో 70 గృహాలు 285 మంది ప్రజలు ఉన్నారని, చిన్న గ్రామమైన అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని చెప్పారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఈ గ్రామంలో డిజిటల్ తరగతులు ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, విద్యార్థులు ఇంగ్లిష్ బాగా మాట్లాడుతున్నారంటూ, వారిని అభినందించారు. మంగళవారం ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని కొండపర్తిలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పర్యటించారు. హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గాన కొండపర్తికి చేరుకున్న ఆయన.. తొలుత కొమురంభీం, బిర్సాముండ విగ్రహాలను, పాఠశాలలో డిజిటల్ తరగతులు, అంగన్‌వాడీ కేంద్రం, మసాలా, కుట్టు మెషీన్ యూనిట్లను ప్రారంభించారు. అనంతరం రిమోట్‌తో వ్యవసాయ మోటార్లు ప్రారంభించి కొండపర్తి గ్రామస్తులతో మాట్లాడారు. అక్కడి నుంచి నేరుగా మేడారం చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమ్మక్క–సారలమ్మలకు నిలువెత్తు బంగారం సమర్పించి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు కొండపర్తి, మేడారం ఆలయ ప్రాంగణంలో గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడు ఆదివాసీ గ్రామాలను దత్తత తీసుకున్నానని అందులో, కొండపర్తి కూడా ఉందని చెప్పారు. కొండపర్తిలో మహిళల ఆర్థికాభివృద్ధికి ఇంకా చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్ల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధన జరుగుతుందన్నారు. గుజరాత్ రాష్ట్రంలో అమూల్ ఏవిధంగా ప్రసిద్ధిగాంచిందో, అదే తరహాలో కొండపర్తి కారం, పసుపు, మసాలా యూనిట్లకు అంతటి పేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆకాంక్షించారు. ములుగు ప్రాంతంలో మిర్చి సాగు బాగుందని.. ఇక్కడి మిర్చి పొడర్‌కు మంచి ఇమేజ్ రావాలని, తెలంగాణ వ్యాప్తంగా మిర్చి పొడర్ బాగా ఫేమస్ కావాలని సూచించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వికసిత్ భారత్ సంకల్పానికి ఈ గ్రామం ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. తాను, రాష్ట్రపతి, రాష్ట్రమంత్రి సీతక్క అందరూ ఆదివాసీ బిడ్డలమని పేర్కొన్నారు. ములుగు జిల్లాలో పర్యటించిన గవర్నర్‌కు రాష్ట్ర మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ పి.శబరీశ్, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ తదితరులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో గవర్నర్ కార్యాలయ ప్రధాన కార్యదర్శి దానకిశోర్, సంయుక్త కార్యదర్శి భవానిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రంగంలోకి రోబోలు

- ఎస్ఎల్‌బీసీ సొరంగంలో నేటి నుంచి రెస్క్యూ ఆపరేషన్
- మూడు రకాల రోబోలతో కార్మికుల కోసం వెదుకులాట
- ప్రమాద స్థలంలో డీ2 నుంచి డీ1 మధ్యనే తవ్వకాలు ముమ్మరం
- టన్నెల్ నిండా 6 వేల క్యూబిక్ మీటర్ల మట్టి, శిథిలాలు
- మరోసారి టన్నెల్‌లోకి కడావర్ డాగ్స్



సొరంగం వద్ద మాస్టర్ రోబో

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో గల్లంతైన కార్మికుల జాడ కనిపెట్టేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత రోబోలను బుధవారం నుంచి రంగంలోకి దింపనున్నారు. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన ఎన్వీ రోబోటిక్స్ బృందం మంగళవారం సొరంగం వద్దకు చేరుకుంది. మూడు రకాల రోబోల ద్వారా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టనున్నారు. వాటిని ఆపరేట్ చేసే మాస్టర్ రోబోను సొరంగం వద్దకు తీసుకొచ్చారు. రోబోటిక్ నిపుణులు విజయ్, అక్షయ్ నేతృత్వంలో రోబోల అనుసంధానం కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

ముమ్మరంగా గాలింపు

సొరంగంలో గల్లంతైన 8 మందిలో ఒకరి మృతదేహాన్ని ఇప్పటికే వెలికి తీయగా, మిగతా ఏడుగురి కోసం గాలింపు కొనసాగుతోంది. ప్రమాదస్థలంలో కడావర్ డాగ్స్ గుర్తించిన డీ2 నుంచి డీ1 స్పాట్ల మధ్యలో ట్రెంచ్‌ను తవ్వుతున్నారు. టీబీఎం కట్టర్ హెడ్ భాగానికి వెనుకవైపు నుంచి డీ1 వరకు సుమారు 150 మీటర్ల విస్తీర్ణంలో ప్రతీ 10 మీటర్లకు ఒక చోట తవ్వకాలు జరుపుతూ గుంతలను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా చోట్ల మళ్లీ కడావర్ డాగ్స్‌తో గాలింపు చేపడుతున్నారు. 18 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్ సొరంగం వద్దే ఉండి పర్యవేక్షిస్తున్నారు.

మనుషుల కన్నా 15 రెట్ల వేగం


సొరంగం లోపల 13.850 కి.మీ. వద్ద ప్రమాదం చోటుచేసుకోగా.. చివరి 20 మీటర్ల వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. పైకప్పు వదులుగా ఉండి మళ్లీ కూలే అవకాశం ఉండటంతో రోబోల ద్వారా రెస్క్యూ పనులను చేపట్టనున్నారు. సొరంగంలోని పెద్ద రాళ్లను, శిథిలాలను తొలగించేందుకు ఒక రోబో, మట్టిని తొలగించేందుకు ఒకటి, బురదను తొలగించేందుకు మరొక రోబోను వినియోగించనున్నారు. సొరంగం చివరన 200 మీటర్ల విస్తీర్ణంలో సుమారు 6 వేల క్యూబిక్ మీటర్ల మట్టి, బురద పేరుకుని ఉంది. రోబోల ద్వారా మూడు రోజుల్లో మొత్తం మట్టి, శిథిలాలను తొలగించేందుకు వీలుంటుందని భావిస్తున్నారు. రోబోల రెస్క్యూ ఆపరేషన్‌ను సొరంగంలోపల 200 మీటర్ల దూరం నుంచి పర్యవేక్షించేందుకు వీలుంటుంది. ఇందుకోసం ఇన్‌డెప్త్ ఏఐ కెమెరా, లైటర్ టెక్నాలజీ వినియోగించనున్నారు.

బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రైనింగ్ ప్రోగ్రాం

- ఏప్రిల్ 12న ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్.. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్, బీసీ స్టడీ సర్కిల్ సంయుక్తంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో నెలరోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ ట్రైనింగ్ ప్రోగ్రాం ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ శిక్షణ నెలరోజుల పాటు హైదరాబాద్‌లో స్కూల్ ఆఫ్ బిజినెస్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించనున్నామని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రైనింగ్ ప్రోగ్రాం పూర్తైన తర్వాత ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. డిగ్రీ పూర్తయి 26 సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న అభ్యర్థులు మార్చి 15, 2025 నుంచి ఏప్రిల్ 8, 2025 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ శిక్షణకు బీసీ విద్యార్థులను అర్హులుగా నిర్ధారించారు. ఏప్రిల్ 12న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామని, స్క్రీనింగ్ టెస్ట్ అనంతరం శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 15 నుంచి ఏప్రిల్ 8 వరకు www.tgstudycircle.cgg. gov. inలో దరఖాస్తు సమర్పించాలని శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మరింత సమాచారం కోసం 040–29303130 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గుండెపోటుతో యువ రైతు మృతి



పండుగ అనిల్

టేకుమట్ల: గుండెపోటుతో ఒక యువ రైతు మృతి చెందాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం అంకుషాపూర్‌లో మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన పండుగ అనిల్ (30) తన వ్యవసాయ భూమిలో పంటకు నీరు పారిస్తున్న క్రమంలో.. గుండెపోటు రాగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన అతని సోదరుడు వెంటనే చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆసుపత్రికి తరలించగా.. అనిల్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. అనిల్ మృతి సమాచారం అందుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు.. మృతుని స్వగ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

'నాగపూర్ ప్లాన్' అంగీకరించం

తేల్చిచెప్పిన సీఎం స్టాలిన్



చెన్నై: జాతీయ విద్యా విధానం అనేది విధ్వంసకర నాగపూర్ ప్లాన్ అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ పరోక్షంగా ఆర్ ఎస్ఎస్‌పై మండిపడ్డారు. దాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని చెప్పారు. హిందీ, సంస్కృత భాషలను ఆమోదిస్తే రూ.2 వేల కోట్లు ఇస్తామని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అంటున్నారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తమ రాష్ట్రానికి రూ.10 వేల కోట్లు ఇచ్చినా జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయబోమని స్టాలిన్ స్పష్టం చేశారు. మంగళవారం చెంగల్‌పేటలో ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన విద్యా విధానం తమిళనాడులో విద్యాభివృద్ధిని పూర్తిగా దెబ్బతీస్తుందని తెలిపారు. విద్యార్థులను విద్య నుంచి దూరం చేసేలా ఈ విధానం తీసుకొచ్చారని విమర్శించారు. విద్యా రంగంపై కేంద్ర ప్రభుత్వ పెత్తనం ఏమిటని నిలదీశారు. విద్యలో మతతత్వాన్ని పెంచడం, ప్రైవేటీకరణను ప్రోత్సహించడం సరైంది కాదని స్పష్టం చేశారు. కేవలం సంపన్న వర్గాల పిల్లలే ఉన్నత విద్య అభ్యసించాలా? పేదలకు చదువుకొనే అవకాశాలు లభించకూడదా? అని ప్రశ్నించారు. తమిళనాడు ప్రయోజనాల పరిరక్షణ కోసం కేంద్రంపై పోరాడుతూనే ఉంటామని స్టాలిన్ పునరుద్ఘాటించారు.

టారిఫ్‌లు తగ్గిస్తామని హామీ ఇవ్వలేదు

భారత ప్రభుత్వం స్పష్టీకరణ



న్యూఢిల్లీ: అమెరికా ఉత్పత్తులపై టారిఫ్‌లు తగ్గిస్తామని భారత ప్రభుత్వం ఎవరికీ ఎలాంటి హామీ ఇవ్వలేదని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ తేల్చిచెప్పారు. టారిఫ్‌ల తగ్గింపు విషయంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం నుంచి హామీ లభించిందని ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనిపై సునీల్ వివరణ ఇచ్చారు. విదేశీ వ్యవహారాలపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీకి ఈ మేరకు సమాచారం అందించారు. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని, ఇరు దేశాల నడుమ వాణిజ్య ఒప్పందమేదీ కుదరలేదని సునీల్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడి ప్రకటనలు, మీడియా రిపోర్టుల ఆధారంగా ఒక అభిప్రాయానికి రావడం సరైంది కాదని చెప్పారు. వాణిజ్యపరమైన అంశాలపై ఇతర దేశాలతో చర్చలు జరుగుతున్నప్పుడు భారతదేశ ప్రయోజనాల పరిరక్షణను తప్పనిసరిగా దృష్టిలో పెట్టుకుంటామని స్పష్టం చేశారు. ఇరుదేశాల ప్రజలకు మేలు జరిగేలా అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్యం, సరళీకరణ పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని వివరించారు. టారిఫ్‌ల యుద్ధం ఎవరికీ మేలు చేయదని ఉద్ఘాటించారు. స్వదేశీ వాణిజ్యానికి సంబంధించి కీలకమైన రంగాల్లో టారిఫ్‌లు విచ్చల విడిగా తగ్గించడం కుదరదని సునీల్ వ్యాఖ్యానించారు.

ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు దుతర్తే అరెస్ట్



మనీలా: ఫిలిప్పీన్స్ మాజీ అధ్యక్షుడు రొడ్రిగో దుతర్తే మంగళవారం అరెస్టయ్యారు. హాంకాంగ్ నుంచి వచ్చిన ఆయన్ను మనీలాలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అధ్యక్షుడిగా ఉన్న సమయంలో డ్రగ్స్ అక్రమ రవాణాదారులను చంపేయాలంటూ దుతర్తే ఇచ్చిన పిలుపుతో వేలాది మంది దారుణ హత్యకు గురవడం తీవ్ర వివాదాస్పదమైంది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ)ఆయనపై విచారణకు చర్యలు ప్రారంభించింది. అయితే, ఆ విచారణ నుంచి తప్పించుకునేందుకు ఐసీసీ నుంచి వైదొలగుతున్నట్లు అధ్యక్షుడిగా ఉన్న దుతర్తే ప్రకటించారు. 2022 ఎన్నికల్లో ఫెర్డినాండ్ మార్కోస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. అనంతర పరిణామాల్లో దుతర్తేపై వచ్చిన ఆరోపణలపై విచారణను తిరిగి ప్రారంభించనున్నట్లు 2023 జూలైలో ఐసీసీ ప్రకటించింది. జన హననానికి పాల్పడ్డారంటూ వచ్చిన ఆరోపణలపై దుతర్తేకు వారెంట్లు జారీ చేసింది. ఈ వారెంట్లకు స్పందనగానే దుతర్తేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ తెలిపారు. దుతర్తేపై విచారణకు ఐసీసీకి సహకరిస్తామని అధ్యక్షుడు మార్కోస్ ప్రకటించారు.

కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్‌కు ఢిల్లీ కోర్టు ఆదేశం



న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ భారీ హోర్డింగులు ఏర్పాటు చేసినందుకుగాను ఆప్ చీఫ్, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌పై కేసు నమోదు చేయాలని ఢిల్లీ కోర్టు ఆదేశించింది. ఢిల్లీ ప్రివెన్షన్ ఆఫ్ డిఫేస్‌మెంట్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్‌-2007లోని సెక్షన్‌-3 ప్రకారం ఆయనపై తక్షణమే ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయాలని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నేహా మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆప్‌కే చెందిన అప్పటి మటియాలా ఎమ్మెల్యే గులాబ్ సింగ్, ద్వారక వార్డు కౌన్సిలర్ నితికా శర్మలపైనా కేసు నమోదు చేయాలని సంబంధిత ఎస్‌హెచ్‌వోకు ఆదేశాలిచ్చారు. ఉద్దేశపూర్వకంగానే ప్రజా ధనాన్ని వెచ్చించి తమ ప్రాంతాల్లో భారీ కటౌట్లు ఏర్పాటు చేశారంటూ 2019లో శివ్ కుమార్ సక్సేనా అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై మేజిస్ట్రేట్ ఈ ఆదేశాలిచ్చారు. ఈ విషయంలో కాలయాపన చేసిన ఎస్‌హెచ్‌వో తీరును ఆమె తీవ్రంగా ఆక్షేపించారు.

పాకిస్తాన్‌లో రైలు హైజాక్

బలూచీ వేర్పాటువాదుల దుశ్చర్య

30 మంది కాల్చివేత, బందీలుగా 215 మంది



బలూచ్ వేర్పాటువాదులు

- మృతులు, బందీల్లో అత్యధికులు సైనికులే!
- సైనిక చర్యకు దిగితే వారందరినీ చంపేస్తాం
- పాక్ ప్రభుత్వానికి బీఎల్ఏ వేర్పాటువాదుల హెచ్చరికలు
- తమ నేతల విడుదలకు డిమాండ్
- ప్రభుత్వానికి 48 గంటల డెడ్‌లైన్



పాక్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్సులో మంగళవారం హైజాక్ జరిగిన బొలాన్ కనుమ ప్రాంతం

కరాచీ/ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో బలూచీ వేర్పాటువాదులు ఘోరానికి తెగబడ్డారు. మంగళవారం బలూచిస్తాన్ ప్రావిన్సులో ఏకంగా ఒక ప్రయాణికుల రైలునే హైజాక్ చేసేశారు. ఇది తమ పనేనని నిషేధిత బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ప్రకటించుకుంది. ''500 మంది ప్రయాణికుల్లో కనీసం 30 మందిని కాల్చి చంపేశామని, 215 మందిని బందీలుగా పట్టుకున్నాం. మృతులతో పాటు బందీల్లో దాదాపుగా అంతా సైనికులే'' అని పేర్కొంది. దీనిపై పాక్ ప్రభుత్వం ఇప్పటిదాకా అధికారికంగా స్పందించలేదు. బందీలను విడిపించేందుకు సైన్యం హుటాహుటిన రంగంలోకి దిగింది. ఘటనా స్థలిని సైనిక హెలికాప్టర్లు పెద్ద సంఖ్యలో చుట్టుముట్టి బాంబు దాడులకు దిగాయి. దాంతో బీఎల్ఏ మండిపడింది. సైనిక చర్యను తక్షణం నిలిపేయకపోతే బందీలందరినీ చంపేస్తామంటూ పాక్ సర్కారును తీవ్రంగా హెచ్చరించింది. రాజకీయ ఖైదీలుగా నిర్బంధించిన బలూచీ నేతలు, కార్యకర్తలందరినీ 48 గంటల్లోపు బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేసింది. లేదంటే తీవ్ర పరిణామాలు తప్పవని స్పష్టం చేసింది. దాంతో సైనిక చర్యకు షహబాజ్ షరీఫ్ ప్రభుత్వం తాత్కాలికంగా విరామం ప్రకటించింది. తీసుకోవాల్సిన చర్యలపై మల్లగుల్లాలు పడుతోంది. బలూచిస్తాన్‌తో పాటు పరిసర ప్రావిన్సుల్లో ఎమర్జెన్సీ విధించారు. ఘటనను కవర్ చేయకుండా మీడియాపై ప్రభుత్వం ఆంక్షలు విధించినట్టు చెబుతున్నారు. ముష్కరులతో ఎలాంటి సంప్రదింపులూ ఉండబోవని అంతర్గత శాఖ మంత్రి మొహసిన్ నక్వీ ప్రకటించారు. కడపటి వార్తలు అందే సమయానికి బీఎల్ఏ సాయుధులపై పాక్ సైనిక హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా బాంబు దాడులకు దిగినట్టు సమాచారం. బందీల్లో దాదాపు 80 మందిని విడిపించినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. మృతుల సంఖ్య 35 దాటిందన్నాయి. బలూచిస్తాన్ ప్రావిన్సు అఫ్గానిస్తాన్, ఇరాన్ సరిహద్దుల్లో ఉంటుంది. పాక్ నుంచి స్వాతంత్ర్యం కోసం పలు స్థానిక తెగలతో కూడిన వేర్పాటువాద సంస్థలు దశాబ్దాలుగా పోరాడుతున్నాయి. వాటిలో బీఎల్ఏ అతి పెద్దది. దానిపై పాక్‌తో పాటు అమెరికా, బ్రిటన్లలో కూడా నిషేధముంది.

ఇలా జరిగింది

దాదాపు 500 మంది ప్రయాణికులతో కూడిన జాఫర్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం ఉదయం 9 గంటలకు బలూచిస్తాన్‌లోని క్వెట్టా నుంచి పెషావర్‌కు బయల్దేరింది. బొలాన్ జిల్లాలో కొండ ప్రాంతంలో కనుమ సమీపంలో గుదలార్, పెరో కున్రీ ప్రాంతాల మధ్య 8వ నంబర్ టన్నెల్ సమీపంలో బీఎల్ఏ సాయుధులు అప్పటికే రైలు పట్టాలను పేల్చేసి మాటు వేశారు. అక్కడికి చేరుకుని అతి నెమ్మదిగా వెళ్తున్న రైలు ఒక్కసారిగా పట్టాలు తప్పింది. వెంటనే బలూచీ సాయుధులు భారీ సంఖ్యలో రైలును చుట్టుముట్టారు. నేరుగా ఇంజన్‌పైకి కాల్పులు జరపడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. రైలు ఆగిపోగానే మొత్తం 9 బోగీల్లోకీ చొరబడ్డారు. వారికి, రైల్లోని భద్రతా సిబ్బందికి మధ్య కాసేపు కాల్పులు జరిగాయి. అనంతరం రైలును బీఎల్ఏ సాయుధులు తమ అధీనంలోకి తీసుకుని సమీపంలోని టన్నెల్లోకి తరలించినట్టు సమాచారం. ''ప్రయాణికుల్లో సాధారణ పౌరులు, మహిళలు, చిన్నారులను ఒకవైపు, సైనికులను మరోవైపు విడదీశారు. అనంతరం సైనికుల్లో 20 నుంచి 30 మందిని కాల్చి చంపారు. సాధారణ పౌరులను వదిలేశారు. 215 మందిని బందీలుగా చేసుకున్నారు. వారిలో అత్యధికులు పోలీసు, యాంటీ టెర్రరిజం ఫోర్స్, ఐఎస్ఐకు, సైన్యానికి చెందినవారే. వారంతా సెలవులపై స్వస్థలాలకు వెళ్తున్నారు'' అని స్థానిక మీడియా పేర్కొంది. ఘటనా స్థలిలో మొబైల్ నెట్‌వర్క్ వంటివేమీ లేకపోవడంతో రైల్లోని సిబ్బందితో ఎలాంటి కాంటాక్టూ వీలవడం లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దాడికి పాల్పడింది బీఎల్ఏలోని మజీద్ బ్రిగేడ్‌గా భావిస్తున్నారు. వారితో పాటు స్పెషల్ టాక్టికల్ ఆపరేషన్స్ స్క్వాడ్, ఫతే స్క్వాడ్ ప్రత్యేక విభాగాలు కూడా దాడిలో పాల్గొన్నట్టు బీఎల్ఏ ప్రకటించింది. ప్రయాణికుల్లో మహిళలు, పిల్లలు, పౌరులను వదిలేసినట్టు ప్రకటించింది. బీఎల్ఏ దాడుల నేపథ్యంలో క్వెట్టా, పెషావర్ మధ్య రైలు సేవలను కొంతకాలం నిలిపేశారు. గత అక్టోబర్ లోనే పునరుద్ధరించారు. తర్వాత నెల రోజులకే క్వెట్టా రైల్వేస్టేషన్లో జరిగిన ఆత్మాహుతి దాడిలో కనీసం 26 మంది మరణించారు. బలూచీల దాడి ముప్పు నేపథ్యంలో ఈ ప్రాంతం గుండా వెళ్లే రైళ్లన్నీ పటిష్టమైన సాయుధ భద్రత నడుమ ప్రయాణిస్తుంటాయి. భారీ దాడికి బీఎల్ఏ పథక రచన చేస్తోందని కౌంటర్ టెర్రరిజం విభాగం గత మంగళవారమే ప్రభుత్వాన్ని హెచ్చరించినట్టు చెబుతున్నారు.

బలూచ్ భగభగలు

- సాయుధ ఉద్యమపంథాలో కొనసాగుతున్న బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ
- సైన్యం, ప్రభుత్వ ఆస్తులపై దాడులు

పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఏకంగా రైలునే బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) తమ అధీనంలోకి తెచ్చుకోవడంతో బలూచిస్తాన్ స్వయంప్రతిపత్తి అంశం మరోసారి తెరమీదకొచ్చింది. పాతికేళ్లుగా సాయుధ ఉద్యమపంథాను అనుసరిస్తున్న బీఎల్ఏ మూలాలు ఆ ప్రాంత ప్రజల అసంతృప్తి, ఆగ్రహంలో ఉన్నాయి. బలవంతంగా తమను స్వతంత్ర పాక్‌లో కలిపేసి తమ అభివృద్ధిని కాలరాశారని బలూచ్ ప్రజలు భావిస్తుండటమే ఈ ఉద్యమం ఇంకా కొనసాగడానికి అసలు కారణం.

ఎవరీ బలూచ్‌లు?

పాకిస్తాన్‌లోని నైరుతి ప్రాంతాన్ని బలూచిస్తాన్‌గా పిలుస్తారు. ఇది పాక్‌లోని ఒక ప్రావిన్స్‌గా కొనసాగుతోంది. ఇక్కడ స్థానిక బలూచ్ తెగ ప్రజల పూర్వీకులు సమీప ఇరాన్, అఫ్గానిస్తాన్‌లోనూ స్థిరపడ్డారు. ఇరాన్‌కు ఆగ్నేయంగా, అఫ్గానిస్తాన్‌కు దక్షిణంగా ఈ సువిశాల ప్రాంతం విస్తరించి ఉంది. దాదాపు 3,50,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణమున్న బలూచ్ ప్రాంతం దేశంలోనే అతిపెద్ద ప్రావిన్స్ అయినప్పటికీ అభివృద్ధి విషయంలో ఆమడదూరంలో నిలిచిపోయింది. ఇక్కడ జనాభా కూడా అత్యల్పం. మొత్తం పాక్ విస్తీర్ణంలో బలూచ్ 44 శాతం ఉంటుంది. దశాబ్దాలక్రితం స్వతంత్ర ప్రాంతంగా కొనసాగిన బలూచిస్తాన్‌ను ఆ తర్వాత బ్రిటిషర్లు ఆక్రమించి స్థానిక కలాట్ సంస్థానం (ఖానేట్) పాలకుడు ఖాన్‌కు పరిపాలనా బాధ్యతలు అప్పగించారు. 1948 మార్చి 27వ తేదీన బలూచిస్తాన్‌ను పాకిస్తాన్‌లో అధికారికంగా విలీనం చేశారు. ఈ విలీన ప్రక్రియను నాటి బలూచిస్తాన్ పాలకుల్లోని ఒక వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ వ్యతిరేకతే తదనంతరకాలంలో తీవ్ర నిరసనగా, వేర్పాటువాదంగా చివరకు బలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ)గా అవతరించింది. 1948, 1958–59, 1962–63, 1973–77 కాలాల్లో బలూచ్ స్వతంత్ర్య ఉద్యమాలు కొనసాగిన నాటి పాకిస్తాన్ ప్రభుత్వాలు ఆ ఆందోళనలను ఉక్కుపాదంతో అణిచివేశాయి. ఈ కాలంలో వేలాది మంది బలూచ్ ప్రజలు అదృశ్యమయ్యారు. అక్కడి కీలక బలూచ్ నేతలు కొందరు దేశం వీడారు. కొందరు ముఖ్యనేతలు హత్యకు గురయ్యారు. 2003 ఏడాది నుంచి మళ్లీ బీఎల్ఏ ఆవిర్భావంతో స్వతంత్ర బలూచ్ కోసం పోరాటం ఉధృతమైంది. సాయుధ బాటలో పయనిస్తూ తరచూ పాకిస్తాన్ సైన్యం, ప్రభుత్వ ఆస్తులు, పౌరులపై దాడులకు తెగబడుతోంది. బలూచ్ ప్రజల స్వయం నిర్ణయాధికారం, పాకిస్తాన్ నుంచి విడివడి ప్రత్యేక ప్రాంతంగా ఏర్పడాలన్న లక్ష్యాలతో బీఎల్ఏ పోరాడుతోంది. ఉద్యమాన్ని అణిచివేసే క్రమంలో తీవ్రస్థాయిల మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందని పాకిస్తాన్‌పై అంతర్జాతీయంగా ఆరోపణలు వెల్లువెత్తాయి.

అపార సంపద

పర్వతమయ బలూచిస్తాన్‌లో అపార సహజసంపద సందప దాగి ఉంది. ఇక్కడ సహజవాయు నిక్షేపాలు ఎక్కువ. దక్షిణ పాకిస్తాన్‌లో అరేబియా సముద్రతీరం వెంట ఉన్న ఏకైక అతిపెద్ద గ్వాదర్ పోర్ట్ బలూచిస్తాన్‌లోనే ఉంది. సరకు రవాణాకు అనువైన ప్రాంతం. దీంతో చైనా ఈ ప్రాంతంపై కన్నేసింది. చైనా, పాకిస్తాన్ ఆర్థిక కారిడార్(సీపెక్)ను నిర్మించాలని చైనా తలపోయడం తెల్సిందే. ఈ సీపెక్ బలూచిస్తాన్ గుండా వెళ్తుంది. సీపెక్ ఈ ప్రాంత అభివృద్ధిని పెంచుతుందని పాకిస్తాన్ ప్రభుత్వం చెబుతుండగా తమ ప్రాంత సంపదను కొల్లగొట్టడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక బలూచ్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఇక్కడ సీపెక్ సంబంధ ప్రాజెక్టులపై తరచూ దాడులుచేస్తున్నారు. ముఖ్యంగా చైనా సిబ్బందిని బీఎల్ఏ లక్ష్యంగా చేసుకుంది. దశాబ్దాలుగా పేదరికంలో మగ్గిపోవడానికి పాకిస్తాన్ ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యమే కారణమని బలూచ్ ప్రాంతవాసుల్లో ఒక అభిప్రాయం గూడుకట్టుకుపోయింది. ఇది బీఎల్ఏ సాయుధపోరుకు నైతిక, ఆర్థిక స్థైర్యాన్ని ఇస్తోంది. బీఎల్ఏకు పాక్ సైన్యానికి మధ్య జరుగుతున్న ఘర్షణల్లో ఇప్పటికే వందలాది మంది అమాయక ప్రజలు ప్రాణాలుకోల్పోయారు. దీంతో వేర్పాటువాదం బాటలో పయనిస్తున్న బీఎల్ఏను ఇప్పటికే అమెరికా, బ్రిటన్‌లు ఉగ్రసంస్థగా ప్రకటించాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

మినీ ఇండియా.. మారిషస్

భారత్‌కు, గ్లోబల్ సౌత్‌కు మధ్య ఒక వంతెన

- భారతదేశ కుటుంబంలో ఒక అంతర్భాగం
- ప్రవాస భారతీయుల సమావేశంలో ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ
- మోదీ రెండు రోజుల మారిషస్ పర్యటన ప్రారంభం
- మోదీకి ఘన స్వాగతం పలికిన మారిషస్ ప్రభుత్వం
- తరలివచ్చిన ప్రధానమంత్రి, మంత్రివర్గం

పోర్ట్ లూయిస్: భారత్‌కు, గ్లోబల్ సౌత్‌కు మధ్య మారిషస్ ఒక వంతెన అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మారిషస్ కేవలం భాగస్వామ్య దేశం మాత్రమే కాదని, భారతదేశ కుటుంబంలో ఒక అంతర్భాగమని చెప్పారు. మారిషస్ అంటే 'మినీ ఇండియా' అని అభివర్ణించారు. ఆయన మంగళవారం మారిషస్ రాజధాని పోర్ట్ లూయిస్‌లో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో మారిషస్ ప్రధాని డాక్టర్ నవీన్‌చంద్ర రామ్‌గూలమ్, వీణా దంపతులు, మంత్రివర్గ సభ్యులు సైతం పాల్గొన్నారు. భారత్, మారిషస్ మధ్య బలమైన చారిత్రక సంబంధాలు ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) కార్డులను రామ్‌గూలమ్ దంపతులకు మోదీ అందజేశారు. మారిషస్‌లోని ఏడో తరం భారతీయులకు కూడా ఈ కార్డులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అంతకుముందు రెండు రోజుల పర్యటన నిమిత్తం మారిషస్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి చిరస్మరణీయమైన స్వాగతం లభించింది. రాజధాని పోర్ట్ లూయిస్‌లోని సర్ సీవూసాగర్ రామ్‌గూలమ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గూలమ్‌తోపాటు ఉప ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నేషనల్ అసెంబ్లీ స్పీకర్, ప్రతిపక్ష నేత, విదేశాంగ మంత్రి, కేబినెట్ సెక్రెటరీ తదితరులు ఘన స్వాగతం పలికారు. మోదీని స్వాగతించడానికి మొత్తం మంత్రివర్గం తరలిరావడం గమనార్హం. మంత్రులు, అధికారులు సహా 200 మందికి ఆయన కోసం ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.

బిహారీ సంప్రదాయ స్వాగతం

మారిషస్‌లో నివసిస్తున్న భారతీయులు ప్రధాని మోదీకి సాదర స్వాగతం పలికారు. మోదీ బస చేసిన హోటల్ వద్ద భారతీయ మహిళలు సంప్రదాయ బిహారీ సాంస్కృతిక సంగీతభరిత నృత్యం 'గీత్ గవాయ్'తో ఆయనను స్వాగతించారు. అలాగే భోజ్‌పురి సంప్రదాయ గీతం ఆలపించారు. భారత త్రివర్ణ పతాకం చేతబూని 'భారత్ మాతాకీ జై' అని బిగ్గరగా నినదించారు. తనకు లభించిన అపూర్వమైన గౌరవ మర్యాదల పట్ల ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు.

మారిషస్ అధ్యక్షుడికి గంగాజలం బహూకరణ

మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్‌కు ప్రధాని మోదీ అరుదైన కానుక అందజేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం వద్ద జరిగిన మహా కుంభ మేళా సమయంలో ఇత్తడి, రాగి పాత్రలో సేకరించిన పవిత్ర గంగజలాన్ని బహూకరించారు. బిహార్‌లో సాగు చేసిన సూపర్‌ఫుడ్ మఖానాతోపాటు మరికొన్ని బహుమతులు సైతం అందించారు. అలాగే ధరమ్ గోకుల్ భార్య బృందా గోకుల్‌కు బనారసీ చీరను కానుకగా ఇచ్చారు. గుజరాత్ కళాకారులు తయారు చేసిన సందేలి చెక్కపెట్టెలో ఈ చీరను అందజేశారు. అలాగే ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) కార్డును ధరమ్ గోకుల్ దంపతులకు అందించారు.

దివంగత నేతలకు నివాళులు

భారత్, మారిషస్ ప్రధానమంత్రులు మోదీ, నవీన్‌చంద్ర రామ్‌గూలమ్ సర్ సీవూసాగర్ రామ్‌గూలమ్ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మారిషస్ దివంగత నేత సర్ సీవూసాగర్ రామ్‌గూలమ్ సమాధి వద్ద మోదీ పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అలాగే మాజీ అధ్యక్షుడు, మాజీ ప్రధాని అనిరుధ్ జగన్నాథ్ సమాధి వద్ద నివాళులర్పించారు. వారిని స్మరించుకున్నారు.



మంగళవారం మారిషస్‌లో ప్రధాని నవీన్ రామ్‌గులాంతో మోదీ



మారిషస్ అధ్యక్షుడు ధరం గోకుల్‌కు గంగా జలం అందజేస్తున్న మోదీ

మోదీకి మారిషస్ అత్యున్నత పురస్కారం

భారత ప్రధానమంత్రి మోదీని తమ దేశ అత్యున్నత పురస్కారంతో సత్కరించనున్నట్లు మారిషస్ ప్రధాని రామ్‌గూలమ్ ప్రకటించారు. మోదీకి ప్రతిష్టాత్మక 'ద గ్రాండ్ కమాండర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద స్టార్ అండ్ కీ ఆఫ్ ద ఇండియన్ ఓషియన్' అవార్డు అందజేస్తామని వెల్లడించారు. ఈ పురస్కారం అందుకోనున్న మొట్టమొదటి భారత ప్రధానిగా మోదీ రికార్డుకెక్కబోతున్నారు.

సభకు ఖర్గే క్షమాపణ



న్యూఢిల్లీ: రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగింది. చివరకు ఆయన క్షమాపణ చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. మంగళవారం సభలో ప్రశ్నోత్తరాల అనంతరం కేంద్ర విద్యాశాఖ పనితీరుపై చర్చ మొదలైంది. తమిళనాడు ప్రభుత్వాన్ని, ప్రజలను కించపరుస్తూ మాట్లాడిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాని క్షమాపణ చెప్పాలని విపక్ష సభ్యులు పట్టుబట్టారు. పలువురు తమ స్థానాల్లో నిల్చొని నినాదాలు చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతోపాటు జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడుకు చెందిన డీఎంకే ఎంపీలు నల్లదుస్తులు ధరించి సభకు వచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ క్షమాపణ చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. అధికార, విపక్ష సభ్యులు కేకలు వేస్తుండడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ సమయంలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకున్నారు. మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఆయనకు ఇప్పటికే ఒకసారి సభలో మాట్లాడే అవకాశం ఇచ్చామని, ఇప్పుడు మాట్లాడేందుకు వీల్లేదని సభాపతి స్థానంలో ఉన్న డిప్యూటీ చైర్మన్ హరివంశ్ చెప్పారు. తాను మాట్లాడినప్పుడు విద్యా శాఖ మంత్రి సభలో లేరని ఖర్గే బదులిచ్చారు. ప్రస్తుతం తనను మాట్లాడనివ్వకపోవడంతో నిరంకుశత్వమేనని అన్నారు. కాంగ్రెస్ సభ్యుడు దిగ్విజయ్ సింగ్ మాట్లాడాలని హరివంశ్ కోరగా, ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. బయటకు గెంటేస్తామని అర్థం వచ్చే హిందీ మాటను ఉపయోగించారు. దాంతో అధికారపక్ష సభ్యులు భగ్గుమన్నారు. సభాపతిని ఉద్దేశించి అనుచిత పదప్రయోగం చేశారని, అన్‌పార్లమెంటరీ భాష మాట్లాడారని ఖర్గేపై మండిపడ్డారు. ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కేంద్ర మంత్రి జె.పి.నడ్డా పేర్కొన్నారు. అందరూ ఖండించాలని కోరారు. సభలో అనుచిత భాష మాట్లాడడం క్షమించరాని తప్పిదమని అన్నారు. ఖర్గే ఉపయోగించిన పదాన్ని రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. ఖర్గే క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. దీంతో ఖర్గే స్పందిస్తూ.. సభను క్షమాపణ కోరుతున్నట్లు చెప్పారు. సభాపతిని అవమానించాలన్న ఉద్దేశం తనకు లేదని, ప్రభుత్వ విధానాలను మాత్రమే తాను విమర్శించానని స్పష్టంచేశారు. తన వ్యాఖ్యల పట్ల బాధపడి ఉంటే క్షమించాలని సభాపతికి విజ్ఞప్తి చేశారు.

నియోజకవర్గాల పునర్విభజనపై విపక్షాల నిరసన

జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడానికి వీల్లేదని పేర్కొంటూ రాజ్యసభలో విపక్ష సభ్యులు నిరసన వ్యక్తంచేశారు. వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. శాంతించాలని సభాపతి కోరినప్పటికీ వారు వినిపించుకోకపోవడంతో సభను వాయిదా వేశారు.

రాహుల్‌పై సంబిత్ పాత్ర వ్యాఖ్యలతో లోక్‌సభలో గందరగోళం

న్యూఢిల్లీ: విపక్ష నేత రాహుల్ గాంధీపై బీజేపీ సభ్యుడు సంబిత్ పాత్ర చేసిన వ్యాఖ్యలపై మంగళవారం లోక్‌సభ అట్టుడికింది. గ్రాంట్లు, అదనపు గ్రాంట్లు, మణిపూర్ బడ్జెట్‌పై చర్చ సందర్భంగా సంబిత్ పాత్ర మాట్లాడారు. క్రికెట్ రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై గత వారం కాంగ్రెస్ నేత షమా మొహమ్మద్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. రాహుల్ సైతం రోహిత్ శర్మ మాదిరిగానే లావుగా అధిక కొవ్వుతో ఉన్నట్లు పరోక్షంగా పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సంబిత్ పాత్ర క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. సంబిత్ పాత్ర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు సభాపతి స్థానంలో ఉన్న సంధ్యా రాయ్ చెప్పారు. అయినప్పటికీ నిరసనలు ఆగలేదు. తర్వాత స్పీకర్ ఓం బిర్లా సభకు చేరుకున్నారు. శాంతించాలని కాంగ్రెస్ సభ్యులను కోరారు. వారు వినిపించుకోకపోవడంతో సభను 10 నిమిషాలపాటు వాయిదా వేశారు. సభ పునఃప్రారంభమైన తర్వాత సంబిత్ పాత్ర తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారు. మరోవైపు నూతన జాతీయ విద్యా విధానం కింద మూడు భాషల ఫార్ములాను వ్యతిరేకిస్తూ పార్లమెంట్ ఆవరణలో డీఎంకే ఎంపీలు నిరసన చేపట్టారు.

మరో 25% టారిఫ్ వేస్తున్నాం

- కెనడా స్టీల్, అల్యూమినియం దిగుమతులపై రెట్టింపు టారిఫ్ విధించిన ట్రంప్

వాషింగ్టన్: కెనడాతో టారిఫ్ యుద్ధాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉధృతం చేశారు. ఏప్రిల్ రెండో తేదీ నుంచి అమలుకానున్న నూతన దిగుమతి టారిఫ్‌లను మరో 25 శాతం పెంచుతున్నట్లు ప్రకటించారు. స్టీల్, అల్యూమినియంపై 25 శాతంగా ఉన్న టారిఫ్‌ను 50 శాతానికి పెంచుతున్నట్లు ట్రంప్ వెల్లడించారు. కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ప్రభుత్వం అమెరికాలోని మూడు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న విద్యుత్‌పై సుంకాలను పెంచుతున్నట్లు ప్రకటించిన వేళ ట్రంప్ ఈ తాజా నిర్ణయం తీసుకున్నారు. ''కెనడా వ్యవసాయ ఉత్పత్తులపై 250 శాతం నుంచి 390 శాతం వరకు టారిఫ్ విధిస్తోంది. విద్యుత్‌పై 25 శాతం టారిఫ్ పెంచుతున్నట్లు ఒంటారియో ప్రావిన్స్ ఇప్పుడే ప్రకటించింది. ఇలా పెంచే హక్కు మీకు లేదు. మీరు పెంచిన స్థాయిలో మేం కూడా ఏప్రిల్ రెండోతేదీ నుంచి టారిఫ్‌లను పెంచుతాం. కెనడా ప్రతిసారీ టారిఫ్‌లను దుర్వినియోగం చేస్తోంది. వాణిజ్య శాఖ మంత్రి(హోవార్డ్ లుట్నిక్)కి ఇప్పుడే ఆదేశాలిచ్చా. కెనడా నుంచి వచ్చే అన్ని గ్రేడ్ల స్టీల్, అల్యూమినియంపై మరో పాతికశాతం టారిఫ్ విధించాలని సూచించా. ఇకపై స్టీల్, అల్యూమినియం టారిఫ్ 50 శాతానికి పెరుగుతుంది. ఇకపై అమెరికన్లకు కెనడా కార్లు, కలప, ఇంధనం అక్కర్లేదు. మీ వస్తువులు లేకుండానే అమెరికా మనుగడ సాగించగలదని మీరు త్వరలోనే తెల్సుకుంటారు'' అని కెనడానుద్దేశిస్తూ ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లోని తన ఖాతాలో మంగళవారం ఒక పోస్ట్‌పెట్టారు. సరిహద్దుల్లోని మిన్నెసోటా, న్యూయార్క్, మిషిగన్ రాష్ట్రాల్లోని 15 లక్షల మంది వినియోగదారులకు కెనడా నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ విద్యుత్‌పై సుంకాలను 25 శాతం పెంచుతున్నట్లు ఒంటారియో ప్రావిన్స్ ప్రీమియర్ డగ్ ఫోర్డ్ ప్రకటించడం తెల్సిందే.

కాల్పుల విరమణకు ఉక్రెయిన్ ఓకే

జెద్దా: మూడేళ్లుగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఓ కొలిక్కి వచ్చే సూచనలు కన్పిస్తున్నాయి. అమెరికా, ఉక్రెయిన్ మధ్య ఈ విషయమై సౌదీ అరేబియాలోని జెద్దాలో మంగళవారం జరిగిన ఉన్నతాధికారుల స్థాయి చర్చల్లో ఈ దిశగా పురోగతి కన్పించింది. 30 రోజుల కాల్పుల విరమణకు అమెరికా చేసిన ప్రతిపాదనకు ఉక్రెయిన్ సంసిద్ధత వెలిబుచ్చింది. దాంతో ఉక్రెయిన్‌కు సైనిక సాయంపై ఇటీవల విధించిన నిషేధాన్ని వెంటనే ఎత్తేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. 30 రోజుల కాల్పుల విరమణ ఒప్పందంపై రష్యాతో చర్చించనున్నట్టు తెలిపింది.

సాక్షి కరీంనగర్

బుధవారం । 12 । మార్చి । 2025

కనులపండువగా నృసింహుని కల్యాణం

ధర్మపురి:ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి స్థానిక బ్రాహ్మణ సంఘం పక్కనున్న శ్రీమఠం స్థలంలో స్వామివారల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి సుమారు 30వేల వరకు భక్తులు తరలివచ్చారు. - 8లో▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా॥)	సహర్ గురువారం (ఉ॥)
కరీంనగర్	6.27	5.06
పెద్దపల్లి	6.31	5.05
సిరిసిల్ల	6.26	5.15
జగిత్యాల	6.31	5.05



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ

ఆక్యుపంక్చర్‌తో మెరుగైన ఫలితాలు

కరీంనగర్‌క్రైం: ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెషర్ వంటి ప్రత్యామ్నాయ వైద్య విధానాల ద్వారా మందుల అవసరం లేకుండానే అనేక రకాల వ్యాధులను అధిగమించి మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ తెలిపారు. సంకల్ప ఆయుర్వేదిక్ ఆల్టర్నేటివ్ మెడిసిన్ ఫిజియోథెరపీ ట్రీట్మెంట్ హైదరాబాద్‌వారి సహకారంతో, కరీంనగర్ బార్ అసోసియేషన్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం ఉచిత ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెషర్ శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జడ్జి ప్రతిమ మాట్లాడుతూ నడుము, మెడనొప్పి, మోకాళ్లనొప్పులు, తలనొప్పి, సయాటికా, మైగ్రెన్, గ్యాస్ట్రిక్ వంటి అనేక సమస్యలకు ఆక్యుపంక్చర్, ఆక్యుప్రెషర్ వైద్య పద్ధతుల ద్వారా సమర్థవంతమైన చికిత్స పొందవచ్చని వివరించారు. ఈ శిబిరంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సహా దాదాపు 400మంది వైద్య సేవలు పొందారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ.రాజ్‌కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి వెంకటేశ్ పాల్గొన్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

ఆడుతూ.. పాడుతూ..

కరీంనగర్: కరీంనగర్‌లోని టీఎన్జీవోల సంఘ భవనంలో జిల్లా టీఎన్జీవోలు, టీజీవోల ఆధ్వర్యంలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఆటల పోటీలు, ఆరోగ్య మహిళా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కలెక్టర్ పమేలా సత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం చాలా ముఖ్యమని, నవ సమాజ నిర్మాణానికి పాటుపడాలని కోరారు. అనంతరం మహిళల ఆటల పోటీలను ప్రారంభించారు. డాడ్జ్ బాల్, స్కిప్పింగ్, టగ్‌ఆఫ్‌వార్, త్రోబాల్, బెలూన్‌గేమ్ పోటీలు నిర్వహించారు. సుమారుగా 500మంది మహిళా ఉద్యోగులు ఆటలపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి కలెక్టర్ పమేలా సత్పతి, జడ్జి ప్రతిమ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, చరణ్, అరవింద్‌రెడ్డి, నరసింహస్వామి, ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, సబిత, సునీత, విజయలక్ష్మి, లత, హరిప్రియ, సుస్మిత, శైలజ, సరిత, రాధిక, వీణా, రాజేశ్వరి, మమత పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

సొంత పిల్లల్లా చూసుకోవాలి

తిమ్మాపూర్: గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులను ఉపాధ్యాయులు సొంత పిల్లల్లా చూసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అధికారులకు సూచించారు. తిమ్మాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు మూడు గంటలపాటు పాఠశాలలోనే ఉండి.. విద్యార్థులతో గడిపారు. కిచెన్‌రూం పరిశీలించి, పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రతీ తరగతి గదికి కలియ తిరుగుతూ.. బాలికల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేవని విద్యార్థులు శారద దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంతో డైనింగ్‌హాల్ కొంచెం ఇబ్బందిగా ఉందని తన దృష్టికి వచ్చిందని మహిళా కమిషనర్ చైర్‌పర్సన్ తెలిపారు. గురుకులాల్లో ప్రభుత్వం నుంచి సదుపాయాలు అందడం లేదా? లేక అధికారుల లోపమా? అని తెలుసుకోవడం కోసమే ఆకస్మికంగా సందర్శించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

న్యూస్‌రీల్

వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



వైద్యులను సన్మానిస్తున్న అధ్యాపకులు

కరీంనగర్ సిటీ: ప్రతీమహిళ, విద్యార్థులు వారికి సంక్రమించే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి సూచించారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాలలోని ఆడిటోరియంలో కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ ఆంకాలజిస్ట్ అర్చనరెడ్డి హాజరై మహిళలకు ఎక్కువగా వచ్చే కేన్సర్లపై అవగాహన కల్పించారు. రొమ్ము, గర్భాశయ కేన్సర్ మహిళలకు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలన్నారు. హెల్త్ క్లబ్ కో–ఆర్డినేటర్ నాజియా రహమాన్, ఎన్‌సీసీ ఇన్‌చార్జి స్రవంతి పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌తో మెరుగైన బోధన



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రవికుమార్

కరీంనగర్ సిటీ: వర్క్‌షాప్‌తో ఆయా పాఠ్యాంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని, మెరుగైన బోధనకు అవకాశం ఉంటుందని శాతవాహన వీసీ డా.ఉమేశ్‌కుమార్ తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయ సైన్స్‌కళాశాల రసాయనశాస్త్ర విభాగంలో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. డిగ్రీస్థాయిలో రసాయన శాస్త్ర సబ్జెక్టు బోధించే అధ్యాపకులకు 'రీఇన్ఫోర్స్ నాలెడ్జ్ ఆఫ్ ప్రాక్టికల్ ప్రొసీజర్స్ ఇన్ కెమిస్ట్రీ' అంశంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ జయంతి ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్స్ పీ.వీరసోమయ్య, కోటేశ్ రసాయనశాస్త్రంలోని మెలకువలను వివరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్ మాట్లాడుతూ కార్యశాలతో నైపుణ్యాలు పెంచుకోవచ్చని తెలిపారు.

పురుగు మందుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



మాట్లాడుతున్న డీఏవో భాగ్యలక్ష్మి

తిమ్మాపూర్: జిల్లాలోని పురుగు మందుల విక్రయాల డీలర్లు వారి స్టాక్ వివరాలను వ్యవసాయశాఖ రూపొందించిన యాప్‌లో ఈనెల 15లోగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి సూచించారు. తిమ్మాపూర్‌లోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమానికి డీఏవో హాజరయ్యారు. అనంతరం పురుగు మందుల విక్రయ డీలర్లతో సమావేశం నిర్వహించారు. యాప్‌లో వివరాల నమోదు గురించి అవగాహన కల్పించారు. ఏవోలు సురేందర్, కిరణ్మయి, రమ్యశ్రీ, డీలర్లు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ.7,150

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్లో క్వింటాల్ పత్తి గరిష్టంగా రూ.7,150 పలికింది. మార్కెట్‌కు 19వాహనాల్లో 290క్వింటాళ్ల పత్తిని రైతులు తెచ్చారు. మోడల్ ధర రూ.7,100, కనిష్ట ధర రూ.6,700కు వ్యాపారులు కొనుగోలు చేశారు. కార్యదర్శులు పర్యవేక్షించారు.

శాంతిభద్రతలకు ప్రాధాన్యం

ఫ్రెండ్లీ పోలీస్‌తో ముందుకు

- నేరాలను తగ్గించేందుకు కృషి
- ఆరోపణలున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు
- కబ్జారాయుళ్లపై కఠినంగా వ్యవహరిస్తాం
- షీటీం సేవలకు మరింత పదును
- ఇసుక, పీడీఎస్, గంజాయి, సైబర్ నేరాలు కట్టడి చేస్తా
- 'సాక్షి'తో సీపీ గౌస్ ఆలం



సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్‌క్రైం: శాంత్రి భద్రతలు పరిరక్షించడం, నేరాలపై ఉక్కుపాదం మోపి నేర రహిత కమిషనరేట్‌గా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తానని నూతన పోలీసు కమిషనర్ గౌస్ ఆలం పేర్కొన్నారు. ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో మరింత చేరువై వేగంగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. భూకబ్జాలతో అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత గంజాయి మత్తుకు బానిసకాకుండా అవగాహన కల్పిస్తామని.. నార్కోటిక్ వింగ్ ద్వారా గంజాయి నేరాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పీడీఎస్ బియ్యం, ఇసుక రవాణా, సైబర్ నేరాల ఆటకట్టిస్తామన్నారు. మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సీపీ గౌస్ ఆలం పలు విషయాలు వెల్లడించారు.

కరీంనగర్ సీపీగా మీరు ఫోకస్‌చేసే అంశం ఏంటి?

సీపీ: కరీంనగర్ కమిషనరేట్ ప్రజలకు సత్వరమైన సేవలు అందించేలా కృషిచేస్తా. సిటిజెన్ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తూ, వారి ఫిర్యాదులు పరిశీలించి పరిష్కరిస్తా. ఏం జరిగినా ప్రజలు పోలీసులకు స్వచ్ఛందంగా సమాచారం అందించేలా అవగాహన కల్పిస్తా. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా క్యూఆర్ కోడ్‌తో తమ అభిప్రాయాలు పంచుకుంటున్నారు. ఈ విధానం సరైన రీతిలో అమలు చేసేందుకు కృషిచేస్తా.

వివిధ నేరాల కట్టడికి అవలంబించే విధానం?

సీపీ: కమిషనరేట్‌వ్యాప్తంగా సైబర్‌నేరాలు తగ్గించేందుకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఉంది. ప్రతీస్టేషన్‌లో సైబర్‌వారియర్స్ ఉన్నారు. అమాయక ప్రజలు మోసం పోతే వెంటనే రికవర్ చేసేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. యువత గంజాయి మత్తుకు బానిసవకుండా, గంజాయి కమిషనరేట్‌లో అడుగుపెట్టకుండా చూస్తా. పీడీఎస్‌బియ్యం, ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పేకాట, మట్కా ఆడితే కేసులు నమో దు చేస్తాం. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై, రౌడీషీటర్లపై దృష్టి పెడతా. రాత్రి పూట గస్తీ పెంచి దొంగతనాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేస్తాం.

మహిళల భద్రతకు తీసుకునే చర్యలు?

సీపీ: మహిళల రక్షణే ధ్యేయంగా పనిచేసే షీటీంలకు మరింత పదును పెడుతాం. అమ్మాయిలు, మహిళలు రోడ్డు మీద వెళ్లేటప్పుడు, కార్యాలయాల్లో, కళాశాలల్లో, పనిచేసే సంస్థల్లో ఎక్కడైనా ఆడవాళ్లకు ఏం జరిగినా.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసే విధంగా అవగాహన కల్పిస్తాం. వారు ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలోనే రక్షణ కల్పించి, కారకులపై చర్యలు తీసుకుంటాం.

కరీంనగర్‌కు బదిలీ కావడంపై మీ ఫీలింగ్?

సీపీ: నేను గతంలో ములుగు, ఆదిలాబాద్‌లో పనిచేశాను. అక్కడ గ్రామీణ ప్రాంతాలు, ట్రైబల్ ఏరియాలు ఎక్కువగా ఉంటాయి. అక్కడ పోలీసింగ్ కొంతవేరుగా ఉంటుంది. కరీంనగర్ కమిషనరేట్ ఎక్కువగా అర్బన్ పోలీసింగ్ ఉంటుంది. ఇక్కడ వేరుగా ఉంటుంది. పోస్టింగ్ ఎక్కడయినా శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తా.

గతంలో ఉన్న ఎకానమిక్స్ అఫెన్సెస్ వింగ్ కొనసాగిస్తారా...?

సీపీ: ఎకనామిక్స్ అఫెన్సెస్ వింగ్‌ను మొదట పూర్తిగా రివ్యూ చేసి తద్వారా ఏం చేశారనే విషయాలు లోతుగా తెలుసుకుంటాం. అమాయక ప్రజల భూములను కబ్జాలు చేస్తూ మోసాలు, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

ట్రాఫిక్ సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

సీపీ: కరీంనగర్‌లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందని తెలుసు. పటిష్టమైన ట్రాఫిక్ విభాగంతో సమస్యలను అధిగమిస్తాం. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం కాకుండా చర్యలు తీసుకుంటాం. ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రత్యేకమైన కార్యాచరణ రూపొందిస్తాం. నిత్యం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతూ.. మద్యంసేవించి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకుంటాం.

పోస్టింగ్‌లలో రాజకీయ ఒత్తిడిపై మీరేమంటారు?

సీపీ: పోలీస్ బదిలీలు అన్ని కూడా వారి ప్రతిభను ఆధారంగా చేసుకునే ఉంటాయి. పోలీసు బదిలీల్లో పొలిటికల్ ఒత్తిడి ఉండదు. కమిషనరేట్‌వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది అక్రమాలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటే శాఖపరమైన విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటా. సివిల్ కేసుల్లో తలదూర్చే పోలీసులపై చర్యలు తప్పవు.

లీకేజీ పరేషాన్

- పైపుల్లో నాణ్యత ఉండదు.. నిబంధనలు పట్టవు
- నగరంలో నిత్యం వాటర్ లీకేజీలే
- శాశ్వత చర్యలపై పట్టింపు లేని బల్దియా



లీకవుతున్న కొత్తగా వేసిన హెచ్‌డీపీఈ పైప్‌లైన్

కరీంనగర్ కార్పొరేషన్:

నాసిరకం పైపుల వినియోగం.. నిబంధనలు పాటించకుండా పైపైనే పైపులు వేయడం.. జాయింట్లలోనూ పట్టని జాగ్రత్తలు.. పర్యవేక్షణ మరిచిన అధికారులు.. వెరసి నగరంలో ప్రతీరోజు ఎక్కడో ఒక చోట తప్పనిసరిగా పైప్‌లైన్ లీకేజీలు.. రోడ్లపై వృథాగా నల్లానీళ్లు.. తాగునీటి నాణ్యతపై నగరవాసులు బేజారు..! ఇది నగర పాలకసంస్థ పరిధిలో జరుగుతున్న తాగునీటి సరఫరాకు సంబంధించిన లీకేజీ వ్యవహారం. నగరంలో 60 డివిజన్లు కాస్తా 66 డివిజన్లుగా మారుతున్నా.. నగరపాలకసంస్థ పరిధి కిలో మీటర్ల మేర విస్తరిస్తున్నా.. అధికారుల పర్యవేక్షణలో మార్పు రావడం లేదు. తరచూ పైప్‌లైన్ లీకేజీలు అవుతున్నా తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారే తప్ప, అందుకు కారణాలపై దృష్టి పెట్టడం లేదు. శాశ్వత పరిష్కారం వైపు కనీస చర్యలు కనిపించడం లేదు.

నాసిరకమే ఎక్కువ

నగరంలో తాగునీటి సరఫరాకు గతంలో సిమెంట్ పైపులు వాడేవారు. అవి త్వరగా పగులుతుండడంతో లీకేజీలు పెరిగేవి. దీంతో హెచ్‌డీపీఈ (హై డెన్సిటీ పాలిథిన్)పైపులను తీసుకొచ్చారు. ఐఎస్‌ఐ మార్క్ కలిగిన ఈ హెచ్‌డీపీఈ పైప్‌లు సంవత్సరాలుగా చెడిపోకుండా ఉండడంతో వీటినే వాడుతున్నారు. నగరంలో పాత సిమెంట్ పైప్‌లైన్ పక్కనపెడితే, కొత్తగా వేస్తున్న హెచ్‌డీపీఈ పైప్‌లు కూడా పగులుతుండడమే ప్రస్తుతం ప్రధాన సమస్యగా మారింది. వాటర్ ప్రెషర్‌కు అనువైన వైశాల్యంతో హెచ్‌డీపీఈ పైప్‌లు వేస్తున్నారు. చాలా చోట్ల నాసిరకం పైప్‌లు వేయడం వల్ల, ఏళ్లపాటు మన్నికగా ఉండాల్సిన పైపులు తరచూ పగిలిపోతున్నాయనే ఆరోపణలున్నాయి. దీంతో కొత్తగా పైప్‌లైన్ వేసిన చోట కూడా లీకేజీలు పెరుగుతున్నాయి. లీకేజీలకు మరమ్మతులు చేసే వాటర్ వర్క్స్ సిబ్బంది కూడా, నాసిరకం పైప్‌లు వేసి తమను ఇబ్బంది పెడుతున్నారంటూ మండిపడుతుండడం గమనార్హం.

నిబంధనలు పట్టవు

హెచ్‌డీపీఈ పైప్‌లు నాసిరకం వాడుతుండడమే కాకుండా, పైప్‌లు భూమిలో వేసే సమయంలో నిబంధనలు పాటించకపోవడం కూడా సమస్యగా మారింది. నిబంధనల ప్రకారం దాదాపు మూడు ఫీట్ల లోతులో తవ్వి, ఆఫ్ ఇంచ్ ఇసుక, డస్ట్‌లో ఈ పైప్‌లు వేయాల్సి ఉంటుంది. భారీ వాహనాలు పైప్‌లైన్ మీదుగా వెళ్లినప్పుడు దెబ్బతినకుండా ఇసుక, డస్ట్ పనిచేస్తుంది. ఎక్కడా మూడు ఫీట్ల లోతు కనిపించదు. ఇసుక జాడ కూడా ఉండదు. రెండు ఫీట్లలోపు లోతులోనే పైప్‌లు వేస్తుండడంతో, భారీ వాహనాలు వెళ్లే సమయంలో పైప్‌లు పగుళ్లు చూపుతున్నాయి. పైపుల జాయింట్ల వద్ద కప్లింగ్ వేయాలి. కానీ.. వేడి చేసి పైప్‌లను కలుపుతూ వెళ్తుండడంతో కొద్దిరోజుల్లోనే జాయింట్ల వద్ద లీకేజీ మొదలవుతోంది.

పర్యవేక్షణ మరిచారు

నిబంధనల ప్రకారం పైపులైన్ వేస్తున్నారా, నాణ్యమైన పైపులు వాడుతున్నారా అనేది చూడాల్సిన నగరపాలకసంస్థ అధికారులు పర్యవేక్షణ మరిచారు. నాసిరకం పైప్‌లు, పైపైనే వేయడం కారణంగా తరచూ వాటర్ లీకేజీ అవుతున్నా, ఉన్నతాధికారులు లోతుగా సమస్యపై దృష్టి పెట్టడం లేదు. ప్రెషర్‌కు అనుగుణంగా కొత్తగా వేస్తున్న హెచ్‌డీపీఈ పైప్‌లు కూడా పగిలి లీకేజీలవుతుండడమే ఇందుకు నిదర్శనం. గతంలో వేసిన వాల్వ్‌లు సంవత్సరాల పాటు ఉండగా, ప్రస్తుతం వేసే వాల్వ్‌లు ఆరు నెలల్లో మరమ్మతులకు వస్తున్నాయి. నగరపాలకసంస్థ ఉన్నతాధికారులు లీకేజీల అసలు కారణంపై, పైప్‌ల నాణ్యతపై దృష్టి సారిస్తే తప్ప నగరంలో లీకేజీల ప్రవాహానికి అడ్డుకట్ట పడదు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

కరీంనగర్‌టౌన్: జిల్లాకేంద్రంలోని పలు స్కానింగ్, ఫెర్టిలిటీ సెంటర్లను మంగళవారం డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీ చేశారు. కేంద్రాల్లో స్కానింగ్ కోసం వచ్చిన అవుట్ పేషెంట్ రిజిష్టర్లు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, డాక్టర్ల క్వాలిఫికేషన్ వెరిఫికేషన్, గర్భస్థ పూర్వ, లింగ నిర్ధారణ చట్టం అమలు తీరును పరిశీలించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉమాశ్రీ, సనా, డి.లక్ష్మి, కె.రమేశ్, రాజగోపాల్, విజయవాణి పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో డెలివరీలు పెంచాలి

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో డెలివరీల కోసం వచ్చే విధంగా సదుపాయాలు కల్పించాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో బృందం

మైక్రో యాక్షన్ ప్లాన్ తయారు చేసి ప్రతీఒక్క చిన్నారికి పూర్తివ్యాధి నిరోధక టీకాలు 100శాతం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈనెల 17నుంచి 30వరకు జరిగే కుష్టువ్యాధి కేసు గుర్తింపు క్యాంపుల్లో అందరూ పాల్గొనేలా చూడాలన్నారు. అతుల్ వాసరే, సుదా రాజేంద్ర, ఉమాశ్రీరెడ్డి పాల్గొన్నారు.

13న జాబ్‌మేళా

కరీంనగర్/విద్యానగర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు హైదరాబాద్‌లోని క్వెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీవోడీఎస్ అసెంబ్లీ హెల్పర్స్, తదితర పోస్టులు ఖాళీలున్నాయని, ఈ పోస్టులకు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ ఆపై చదివి, ఉత్తీర్ణత సాధించినవారు అర్హులని, వయస్సు 18 నుంచి 35లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 13న ఉదయం 11 గంటల సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో జిల్లా ఉపాధి కార్యాలయంలో తమ పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 95734 26092, 99082 30384 నంబర్లలో సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

కరీంనగర్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా గీతారెడ్డి



గీతారెడ్డి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది రూపిరెడ్డి విశ్వ గీతారెడ్డిని కరీంనగర్ నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌గా(న్యాయవాదిగా) నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో జారీ చేసింది. సీనియర్ న్యాయవాది అయిన గీతారెడ్డి గతంలో ప్రభుత్వ ప్లీడర్(జీపీ)గా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం విద్యుత్‌శాఖకు స్టాండింగ్ కౌన్సిల్‌గా కొనసాగుతున్నారు. ఇకనుంచి మున్సిపల్ పక్షాన కోర్టుల్లో గీతారెడ్డి వాదనలు వినిపించనున్నారు. గీతారెడ్డి నియామకంపై బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రఘునందన్‌రావు, సీనియర్ న్యాయవాదులు సింగిరెడ్డి లక్ష్మారెడ్డి, ఎడమ శ్రీరంగారెడ్డి, ఉప్పుల అంజనిప్రసాద్, రూపిరెడ్డి దేవేందర్‌రెడ్డి, పలువురు లాయర్లు హర్షం వ్యక్తం చేశారు.

మెస్‌చార్జీల పెంపుతోనే పౌష్టికాహారం

- 'సుడా' చైర్మన్ నరేందర్‌రెడ్డి



భోజనం చేస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెస్‌చార్జీలు పెంచడంతోనే హాస్టల్ విద్యార్థులకు పౌష్టికాహారం సాధ్యమైందని సుడా చైర్మన్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. వంటశాలలోని సరుకులు తనిఖీ చేశారు. వంటకాలను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చాలీచాలని మెస్ చార్జీలతో విద్యార్థులకు పౌష్టికాహారం అందించే పరిస్థితి ఉండేది కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మెస్‌చార్జీల పెంపుతో ఆ పరిస్థితి పోయిందన్నారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని ఆయన ప్రిన్సిపల్‌కు సూచించారు. మెనూ అమలు చేస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్, నాయకులు మిరాజ్, కొరివి అరుణ్‌కుమార్, శ్రావణ్‌నాయక్, కుర్ర పోచయ్య, పెద్దిగారి తిరుపతి ఉన్నారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా రమేశ్



చామనపల్లి రమేశ్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది చామనపల్లి రమేశ్‌ను కరీంనగర్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రామడుగు మండలం వెలిచాలకు చెందిన రమేశ్ 20ఏళ్లుగా కరీంనగర్ కోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఏజీపీగా రమేశ్ నియామకంపై న్యాయవాదులు గడ్డం లక్ష్మణ్, కొరివి వేణుగోపాల్, ఎర్రం రాజిరెడ్డి, వెంకటరమణారావు, పెంచాల మురహరిరావు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

కాలువలోపడి వ్యక్తి మృతి


మానాల వెంకటేశ్(ఫైల్)

గోదావరిఖని: మల్కాపూర్ గ్రామానికి చెందిన మానాల వెంకటేశ్(47) మంగళవారం ప్రమాదవశాత్తు మురుగునీటికాలువలోపడి మృతి చెందాడని వన్‌టౌన్ ఎస్సై రమేశ్ తెలిపారు. ఉదయం పని కోసం స్కూటీపై వెళ్తూ అదుపుతప్పి కాలువలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య


అంజయ్య మృతదేహం

మానకొండూర్: మండలంలోని పోచంపల్లికి చెందిన పొలం అంజయ్య (53) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొలం అంజయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి 15 ఏళ్ల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి అంజయ్య ఆరోగ్య పరిస్థితి బాగోలేదు. కుటుంబ సభ్యులు అతడి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేందుకు పలు ఆస్పత్రులు తిరిగి వైద్యం చేయించారు. రెండు నెలలనుంచి మళ్లీ అంజయ్య ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున అంజయ్య ఇంట్లో కనిపించకపోవడంతో కుమారుడు రఘు తండ్రి కోసం వెతకగా ఇంటి ముందు చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో ఒకరు..


నర్సింహాచారి (ఫైల్)

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ శివారు భూషణగట్ల వద్ద బండోజు నర్సింహాచారి(50) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సైదాపూర్ ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామానికి చెందిన బండోజు నర్సింహాచారి అనారోగ్య సమస్యలతో జనవరి 7న హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి వెళ్లాడు. చికిత్సకు సుమారు రూ.5లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలని మనస్తాపం చెందాడు. ఆ మర్నాడు రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నర్సింహాచారి కనిపించడం లేదని హుస్నాబాద్ పోలీసులకు ఆయన కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. సైదాపూర్ మండలం ఆకునూర్ శివారు భూషణగట్ల వద్ద చెట్టుకు ఉరేసుకొని చనిపోయాడని సర్వాయిపేట గ్రామానికి చెందిన దేవయ్య మంగళవారం ఇచ్చిన సమాచారంతో కుటుంబసభ్యులు నర్సింహాచారి మృతదేహంగా గుర్తించారు. నర్సింహాచారికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. చిన్న అల్లుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

జ్వరంతో బాలిక మృతి


రమ్య (ఫైల్)

హుజూరాబాద్ : మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన బండారి రమ్య (14) తీవ్ర జ్వరంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రమ్య గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. 20 రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా హన్మకొండలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సోమవారం రాత్రి తీవ్ర జ్వరంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. రమ్య తండ్రి బండారి పెద్ద రమేశ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.


స్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


హాజరైన కలెక్టర్, ఎస్పీ, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్

కల్యాణం.. కమనీయం

- పట్టువస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ అడ్లూరి..
- జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్
- హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రముఖులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణవేడుకలను అశేషభక్తుల మధ్య మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు స్వామివారి కల్యాణ వేడుకలను ఉదయం నుంచే ప్రారంభించారు. రాష్ట్రనలుమూలలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో శ్రీమఠంస్థలం కిక్కిరిసి పోయింది. స్వామివారలకు ప్రభుత్వం తరఫున స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఇసుక స్తంభం నుంచి దేవాలయం వరకు మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణ వేదిక వద్దకు తీసుకెళ్లారు. ముందుగా ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందించారు. వేడుకల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




వేడుకను తిలకిస్తున్న భక్తులు


పట్టువస్త్రాలు తెస్తున్న కలెక్టర్ దంపతులు


పట్టు వస్త్రాలతో విప్ అడ్లూరి లక్ష్మణ్

పేకాట.. వసూళ్లు

- వాహనాలు, సెల్‌ఫోన్ల అప్పగింత పేరిట
- లంచాలకు తెరతీస్తున్న పోలీసులు

కోరుట్ల: పేకాటలో దొరికిన డబ్బుల్లో కొంత నొక్కేయడం అక్కడక్కడ షరామామూలుగా మారింది. అడిగితే ఇన్‌ఫార్మర్‌కు కొన్ని డబ్బులు ఇచ్చామని పైఅధికారులకు సర్ది చెప్పడం తెలిసిందే. మరికొందరు పోలీసు సిబ్బంది అత్యుత్సాహం చూపుతూ.. పేకాటరాయుళ్ల వాహనాలు, సెల్‌ఫోన్లను అప్పగించడానికి ఎంతోకొంత మామూళ్లు వసూలు చేస్తున్న వైనం బహిరంగ రహస్యమే అయినా ఈ వ్యవహారం గత బుధవారం కోరుట్లలో ఏసీబీకి చిక్కిన ఎస్సై తీరుతో వెలుగులోకి వచ్చింది. పేకాట ఆడేవారి సంఖ్యను బట్టి ఒక్కోసారి ఎంత తక్కువ అనుకున్నా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూళ్ల దందా సాగుతోందంటే అతిశయోక్తి కాదు.

వాహనాలు.. సెల్‌ఫోన్లు

జగిత్యాల జిల్లాలోని రాయికల్, మల్యాల, మల్లాపూర్, కథలాపూర్, ఇబ్రహీంపట్నం, బీర్‌పూర్, కొడిమ్యాల, కోరుట్ల, మల్యాల తదితర మండలాల్లో పేకాట జోరుగా సాగుతున్న క్రమంలో కొన్నిచోట్ల స్థానిక పోలీసులు నిక్కచ్చిగా వ్యవహరించడం లేదని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేకంగా స్పెషల్ పార్టీలు ఏర్పాటు చేసి పేకాట స్థావరాలపై దాడులు చేస్తున్నారు. ఈ ఏడాది రెండు నెలల వ్యవధిలో జిల్లాలో సుమారు 11 చోట్ల పేకాట రాయుళ్లను పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. వీటిలో స్పెషల్ పార్టీ పోలీసులు పట్టుకున్న కేసులే ఎక్కువగా ఉన్నాయి. పేకాటరాయుళ్లను పట్టుకున్న సందర్భంలో డబ్బులతోపాటు వారి వాహనాలు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు. స్పెషల్ పార్టీ పోలీసులు పేకాటరాయుళ్లను పట్టుకున్నా స్థానిక


పేకాట ఆడుతున్న వ్యక్తులు

పోలీస్‌స్టేషన్‌లోనే అప్పగిస్తారు. ఇలా స్థానిక పోలీస్‌స్టేషన్లలో పదుల సంఖ్యలో వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

ఇదే సాకుగా..

వాస్తవానికి పేకాటరాయుళ్ల వాహనాలు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం లేదని సమాచారం. కొన్ని సందర్భాల్లో ఎంవీఐ యాక్ట్ -207 ప్రకారం వాహనాలు, సెల్‌ఫోన్లను సీజ్ చేసే అవకాశముంది. పేకాటరాయుళ్లను పట్టుకున్న పోలీసు అధికారి విచక్షణాధికారం ప్రకారం నిర్ణయం తీసుకునే అవకాశముంది. కానీ.. పేకాట రాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాలు, సెల్‌ఫోన్లు వదిలేస్తే మళ్లీ కోర్టుకు హాజరుపర్చడంలో ఇబ్బందులు వస్తున్నాయి. చాలామంది కోర్టుకు రమ్మంటే రావడం లేదు. ఈ కారణంగా పోలీసులు పేకాటరాయుళ్లను పట్టుకున్న అనంతరం నిందితులను కోర్టుకు హాజరుపరిచే వరకు సెల్‌ఫోన్లు, వాహనాలు పోలీస్‌స్టేషన్లలో ఉంచుకుంటున్నారు. ఇదే సాకుగా కొంత మంది కింది స్థాయి సిబ్బంది వాహనాలు, సెల్‌ఫోన్లు తిరిగి ఇచ్చే సాకుతో కాసుల వసూళ్ల దందాకు తెరలేపుతున్నారు. ఇలా పేకాటలో దొరికిన చాలామంది వద్ద పోలీసులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కోరుట్ల ఎస్సై పేకాట అడి పట్టుబడిన ఓ వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేసే క్రమంలో ఏసీబీకి చిక్కడం గమనార్హం.

నలుగురు బాలికల అదృశ్యం

- తల్లిదండ్రులకు అప్పగించిన వన్‌టౌన్ పోలీసులు

కరీంనగర్ క్రైం: నగరానికి చెందిన నలుగురు బాలికలు రెండు రోజుల క్రితం అదృశ్యం అయ్యారు. వారి జాడ గుర్తించిన కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు క్షేమంగా ఇంటికి చేర్చారు. ఈ నెల 09న వన్‌టౌన్ పోలీసులకు నలుగురు బాలికలు అదృశ్యం అయ్యారని ఫిర్యాదు వచ్చింది. దర్యాప్తు చేసిన పోలీసులు గుంటూరులో బాలికలను గుర్తించి కరీంనగర్ తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. బాలికలు తరచూ ఫోన్లు చూస్తుండడంతో మందలించడంతోనే ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

సిరిసిల్లక్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సుందరయ్యనగర్‌కు చెందిన నాయిని రాజయ్య (59) రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. రాజయ్య సైకిల్‌పై వెల్జిపూర్ వెళ్తుండగా సిరిసిల్ల బ్రిడ్జి వద్ద వెనకనుంచి బైక్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజయ్యను సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రి, అక్కడి నుంచి కరీంనగర్ తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడి చిన్న కొడుకు రమేశ్ ఫిర్యాదు మేరకు కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన శీతల్లి మనోహర్‌ను నిందితుడిగా గుర్తించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

శంకరపట్నం: శంకరపట్నం మండలంలో వీధికుక్కల దాడిలో మరో బాలుడికి తీవ్రగాయాలు అయ్యాయి. మండలంలోని వంకాయగూడెం గ్రామానికి చెందిన శ్రేయాన్స్(4) ఇంటిఎదుట ఆడుకుంటుండగా వెన్నులో కుక్క కరిచి గాయపర్చింది. తాడికల్‌లో కృత్విక్‌ను కరిచిన కుక్క వంకాయగూడెం వచ్చి శ్రేయాన్స్‌ను కరిచిందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. శ్రేయాన్స్‌కు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

కరీంనగర్‌క్రైం: నగరంలోని హౌజింగ్‌బోర్డుకాలనీలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిట్లు కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న పోలీసు ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద రూ.3000 విలువైప 1.460 కిలోల గంజాయి చాక్లెట్లు లభించినట్లు వెల్లడించారు. నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహేశ్‌కుమార్ గౌతమ్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేటి నుంచి డోలోత్సవం

వేములవాడ: రాజన్న ఆలయంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు డోలోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకుడు చంద్రగిరి శరత్‌శర్మ తెలిపారు. ఈనెల 16 నుంచి ఐదు రోజులపాటు జరిగే శివకల్యాణోత్సవాల సందర్భంగా ఆలయంలో పనులు వేగం పుంజుకున్నాయి. ప్రధానాలయం ముందు యాగశాల సిద్ధం చేస్తున్నారు.

ఇన్‌చార్జి స్థానాచార్యులుగా ఉమేశ్‌శర్మ

రాజన్న ఆలయం ఇన్‌చార్జి స్థానాచార్యులుగా ఉమేశ్‌శర్మను నియమించినట్లు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి తెలిపారు. గతనెలలో ఇనచార్జి స్థానాచార్యులుగా కొనసాగిన అప్పాల భీమాశంకరశర్మ రిటైర్డ్ కావడంతో ఏర్పడిన ఖాళీలో ప్రధాన అర్చకులైన ఉమేశ్‌శర్మ నియమించారు.


ఏర్పాటు చేస్తున్న యాగశాల

265 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

ధర్మారం(ధర్మపురి): నర్సింహులపల్లి గ్రామశివారులో మంగళవారం లారీలో అక్రమంగా తరలిస్తున్న 264.70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ టీంతోపాటు పెద్దపల్లి సీఎస్ఐ శ్రీనివాస్ సంయుక్తంగా నర్సింహులపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో అటుగా వచ్చిన లారీని ఆపి సోదా చేయగా.. దాదాపు రూ.పది లక్షల 32వేల 330 విలువైన 267.70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించాయని పేర్కొన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పెద్దపల్లి ఆర్ఐ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న మొటం గురువయ్య, ముగ్గు శ్రీనివాస్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్సై వివరించారు.

లే నాన్నా.. అమ్మా, చెల్లి వచ్చాం

- లిఫ్ట్ ప్రమాదంలో సిరిసిల్ల కమాండెంట్ మృతి
- తండ్రి మృతదేహాన్ని చూసి విలవిల్లాడిన కూతురు
- కలెక్టర్, ఎస్పీ నివాళి
- సంతాపం తెలిపిన కేంద్ర మంత్రి బండి, మాజీ మంత్రి కేటీఆర్


గంగారాం(ఫైల్)

సిరిసిల్ల/సిరిసిల్లక్రైం: 'లే నాన్న.. అమ్మా.. చెల్లి వచ్చాం.. ఒక్కసారి చూడండి నాన్న.. మీరే మా ధైర్యం.. ఇలా వెళ్లి పోతే ఎలా.. మీకు ఎన్ని గాయాలు అయ్యాయి.. నాన్న పడిపోతుంటే.. మీరంతా ఉండి ఏం చేస్తున్నారు..!! అంటూ.. సిరిసిల్లలో ప్రమాదవ శాత్తు మృతిచెందిన 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ తోట గంగారాం(61) కూతురు డాక్టర్ గౌతమి కన్నీరు కార్చుతూ విలవిలాడిపోయారు. వివరాలు.. రాజన్న సిరిసిల్ల జిల్లా వెంకట్రావునగర్‌లో రమేశ్ ఇంట్లో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అద్దెకు ఉంటారు. చంద్రశేఖర్‌రెడ్డి కూతురు ఇటీవల మరణించారు. అతన్ని ఓదార్చేందుకు వారి ఇంటికి వెళ్లిన తోట గంగారాం తిరిగి వస్తుండగా.. లోపల లిఫ్ట్ లేకుండానే గేటు ఓపెన్ కావడంతో అందులో ప్రమాదశాత్తు పడిపోయాడు. మూడో అంతస్తు నుంచి గంగారాం పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీస్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది తాళ్ల సాయంతో గంగారాంను బయటకు తీయగా అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. లిఫ్ట్ నిర్వహణ లోపమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు సిద్దిపేటకు చెందిన లిఫ్ట్ నిర్మాణ సంస్థ ప్రతినిధిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పోలీస్ బెటాలియన్‌లో..

సిరిసిల్ల శివారులోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ మృతదేహాన్ని ఉంచి పలువురు నివాళులు అర్పించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బెటాలియన్‌కు చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అంతకు ముందు రాత్రి ఎస్పీ గిటే మహేశ్ బాబా సాహేబ్, ఏఎస్పీ చంద్రయ్య గంగారాం మృతదేహాన్ని పరిశీలించి నివాళి అర్పించారు. గతంలో హైదరాబాద్ సచివాలయం ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీస్(సీఎస్‌వో) గా గంగారాం పని చేశారని, ఆయన మృతిపట్ల సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కె.తారక రామారావు సంతాపం తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌కుమార్ పోలీస్ కమాండెంట్ మృతిపై సంతాపం ప్రకటించారు. బెటాలియన్ పోలీస్ సిబ్బంది కన్నీటి నివాళి మధ్య గంగారాం మృతదేహాన్ని స్వగ్రామం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సిద్దులంకు తరలించారు.


గంగారాం మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పరీక్ష రాస్తే విజయమే

తెలంగాణ పబ్లిక్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్–1, 2 ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సత్తాచాటారు. కొందరు అభ్యర్థులు ఇదివరకు గ్రూప్–4 ఫలితాల్లో ర్యాంకులు సాధించి ఆయా శాఖల్లో ఉద్యోగం చేస్తున్నారు. మళ్లీ ఇప్పుడు ఉత్తమ ర్యాంకులు సాధించడం విశేషం.

- వీఆర్వోగా, జూనియర్ అసిస్టెంట్‌గా రాణించిన దివ్య
- గ్రూప్ -2లో ప్రతిభ


దివ్య

ధర్మారం(ధర్మపురి): ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ - 2 ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన మోటపల్లి దివ్య రాష్ట్రస్థాయిలో 169వ ర్యాంక్ సాధించారు. కాళేశ్వరం జోన్ మహిళా విభాగంలో రెండో ర్యాంక్ సాధించారు. బంగారు ఆభరణాల పనిచేసే మోటపల్లి తిరుపతి–భారతి దంపతుల కూతురు దివ్య. బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్ చదివారు. 2019లో వీఆర్వోతోపాటు గ్రూప్ - 4 ఉద్యోగం కోసం నిర్వహించిన పరీక్ష రాశారు. తొలుత వీఆర్వో ఉద్యోగానికి ఎంపికయ్యారు. జూలపల్లి మండలంలో పనిచేశారు. గ్రూప్- 4 పరీక్ష ఫలితాలు 2021లో ప్రకటించగా రాష్ట్రస్థాయిలో 47వ ర్యాంక్ సాధించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యారు. 317 జీవో కింద దివ్యను ధర్మారం తహసీల్దార్ కార్యాలయానికి జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. గ్రూప్ - 1 లక్ష్యంగా ఉద్యోగానికి దీర్ఘకాలిక సెలవు పెట్టిన ఆమె.. రెండు నెలల వ్యవధిలోనే గ్రూప్ -2, గ్రూప్ -1 పరీక్షలు నిర్వహించగా రెండింటికి ప్రిపేరయ్యారు. మంగళవారం విడుదలైన గ్రూప్- 2 ఫలితాల్లో సత్తాచాటారు.

సన్మానించిన తహసీల్దార్

ధర్మారం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దివ్యను మంగళవారం తహసీల్దార్ వకీల్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. దివ్యను శాలువాతో సన్మానించి మిఠాయిలు పంపిణీ చేశారు. తహసీల్దార్ వకీల్, డిప్యూటీ తహసీల్దార్ కుమార్, ఆర్ఐలు వరలక్ష్మి, నవీన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిఖిల్‌రెడ్డికి 70వ ర్యాంక్


నిఖిల్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): గ్రూప్–2 మెరిట్‌లిస్టులో సైదాపూర్ మండలానికి చెందిన సంతపురి నిఖిల్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 70వ ర్యాంకు సాధించారు. సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సంతపురి నాగిరెడ్డి, జ్యోతి కొడుకు నిఖిల్‌రెడ్డి ప్రస్తుతం కరీంనగర్ జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన నిఖిల్‌రెడ్డి ఏ విధమైన కోచింగ్ లేకుండానే ఇంటి వద్దనే సొంతంగా పరీక్షలకు సన్నద్ధమై తొలుత గ్రూప్–4లో పోలీస్‌శాఖలో, రెండోసారి గ్రూప్–4లో ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. మంగళవారం విడుదలైన గ్రూప్–2లో 398.423 మార్కులతో రాష్ట్రస్థాయిలో 70ర్యాంకు సాధించాడు.

గ్రూప్–4లో 26, ఇప్పుడు 24వ ర్యాంక్


రాకేశ్‌గౌడ్

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామానికి చెందిన గొట్టిపర్తి రాకేశ్‌గౌడ్ గ్రూప్– 2 ఫలితాల్లో 24వ ర్యాంకు సాధించాడు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని రాకేశ్ తెలిపాడు. మూడు నెలల క్రితం ప్రకటించిన గ్రూపు– 4 ఫలితాల్లో 26వ ర్యాంకు సాధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాకేశ్ ప్రాథమిక విద్యాభ్యాసం ఇల్లంతకుంట మండల కేంద్రంలో, డిగ్రీ, పీజీ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. రెవెన్యూ, మున్సిపల్, కమర్షియల్ అండ్ టాక్సెస్ శాఖల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాకేశ్ తండ్రి యాదగిరిగౌడ్ వ్యవసాయం, మోటార్ వైండింగ్ పనులు చేస్తారు.

సత్తాచాటిన భువన


భువన

సిరిసిల్లఎడ్యుకేషన్: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన బుర్ర భువన గ్రూప్–1లో 456 మార్కులు, గ్రూప్–2లో 363 ర్యాంకు సాధించింది. గతంలో తెలంగాణ పబ్లిక్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్–4లో ఎంపికై ప్రస్తుతం కలెక్టరేట్‌లోని ల్యాండ్ అండ్ రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తుంది. చొప్పదండి జవహర్ నవోదయ పాఠశాలలో చదివి 10జీపీఏ సాధించి, అనంతరం ఎస్ఆర్ కళాశాల హనుమకొండలో ఇంటర్ పూర్తి చేసింది. ఎన్ఐటీ వరంగల్‌లో బీటెక్ పూర్తి చేసి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో మూడేళ్లు అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేసి ఉద్యోగానికి రాజీనామా చేసింది. గ్రూప్స్ కోసం చదివి ప్రస్తుతం మెరుగైన ఫలితాన్ని సాధించడంపై కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు. భువన తండ్రి బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా తల్లి ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్‌గావ్యవహరిస్తుంది.

సాయిప్రశాంత్‌రెడ్డికి 95వ ర్యాంకు


సాయిప్రశాంత్‌రెడ్డి

ఇల్లందకుంట(హుజూరాబాద్): ఇల్లందకుంట మండలకేంద్రానికి చెందిన కాంతాల మల్లారెడ్డి– రజిత దంపతుల కుమారుడు కాంతాల సాయిప్రశాంత్‌రెడ్డి గ్రూప్– 2 ఫలితాల్లో 95వ ర్యాంకు సాధించాడు. సామాన్య వ్యవసాయ కుటుంబానికి చెందిన సాయి ప్రశాంత్‌రెడ్డి గ్రూప్– 4 ఫలితాల్లో 777వ ర్యాంకుతో సత్తాచాటి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలో హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సాయి ప్రశాంత్‌రెడ్డి ఉత్తమ ర్యాంక్ సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


కూలీ కుటుంబం నుంచి...


మోదుంపల్లి మహేశ్వరి

మానకొండూర్: మానకొండూర్‌కు చెందిన మోదుంపల్లి మహేశ్వరి గ్రూప్–1 ఫలితాల్లో 456 మార్కులు సాధించింది. మోదుంపల్లి శంకరయ్య–శంకరమ్మ దంపతులకు కూతురు మహేశ్వరీ సంతానం. తండ్రి శంకరయ్య మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి శంకరమ్మ కూలీనాలి పనులు చేసుకుంటూ కూతురును చదివించింది.

ఆమె మాట్లాడితేనే టవర్ దిగుతా

- హైటెన్షన్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్
- మహిళ మాట్లాడటంతో కిందకు దిగిన యువకుడు


విద్యుత్ హైటెన్షన్ టవర్‌పై ఉన్న అజయ్

జ్యోతినగర్(రామగుండం): తనతో చనువుగా ఉన్న ఆమె ఇప్పుడు తనతో మాట్లాడడం లేదని, ఆమె మాట్లాడితేనే టవర్ దిగుతానని, లేదంటే దూకి ఆత్మహత్య చేసుకుంటానని బిహార్‌కు చెందిన వలసకూలీ గేదెం అజయ్ భీష్మించుకు కూర్చున్నాడు. మంగళవారం ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లోని హైటెన్షన్ విద్యుత్ టవర్ పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఉదయ్‌కిరణ్, ఏసీపీ రమేశ్, సీఐ ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసు అధికారులు మైక్‌సెట్ ద్వారా యువకుడిని సంప్రదించగా.. కొద్దిరోజులుగా ఆ యువతి తనతో మాట్లాడడం లేదన్నారు. స్పందించిన పోలీసులు యువతిని ఘటనా స్థలానికి తీసుకొచ్చి మైక్‌లో మాట్లాడించగా, అజయ్ టవర్ దిగాడు. పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మరోవైపు.. అజయ్ తనను కొంతకాలంగా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కాగా, పోలీసుల అప్రమత్తంగా వ్యవహరించి సదరు యువతిని సంఘటనా స్థలానికి తీసుకొచ్చి మాట్లాడించడంతో యువకుడి ప్రాణాలు దక్కాయి.


అజయ్‌ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బ్లాక్ మెయిల్ చేసిన ముగ్గురి అరెస్ట్

- రూ.80వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

మెట్‌పల్లి: ఇరిగేషన్ శాఖ మెట్‌పల్లి డివిజన్‌లో డీఈఈ లక్కంపల్లి అరుణోదయ్ కుమార్‌ను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఎస్సై అనిల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. రౌడీ షీటర్ బత్తుల భరత్, జెట్టి లక్ష్మణ్, రేంజర్ల అజయ్, ఎన్నం రమేశ్ ముఠాగా ఏర్పడి కొంతకాలంగా అక్రమదందాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. ప్రశ్నించిన వారిపై అట్రాసిటీ కేసు పెడతామంటూ బెదిరిస్తూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. గతనెల 12న రేంజర్ల అజయ్ రాజేశ్వర్‌రావు పేటలోని వరద కాలువ నుంచి అక్రమంగా మొరం తరలిస్తుండగా డీఈఈ తమ వర్క్ ఇన్‌స్పెక్టర్ లస్మయ్యతో కలిసి అక్కడకు వెళ్లి అడ్డుకున్నాడు. వెంటనే అజయ్ ఈ విషయాన్ని ఫోన్‌లో రమేశ్‌కు తెలపగా.. అతడు వచ్చి డీఈఈని దూషించడంతోపాటు అట్రాసిటీ కేసు పెట్టిస్తామని బెదిరించాడు. గత్యంతరం లేక డీఈఈ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత భరత్ డీఈఈకి ఫోన్ చేసి అట్రాసిటీ కేసు పెట్టకుండా ఉండాలంటే రూ.3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అలాగే జెట్టి లక్ష్మణ్ కూడా ఫోన్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలని, లేకుంటే చంపుతామని బెదిరించాడు. దీనికి భయపడిన డీఈఈ భరత్‌కు ఫోన్‌పే ద్వారా రూ.1.10లక్షలు, లక్ష్మణ్‌కు రూ.40వేలు నేరుగా అందించాడు. అయినా వినకుండా మిగతా డబ్బులు కూడా ఇవ్వాలంటూ తరచూ ఫోన్ చేసి బెదిరించసాగారు. వారి వేధింపులు భరించలేక డీఈఈ ఈనెల 6న ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషనలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటినుంచి పరారీలో ఉన్న నలుగురిలో భరత్, లక్ష్మణ్, అజయ్‌ని జిల్లా సరిహద్దు గండి హనుమాన్ ఆలయ సమీపంలో పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.80వేలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు రమేశ్ పరారీలో ఉన్నాడు. సర్కిల్ పరిధిలో పంచాయితీలు, సెటిల్‌మెంట్లు చేస్తూ ప్రజలను బెదిరింపులకు గురిచేయడం మానుకోవాలని, లేకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

క్లుప్తంగా

టౌన్ ఏసీపీ కార్యాలయం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న సీపీ

కరీంనగర్‌క్రైం: టౌన్ ఏసీపీ కార్యాలయాన్ని మంగళవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై సమీక్ష చేసి కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అర్బన్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సైబర్ నేరాల బారిన ప్రజలు పడకుండా అవగాహన పెంచాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై చర్చించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్‌స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్, జాన్‌రెడ్డి, శ్రీలతతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌ఈ

కొత్తపల్లి: కరీంనగర్ టౌన్–2 సబ్ డివిజన్ పరిధిలోని టౌన్ 7 సెక్షన్, టౌన్ 4 సెక్షన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు 100 కేవీఆర్ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్‌బాబు ప్రారంభించారు. వేసవిలో పెరుగుతున్న విద్యుత్ లోడ్‌ను అధిగమించేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డీఈటీ ఉపేందర్, టౌన్ డీఈ జంపాల రాజం, ఏడీఈ ఎం.లావణ్య, ఏఈలు ఎస్.భూమయ్య, కె.మల్లయ్య, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

'గాయత్రి' సేవలు అభినందనీయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

కరీంనగర్: గాయత్రి బ్యాంకు సేవలు అభినందనీయమని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బ్యాంకు ఖాతాదారుడు తిరుపతి ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా.. గాయత్రి నిర్భయ సేవింగ్స్‌పై గల ప్రమాద బీమా చెక్కును మృతి భార్య వెంకటలక్ష్మికి మంగళవారం అందజేశారు. బ్రాంచ్ మేనేజర్ గొట్టె అశోక్, సీనియర్ ఆఫీసర్ వేముల విష్ణుధర్, జూనియర్ ఆఫీసర్ ఉల్లెంగుల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత



కరీంనగర్‌రూరల్: తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సోమవారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు భయపడకుండా ఒత్తిడిని జయించినప్పుడే విజయం సాధిస్తారని అన్నారు. రాబోయే వార్షిక పరీక్షల్లో 9.8, ఆపై జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.2,016 నగదు పారితోషికం అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కరుణ, సంస్థ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, మన్‌సాయి, హిమసాయి, సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మాణాలు

- విలీన గ్రామాలపై పర్యవేక్షణ కరువు



వల్లంపహాడ్‌లో సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించిన బేస్‌మెంట్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయి. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎలాంటి సెట్‌బ్యాక్‌లు లేకుండానే గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రధానంగా తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. తీగలగుట్టపల్లి–గోపాల్‌పూర్ బైపాస్‌రోడ్డులో వల్లంపహాడ్ వద్ద ఓ వ్యక్తి సెట్‌బ్యాక్ లేకుండానే ఇంటి నిర్మాణం చేపట్టడం వివాదాస్పదంగా మారింది. ఈ రహదారి 33 అడుగులు వెడల్పు ఉండగా సదరు వ్యక్తి రోడ్డును ఆనుకుని బేస్‌మెంట్ నిర్మించారు. రోడ్డు మూలమలుపు వద్ద నిర్మించిన బేస్‌మెంట్‌తో వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారే అవకాశముంది. రోడ్డుకు ఆనుకుని ఉండటంతో ప్రమాదాలు కూడా జరిగే అవకాశముందని స్థానికులు పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గృహనిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి విలీన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

గడువులోగా పన్ను చెల్లించాలి



మహేందర్‌కు ఆస్తి పన్ను రశీదు అందిస్తున్న స్వరూపరాణి

కరీంనగర్ కార్పొరేషన్: ఈ నెలాఖరులోగా ఆస్తి, వాణిజ్య పన్నులు చెల్లించాలని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి అన్నారు. మంగళవారం కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం కన్వీనర్ దగ్గు మహేందర్ రాకేశ్ నుంచి ఆస్తి పన్ను కట్టించి, ప్రొసీడింగ్ అందజేశారు. ప్రతీ కాంట్రాక్టర్ ఇంటి పన్ను, నల్లా పన్ను చెల్లించేలా చూడాలని సూచించారు. మొండి బకాయిదారులపై కఠిన చర్యలుంటాయని తెలిపారు. నగరపాలకసంస్థ నుంచి అందే సౌకర్యాలు కూడా నిలిపివేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆ పరిస్థితి తెచ్చుకోవద్దని, పన్నులు సకాలంలో చెల్లించాలన్నారు.

ప్రాథమిక పాఠశాలల తనిఖీ



విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఈవో రవీందర్

కరీంనగర్‌రూరల్: ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసి (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంలో ఎంపిక చేసిన దుర్శేడ్, దుబ్బపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఎంఈవో కె.రవీందర్ సందర్శించారు. ఈనెల 10నుంచి 12వరకు రెండవ తరగతి విద్యార్థులకు అభ్యాసన పరీక్ష నిర్వహణలో భాగంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి చెందారు. అనంతరం చామనపల్లి జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం తయారు చేయించాలని ఇన్‌చార్జి ఉపాధ్యాయురాలు లక్ష్మిని ఆదేశించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రేణుకాదేవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచైతన్య పాఠశాల వార్షికోత్సవం



ఆర్డీవోకు స్వాగతం పలుకుతున్న పాఠశాల యాజమాన్యం

కరీంనగర్: నగర శివారులోని చింతకుంటలో గల శ్రీచైతన్య సీబీఎస్ఈ పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సభ అధ్యక్షుడిగా సీబీఎస్ఈ సీవో ఐపీఎల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ వ్యవహరించి ముఖ్య అతిథులను ఆహ్వానించి వేడుకలు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు సత్యనారాయణ, సత్యం, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, వరంగల్ జడ్జి విష్ణు, ఏసీబీ వెంకటస్వామి, ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్, ఆర్డీవో మహేశ్, కొత్తపల్లి ఎస్సై స్వాతి, డీఈవో జనార్దన్‌రావులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో జీఎం నాగేంద్ర, శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్లు సీమ, శ్రీవిద్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'చావా' సినిమా వీక్షణ



కరీంనగర్ కల్చరల్/కరీంనగర్‌టౌన్/విద్యానగర్: శంభాజీ మహారాజ్ బలిదాన దినోత్సవం సందర్భంగా ఆయనకు నివాళి అర్పిస్తూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మంగళవారం నగరంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు 'చావా' సినిమా చూపించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి మాట్లాడుతూ మొగలులు అధికారం కోసం తండ్రినే చంపారని, కానీ హిందూ స్వరాజ్యం కోసం తన తండ్రి ఛత్రపతి శివాజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు శంభాజీ చేసిన త్యాగం మరువలేనిదన్నారు.

వెల్‌డన్ తపస్వి



తపస్విని అభినందిస్తున్న కలెక్టర్

కరీంనగర్‌స్పోర్ట్స్: ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్ ఫూ పెద్దపల్లి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి టోర్నమెంట్‌లో బంగారు పతకం సాధించిన గంగాధర మండలం ఒద్యారం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని తపస్విని మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి తన కార్యాలయంలో అభినందించారు. వెల్‌డన్ అంటూ కొనియాడి భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో గంగాధర ఎంఈవో ప్రభాకర్‌రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీవేణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

వికసిత్ భారత్ 47లో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ పోర్టల్ ద్వారా ఏర్పాటు చేసిన యూత్ పార్లమెంట్ పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. యువత వన్ ఎలక్షన్ వన్ నేషన్ అనే అంశంపై మై భారత్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఒక నిమిషం వీడియో అప్లోడ్ చేయాలన్నారు. వికసిత్ భారత్ మోడల్ జిల్లా చైర్మన్ కలువకుంట రామకృష్ణ, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ రాంబాబు, అర్జున్, రాజేశం, ఎలిజబెత్ రాణి, పి తిరుపతి, రాపర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున బుధవారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు 11కేవీ ఐబీ ఫీడర్ పరిధిలోని ఐబీ చౌరస్తా, సర్కస్ మైదానం, పాత డీఐజీ భవనం, సీఎస్ఐ చర్చి, కోర్టు చౌరస్తా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ పి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

సమాచారం

నేటి నుంచి జాతీయ సెమినార్

కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నామని శాతవాహన యూనివర్సిటీ హెచ్‌వోడీ హరికాంత్ మంగళవారం తెలిపారు. డిజిటల్ పరివర్తన: స్థిరమైన వ్యాపార అభివృద్ధికి కీలకమైన ఉత్ప్రేరకం అనే అంశంపై చర్చించడానికి ప్రఖ్యాత నిపుణులు, అధ్యాపకులు, రిసెర్చ్ స్కాలర్స్ పాల్గొంటున్నారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలచారి తెలిపారు. లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి, వోల్టేజీ హెచ్చుతగ్గులు, లోపాలున్న మీటర్ల మార్పిడి, కొత్త సర్వీసుల మంజూరు, సర్వీసు పేరు మార్పిడి, కేటగిరి మార్పు తదితర సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వివరించారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే సదస్సును వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

13న యూడీఐడీ కార్డుపై అవగాహన సదస్సు

విద్యానగర్(కరీంనగర్): దివ్యాంగులకు సంబంధించిన యూడీఐడీ కార్డుపై ఈనెల 13న కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం 11గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె.సబిత కుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయస్థాయి దాయ్ ఆఖర్ లెటర్ రైటింగ్ పోటీల్లో తృతీయస్థానం



పెంటయ్య

సప్తగిరికాలనీ(కరీంనగర్): భారతీయ తపాలా శాఖ జాతీయస్థాయిలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి దాయ్ ఆఖర్ లెటర్ రైటింగ్ పోటీల్లో కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దామ పెంటయ్య తృతీయస్థానంలో నిలిచారు. భారతీయ పౌరులు ఒక నిర్దిష్ట అంశంపై రాసిన లేఖకు తృతీయస్థానంతో పాటు రూ.5 వేలు నగదు గెలుచుకున్నారు. ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలోని గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నేటి సమాజంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్తరాలు రాస్తూ డిజిటల్ టెక్నాలజీని అవసరమైనంత మేరకే వాడుకోవాలని అన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన సీపీ



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన గౌస్ ఆలం మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పెండింగ్ కేసుల విషయంపై చర్చించారు.



కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ 9వ డివిజన్ పరిధిలోని అలకాపురికాలనీ నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తాకు వెళ్లే దారి మూలమలుపులో గుంత, విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారాయి. గతేడాది తవ్విన గుంతను అలాగే వదిలి వేయడంగా.. రోడ్డుకు అడ్డుగా ఉన్న స్తంభాన్ని కూడా తొలగించడం లేదు. సంవత్సర కాలంగా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నగరపాలకసంస్థ అధికారులు చర్యలు తీసుకొని గుంతను పూడ్చి, స్తంభాన్ని సరిచేసి ఈ రోడ్డును మెయిన్ రోడ్డుకు కలపాలి.

– దుంపేటి రాము, అలకాపురికాలనీ

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
వెంకటేశ్వర్లు, డీఈ, 89199 23123

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 94400 77555

ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టం తేవాలి



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కరీంనగర్: శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకొస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ఇచ్చిన ప్రతీ ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టానికి రూపకల్పన చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష మంగళవారంకు మూడో రోజుకు చేరుకుంది. గత నోటిఫికేషన్లకు వర్గీకరణ వర్తింపజేస్తామని ఆగస్టు 1న అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. ఒకవైపు ఎస్సీ వర్గీకరణ చట్టం వస్తుందని చెప్తూనే మరోవైపు ఉద్యోగ పరీక్ష ఫలితాలు విడుదల చేయడం మాదిగలను ద్రోహం చేయడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అంజయ్య, రాజన్న, ఆంజనేయులు, శంకర్, బాబు, లక్ష్మణ్, మధునయ్య, మల్లేశం, వరలక్ష్మి, గౌతమ్, రాజు, అశోక్, కొమురయ్య, పోచయ్య, రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తూ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన పులి ప్రసన్న హరికృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మానవ వనరులు అభివృద్ధి చెందాలంటే విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాలకు అధిక నిధులు కేటాయించాలన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు తమ బడ్జెట్‌లో 14శాతం నిధులు విద్యారంగానికి కేటాయిస్తుంటే మన రాష్ట్రంలో గత ప్రభుత్వాలు కేవలం 6.6శాతం కేటాయించాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం గతేడాది బడ్జెట్‌లో ఒక శాతం పెంచి 7.76 కేటాయించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు వాష్‌రూమ్‌లకు వెళ్లాలంటే క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. మానవ వనరుల అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి



సర్వే చేస్తున్న ఐద్వా నాయకురాళ్లు

కరీంనగర్: నగరంలోని స్థానిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి డిమాండ్ చేశారు. నగరంలోని పలు వార్డుల్లో మంగళవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోతిరాంపూర్‌లోని పోచమ్మవాడలో వీధి కుక్కలు విపరీతంగా విహరిస్తుండటంతో రోడ్డుపై నడవాలంటే భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని తెలిపారు. కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్‌పై ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో మంచినీరు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తడుపుల ఎల్లమ్మ, బానోత్ రాజమణి, రామంచ స్రవంతి, శాంతమ్మ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ స్కిల్స్‌పై అవగాహన



కరీంనగర్: నగరంలోని కిమ్స్ డిగ్రీ పీజీ కళాశాల, కిమ్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలల విద్యార్థులకు మంగళవారం 'ధ్రువ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్' హైదరాబాద్ ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్ స్కిల్స్‌పై అవగాహన కల్పించారు. మేనేజ్‌మెంట్ రంగంలో ఏ విధంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించాలి, స్కిల్స్‌ను ఏ విధంగా పెంచుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కిమ్స్ కళాశాల వైస్ చైర్మన్ పేర్యాల సాకేత్‌రామారావు, పి.రంగారెడ్డి, వావిలాల వెంకట్, ప్రిన్సిపాల్స్ బి.అర్జున్‌రావు, గౌతమ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



సప్తగిరికాలనీ(కరీంనగర్): స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎలగందల్ మోడల్ స్కూల్, అరెపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు రీసోర్స్‌పర్సన్లు కేఎస్ అనంతచార్య, మాడిశెట్టి గోపాల్‌లు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చారు. వర్మీ కంపోస్టు తయారీ విధానం, ఉపయోగం, సీడ్స్ బాల్ ఆవశ్యకతను వివరించి వాటిని తయారు చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు అనిత, శ్రీలక్ష్మి, నరేశ్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కుంట శిఖంలో సబ్‌స్టేషన్ నిర్మాణం

- విద్యుత్ అధికారులపై ఇరిగేషన్ ఈఈ ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాలతో ఆర్ఐ విచారణ



సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం తవ్విన గుంతలు



విద్యుత్ అధికారులు తాత్కాలికంగా వేసిన రేకుల షెడ్

కరీంనగర్‌రూరల్: చెరువులు, కుంటల పరిరక్షణకు కృషి చేయాల్సిన ప్రభుత్వ అధికారులే దౌర్జన్యంగా ఊరకుంటశిఖం ఆక్రమించుకుని విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టడం వివాదాస్పదంగా మారింది. ప్రజా అవసరాల పేరిట నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌కు ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇరిగేషన్ అధికారులు కుంటశిఖంలో అక్రమ నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ నిర్మాణపు పనులు కొనసాగిస్తున్నారు. మంగళవారం ఆర్ఐ మోఖాపై పరిశీలించి పనులు నిలిపి వేయించినప్పటికీ సాయంత్రం తిరిగి ప్రారంభించడం గమనార్హం.

తీగలగుట్టపల్లిలోని ఊరకుంటలో..

కరీంనగర్ కార్పొరేషన్‌లో విలీనమైన తీగలగుట్టపల్లిలోని సర్వేనం.215లో 8 ఎకరాల విస్తీర్ణంలో ఊరకుంట ఉంది. ప్రధాన రహదారిని ఆనుకుని ఉండటంతో ఇప్పటికే శిఖం స్థలాన్ని పలువురు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈక్రమంలోనే శిఖం స్థలంలో నాలుగు రోజుల నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారు. 2023లో అప్పటి మంత్రి గంగుల కమలాకర్ 132/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అయితే రెండేళ్ల నుంచి ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టని విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్ నాలుగురోజుల క్రితం కుంటశిఖంలో పనులు ప్రారంభించం వివాదాస్పదమైంది. సబ్‌స్టేషన్ నిర్మాణంపై విద్యుత్‌శాఖ ఎస్ఈతో పాటు ఇరిగేషన్ ఉన్నతాధికారులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మూల వెంకట రవీందర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అయితే ఇరిగేషన్ అధికారులు పనులు అడ్డుకున్నప్పటికీ ప్రజా అవసరాల కోసం సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామంటూ విద్యుత్ శాఖ అధికారులు దౌర్జన్యంగా పనులు కొనసాగించారు. దీంతో ఇరిగేషన్ ఈఈ నాగభూషణ్‌రావు సోమవారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాస్, కాంట్రాక్టర్ రఘులు అక్రమంగా కుంటశిఖంలో సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేశారు. కుంటశిఖం స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు స్టేటస్ కో ఉండగా విద్యుత్ అధికారులు సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారని వివరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆర్ఐ కనకరాజు సబ్‌స్టేషన్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. కుంటశిఖంలో ఎలాంటి నిర్మాణ పనులు చేయవద్దంటూ విద్యుత్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు నిలిపివేయించినట్లు ఆర్ఐ కనకరాజు తెలిపారు.

బీసీ స్టడీ సర్కిల్ అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం



భోజనం వడ్డిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని 9వ డివిజన్ పరిధిలో ఉన్న బీసీ స్టడీసర్కిల్‌లో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన వసతి కల్పించారు. గతంలో నగరపాలకసంస్థ నుంచి మధ్యాహ్నం భోజనం అందించగా, కొంతకాలంగా నిలిపివేయడంతో మాజీ కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్ లయన్స్ క్లబ్‌ను ఆశ్రయించారు. దీంతో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. రెండు నెలల పాటు భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మక్కా శరత్, సెక్రెటరీ శ్రీకాంత్, పీడీజీ చిదుర సురేశ్, మునిపల్లి ఫణిత, పెద్ది విద్యాసాగర్, ఎలగందుల మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...



కేసీఆర్‌ను కలిసిన శ్రవణ్

సాక్షి, హైదరాబాద్: తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన నేపథ్యంలో నామినేషన్ అనంతర స్క్రూటినీ కార్యక్రమాన్ని ముగించుకున్న దాసోజు శ్రవణ్.. మంగళవారం బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను కుటుంబ సమేతంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు.

నేడు సీఎల్పీ భేటీ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభాపక్షం (సీఎల్పీ) బుధవారం సమావేశం కానుంది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారని సీఎల్పీ వర్గాలు వెల్లడించాయి.

ఈనెల 27న పోలవరం ముంపుపై సమావేశం

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణ భూభాగంలో ఉన్న ముంపు ప్రభావంపై చర్చించడానికి ఈనెల 27 మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) కార్యాలయంలో ఏపీ, తెలంగాణలతో సమావేశం నిర్వహించనున్నట్టు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) తెలిపింది. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావంపై 2022, సెప్టెంబర్ 22న సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల అమలులో భాగంగా ఈ సమావేశం నిర్వహించనున్నట్టు పీపీఏ సభ్యకార్యదర్శి ఎం.రఘురామ్ మంగళవారం రెండు రాష్ట్రాలకు లేఖరాశారు.

మోదీ అసలైన కోవర్టు, ఫేవరెట్ కేసీఆరే..

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: దేశ ప్రధాని మోదీకి అసలైన కోవర్టు, ఆయన ఫేవరెట్ తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆరేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. తెలంగాణకు ఏమీ వద్దు.. మీ ప్రేమ ఉంటే చాలని మోదీకి ప్రేమలేఖలు రాసింది కూడా కేసీఆరేనన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం తెచ్చిన అన్ని బిల్లులకు మద్దతిచ్చింది కేసీఆర్ కాదా?, రాష్ట్రపతి అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు మద్దతిచ్చింది బీఆర్‌ఎస్ కాదా? అని ప్రశ్నించారు.

కృష్ణా ప్రాజెక్టులపై రెండో విడత టెలిమెట్రీ

సాక్షి, హైదరాబాద్: కృష్ణా పరీవాహకం పరిధిలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల నుంచి రెండు రాష్ట్రాలు జరుపుతున్న నీటి వినియోగాన్ని కచ్చితంగా లెక్కించడానికి రెండో విడత కింద టెలిమెట్రీ సిస్టమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) వెల్లడించింది. గత జనవరి 21న జరిగిన 19వ కృష్ణా బోర్డు సమావేశం తీసుకున్న నిర్ణయం మేరకు.. రెండో విడత టెలిమెట్రీ వ్యవస్థ ఏర్పాటుకు చెరో రూ.7 కోట్లను విడుదల చేయాలని కృష్ణా బోర్డు సభ్యుడు డీఎం రాయిపూరే మంగళవారం రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖలకు లేఖ రాశారు.

సీతారామ అంచనాల పెంపుపై ఆర్థిక శాఖ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు వ్యయ అంచనాలకి సంబంధించిన అన్ని వివరాలను సమర్పించాలని నీటిపారుదల శాఖను రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. ప్రాజెక్టు అంచనాలను రూ.13,057 కోట్ల నుంచి రూ.19,324 కోట్లకు పెంచాలనే ప్రతిపాదనలను ఇటీవల మంత్రివర్గం ఆమోదించకుండా, రాష్ట్ర ఆర్థిక శాఖ పరిశీలనకు పంపాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో రామకృష్ణారావు మంగళవారం జలసౌధలో నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్‌తో సమావేశమై అంచనా వ్యయం పెంపునకు కారణాలను ఆరాతీశారు. రూ.7,926.14 కోట్ల అంచనాలతో సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి 2016, ఫిబ్రవరి 18న గత ప్రభుత్వం పరిపాలనాపర అనుమతులు జారీ చేయగా, 2018లో అంచనాలను రూ.13,057 కోట్లకు పెంచింది. తాజాగా మళ్లీ ఎందుకు పెంచాల్సి వచ్చింది అనే అంశాన్ని రామకృష్ణారావు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలను ప్యాకేజీల వారీగా అందించాలని, పనులు జరిగిన కాంపోనెంట్లకి సంబంధించిన ఫొటోలు, వీడియోలను కూడా సమర్పించాలని కోరినట్టు తెలిసింది. 67.5 టీఎంసీల గోదావరి జలాలను తరలించి ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో 4.15 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 3.89 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం చేపట్టిన ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే రూ.10 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారు.

అనుభవం, జ్ఞానం లేదు.. కామన్‌సెన్స్ వాడరు

▶ మొదటి పేజీ తరువాయి

బడ్జెట్ ప్రతిపాదనలను లోతుగా అధ్యయనం చేయండి. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వివిధ శాఖల మంత్రులుగా పనిచేసినవారు మన పార్టీ తరఫున ఉభయ సభల్లోనూ ఉన్నారు. వారు 'షాడో కేబినెట్'లా వ్యవహరించి పద్దులపై చర్చ సందర్భంగా బడ్జెట్ ప్రతిపాదనల్లోని డొల్లతనాన్ని ఎండగట్టాలి..'' అని కేసీఆర్ స్పష్టం చేశారు. తాగు, సాగునీటి కష్టాలతోపాటు రుణమాఫీ, రైతు భరోసా, విద్యుత్ కోతలు, వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోతుండటం, ఎండుతున్న పంటలు వంటి రైతాంగ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలతో వివిధ రంగాల్లో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం, బడ్జెట్ ప్రతిపాదనలు, పద్దులు, ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ఎత్తిచూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై నెలకొన్న ప్రజావ్యతిరేకతకు సోషల్ మీడియా అద్దం పడుతోందని, నిజానికి అంతకంటే ఎక్కువ వ్యతిరేకత క్షేత్రస్థాయిలో నెలకొందని పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, సబిత, హరీశ్‌రావు, మధుసూదనాచారి, బండ ప్రకాశ్, కేటీఆర్, తలసాని

నలుగురు సభ్యులు గైర్హాజరు

బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష భేటీకి నలుగురు సభ్యులు ముందస్తు సమాచారం ఇచ్చి గైర్హాజరు అయ్యారు. వ్యక్తిగత పనులతో తాము సమావేశానికి రాలేకపోతున్నట్టు తెలిపారు. గైర్హాజరైన వారిలో ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్ రెడ్డి, అనిల్‌జాదవ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఉన్నారు.

దాదాపు 25 అంశాలపై దిశానిర్దేశం

సుమారు మూడు గంటల పాటు సాగిన బీఆర్‌ఎస్ ఎల్పీ సమావేశంలో కేసీఆర్ దాదాపు 25 అంశాలకు సంబంధించి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. బీసీ, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లులు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు, డీఏలు, పీఆర్సీ తదితరాలపై గొంతు వినిపించాలని సూచించారు. మహిళలు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, వైద్యరంగంలో దిగజారిన ప్రమాణాలు, దళిత బంధు నిలిపివేత, గొర్రెలు, చేపపిల్లల పంపిణీ, ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం వంటి అంశాలు ప్రస్తావించాలన్నారు. ఏపీ నదీ జలాల చౌర్యం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, ప్రభుత్వ బిల్లుల చెల్లింపులో 20శాతం కమిషన్ల ఆరోపణలు, పరిశ్రమల ఏర్పాటుకు బలవంతపు భూసేకరణ వంటి అంశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. కేంద్రం నుంచి నిధుల సాధన, కులగణనలో తప్పులు, బెల్ట్‌షాపుల తొలగింపు, ఎల్‌ఆర్‌ఎస్, మేడిగడ్డ పునరుద్ధరణ వంటి అంశాల్లో ప్రభుత్వ వైఖరిని నిలదీయాలని దిశానిర్దేశం చేశారు.

నేడు అసెంబ్లీకి కేసీఆర్

బుధవారం నుంచి ప్రారంభమవుతున్న అసెంబ్లీ సమావేశాలకు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. ఆయన మంగళవారం ఉదయం ఎర్రవల్లి నివాసం నుంచి వచ్చి తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ శాసనసభాపక్ష భేటీలో పాల్గొన్నారు. అనంతరం నందినగర్‌లోని నివాసానికి చేరుకున్నారు. మూడు రోజుల పాటు ఆయన ఇక్కడే ఉంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం లేదా ద్రవ్య వినిమయ బిల్లుపై జరిగే చర్చలో కేసీఆర్ పాల్గొనే అవకాశం ఉందని వెల్లడించాయి.

బీఆర్‌ఎస్‌కు డిప్యూటీ లీడర్లు

ప్రస్తుతం అసెంబ్లీలో బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష నేతగా, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ వ్యవహరిస్తుండగా.. శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఎమ్మెల్సీ మధుసూదనాచారి వ్యవహరిస్తున్నారు. గత అసెంబ్లీ సమావేశాల సమయంలో శాసనసభలో బీఆర్‌ఎస్ విప్‌గా ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మండలిలో విప్‌గా సత్యవతి రాథోడ్‌ను కేసీఆర్ నియమించారు. తాజాగా ఉభయ సభల్లో బీఆర్‌ఎస్ సభ్యులను సమన్వయం చేసేందుకు డిప్యూటీ లీడర్లను నియమిస్తున్నట్టు కేసీఆర్ వెల్లడించారు. శాసనసభలో పార్టీ డిప్యూటీ లీడర్‌గా మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, గంగుల కమలాకర్, మండలిలో ఎల్.రమణ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. గతంలో బీఆర్‌ఎస్ శాసనసభాపక్ష ఉప నేతగా, శాసనసభ వ్యవహారాల మంత్రిగా, రెండు దశాబ్దాలుగా ఎమ్మెల్యేగా సుదీర్ఘ అనుభవం ఉన్న హరీశ్‌రావు డిప్యూటీ లీడర్‌గా ఎంపికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.

14 నెలలైనా.. హామీల అమలులో అదే కాలయాపన

- రూ.1.5 లక్షల కోట్లు కావాలని కేంద్రానికి లేఖ రాయడం చిన్నపిల్లల నవ్వులాటలా ఉంది
- నన్ను ఎవరు తిట్టినా వారి విజ్ఞతకే వదిలేశాను : కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు 6 గ్యారంటీలు ప్రకటించి, అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఆ హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే పార్టీ బీజేపీ అని, తాము చేయలేకపోయిన హామీలను ఇంకొకరి మీద వేసి, వారు అడ్డుకుంటున్నారు అని ఎప్పుడూ ఎవరినీ నిందించలేదని పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డిని కిషన్‌రెడ్డి విమర్శించారు. కొత్త ప్రాజెక్టుల పేరు మీద రూ. 1.5 లక్షల కోట్లు కావాలి అంటూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం చిన్నపిల్లల నవ్వులాటలా ఉందని ఎద్దేవా చేశారు. ఆర్థిక వనరులకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని కిషన్‌రెడ్డి సూచించారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీలోని తన నివాసంలో భారతీయ పురాతన చేతివృత్తుల వైభవాన్ని గుర్తుచేస్తూ రచించిన 'వూట్జ్: ద ఫర్‌గాటెన్ మెటల్ క్రాఫ్ట్ ఆఫ్ డెక్కన్'పుస్తకాన్ని కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, తన వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రజల దృష్టి మళ్లించడానికి కొత్త ప్రాజెక్టుల రూపకల్పన చేసి కేంద్ర ప్రభుత్వాన్ని డబ్బులు అడుగుతున్నారని విమర్శించారు. ఇది దివాలాకోరు విధానం, బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో రూ. 7.5 లక్షల కోట్లు అప్పు చేసిందని, తమకు తెలియదని, రాష్ట్ర అప్పు రూ.3.5 లక్షల కోట్లే అనుకున్నానని రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి తప్పుబట్టారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోతున్నానని, హామీలు అమలు చేయలేకపోతున్నానంటూ ముఖ్యమంత్రి మాట మార్చడం రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అసమర్థతకు అద్దం పడుతోందని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డుకు తామే హామీ ఇచ్చామని, తప్పకుండా అమలు చేస్తామని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. బుధవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసా, మహిళలకు ఇచ్చిన హామీలు, జాబ్ కేలండర్, నిరుద్యోగ భృతి, రైతులు, కౌలు రైతులకు ఆర్థిక సహాయం, పెన్షన్లు సహా ఇచ్చిన అన్ని హామీల గురించి ప్రస్తావిస్తామన్నారు. వీటన్నింటి గురించి శాసనసభలో చర్చిస్తే బాగుంటుందని కిషన్ రెడ్డి సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 14 నెలల్లో రాష్ట్రాన్ని దోపిడీ చేశారని, రియల్టర్లను వేధిస్తున్నారని మండిపడ్డారు. ఓడిపోతామన్న భయంతోనే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో తనపై వ్యక్తిగత విమర్శలు చేశారన్నారు. తనను ఎవరు తిట్టినా వారి విజ్ఞతకే వదిలేస్తానని చెప్పారు.

సర్కార్ వైఫల్యాలు ఎండగట్టాలి

- కేంద్రం ఇచ్చిన నిధులపై వివరించాలి
- బీజేఎల్పీ నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ హామీలు, వాగ్దానాల అమల్లో వైఫల్యాలను అసెంబ్లీ వేదికగా ఎండగట్టాలని బీజేపీ శాసనసభాపక్షం (బీజేఎల్పీ) నిర్ణయించింది. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాల కింద అందజేసిన నిధులు, గ్రాంట్ల వివరాలను తెలియజేయాలని భావిస్తోంది. రాష్ట్రానికి పథకాలు రాకుండా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారన్న సీఎం రేవంత్ రెడ్డి విమర్శలను గణాంకాలతో తిప్పికొట్టాలని యోచిస్తోంది. బుధవారం శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో గవర్నర్ ప్రసంగం ముగిశాక బీజేఎల్పీ భేటీ అయ్యి సభలో లేవనెత్తే అంశాలను చర్చించనుంది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలు ఏమైంది, 420 హామీలు ఏమాయ్యాయి. 2025-26 రాష్ట్ర బడ్జెట్‌ను వాస్తవ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగానే ప్రవేశపెట్టాలి గానీ లక్షల కోట్లు అంటూ గొప్పలకు పోవద్దని ప్రభుత్వానికి సూచించాలని భావిస్తోంది. గత 15 నెలల కాలంలో ప్రభుత్వం చేసిన అప్పులు, వాటిని ఏమేరకు రాష్ట్ర ప్రయోజనాల సాధనకు ఖర్చుచేశారన్న దానిపై ప్రశ్నించనుంది.

కేసీఆర్‌కు జీతభత్యాలు నిలిపివేయాలి

అసెంబ్లీ స్పీకర్‌కు కాంగ్రెస్ నేతల వినతి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హోదాలో కేసీఆర్‌కు ఇస్తున్న జీతభత్యాలను వెంటనే నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు ఆ పార్టీ నేతలు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, అల్లం భాస్కర్, జగన్‌లాల్ నాయక్, కె.సునీల్, ఎం.ఎస్.గౌడ్ తదితరులు మంగళవారం అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బాధ్యతగల ప్రతిపక్ష హోదాలో కేసీఆర్ విధులు నిర్వర్తించడం లేదని పేర్కొన్నారు. కేసీఆర్ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేంత వర కు.. ఆయన జీతభత్యాల నిలిపివేతకు చర్యలు తీసుకోవాలని ఆ వినతిపత్రంలో కోరారు.

సబ్ ఇంజనీర్ల రిక్రూట్‌మెంట్‌లో అక్రమార్కులు!

టీజీ ఎన్పీడీసీఎల్‌లో 24 మంది అక్రమంగా ఉద్యోగాల్లో చేరారని గుర్తించిన ప్రత్యేక కమిటీ

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్(తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ) పరిధిలో సబ్ ఇంజనీర్ల రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయి. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు పోస్టులు భర్తీ చేయకపోవడంతోపాటు, భర్తీ చేసిన వాటిలో కూడా అక్రమాలకు పాల్పడ్డట్టు విచారణలో వెలుగుచూసింది. సబ్ ఇంజనీర్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు జరిగాయని, అర్హులైన అభ్యర్థులు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాపాలనలోనూ ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో గత పాలక మండలికి అక్రమాలు జరిగినట్టు ఉద్యోగావకాశం కోల్పోయిన అభ్యర్థులు మొరపెట్టుకున్నా.. పట్టించుకోలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో టీజీ ఎన్పీడీసీఎల్ పాత పాలకమండలిని రద్దు చేసింది. ఐఏఎస్ అధికారి కర్నాటి వరుణ్‌రెడ్డిని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా, సీనియర్ సీజీఎంలను ఇన్‌చార్జ్ డైరెక్టర్లుగా నియమించింది. ఈ కమిటీ రాగానే అర్హులై ఉద్యోగావకాశాలు కోల్పోయిన అభ్యర్థులు ప్రస్తుత సీఎండీని కలిసి వినతిపత్రం అందించి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. దీనికితోడు ప్రజాపాలనలో ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణకు చేపట్టారు. టీజీ పీఎస్ఎస్‌సీకి చెందిన ఒక అధికారి, టీజీ ఎస్పీడీసీఎల్, టీజీ ఎన్పీడీసీఎల్ నుంచి ఇద్దరేసి అధికారులతో ప్రత్యేక విచారణ కమిటీ వేశారు. ఈ కమిటీ నియామకాలు జరిగిన ప్రక్రియ మొత్తాన్ని వడపోసింది. చివరకు అక్రమాలు జరిగినట్టు తేల్చింది. విచారణలో తేలిన అక్రమాలపై మరో రెండు సంస్థల ద్వారా క్రాస్ చెక్ చేసుకున్నారు. దీంతో 24 మంది నియామకం అక్రమంగా జరిగినట్టు, అర్హత లేని వారిని నియమించినట్టు విచారణ కమిటీ తేల్చింది.

అభిషేక్ మహంతికి దక్కని ఊరట

కేంద్రం ఉత్తర్వులపై స్టేకు క్యాట్ నిరాకరణ

సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంశాఖ ఉత్తర్వుల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో చేరాలని ఐపీఎస్ అభిషేక్ మహంతికి పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) మంగళవారం సూచించింది. కేంద్ర ప్రభుత్వంతో పాటు ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ, విచారణ వచ్చే నెలకు వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. విభజన సమయంలో మహంతిని ఏపీకి కేటాయించారు. కేటాయింపుల అంశంపై గతంలో క్యాట్ ఇచ్చిన ఆర్డర్ సాయంతో తెలంగాణలో కొనసాగుతున్నారు. ఇలా రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించినా కొందరు ఐపీఎస్‌లు తెలంగాణలోనే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో పనిచేస్తోన్న ఏపీ కేడర్ అధికారులు అంజనీకుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతి వెంటనే ఏపీకి వెళ్లేలా రిలీవ్ చేయాలని ఫిబ్రవరి 21న తెలంగాణను కేంద్ర హోంశాఖ ఆదేశించింది. దీంతో 22న తెలంగాణ సర్కార్ అంజనీకుమార్, అభిలాష బిస్త్‌ను రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా అభిషేక్ మహంతిని కొనసాగించింది. ఎన్నికలు ముగియడంతో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న మహంతిని గత వారం తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఈ నేపథ్యంలో తనను తిరిగి తెలంగాణకు కేటాయించాలని కోరుతూ మరోసారి క్యాట్‌ను ఆశ్రయించారు. తన శాశ్వత స్థానికత హైదరాబాద్ అని, 2010 సివిల్స్ సర్వీసెస్ పరీక్షల సమయంలోనూ తెలంగాణ అనే దరఖాస్తులో పేర్కొన్నానని పిటిషన్‌లో తెలిపారు. ఈ పిటిషన్‌పై జ్యుడీషియల్ సభ్యురాలు డాక్టర్ లతా బస్వరాజ్ పట్నే, పరిపాలన సభ్యురాలు శాలిని మిశ్రా ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్ర ఉత్తర్వులపై వెంటనే స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. ప్రతివాదుల వాదనలు కూడా విని తీర్పు వెలువరిస్తామని, అప్పటివరకు ఏపీలో చేరాలని సూచించింది. కేడర్ అంశంపై బ్యాచ్ ఆఫ్ పిటిషన్లు ఉన్నందున అన్నింటిలో తీర్పు వెలువరిస్తామని తెలిపింది.

రాష్ట్ర బడ్జెట్ రూ. 3.20 లక్షల కోట్లు?

▶ మొదటి పేజీ తరువాయి

సమన్వయంతో వ్యవహరించేలా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇప్పటికే ముందస్తు సమావేశాలు నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో నిరసనలు, ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.

ఎవరి వ్యూహం వారిదే..

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల కోసం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీలతోపాటు ఎంఐఎం, సీపీఐ సిద్ధమయ్యాయి. గత ఏడాది కాలంలో రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించడమే ప్రధాన ఉద్దేశంగా ఈసారి అధికార కాంగ్రెస్ అసెంబ్లీని వేదికగా చేసుకోనుంది. ముఖ్యంగా కులగణన, ఎస్సీల వర్గీకరణతోపాటు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు కోసం తీసుకున్న చర్యలు, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించేలా ప్రణాళికలు రచిస్తోంది. మరోవైపు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటోంది. ఆరు గ్యారంటీలు, కృష్ణా జలాలు, ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం, రాష్ట్రంలో కరువు పరిస్థితులు, తాగు, సాగునీటి కొరత తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్‌ఎస్ నిర్ణయించింది. ఇక బీజేపీ కూడా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలే టార్గెట్‌గా ఈసారి బడ్జెట్ సమావేశాలకు హాజరుకానుంది.

బడ్జెట్ పరిస్థితి ఏమిటి?

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ అంచనాలపై ఆసక్తి నెలకొంది. దేశవ్యాప్తంగా కనిపిస్తున్న ఆర్థిక మాంద్యంతోపాటు రాష్ట్ర సొంత పన్ను రాబడులు తగ్గిపోవడం, రిజిస్ట్రేషన్లు, జీఎస్టీ రాబడుల్లో తగ్గుదల, రెవెన్యూ రాబడులకు, ఖర్చుకు మధ్య భారీ తేడా ఉండటం, ప్రతిపాదిత బడ్జెట్ అంచనాలు, సవరించిన అంచనాలకు మధ్య రూ.50 వేల కోట్ల వరకు లోటు ఉండటం వంటివి కీలకంగా మారాయి. అయితే అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకుని వాస్తవిక బడ్జెట్‌ను రూపొందించినట్టు ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్ ప్రతిపాదించగా.. ఈసారి రూ.3.20 లక్షల కోట్ల వరకు ఉండవచ్చని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో బడ్జెట్ పరిమాణం తగ్గినా ఆశ్చర్యం లేదని కూడా ఆర్థిక శాఖ వర్గాలు చెబుతుండటం గమనార్హం. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు సంక్షేమ పథకాలకు పెద్ద మొత్తంలో నిధులు వ్యయం కానున్నాయి. ఫ్యూచర్ సిటీ, ఇందిరమ్మ ఇళ్లకు రూ.20 వేల కోట్లు, నీటిపారుదల రంగానికి రూ.19 వేల కోట్లు, విద్యుత్ రంగానికి రూ.14 వేల కోట్లు, రవాణాకు రూ.5,800 కోట్లు, పెన్షన్ల పెంపు అమలుకు మరో రూ.8 వేల కోట్లు కావాలి. యువ వికాసానికి రూ.6 వేల కోట్లు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు రూ.11,500 కోట్లు ఇస్తారని భావిస్తున్నారు.



లబ్ధిదారులతో కలిసి ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పొంగులేటి

అప్పులు తీరుస్తూనే.. సంక్షేమం

నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు: పొంగులేటి

వైరా రూరల్: గత ప్రభు త్వం చేసిన రూ.7.19 లక్షల కోట్ల అప్పులో నెలకు రూ.6,500 కోట్ల చొప్పున తీరుస్తూనే నిరంతరాయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా మని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఖమ్మం జిల్లా వైరా మండలంలోని పుణ్యపురంలో 109 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. గిరిజనులు ఎక్కువ ఉన్న ఈ నియోజకవర్గానికి కోటా కంటే ఎక్కువ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.54 లక్షల ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన నిరుపేదలందరికీ కేటాయిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం నిర్మించిన 1.50 లక్షల డబుల్ బెడ్‌రూం ఇళ్లు మొండిగోడలతో మిగిలిపోయాయని, వాటిని సైతం పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. ఈనెలాఖరు నాటికి పెండింగ్ రుణమాఫీ అమలు చేసి రైతు భరోసా అందిస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సమీప నదులు, వాగుల నుంచి ఇసుక తెచ్చుకుంటే పోలీసులు అడ్డుకోవద్దని మంత్రి పొంగులేటి ఆదేశించారు.



టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌తో ఎమ్మెల్సీ అభ్యర్థులు విజయశాంతి, అద్దంకి దయాకర్, కె.శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం

ఎమ్మెల్సీ అభ్యర్థులతో పీసీసీ అధ్యక్షుడి భేటీ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, మిత్రపక్షం సీపీఐల నుంచి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేషన్లు వేసిన అభ్యర్థులతో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ మధ్యాహ్న భోజన సమావేశం ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం హైదర్‌గూడలోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఎమ్మెల్సీ అభ్యర్థులు విజయశాంతి, అద్దంకి దయాకర్, కె.శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థులను సన్మానించిన మహేశ్‌గౌడ్.. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడంలో ముందుండాలని వారికి సూచించారు. మిత్రపక్షమైన సీపీఐకి సంపూర్ణ సహకారం అందించామని స్పష్టం చేశారు. ఇదే మైత్రి కొనసాగేలా ఆ పార్టీ సహకరించాలని మహేశ్‌గౌడ్ కోరారు.

ప్రధాన పార్టీ అభ్యర్థుల నామినేషన్లు ఓకే

- స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరణ
- ఏకగ్రీవం.. ప్రకటన లాంఛనం

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటాలో ఎన్నికకానున్న ఐదుగురు ఎమ్మెల్సీలకు సంబంధించి అధికార పార్టీ అభ్యర్థులు వేసిన నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థులు వేసిన నామినేషన్లను తిరస్కరించారు. కేవలం ఐదుగురు మాత్రమే ఎన్నిక కావడానికి అవకాశం ఉంది. అయితే స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసిన సాయన్న, చాలిక చంద్రశేఖర్, జాజుల భాస్కర్, భోజరాజ్ కోయల్కర్, శ్రీకాంత్ సిలివేరు స్వతంత్ర అభ్యర్థులుగా వేసిన నామినేషన్ల పత్రాలు పరిశీలనలో నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో వాటిని తిరస్కరిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి మంగళవారం ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థులు విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, సీపీఐ అభ్యర్థి సత్యం నెల్లికంటి, బీఆర్‌ఎస్ అభ్యర్థి దాసోజు శ్రవణ్ నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించారు. ఎమ్మెల్యే కోటాలో ఐదు స్థానాలకు ఐదుగురు అభ్యర్థులు బరిలో మిగలడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించడం లాంఛనంగా మారింది.

రెండోరోజూ శ్రీచైతన్య కళాశాలలపై ఐటీ రైడ్

సాక్షి, హైదరాబాద్/ఖమ్మం సహకారనగర్: ఆదాయపన్ను చెల్లింపులలో అవకతవకలపై ఆరా తీస్తున్న ఐటీ అధికారులు రెండో రోజూ దేశవ్యాప్తంగా శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన పలు కార్యాలయాల్లో సోదాలు చేపట్టారు. సోమవారం ఉదయం నుంచి ఏకకాలంలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న శ్రీచైతన్య కార్పొరేట్ కార్యాలయంతోపాటు, ఆంధ్రప్రదేశ్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లోని ప్రాంతీయ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందుకు కొనసాగింపుగా మంగళవారం సైతం రాత్రి వరకు సోదాలు కొనసాగాయి. శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ యలమంచిలి శ్రీధర్ మాదాపూర్‌లో నివాసం ఉండే విల్లాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేశారు. ఈ సందర్భంగా పలు కీలక పత్రాలు ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఖమ్మం టౌన్‌లో ఎన్టీఆర్ సర్కిల్ శ్రీ చైతన్య కాలేజీలో సోదాలు కొనసాగాయి. రెండు రోజుల సోదాల్లో భాగంగా పలుచోట్ల ఈ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి నగదు రూపంలో డబ్బులను తీసుకొని, పన్ను ఎగవేస్తున్నాయని గుర్తించినట్టు తెలిసింది. ఖమ్మం జిల్లాలోని శ్రీచైతన్య విద్యాసంస్థలకు సంబంధించి మెయిన్ బ్రాంచ్‌లో సోమవారం రాత్రి నుంచి తనిఖీలు మొదలయ్యాయి. ఏపీలోని శ్రీ చైతన్య విద్యాసంస్థ బాధ్యులే ఇక్కడా అదే పేరుతో విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

'కాళేశ్వరం' అప్పులను పునర్వ్యవస్థీకరించలేం

రాజ్యసభలో స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్) అప్పులను పునర్వ్యవస్థీకరించలేమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్ట్ కోసం స్పెషల్ పర్పస్ వెహికల్స్ (ఎస్పీవీ)ల కింద చేసిన అప్పులను పునర్వ్యవస్థీకరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రాజ్యసభలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు మంత్రి పంకజ్ చౌదరి రాతపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మించేందుకు ఏర్పాటు చేసిన ఎస్పీవీల ద్వారా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (పీఎఫ్‌సీ లిమిటెడ్), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) నుంచి నిధులను కాళేశ్వరం ప్రాజెక్టుకు సమకూర్చాయని పేర్కొన్నారు. ఇందులో పీఎఫ్‌సీ నుంచి రూ.37,737.11 కోట్లు, ఆర్ఈసీ నుంచి రూ.30,536.08 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అప్పుగా పొందిందన్నారు. కాగా, కేఐపీసీఎల్ అభ్యర్థన మేరకు ఆర్ఈసీ లిమిటెడ్ ఇప్పటికే 2024 డిసెంబర్ వరకు పనులు పూర్తి చేయడానికి సమయం పొడిగించిందని కేంద్రమంత్రి వెల్లడించారు. అప్పు పునర్వ్యవస్థీకరణలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గైడ్‌లైన్స్ ఆధారంగా... పీఎఫ్‌సీ/ఆర్ఈసీ లిమిటెడ్ నిబంధనలను పరిగణనలోకి తీసుకొని కేఐపీసీఎల్ అప్పులను స్టాండర్డ్ నుంచి సబ్ - స్టాండర్డ్‌కు తగ్గించవచ్చని పేర్కొంది. అయితే ఈ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) రుణ ఖర్చు ఆధారంగా, అప్పుల రేట్లను నిర్ణయిస్తాయని తెలిపారు. ఫైనల్‌గా ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత/మూసివేత తర్వాత వడ్డీ రేటుపై రాయితీని పరిగణించవచ్చని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు.



సహజ రంగులతో కూడిన డిజైన్లతో వస్త్రాలు

ఈ వర్ణం సహజం

వస్త్ర తయారీ ప్రక్రియలో రంగుల అద్దకం అంతర్భాగం. రంగులు వేసే పద్ధతులు ప్రాంతాన్ని బట్టీ మారుతుంటాయి. అయితే అసలు సమస్య... రసాయన రంగులతోనే. ఈ సమస్యకు పరిష్కారంగా జహీరాబాద్‌లోని దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) సహజ వర్ణాలకు పెద్ద పీట వేస్తోంది. మోదుగు, తంగేడు, నీలగిరి బెరడు... మొదలైన వాటి రంగులను దుస్తుల అద్దకంలో వాడేలా మహిళలకు శిక్షణ ఇచ్చింది.


రంగుల తయారీ దృశ్యం

రసాయన రంగులతో తయారైన దుస్తులు చర్మానికి హానికరంగా మారుతున్నాయి. కొందరికి రసాయన రంగుల బట్టలు అసలు పడవు. హానికరమైన రంగులతో ఒక్కోసారి చర్మ సంబంధిత క్యాన్సర్‌కు సైతం దారితీసే అవకాశాలుంటాయి. వీటిని అధిగమించేందుకు సహజసిద్ధమైన రంగులతో 'టై అండ్ డై' పద్ధతిలో కృషి విజ్ఞాన కేంద్ర (కేవీకే)తో కలిసి మహిళలకు శిక్షణ ఇస్తోంది దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ.

మిల్లెట్ సాగును ప్రోత్సహించే దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) సంస్థ ఇప్పుడు మారుమూల ప్రాంతాల్లోని మహిళల్లో రకరకాల నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

అందులో సహజ రంగులతో అద్దకం కళ కూడా ఒకటి.

ఈ టై అండ్ డై (అందమైన డిజైన్‌ల అద్దకం)లో ఉండే వివిధ రకాల పద్ధతులను గ్రామీణ మహిళలకు వివరిస్తున్నారు. లహరియ, చెవ్రాన్, ప్లీటింగ్, బండ్లింగ్, క్లిమ్పింగ్, బాందిని వంటి వివిధ రకాల 'టై అండ్ డై' పద్ధతులలో శిక్షణ ఇస్తున్నారు.

'మనకు నిత్యం అందుబాటులో ఉండే వాటితో రంగులు తయారు చేయడం, వాటితో బట్టలపై అద్దకం (టై అండ్ డై) నేర్చుకోవడం సంతోషంగా ఉంది. రంగుల తయారీ, అద్దకంపై ప్రతి దశలోనూ మాకు సులభంగా అర్థం అయ్యేలా చెప్పారు. మేము సొంతంగా డిజైన్‌లు చేయడం గర్వంగా ఉంది' అంటుంది శ్రీవాణి.


శ్రీవాణి


విజయలక్ష్మి

'చెట్ల వేర్లు, కాండం నుంచి రంగులు ఎలా తీయవచ్చు అనేది నేర్చుకున్నాను. ఆ రంగులను బట్టలకు ఎలా అద్దాలి అనే దాని గురించి శిక్షణ పొందాము. ఇలాంటి విధానం పర్యావరణానికి మేలు చేస్తుంది. హానికరమైన రసాయనాల కంటే ప్రకృతి సిద్ధమైన రంగులు ఎంతో మేలు' అంటుంది విజయలక్ష్మి.

దేశవ్యాప్తంగా వస్త్ర తయారీ పరిశ్రమలో సహజ రంగుల ప్రాముఖ్యత పెరుగుతోంది. ప్రతి ప్రాంతంలో వస్త్ర పరిశ్రమ తనదైన మూలాలను వెదుక్కుంటుంది. ఈ నేపథ్యంలో దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ చేపడుతున్న కార్యక్రమాలు ఒకవైపు ప్రకృతికి మేలు చేస్తున్నాయి. మరోవైపు మహిళలలోని సహజ సృజనాత్మకతకు మెరుగులు దిద్దుతున్నాయి.

– పాత బాలప్రసాద్, సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి


సృజన ప్లస్ ఉపాధి



కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నాను. మహిళల్లో స్వయం ఉపాధిని పెంపొందించడానికి వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. ఇందులో భాగంగా 'టై అండ్ డై'పై గ్రామీణ మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమం చేపట్టాం. ఈ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. మహిళలు ఉత్సాహంగా నేర్చుకోవడం సంతోషంగా ఉంది.

– హేమలత, శాస్త్రవేత్త

బెని'ఫిట్' కివి



కివి పండులో విలువైన ఫైబర్, విటమిన్‌లు ఉంటాయి. ఈ పండు వల్ల ప్రయోజనాలు :
- ఉబ్బరం తగ్గిస్తుంది
- గట్ బ్యాక్టీరియాకు ఉపయోగపడుతుంది
- సెరటోనిస్ హార్మోన్ ఉత్పత్తి పెరిగి హాయిగా నిద్రపడుతుంది
- బరువు తగ్గడానికి ఉపకరిస్తుంది
- రోగనిరోధక శక్తిని పెంచుతుంది.
- ఒమేగా ఫ్యాటీ అమ్లాల వల్ల చర్మం మృదువుగా తయారవుతుంది.
- ఎముకలు దృఢంగా ఉండడానికి ఉపయోగపడుతుంది
- మల బద్ధకం సమస్య లేకుండా చేస్తుంది.
- కివీలో ఉండే ఫైబర్ జీర్ణ ఆరోగ్యానికి ఉపకరిస్తుంది
- శరీరం కోల్పోయిన నీటిని అందించడంలో కివీలోని విటమిన్‌లు సి, ఇ, పొటాషియం... ఉపయోగపడతాయి.

బ్యూటిప్



వేసవిలో డియోడరెంట్లు లేదా బాడీ స్ప్రేలు వాడని వారు దాదాపుగా ఉండరు. డియోడరెంట్ వాడే వారు రెగ్యులర్‌గా అండర్ ఆర్మ్స్‌ని స్క్రబ్ చేయాలి. దీనివల్ల అక్కడ పేరుకుపోయిన మురికి, పాత డియోతాలుకు అవశేషాలన్నీ పోతాయి. చర్మ సమస్యలు కూడా రాకుండా ఉంటాయి. కాబట్టి, రెగ్యులర్‌గా స్క్రబ్ చేయాలి. అదేవిధంగా, స్నానానికి మంచి బాడీ వాష్‌ని యూజ్ చేయాలి. దీనివల్ల చెమట వల్ల వచ్చే బ్యాక్టీరియా దూరమవుతుంది.

స్లిప్పేజ్

అమెరికాలో విడాకుల లాయర్‌గా పేరుబడిన జేమ్స్ శాక్స్టన్. విడాకులు పెరగడానికి కారణం 'స్లిప్పేజ్ అన్నాడు. పెళ్లయిన కొన్నాళ్ల తర్వాత భార్యాభర్తలు ఒకరినొకరు పట్టించుకోక చూపే లెక్కలేనితనాలే ఒకనాటికి 'విడాకులు'గా మారుతున్నాయని హెచ్చరించాడు. 'నా ఉద్యోగం, పిల్లలు, సంపాదన... వీటన్నింటి కన్నా ముందు నువ్వే నాకు ముఖ్యం' అని భార్య/భర్త ఒకరికొకరు తరచూ చెప్పకోకపోతే చర్యలతో చూపకపోతే విడాకులకు దగ్గరపడ్డట్టే అంటున్నాడు. స్లిప్పేజ్ లక్షణాలు మీలో ఉన్నాయా?



జాగ్రత్త పడకుంటే విడాకులే

ఒకరోజు ఉదయాన్నే మీరు బట్టలు ధరిస్తుంటే అవి బిగుతుగా కనబడతాయి. వేసుకోవడానికి పనికి రానట్టుగా ఉంటాయి. ఏమిటి... ఇంత లావైపోయానా అనుకుంటారు. ఈ లావు రాత్రికి రాత్రి వచ్చిందా? కాదు. సంవత్సరాలుగా మీరు నిర్లక్ష్యంగా తిన్నది, వ్యాయామాన్ని పట్టించుకోనిది పేరుకుని ఇప్పుడు ఇలా బయటపడింది. మీ జీవన భాగస్వామి ఒక ఉదయాన వచ్చి మనం విడాకులు తీసుకుందాం అనంటే అది అప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయం కాదు. ఎన్నో సంవత్సరాల నిర్లక్ష్యాల ఫలితం' అంటున్నాడు జేమ్స్ శాక్స్టన్. అమెరికాలో విడాకుల లాయర్‌గా పేరుగడించిన ఈయన ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో 'స్లిప్పేజ్' అనే మాట వాడాడు. పెళ్లయ్యాక ఏది ముఖ్యమో, ఏది అక్కడ అవసరమో అది వయసు గడిచే కొద్దీ 'స్లిప్' చేసుకుంటూ వెళితే ఎదురయ్యేది విడాకులే అంటాడతను. ఇతని మాటల ఆధారంగా వివిధ మ్యారేజ్ కౌన్సిలర్లు తమ వ్యాఖ్యానం వినిపిస్తున్నారు.

మీ పెళ్లయ్యాక ఇలా చేస్తున్నారా?
- అతడు/ఆమె ఇష్టాఇష్టాలను 'ఏం పర్లేదులే' అనే ధోరణిలో ఖాతరు చేయకపోవడం.
- చిన్న చిన్న కోరికలు పట్టించుకోకపోవడం
- తగిన సమయం ఇవ్వకపోవడం
- సంభాషించకపోవడం
- మాటల్లేని రోజులను పొడిగించడం
- అసంతృప్తులను బయటకు చెప్పకుండా కప్పెట్టి రోజులు వెళ్లబుచ్చడం...

ఇలాంటివి జరుగుతుంటే త్వరలోనే వివాహ బంధం బ్రేక్ కానుందని అర్థం.

ఇలా చేయండి..
- మీ జీవిత భాగస్వామి పట్ల అక్కరగా ఉండండి.
- తరచూ ఎక్కువగా మాట్లాడండి. మంచి సమయాన్ని గడపండి.
- ఆర్థిక విషయాలు దాచకుండా చర్చిస్తూ ఇష్టాఇష్టాలు గమనించండి.
- మీ భార్య/భర్త ఒక గట్టి పాయింట్ లేవదీసి మిమ్మల్ని నిలదీస్తే తప్పించుకోకుండా దానిపై ఇవ్వాల్సిన వివరణ ఇచ్చి ముగించండి. లేకుంటే అది పెరుగుతూనే ఉంటుంది.
- మీరు భార్య లేదా భర్త. అంటే వివాహ బంధంలో మీవంటూ కొన్ని బాధ్యతలు తప్పనిసరిగా ఉంటాయి. ఆ బాధ్యతలను మీరు నిర్లక్ష్యం చేస్తే ఆ బంధం గట్టిగా ఉంటుందని భావించడంలో లాజిక్ లేదు.
- పెళ్లి తనకు తానుగా నిలబడదు. కాని మీరు నిర్లక్ష్యం చేస్తే తనకు తానుగా విఫలమవుతుంది. కాబట్టి చెక్ చేసుకోండి.

ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా?
- మీరు కేవలం రోజువారి పైపై మాటలే మాట్లాడుకుంటున్నారా?
- లోతైన, ఆత్మీయమైన సంభాషణలే చేసుకోవడం లేదా?
- సన్నిహితమైన సమయాలే ఉండటం లేదా?
- సమస్యాత్మక విషయాలను చర్చకు పెట్టకుండా తప్పించుకు తిరుగుతున్నారా?

ఇలా ఉన్నా మీ వివాహం ప్రమాదంలో ఉన్నట్టే అంటున్నారు నిపుణులు.

మంచి తల్లిదండ్రులైతే సరిపోదు

చాలామంది దంపతులు తాము మంచి తల్లిదండ్రులుగా ఉండటం ముఖ్యమనే దశకు వెళతారు. పిల్లలతో అనుబంధం గట్టిగా ఉంటే భార్యాభర్తల బంధం కూడా గట్టిగా ఉంటుందని అనుకుంటారు. అయితే ఇలా ఉండటం వల్ల భార్యాభర్తల మధ్య దూరం పెరుగుతుంది అంటున్నారు నిపుణులు. 'నేను, నా ఉద్యోగం, నా పిల్లలు, నా సంపాదన ఆ తర్వాతే జీవిత భాగస్వామి అనుకుంటారు చాలామంది. వాస్తవానికి జీవిత భాగస్వామి ముందు ఉండాలి. మనం చేస్తున్నదంతా భార్య/భర్త కోసమే అనుకుని నిర్లక్ష్యం వహిస్తే భార్య/భర్త దూరమవుతారు. పిల్లలు, కెరీర్ కంటే ముందు భార్యాభర్తలుగా మన బంధం ముఖ్యం అని ఇద్దరూ ఒకరికొకరు చెప్పుకోవాలి... ఆ విధంగా రిలేషన్‌ను కాపాడుకోవాలి' అంటున్నారు నిపుణులు.

లీగల్

రికవరీ సూట్ ఫైల్ చేసుకోవచ్చు

దుబాయ్‌లో ఉండే ఒక వ్యక్తికి 12 లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చాను. అతను భారతీయుడే. కానీ తిరిగి చెల్లించకపోవడంతో పోలీసులను ఆశ్రయించగా, స్టేషన్‌కు వచ్చి సెటిల్ చేసుకొని '7 లక్షల రూపాయలు కడతాను, అంతకు మించి ఇవ్వలేను' అని అందరిముందూ ఒప్పుకున్నాడు. మూడు లక్షలు ఇచ్చాడు. నాలుగు లక్షలకి చెక్కు రాసి ఇచ్చాడు. కానీ ఇంతవరకు డబ్బులు ఎప్పుడు ఇస్తాడో చెప్పలేదు. ఇది జరిగి రెండు సంవత్సరాలు అవుతోంది. భార్యాభర్తలు ఇద్దరూ తిరిగి దుబాయ్ కి వెళ్ళిపోయారు. 'ఎప్పుడిస్తారు అని అడిగితే కేసులు పెట్టుకోండి మా దగ్గర డబ్బులు లేవు' అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో ఐదులక్షల రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేసిన రసీదు మా దగ్గర ఉంది. ఇదేమైనా సాక్ష్యంగా పనికొస్తుందా? ఈ పరిస్థితుల్లో ఏం చేయమంటారు?

– చిరంజీవి, మచిలీపట్నం

రెండు సంవత్సరాల క్రితం చెక్కు ఇచ్చారు అని చెప్పారు కానీ అది పోస్ట్‌డేటెడ్ చెక్కా లేక డేటు వేయకుండా ఇచ్చారా అనే విషయాన్ని చెప్పలేదు. ఒకవేళ చెక్కు మీద డేటు వేసి ఉంటే, ఆ డేటు నుంచి మూడు నెలల గడువులోగా చెక్కును డిపాజిట్ చేసి, అది చెల్లకపోతే చెక్ బౌన్స్ కేసు వేసుకోవచ్చు. అలాంటి వీలు ఉందో లేదో చూసుకోండి. లేనిపక్షంలో సివిల్ కోర్టును ఆశ్రయించి రికవరీ సూట్ ఫైల్ చేసుకోండి. అప్పు తీసుకున్న నాటి నుండి లేదా ఆ లావాదేవీ జరిగిన తేదీ నుంచి మూడు సంవత్సరాలలోగా కేసు వేసుకోవాల్సి ఉంటుంది. దగ్గర్లోని లాయర్‌ను సంప్రదించి మీ వద్ద ఉన్న సాక్ష్యాలను, చెక్కును చూపించి ఏం చేయాలో నిర్ణయం తీసుకోండి.

నేను ఒక అపార్టుమెంటులో నివాసం ఉంటూ ఆ అపార్ట్‌మెంట్ కోశాధికారిగా బాగోగులు చూస్తున్నాను. మా దాంట్లో ఒక ఓనర్ మెయింటెనెన్స్ కట్టడం లేదు. బకాయి పెరిగిపోతోంది. ఎన్నిసార్లు అడిగినా ఏదో సాకు చెప్తూ డబ్బు ఇవ్వడం లేదు. గట్టిగా అడిగితే అసలు ఇవ్వనని కరాఖండిగా చెప్తున్నాడు. అతని నుంచి మెయింటెనెన్స్ డబ్బులు రాబట్టడం ఎలా?

– గోవిందరాజు, హైదరాబాద్

మీ అపార్ట్‌మెంట్ సొసైటీల చట్టం కింద రిజిస్టర్ అయిందా లేదా అనే విషయాన్ని మీరు చెప్పలేదు. ఒకవేళ కోపరేటివ్ సొసైటీస్ చట్టం కింద రిజిస్టర్ అయి ఉంటే, సదరు కమిషనర్ ముందు మీరు దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం, 2001 చట్టం కింద రిజిస్టర్ చేసుకుని ఉంటే... సెక్షన్ 23 ప్రకారం, ఆర్బిట్రేషన్ ద్వారా లేదా సివిల్ కోర్టును ఆశ్రయించడం ద్వారా మీ బకాయిలను వసూలు చేసుకోవచ్చు. బకాయిలు చెల్లించేంతవరకు సదరు ఓనరు ఇల్లు అమ్మడానికి వీలు లేదు అనేటటువంటి ఆర్డర్ కూడా పొందవచ్చు.



- శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

గరిమెళ్ల గళంలో అన్నమయ్య అమృతం

● ఆచార్య తాడేపల్లి పతంజలి

కొందరు జీవించి ఉన్నప్పుడే తాము ఎంచుకున్న క్షేత్రంలో అంకితభావంతో కృషిచేసి ప్రసిద్ధులవుతారు. శరీరాన్ని విడిచి పెట్టిన తర్వాత ఈ లోకానికి సిద్ధ పురుషులుగా మిగిలిపోతారు. అటువంటి వారిలో శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ ఒకరు.

'పుడమి నిండరి బట్టి భూతము కడుబొడవైన నల్లని భూతము' అని అన్నమయ్య వేంకటేశుని గురించి వర్ణిస్తాడు. ఆ అన్నమయ్య కీర్తనల భూతం ఎప్పటినుంచో సంగీత సాహిత్య ప్రపంచంలో చాలా మందిని పట్టుకొని వదలటం లేదు. అటువంటి అన్నమయ్య వేంకటేశుని భూతము పట్టినవారిలో గరిమెళ్ళ ఒకరు. తన మనసుని పట్టుకున్న అన్నమయ్య కీర్తనకి అద్భుతమైన తన గాత్ర రాగ చందనాన్ని అద్ది సంగీత సాహిత్య ప్రియుల హృదయాలలో పట్టుకునేటట్లు కలకాలం నిలిచి ఉండేటట్లు చేసారు. ఒకటా రెండా... వందల కొలది అన్నమయ్య కీర్తనలు గరిమెళ్ళ వారి స్వరరచనలో విరబూసిన వాడిపోని కమలాలుగా, సౌగంధికా పుష్పాలుగా నేటికీ విరబూస్తున్నాయి. భావ పరిమళాలు వెదజల్లుతున్నాయి.

ఒక గొప్ప రహస్యం

ఎందరు గాయకులు పాడుతున్నప్పటికీ ప్రత్యేకంగా శ్రీ గరిమెళ్ళ అన్నమయ్య కీర్తన ఇంతగా ప్రచారం కావడం వెనుక ఒక గొప్ప రహస్యం ఏమిటంటే, అన్నమయ్య మానసిక స్థాయికి తాను వెళ్లి, రసానుభూతితో పాడారు కనుకనే గరిమెళ్ళ వారి అన్నమయ్య కీర్తన సప్తగిరులలోను, లోకంలోను ప్రతిధ్వనిస్తున్నది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకులయిన గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ నడుస్తూనే ఈ లోకం నుంచి సెలవు తీసుకొన్నారు. బహుశా ఆ సమయంలో కూడా అన్నమయ్య కీర్తన ఏదో ఆయన మనస్సులో ప్రస్థానం సాగించే ఉంటుంది. అనుమానం లేదు.

సంగీత ప్రస్థానం

శ్రీ గరిమెళ్ళ సంగీత ప్రస్థానం చాలా విచిత్రంగా సాగింది. మొదట్లో సినిమా పాటలు పాడేవారు. తర్వాత లలిత సంగీతం, ఆ తర్వాత శాస్త్రీయ సంగీతం ఆయనను తన అక్కున చేర్చుకుంది. తన పినతల్లి అయిన ప్రముఖ సినీ నేపథ్యగాయని ఎస్. జానకి గారి ఇంట్లో ఆరు నెలల పాటు ఉండి ఆమెతో కలిసి రికార్డింగ్‌లకి వెళ్లేవారు. జానకి గారు గరిమెళ్ళ వారిని ఎంతో ప్రోత్సహించారు. బాలకృష్ణ ప్రసాద్ మొదట్లో చిన్న చిన్న కచేరీల్లో మృదంగం వాయించేవారు. తన 16వ ఏట చలనచిత్ర గీతాలతో పాటు భక్తి పాటలు కలిపి మొదటి కచేరీ చేసారు. ఆ తర్వాత ప్రపంచ వ్యాప్తంగా చేసిన కచేరీలు, శబ్దముద్రణలు (రికార్డింగ్‌లు లెక్కకు అందనివి.

కొత్త పద్ధతి

సాధారణంగా ఎవరైనా ఒకే వేదిక నుంచి ఒకరోజు సంకీర్తన యజ్ఞం చేస్తారు కానీ బాలకృష్ణ ప్రసాద్ ఒక వారం రోజులపాటు ఒకేవేదిక నుంచి సంకీర్తన యజ్ఞం చేసి ఒక కొత్త పద్ధతిని ప్రారంభించారు. టెలివిజన్ మాధ్యమాల ద్వారా అనేక మందికి సంగీతపు పాఠాలు నేర్పించారు.

నేదునూరి నోట - అన్నమయ్య మాట

అప్పట్లో ప్రసిద్ధమయిన ఆకాశవాణి భక్తి రంజనిలో బాలకృష్ణ ప్రసాద్ ని పాడటానికి సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి ఆహ్వానించారు. పొంగిపోయారు బాలకృష్ణ ప్రసాద్. గరిమెళ్ళ గానానికి సంతోషించిన నేదునూరి తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టులో చేరమని సలహా ఇచ్చారు. అలా అన్నమయ్య కు వేంకటేశునికి బాలకృష్ణ ప్రసాద్ దగ్గరయ్యారు. అన్నమాచార్య ప్రాజెక్టుకు బాలకృష్ణప్రసాద్ అందించిన సేవలు సాటిలేనివి.

అన్నమయ్య స్వరసేవ

'అన్నమయ్యకు స్వరసేవ చేయడం తప్ప మరో ప్రపంచం తెలీదు. అన్నమయ్య పాటలే ప్రపంచంగా బతికారు. ఆ పాటలు వినని వాళ్లకు కూడా బలవంతంగా వినిపించేవారు. ప్రతి ఇంట్లో అన్నమయ్య పాట ఉండాలి.. ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని తపన పడేవారు. అన్నమయ్య కీర్తనలు స్వరం, రాగం, తాళం తూకం వేసినట్లు కచ్చితంగా పాడాలని పట్టుబట్టేవారు." అని బాలకృష్ణ ప్రసాద్ సతీమణి రాధ చెప్పారు. అన్నమయ్య చెప్పినట్లు "ఇదిగాక వైభవంబిక నొకటి కలదా?"

చిరస్మరణీయం

తెలంగాణ రాష్ట్రంలోని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా మార్చి నెల 6న నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తన విభావరియే ఆయన చివరి కచేరీ. నాలుగు నెలలుగా గొంతు సరిగా లేకపోవడంతో ఎక్కడా కచేరీ చేయలేదని, నీదే భారమంటూ స్వామికి మొక్కి వచ్చినట్లు ఆయన ఆర్తంగా యాదగిరిగుట్టలో చెప్పిన విషయం చిరస్మరణీయం.

పురస్కారాలు

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నుంచి 2023 ఫిబ్రవరి 23న కేంద్ర సంగీత, నాటక అకాడమీ అవార్డు, శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు ఇలా కోకొల్లలు. అన్నమాచార్య సంకీర్తన సంపుటి, అన్నమయ్య నృసింహ సంకీర్తనం వంటి పుస్తకాలు తెలుగు, తమిళ భాషల్లో ఆయన ప్రచురించారు.

నివాళి


గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్

గరిమెళ్ళపై ముగ్గురు పీహెచ్‌డీ విద్యార్థులు పరిశోధన గ్రంథాలు సమర్పించారు.

శివపదం కూడా...

గరిమెళ్ళ ఎంతటి అన్నమయ్య వేంకటేశ భక్తులో అంతగా శివభక్తులు కూడా. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ శివునిపై రచించిన సాహిత్యానికి, గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ మృదుమధురంగా స్వరపరిచి పాడారు. ''అడుగు కలిపెను'','' ఐదు మోములతోడ'', ''అమృతేశ్వరాయ'' వంటి కీర్తనలు ఎంతో ప్రసిద్ధి పొందాయి. 'చూపు లోపల త్రిప్పి చూచినది లేదు, యాగ విధులను నిన్ను అర్చించినది లేదు' అంటూ ఒక శివ పద కీర్తనలో బాల కృష్ణప్రసాద్ ఆర్తి మరిచిపోలేనిది. ఆంజనేయుడు మొదలయిన ఇతర దేవతలపై కూడా గరిమెళ్ళ పాడిన పాటలు ప్రసిద్ధాలు.

● ప్రసూన బాలాంత్రపు

మంద్రస్థాయిలోని మధుర స్వరం భక్తి, ప్రేమ రంగరించి రూపం దాలిస్తే అది బాలకృష్ణ ప్రసాద్ అవుతుంది. ఈ తరం వారికి అన్నమయ్య పాటలంటే మొట్టమొదట గుర్తుకు వచ్చేది బాలకృష్ణ ప్రసాద్. లలిత సంగీత ధోరణిలో అన్నమయ్యను అందరికి దగ్గర చేసిన ఘనత ఆయనది.

1948 నవంబర్ 9న రాజమండ్రిలో కృష్ణవేణి, గరిమెళ్ళ నరసింహరావులకు జన్మించారు బాలకృష్ణ. ఇంటిలో అందరూ సంగీత కళాకారులే కావడం వల్ల ఆయన పాటతోనే పెరిగారు. ప్రముఖ నేపథ్యగాయని జానకి వారి పినతల్లి.

అన్నమయ్య కీర్తనలకు రాగి రేకులలో ప్రతిపాదించిన రాగాలతో కొన్ని సంగీత పరచినా, కొన్ని పాట అర్థానికి, అందానికి తగినట్లుగా సుందర రంజని, వాణిప్రియ వంటి దాదాపు 20 కొత్త రాగాలు కూడా సృష్టించారు.

సంగీతం ఎంతో సహజంగా వారికి అబ్బింది కనుకే ఒక పాట రాసినా, సంగీతం కూర్చినా, పాట పాడినా అది అందరి మనస్సులను ఆకర్షించింది. 1980లో మాట. టి.టి.డి వాళ్ళు అన్నమాచార్య ప్రాజెక్ట్ మొదలు పెట్టి రాగి రేకులలో దొరికిన అన్నమయ్య పాటలను ప్రజలకు చేర్చాలని నిశ్చయించారు. అప్పటికే కొన్ని పాటలు జనంలో వున్నా అవి అన్నమయ్య పాటలు అని తెలియదు. ఉదాహరణకు 'జో అచ్యుతానంద'. ఒక ఉద్యమంగా ఈ పాటలు ప్రచారం చెయ్యాలని ప్రతిపాదన. ప్రముఖ విద్వాంసులు రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, నేదునూరి కృష్ణమూర్తి, బాలాంత్రపు రజనీకాంతరావు, మల్లిక్ ఈ పాటలకు సంగీతం కూర్చారు. ఆ తరువాత తరం కళాకారులు బాలకృష్ణ ప్రసాద్, శోభారాజు.

నేదునూరి కృష్ణమూర్తి గారి దగ్గర బాలకృష్ణ ప్రసాద్ స్కాలర్షిప్‌తో శిష్యులుగా చేరి శాస్త్రీయ సంగీతం, అన్నమయ్య పాటలు నేర్చుకున్నారు. నేదునూరి గారు ముందుగా స్వరపరచినది 'ఏమొకో చిగురుటధరమున' అనే పాట. ఇది కీర్తన అనేందుకు లేదు. మామూలుగా శాస్త్రీయ సంగీతంలో కనిపించే ధోరణులు ఇందులో ఉండవు. మరో పాట 'నానాటి బ్రతుకు' కూడా ఇటువంటిదే. ఆ పాటలలో భావం, కవి హృదయం వినే మనస్సుకు అందాలి. అది ఆ సంగీతంలోని భావనా శక్తి. అదే బాలకృష్ణ ప్రసాద్ గారికి స్ఫూర్తి. ఇక అన్నమయ్య పాట పుట్టింది. ప్రచారంలో ఉన్న త్యాగరాజ కీర్తనలకు భిన్నంగా నడిచింది ఈ సంగీతం. నిజానికి అన్నమయ్య త్యాగరాజ ముందు తరం వాడు. అదే బాటలో మొదటి అడుగుగా 'వినరో భాగ్యం విష్ణు కథ' పాటలా మన ముందుకు వచ్చింది. నేదునూరి రాగభావన అందిపుచ్చుకుని బాలకృష్ణ ప్రసాద్ ముందుకు నడిచారు. 'చూడరమ్మ సతులాలా' అన్నా, 'జాజర పాట' పాడినా, 'కులుకుతూ నడవరో కొమ్మల్లాలా' అన్నా బాలకృష్ణ ప్రసాద్ గొంతులో భావం, తెలుగు నుడి అందంగా ఒదిగిపోతాయి.

అలా ప్రారంభం అయిన బాలకృష్ణ ప్రసాద్ సంగీత ప్రస్థానం 150 రాగాలతో 800 పైగా సంకీర్తనలకు సంగీతం కూర్చడం దాకా సాగింది. అన్నమయ్య కీర్తనలకు రాగి రేకులలో ప్రతిపాదించిన రాగాలతో కొన్ని సంగీత పరచినా, కొన్ని పాట అర్థానికి, అందానికి తగినట్లుగా సుందర రంజని, వాణిప్రియ వంటి దాదాపు 20 కొత్త రాగాలు కూడా సృష్టించారు. అన్నమయ్యవి అచ్చ తెలుగు పాటలు. బాలకృష్ణ ప్రసాద్ గొంతులో ఆ తెలుగు సొబగు మృదుమధురంగా వినిపిస్తుంది. ఆయన సంగీతంలో అనవసరమైన సంగతులు ఉండవు. పాట స్పష్టంగా, హృదయానికి తాకేటట్లు పాడడమే ఉద్దేశం. విన్న ప్రతివారు మళ్ళీ ఆ పాట పాడుకోగలగాలి. దీనికై వారు అన్నమయ్య సంగీత శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించి ప్రచారం చేశారు.

400 పైగా కృతులను తెలుగు, సంస్కృత భాషల్లో రచించారు బాలకృష్ణ. అనేక వర్ణాలు, తిల్లానాలు, జావళీలు రచించారు. 400కు పైగా లలిత గీతాలు రచించారు. 16 నవంబర్ 2012లో టి.టి.డి ఆస్థాన గాయకులుగా, కంచి కామకోటి పీఠం ఆస్థాన గాయకులుగా నియమించబడ్డారు. ఆయన లలిత గీతాలు కూడా రచించారు. ఆంజనేయ కృతి మణిమాల, వినాయక కృతులు, నవగ్రహ కృతులు, సర్వదేవతాస్తుతి రచించి క్యాసెట్టు రూపంలో అందించి తెలుగు వారి పూజాగృహంలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఆయన పాట ఒక అనుభూతి, ఒక స్వర ప్రవాహం, ఒక భావ సంపద. కొందరికి మరణం ఉండదు. వారి పాట, మాట నిత్యం మనతోనే ఉంటాయి. బాలకృష్ణ ప్రసాద్ అటువంటి మహనీయుడు.



భారత మహిళల కబడ్డీ జట్టుకు రూ. 67.50 లక్షల నగదు బహుమతి

ఆసియా కబడ్డీ చాంపియన్‌షిప్‌లో ఐదోసారి విజేతగా నిలిచిన భారత మహిళల జట్టుకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ రూ. 67.50 లక్షల నగదు బహుమతి అందించింది. ఇటీవల ఇరాన్ వేదికగా జరిగిన టోర్నీలో అజేయంగా నిలిచిన భారత మహిళల కబడ్డీ జట్టు... ఫైనల్లో 32–25 పాయింట్ల తేడాతో ఆతిథ్య ఇరాన్ జట్టును ఓడించింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత జట్టు ఐదో సారి ఈ టోర్నీలో విజేతగా నిలిచింది. మంగళవారం స్వదేశానికి తిరిగి వచ్చిన భారత మహిళల కబడ్డీ జట్టును కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అభినందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 'మహిళా అథ్లెట్లను మరింత ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాం. మహిళా కబడ్డీ ప్లేయర్లకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకంగా కబడ్డీ లీగ్‌ను కూడా ప్రారంభించాలనుకుంటున్నాం' అని అన్నారు.

బెంగళూరు గెలిచింది


స్మృతి

- ఆఖరి పోరులో 11 పరుగులతో ఓడిన ముంబై
- చెలరేగిన స్మృతి, పెరీ, జార్జియా
- అగ్రస్థానంతో నేరుగా ఫైనల్‌కు ఢిల్లీ
- రేపు ముంబై, గుజరాత్‌ల మధ్య ప్లేఆఫ్స్ పోరు

ముంబై: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో నిలిచి నేరుగా ఫైనల్ చేరాలనుకున్న ముంబై ఆశలపై డిఫెండింగ్ చాంప్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) నీళ్లు చల్లింది. డబ్ల్యూపీఎల్ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 11 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. దీంతో రెండో స్థానంతోనే సరిపెట్టుకున్న హర్మన్‌ప్రీత్ సేన ఫైనల్‌కు అర్హత సాధించేందుకు రేపు గుజరాత్ జెయింట్స్‌తో 'ప్లేఆఫ్' మ్యాచ్ ఆడనుంది. వరుసగా ఐదు ఓటముల తర్వాత ఆర్‌సీబీ విజయం సాధించడం విశేషం. తాజా ఫలితంతో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా మూడో సీజన్‌లోనూ ఫైనల్లోకి అడుగుపెట్టింది. ఢిల్లీ, ముంబై చెరో 10 పాయింట్లతో సమంగా నిలిచినా... రన్‌రేట్‌తో క్యాపిటల్స్ ముందంజ వేసింది. 2023, 2024లలో కూడా ఢిల్లీ ఫైనల్ చేరినా... రన్నరప్‌గానే సరిపెట్టుకుంది.

మంగళవారం జరిగిన పోరులో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ స్మృతి మంధాన (37 బంతుల్లో 53; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఎలీస్ పెరీ (38 బంతుల్లో 49 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగారు. అనంతరం కష్టసాధ్యమైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 188 పరుగులు చేసి పోరాడి ఓడింది. నాట్ సివర్ బ్రంట్ (35 బంతుల్లో 69; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించింది. బెంగళూరు బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్నేహ్ రాణా (3/26) మూడు... కిమ్ గార్త్, పెరీ చెరో రెండు వికెట్లు తీశారు.

అందరూ ధాటిగా...

బెంగళూరు జట్టులో క్రీజులోకి దిగినవారంతా ధాటిగా పరుగులు సాధించారు. సబ్బినేని మేఘన (13 బంతుల్లో 26; 4 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ స్మృతి ఓపెనింగ్ వికెట్‌కు 22 బంతుల్లో 41 పరుగులు జోడించారు. తర్వాత కెప్టెన్ మంధానకు జతయిన ఎలీస్ పెరీ కూడా వేగంగా ఆడటంతో బెంగళూరు స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. వీళ్లిద్దరు రెండో వికెట్‌కు 59 పరుగులు జోడించారు. స్మృతి నిష్క్రమణతో క్రీజులోకి వచ్చిన రిచా ఘోష్ (22 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్) తనదైన శైలిలో దూకుడు కనబరిచింది. రిచా, పెరీలిద్దరూ జట్టు స్కోరును 150 పరుగులు దాటించారు. అనంతరం రిచా జోరుకు హేలీ అడ్డుకట్ట వేసింది. అయితే జార్జియా వేర్‌హామ్ (10 బంతుల్లో 31 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) డెత్ ఓవర్లలో చెలరేగడంతో ప్రత్యర్థి ముందు 200 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

రాణించిన నాట్ సివర్

ముంబై ఆరంభంలోనే తడబడింది. ఓపెనర్లు హేలీ మాథ్యూస్ (19), అమెలియా కెర్ (9) భారీ లక్ష్యానికి అనువైన శుభారంభాన్ని ఇవ్వలేకపోయారు. నాట్ సివర్ బ్రంట్ చక్కగా పోరాడినప్పటికీ తర్వాత వచ్చిన బ్యాటర్లు వికెట్లు పారేసుకోవడంతో ముంబై జట్టు లక్ష్యానికి దూరమైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (20; 2 ఫోర్లు), అమన్‌జోత్ (17) ప్రభావం చూపలేకపోగా... ఆఖరి ఓవర్లో సజీవన్ సజన (12 బంతుల్లో 23; 1 ఫోర్, 2 సిక్స్‌లు) భారీ షాట్లతో వణికించింది. 3 బంతుల్లో 12 పరుగులు చేయాల్సిన దశలో ఆమె కూడా అవుట్ కావడంతో ముంబైకి ఓటమి ఖాయమైంది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: మేఘన (సి) పారుణిక (బి) హేలీ మాథ్యూస్ 26; స్మృతి (సి) షబ్నిమ్ (బి) అమెలియా 53; ఎలీస్ పెరీ నాటౌట్ 49; రిచా ఘోష్ (సి) నాట్ సివర్ (బి) హేలీ మాథ్యూస్ 36; జార్జియా నాటౌట్ 31; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు)** 199. **వికెట్ల పతనం:** 1–41, 2–100, 3–153.

బౌలింగ్: షబ్నిమ్ ఇస్మాయిల్ 4–0–41–0, నాట్ సివర్ 2–0–16–0, హేలీ మాథ్యూస్ 4–0–37–2, అమన్‌జోత్ 4–0–27–0, అమెలియా కెర్ 3–0–47–1, సంస్కృతి గుప్తా 1–0–6–0, పారుణిక సిసోడియా 2–0–24–0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: హేలీ మాథ్యూస్ (సి) గ్రాహమ్ (బి) స్నేహ్ రాణా 19; అమెలియా (సి) మంధాన (బి) స్నేహ్ రాణా 9; నాట్ సీవర్ (సి అండ్ బి) పెరీ 69; హర్మన్‌ప్రీత్ (సి) రిచా ఘోష్ (బి) కిమ్ గార్త్ 20; అమన్‌జోత్ (బి) గ్రాహమ్ 17; యస్తిక భాటియా (సి అండ్ బి) స్నేహ్ రాణా 4; సజన (సి) మేఘన (బి) పెరీ 23; కమలిని (సి) పెరీ (బి) జార్జియా 6; సంస్కృతి (సి) జోషిత (బి) కిమ్ గార్త్ 10; షబ్నిమ్ నాటౌట్ 4; పారుణిక నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు)** 188. **వికెట్ల పతనం:** 1–27, 2–38, 3–78, 4–129, 5–134, 6–140, 7–152, 8–167, 9–188. **బౌలింగ్:** కిమ్ గార్త్ 4–0–33–2, ఎలీస్ పెరీ 4–0–53–2, స్నేహ్ రాణా 4–0–26–3, హెథెర్ గ్రాహమ్ 4–0–47–1, జార్జియా వేర్‌హామ్ 4–0–29–1.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

లక్ష్యసేన్ శుభారంభం



- ప్రణయ్ పరాజయం
- మాళవిక ముందంజ
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

బర్మింగ్‌హామ్: ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ తొలి రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. తొలి రౌండ్‌లో లక్ష్యసేన్, మాళవిక బన్సోద్ విజయాలు సాధించి ముందంజ వేయగా... హెచ్‌ఎస్ ప్రణయ్ పరాజయంతో ఇంటిబాట పట్టాడు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్–1000 టోర్నీ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మంగళవారం ప్రపంచ 15వ ర్యాంకర్ లక్ష్యసేన్ 13–21, 21–17, 21–15తో ప్రపంచ 37వ ర్యాంకర్ లి యాంగ్ సు (చైనీస్ తైపీ)పై విజయం సాధించాడు. గంటా 15 నిమిషాల పాటు సాగిన పోరు తొలి గేమ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన లక్ష్య... హోరాహోరీగా సాగిన రెండో గేమ్ 17–17తో సమంగా ఉన్న సమయంలో చైనీస్ తైపీ షట్లర్ తప్పిదాలతో వరుస పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. నిర్ణయాత్మక మూడో గేమ్ ఆరంభం నుంచే దూకుడు కనబర్చిన లక్ష్యసేన్... నెట్ గేమ్‌తో ప్రత్యర్థిని ఉక్కిరి బిక్కిరి చేసి 11–9తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే పట్టువదలని చైనీస్ తైపీ షట్లర్ 15–15తో స్కోరు సమం చేశాడు. అక్కడి నుంచి విజృంభించిన లక్ష్యసేన్... బలమైన రిటర్న్‌లతో చెలరేగి వరుసగా ఆరు పాయింట్లు సాధించి ప్రీక్వార్టర్స్‌కు చేరాడు. ఈ మ్యాచ్‌లో మూడో సీడ్ జొనాథన్ క్రిస్టి (ఇండోనేసియా)తో లక్ష్యసేన్ తలపడతాడు. 2024 పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక పోరులో క్రిస్టి చేతిలో ఓడిన లక్ష్యసేన్... ఆ పరాజయానికి బదులు తీర్చుకునేందుకు ఇది చక్కటి అవకాశం. మరో మ్యాచ్‌లో ప్రపంచ 29వ ర్యాంకర్ ప్రణయ్ 19–21, 16–21తో ప్రపంచ 17వ ర్యాంకర్ టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యాడు. 53 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రణయ్ వరుస గేమ్‌ల్లో ఓడాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో రైజింగ్ స్టార్ మాళవిక బన్సోద్ 21–13, 10–21, 21–17తో జియా మిన్ యో (సింగపూర్)పై విజయం సాధించింది. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో ద్వయం 20–22, 18–21తో చెన్ చెంగ్–సెయి పెయి షాన్ జంట చేతిలో ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్–ఆద్య జంట 6–21, 15–21తో జిన్ వా–చెన్ ఫెంగ్ హుయి (చైనా) ద్వయం చేతిలో ఓడింది.

భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి బుధవారం బరిలోకి దిగనున్నారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో యున్ కిమ్ (దక్షిణ కొరియా)తో సింధు తలపడుతుంది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో డానియల్ లింగ్‌గార్డ్–మాడ్స్ వెస్టర్‌గాడ్ (డెన్మార్క్) జంటతో సాత్విక్–చిరాగ్ జోడీ ఆడుతుంది.

భారత రెజ్లర్లకు ఊరట

- డబ్ల్యూఎఫ్ఐపై సస్పెన్షన్ ఎత్తివేత
- 15 నెలల తర్వాత క్రీడా శాఖ నిర్ణయం



న్యూఢిల్లీ: భారత రెజ్లర్లకు మేలు చేసే కీలక నిర్ణయాన్ని కేంద్ర క్రీడాశాఖ తీసుకుంది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై విధించిన సస్పెన్షన్‌ను క్రీడా శాఖ ఎత్తేసింది. డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై స్టార్ రెజ్లర్ల లైంగిక ఆరోపణలు దరిమిలా చుట్టుముట్టిన వివాదాలు, కోర్టు కేసుల అనంతరం 15 నెలల క్రితం కొత్త కార్యవర్గం కొలువు దీరింది. కానీ రోజుల వ్యవధిలోనే కేంద్ర క్రీడా శాఖ ఆగ్రహానికి గురైంది. దీంతో పలు అంతర్జాతీయ ఈవెంట్లలో భారత రెజ్లర్లు పాల్గొనేందుకు ఇబ్బందులెదురవుతున్నాయి. రెజ్లర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పుడు నిషేధాన్ని ఎత్తేసింది. కేంద్ర క్రీడా శాఖ మార్గదర్శకాలను డబ్ల్యూఎఫ్ఐ పాటించడంతో పాటు రెజ్లర్ల విస్తృత ప్రయోజనాలను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ శాఖ అధికారులు వెల్లడించారు. క్రీడాపాలసీ ప్రకారం డబ్ల్యూఎఫ్ఐ నడుచుకోవాలని, వివాదాస్పద, కళంకిత అధికారులు, పాత కార్యవర్గ సభ్యులకు దూరంగా ఉండాలని, లేదంటే కఠిన చర్యలకు వెనుకాడమని క్రీడా శాఖ హెచ్చరించినట్లు తెలిసింది. డబ్ల్యూఎఫ్ఐ కార్యకలాపాలు మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ ఇంటి నుంచే నిర్వహిస్తున్నారనే విమర్శలపై క్రీడాశాఖ పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రత్యక్ష పరిశీలన అనంతరం ఇచ్చిన నివేదికను బట్టే తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. దీంతో వచ్చే ఏషియాడ్ (2026), లాస్ ఏంజెలెస్ (2028) ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలనుకునే రెజ్లర్లకు కొండంత ఆత్మవిశ్వాసం లభించినట్లయ్యింది. క్రీడాశాఖ నిర్ణయంపై డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. 'ప్రభుత్వానికి కృతజ్ఞతలు. సస్పెన్షన్ తొలగిపోవడంతో ఇక మా కార్యకలాపాలు సజావుగా జరిగేందుకు అవకాశం లభించింది. రెజ్లింగ్ క్రీడ అభ్యున్నతికి ఇలాంటి నిర్ణయం ఎంతో అవసరం కూడా! ఇప్పటికే ప్రతిభావంతులైన రెజ్లర్లు పలు అంతర్జాతీయ ఈవెంట్లకు దూరమయ్యారు. ఇకనుంచి వారంతా పతకాల కోసం పోటీపడొచ్చు' అని అన్నారు. క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ సస్పెన్షన్‌ను ఇంకా కొనసాగిస్తే రెజ్లర్లకు అన్యాయం చేసిన వారమవుతామని చెప్పారు. రెజ్లర్లు అంతర్జాతీయ క్రీడావేదికలపై రాణించాలనే సదుద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ మాట్లాడుతూ తనపై చేసిన తప్పుడు ఆరోపణలేవీ నిలబడలేదని చెప్పుకొచ్చారు.

సాక్షి సినిమా

సాయికుమార్‌కు కొమరం భీమ్ జాతీయ పురస్కారం



ప్రముఖ నటుడు సాయికుమార్ నటుడిగా స్వర్ణోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా 2024 ఏడాదికి గాను కొమరం భీమ్ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లుగా సెలక్షన్ కమిటీ చైర్మన్ సి. పార్థసారథి ఐఏఎస్, కో–చైర్మన్ నాగబాల డి.సురేష్ కుమార్, కన్వీనర్ కొమరం సోనే రావు, శిడాం అర్జు మాస్టారు తెలిపారు. భారత కల్చరల్ అకాడమీ, ఓం సాయి తేజ ఆర్ట్స్, ఆదివాసి సాంస్కృతిక పరిషత్‌ల నిర్వహణలో ఈ అవార్డును పన్నెండేళ్లుగా అందిస్తున్నామని, పలువురు ప్రముఖులను సన్మానించామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 23న కొమరం భీమ్ జిల్లా, ఆసిఫాబాద్ కేంద్రంలోని ప్రమీల గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం జరుపుతామని నిర్వాహకులు పేర్కొన్నారు.


మహేశ్‌బాబు

రామాయణం ఆధారంగా...

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ ఫిల్మ్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ఇటీవల ఒడిశాలో ప్రారంభమైంది. మహేశ్‌బాబు, పృథ్వీ రాజ్ సుకుమారన్‌లు పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు రాజమౌళి. అలాగే మంగళవారం నుంచి ఈ షెడ్యూల్‌లో ప్రియాంకా చోప్రా కూడా పాల్గొంటున్నారని తెలిసింది. మహేశ్, పృథ్వీరాజ్, ప్రియాంకల కాంబినేషన్ సీన్స్‌ను చిత్రీకరిస్తున్నారట. కాగా ఈ సినిమా షూటింగ్‌లోని ఓ వీడియో బయటికొచ్చింది. దీంతో మరింత కట్టుదిట్టమైన ఏర్పాట్లతో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నట్లుగా తెలిసింది. అలాగే ఈ చిత్రానికి మైథలాజికల్ టచ్ ఉందని, రామాయణంలోని కొన్ని ముఖ్య సంఘటనలను స్ఫూర్తిగా తీసుకుని, నేటి ఆధునిక కాలానికి అన్వయించి, ఈ కథను విజయేంద్రప్రసాద్ రెడీ చేశారని సమాచారం. కథలో కాశీ నగరానికి కూడా ప్రాముఖ్యత ఉందట... దాంతో కాశీ నగరాన్ని పోలిన సెట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలనే ఆలోచనలో యూనిట్ ఉందని భోగట్టా.

సినిమా వ్యాపారాన్ని మనమే చంపేశాం

- ఆమిర్ ఖాన్



''గతంలో ఏ సినిమా చూడాలనుకున్నా థియేటర్‌కి వెళ్లేవాణ్ణి. ఎందుకంటే మూవీస్ చూసేందుకు నాకు మరో చాయిస్ లేదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సినిమాలు విడుదలైన ఎనిమిది వారాలకే ఓటీటీల్లో రిలీజ్ చేసి, మన సినిమా వ్యాపారాన్ని మనమే చంపేశాం'' అని బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ ఆగ్రహావేదన వ్యక్తం చేశారు. ఈ నెల 14న ఆమిర్ ఖాన్ బర్త్ డేని పురస్కరించుకుని 'పీవీఆర్ ఐనాక్స్' ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తోంది. 'ఆమిర్ ఖాన్: సినిమా కా జాదూగర్' పేరుతో ఆయన హిట్ సినిమాలను ప్రదర్శిస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమిర్ ఖాన్, రచయిత జావేద్ అక్తర్ పాల్గొన్నారు. ''గతంతో పోలిస్తే ప్రస్తుతం హిందీ చిత్రాలు ప్రేక్షకులను అలరించలేకపోతున్నాయి. బాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం లేని దక్షిణాది నటుల సినిమాలు బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద రూ. 600 నుంచి 700 కోట్ల రూపాయలు వ్యాపారం చేస్తున్నాయి. మన సినిమాలను కూడా దక్షిణాది దర్శకులు తెరకెక్కిస్తున్నారు. బాలీవుడ్‌కి ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది?'' అంటూ ఆమిర్ ఖాన్‌ను ప్రశ్నించారు జావేద్ అక్తర్. ఇందుకు ఆమిర్ స్పందిస్తూ– ''దక్షిణాది, ఉత్తరాది చిత్రాలు అనే విషయం సమస్యే కాదు... దర్శకుల ప్రాంతీయ నేపథ్యం కూడా అప్రస్తుతం. సినిమా విడుదలైన ఎనిమిది వారాలకే ఓటీటీలో రిలీజ్ చేస్తున్నాం. ఓటీటీలో ఎన్నిసార్లయినా ఫ్రీగా చూసే వీలుండటంతో ప్రేక్షకులు థియేటర్లకు రావడం తగ్గించేశారు. ఒక సినిమాని రెండు సార్లు ఎలా అమ్మాలో నాకు తెలియడం లేదు. థియేటర్లలో విడుదలైన మూడు లేదా నాలుగు నెలల తర్వాత ఓటీటీల్లో రిలీజ్ చేయాలి. అప్పుడే థియేట్రికల్ బిజినెస్ బాగుంటుంది. ప్రేమ, కోపం, పగ వంటి ఎమోషన్స్ మీద బాలీవుడ్ రచయితలు, డైరెక్టర్స్ ఎక్కువ ఫోకస్ చేయడం లేదు. కేవలం వినో దానికే పెద్ద పీట వేస్తున్నారు. పైగా మూలాలను మర్చిపోతున్నారు. దక్షిణాది చిత్రాల్లాగా భావోద్వేగాలను మిళితం చేయలేపోతున్నారు'' అని పేర్కొన్నారు.

రాబిన్‌హుడ్ నా పుట్టిన రోజు కానుక


- నితిన్


● రవిశంకర్, రాజేంద్రప్రసాద్, నితిన్, శ్రీలీల, వెంకీ కుడుముల

''నేను, వెంకీ కుడుముల కలిసి సోమవారం రాత్రి 'రాబిన్‌హుడ్' సినిమా చూశాం. ఈ మూవీ మా కెరీర్‌లో పెద్ద సినిమా కాబోతుందని చాలా నమ్మకం ఉంది. ఈ నెల 30న నా బర్త్‌డే. 'రాబిన్‌హుడ్' ఈ నెల 28న వస్తుంది. డైరెక్టర్ వెంకీ ఈ సినిమాతో నాకు బిగ్గెస్ట్ బర్త్ డే గిఫ్ట్ ఇవ్వబోతున్నారు'' అని హీరో నితిన్ చెప్పారు. వెంకీ కుడుముల డైరెక్షన్‌లో నితిన్, శ్రీలీల జోడీగా నటించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నితిన్ మాట్లాడుతూ –''నేను, శ్రీలీల, రాజేంద్రప్రసాద్‌గారు, 'వెన్నెల' కిశోర్... మా మధ్య వచ్చే సన్నివేశాలు పొట్ట చెక్కలయ్యేలా నవ్విస్తాయి. మైత్రీ మూవీ మేకర్స్ లేకపోతే ఈ సినిమా ఇంత క్వాలిటీగా వచ్చేది కాదు'' అన్నారు. **శ్రీలీల మాట్లాడుతూ**– ''ఈ సినిమాలో నేను చేసిన మీరా పాత్ర చాలా ప్రత్యేకం. ఈ చిత్రం తప్పకుండా అందర్నీ అలరిస్తుంది'' అన్నారు. **వెంకీ కుడుముల మాట్లాడుతూ**–''సినిమాపై చాలా నమ్మకంగా ఉన్నాను. బ్లాక్ బస్టర్ కొడుతున్నాం. ఈ సినిమాలో అతిథిగా చేసిన డేవిడ్ వార్నర్ గారికి ధన్యవాదాలు'' అని తెలిపారు. ''అద్భుతమైన కథకి వినోదం మిక్స్ చేసిన సినిమా ఇది. ఆడియన్స్‌ని అలరిస్తుంది'' అని నటుడు **రాజేంద్ర ప్రసాద్** అన్నారు. **యలమంచిలి రవిశంకర్ మాట్లాడుతూ**–''ఈ సినిమాలో వినోదం, మంచి యాక్షన్‌తో పాటు అన్ని వాణిజ్య అంశాలు ఉన్నాయి. మూవీ మంచి సక్సెస్ అవుతుందని మేమంతా నమ్మకంతో ఉన్నాం'' అని చెప్పారు.

ఆ ఘనత ఆయనకే దక్కుతుంది

- ఆది సాయికుమార్


● షణ్ముగం సాప్పని, ఆది సాయికుమార్, అవిక

''నా సినిమా విడుదలై సంవత్సరం దాటిపోయింది. ఈ నెల 21న 'షణ్ముఖ'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. ఈ సినిమా ఘనత అంతా దర్శక, నిర్మాత షణ్ముగం సాప్పనికే దక్కుతుంది. మంచి సినిమాకు ప్రేక్షకుల ఆదరణ తప్పకుండా ఉంటుంది. మా చిత్రం కూడా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని ఆది సాయికుమార్ చెప్పారు. షణ్ముగం సాప్పని దర్శకత్వంలో ఆది సాయికుమార్, అవికా గోర్ జంటగా నటించిన చిత్రం 'షణ్ముఖ'. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆది సాయికుమార్ మాట్లాడుతూ– ''మా సినిమా విడుదలకు ముందే అన్ని భాషల శాటిలైట్ హక్కులు, డిజిటల్, థియేట్రికల్ హక్కులు ఫ్యాన్సీ రేటుకు అమ్ముడు పోవడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''డివోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ మూవీ చేయడం హ్యాపీ'' అని అవికా గోర్ పేర్కొన్నారు. ''మా సినిమాని ఏపీ, తెలంగాణలో నా మిత్రుడు శిధర్ రెడ్డి విడుదల చేస్తున్నారు'' అన్నారు షణ్ముగం సాప్పని.

పూరీగారి హీరో తరహాలో నా పాత్ర ఉంటుంది

- కిరణ్ అబ్బవరం



''గతంలో కొన్ని సినిమాలు మొహమాటానికి చేశాను. కొన్ని తప్పులు కూడా చేశాను. కానీ ఇందులో ఎవరి తప్పు లేదు. హీరోగా ఆ తప్పులు నావే. కానీ 'క' విజయం తర్వాత మంచి సినిమాలు చేసేందుకు కిరణ్ కష్టపడతాడనే అభిప్రాయం ప్రేక్షకుల్లో మొదలైంది. అది నా లక్. ఇప్పుడు 'దిల్ రుబా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. ఓ న్యూ ఏజ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా 'దిల్ రుబా' ప్రేక్షకులను మెప్పిస్తుందని చెప్పగలను'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన తాజా చిత్రం 'దిల్ రుబా'. రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సారెగమ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో కిరణ్ అబ్బవరం చెప్పిన విశేషాలు.

● 'క' సినిమా కంటే ముందే 'దిల్ రుబా' చిత్రం మొదలైంది. 'క' సినిమా తర్వాత 'దిల్ రుబా'లో కొన్ని మార్పులు చేశాం. అవి సినిమా బెటర్‌మెంట్ కోసమే. ఇక ఈ సినిమాలో నేను సిద్ధు అనే పాత్రలో కనిపిస్తాను. ఊరికే 'సారీ, థ్యాంక్స్' అనే పదాలను వాడటం సిద్ధుకు నచ్చదు. ఇందుకు బలమైన కారణాలు ఉంటాయి. అలాగే సిద్ధు మాజీ ప్రేమికురాలు అతని కేర్ టేకర్‌గా ఉండి, అతని ప్రస్తుత లవ్‌స్టోరీని ఎలా చక్కదిద్దుతుంది? అన్నదే ఈ సినిమా కథ. సిద్ధు క్యారెక్టర్‌లో పూరి జగన్నాథ్‌గారి సినిమాల్లో ఉండే హీరో క్యారెక్టరైజేషన్ తాలూకు అగ్రెసివ్‌నెస్ ఉంటుంది.

● 'క' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో భావోద్వేగంతో మాట్లాడాను. సింపతీ కోసం అలా మాట్లాడానని అనడంలో అర్థం లేదు. ఒకవేళ సింపతీ కోసమే అనుకున్నా మార్నింగ్ షోకు కొంతమంది రావొచ్చు. కానీ ఓ సినిమాకు లాంగ్ రన్ ఉండాలంటే... కథలో కంటెంట్ ఉండాలి. 'క' సినిమాలో కంటెంట్ ఉంది... ఆడింది. అయినా సింపతీతో సినిమాలు ఆడవు.

● ప్రస్తుతం నాలుగు సినిమాలు కమిట్ అయ్యాను. ఒకటి లవ్‌స్టోరీ, మరొకటి ఫ్యామిలీ డ్రామా, ఇంకొకటి యూత్‌ఫుల్ డ్రామా. అలాగే లంకె బిందెల నేపథ్యంలో ఓ సినిమా ఉంది. అది పెద్ద కథ. మూడు భాగాలుగా తీయాలనుకుంటున్నాం. నా నెక్ట్స్ మూవీగా 'కె–ర్యాంప్' రిలీజ్ అవుతుంది.

అభినవ్ సినిమా తీయడం అభినందనీయం

- మంత్రి కొండా సురేఖ


● శ్రీ పూజ, కొండా సురేఖ, సుధాకర్ గౌడ్

''ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సుధాకర్ గారు 'అభినవ్' చిత్రాన్ని నిర్మించారు. సమాజ శ్రేయస్సు కోసం ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఈ సినిమా తీయడం అభినందనీయం. ఇలాంటి చిత్రాలకు ప్రభుత్వ సహకారం ఉంటుంది'' అని తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అన్నారు. డా. భీమగాని సుధాకర్ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన బాలల చిత్రం 'అభినవ్': చేజ్డ్ పద్మ వ్యూహ. ఈ మూవీ పోస్టర్, ట్రైలర్‌ను మంత్రి కొండా సురేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా భీమగాని సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ– ''గంజాయి, డ్రగ్ మాఫియా కబంధ హస్తాల్లో చిక్కుకున్న గిరిజన అనాథ బాల కార్మికులను హైదరాబాద్‌లోని విద్యార్థులు ఎలా కాపాడారు? ఈ మాఫియాలను ఎలా అంతం చేశారు? అనే కథతో ఈ చిత్రం ఉంటుంది. తెలంగాణ విద్యార్థులకు అతి త్వరలో మధ్యాహ్నం షోగా మా చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయబోతున్నాం'' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: వందేమాతరం శ్రీనివాస్.

క్రైమ్... కామెడీ


● ఇంద్ర రామ్

ప్రముఖ దర్శకుడు నక్కిన త్రినాథరావు 'చౌర్య పాఠం' చిత్రంతో నిర్మాతగా మారారు. ఈ మూవీ ద్వారా ఇంద్ర రామ్ హీరోగా పరిచయమవుతున్నారు. పాయల్ రాధాకృష్ణ కథానాయికగా నటిస్తున్నారు. డైరెక్టర్ చందు మొండేటి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా చేసిన నిఖిల్ గొల్ల మారి 'చౌర్య పాఠం'తో దర్శకునిగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాని ఏప్రిల్ 18న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''క్రైమ్, కామెడీ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'చౌర్య పాఠం'. పరీక్షలు పూర్తి చేసిన విద్యార్థులు వినోదాన్ని ఆస్వాదించాలనుకుంటే మా మూవీ సరదా జర్నీలా ఉంటుంది'' అన్నారు నక్కిన త్రినాథరావు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	13	74,102
నిఫ్టీ ▲	38	22,498

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11:30 ముగింపు)			
నాస్‌డాక్	17,377	▼	91
డోజోన్స్	41,343	▼	569
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,496	▼	104
డాక్స్	22,329	▼	292
షాంఘై	3,380	▲	14
నికాయ్	36,793	▼	235

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	86,024	▲	92
బంగారం (99.5 స్వచ్ఛత)	85,680	▲	92
వెండి (కిలో)	96,626	▼	8

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		85.38	89.06
£	బ్రిటన్ పౌండ్		111.52	115.38
€	యూరో		92.99	97.41
¥	జపాన్ ఎన్ (100)		48.00	70.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		52.53	57.37
S$	సింగపూర్ డాలర్		63.21	67.89
SAR	సౌదీ రియాల్		22.36	23.91
UAE D	యూఏఈ దిర్హామ్		22.85	24.64
¥	చైనా యువాన్		11.18	13.01

ఇండస్‌ఇండ్ ఇన్వెస్టర్లకు షాక్

- ఖాతాలలో రూ. 2,100 కోట్ల తేడా..
- అంతర్గత ఆడిట్ ద్వారా వెలుగులోకి
- భారీ అమ్మకాలతో షేరు 27% క్రాష్



న్యూఢిల్లీ: డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియో ఖాతాల నిర్వహణలో రూ. 2,100 కోట్లమేర అంతరం నమోదైనట్లు తాజాగా ప్రయివేట్ రంగ సంస్థ ఇండస్‌ఇండ్ బ్యాంక్ వెల్లడించింది. అయితే బ్యాంక్‌వద్ద తగినంత రిజర్వులు, మూలధనం ఉండటంతో కవర్ చేసుకోగలమని పేర్కొంది. అయితే యాజమాన్యం హామీ ఇచ్చినప్పటికీ ఇన్వెస్టర్లలో ఆందోళనలు తలెత్తాయి. ఫలితంగా ట్రేడింగ్ ప్రారంభంలోనే ఇండస్‌ఇండ్ షేరు 10% పతనమైంది. ఆపై మరింత బలహీనపడుతూ 20% సర్క్యూట్‌ను తాకింది. సర్క్యూట్ నుంచి రిలీజ్ అయ్యాక మరింత దిగజారింది. వెరసి ట్రేడింగ్ ముగిసేసరికి 27% కుప్పకూలి రూ. 657 వద్ద నిలిచింది. ఒక దశలో రూ. 649 వద్ద ఏడాది కనిష్టాన్ని తాకింది.

ఏం జరిగిందంటే?

ఖాతాలో వ్యత్యాసాన్ని గతేడాది(2024) సెప్టెంబర్- అక్టోబర్‌లో గుర్తించినట్లు ఇండస్‌ఇండ్ బ్యాంక్ సీఈవో, ఎండీ సుమంత్ కథ్పాలియా పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రాథమిక సమాచారాన్ని ఆర్‌బీఐకు గత వారమే నివేదించినట్లు తెలియజేశారు. అయితే తుది వివరాలు బయటి ఏజెన్సీతో చేయిస్తున్న ఆడిట్ ద్వారా వెల్లడికానున్నట్లు పేర్కొన్నారు. నివేదిక ఏప్రిల్ మొదట్లో వెలువడనున్నట్లు తెలియజేశారు. లాభదాయకత, మూలధన పటిష్టత నేపథ్యంలో ఈ ప్రభావాన్ని బ్యాంక్ సర్దుబాటు చేసుకోగలదన్నారు. 2024 ఏప్రిల్1కు ముందు 5-7ఏళ్లుగా డెరివేటివ్ పోర్ట్‌ఫోలియో ఖాతాలో తేడా నమోదవుతూ వచ్చిందని చెప్పారు.

ఎక్స్ఛేంజీలకు సమాచారం...

డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో కొన్ని అంతరాలున్నట్లు సోమవారం ఇండస్‌ఇండ్ బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు నివేదించింది. వీటి వల్ల బ్యాంక్ నెట్‌వర్త్‌పై 2.35 శాతంమేర ప్రతికూల ప్రభావం పడే వీలున్నట్లు పేర్కొంది. అంతర్గత సమీక్ష ద్వారా ఈ అంశాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. వీటిని స్వతంత్రంగా సమీక్షించి నిర్ధారించేందుకు బయటి ఏజెన్సీని ఎంపిక చేసినట్లు తెలిపింది. కాగా.. ట్రెజరీ బిజినెస్‌లో గుర్తించిన వ్యత్యాసం అంతర్గత, చట్టబద్ధ, ఆర్‌బీఐ ఆడిట్‌లలో బయటపడకపోవడం గమనార్హం! 2024 ఏప్రిల్ 1నుంచి డెరివేటివ్స్‌లో ఇంటర్నల్ ట్రేడ్‌ను నిలిపివేస్తూ 2023 సెప్టెంబర్‌లో జారీ అయిన ఆర్‌బీఐ సర్క్యులర్ కారణంగా అంతర్గత బుక్‌పై సమీక్షకు తెరతీసినట్లు సుమంత్ వెల్లడించారు. దీంతో బయటి ఆడిట్‌కు ఆదేశించినట్లు తెలియజేశారు. అయితే బ్యాంక్ ఎండీ, సీఈవోగా తిరిగి ఎంపిక చేయడంలో ఆర్‌బీఐపై ఈ అంశంప్రభావం చూపి ఉండవచ్చని పేర్కొన్నారు. బ్యాంక్ బోర్డు మూడేళ్ల కాలానికి ప్రతిపాదించగా.. గత వారం ఆర్‌బీఐ ఏడాది కాలానికే సుమంత్ బాధ్యతల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

రూ. 19,000 కోట్లు ఆవిరి...

షేరు భారీ పతనంతో ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే ఇండస్‌ఇండ్ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)కు ఒక్కరోజులోనే రూ. 19,000 కోట్లమేర చిల్లుపడింది. ఈ నెల 10న నమోదైన రూ. 70,150 కోట్ల నుంచి బ్యాంక్ మార్కెట్ విలువ తాజాగా రూ. 51,168 కోట్లకు క్షీణించింది. బ్యాంక్ షేరు 2018 ఆగస్ట్‌లో రూ. 2038 వద్ద చరిత్రాత్మక గరిష్టానికి చేరింది. గతేడాది అంటే 2024 ఏప్రిల్ 8న రూ. 1,576 వద్ద నమోదైన గరిష్టం నుంచి తాజాగా 52 వారాల కనిష్టం రూ. 649ను తాకింది. వెరసి 59 శాతం పతనమైంది.



ఫండ్స్ లబోదిబో

ఇది ఇండెక్స్ షేరు కావడంతో 2025 ఫిబ్రవరికల్లా 35 మ్యూచువల్ ఫండ్స్ 360 పథకాల ద్వారా ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో ఇన్వెస్ట్ చేశాయి. 20.88 కోట్ల షేర్లను కలిగి ఉన్నాయి. ఈ హోల్డింగ్స్ విలువ రూ. 20,670 కోట్లు కాగా.. షేరు తాజా పతనంలో రూ. 6,970 కోట్లు ఆవిరైంది. దీంతో హోల్డింగ్స్ విలువ రూ. 13,700 కోట్లకు పరిమితమైంది. ఇక ప్యాసివ్ ఫండ్స్ సైతం బ్యాంక్ షేర్ల పతనంతో ప్రభావితమైనట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి.

టెలికం యూజర్లు @ 119 కోట్లు

ట్రాయ్ డిసెంబర్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా డిసెంబర్‌లో మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య స్వల్పంగా పెరిగి 118.99 కోట్లకు చేరింది. నవంబర్‌లో ఇది 118.71 కోట్లుగా నమోదైంది. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం ఇటు మొబైల్, అటు ఫిక్స్‌డ్ లైన్ విభాగాల్లో జియో పెద్ద సంఖ్యలో కొత్త యూజర్లను దక్కించుకుంది.

వైర్‌లెస్ యూజర్ల విభాగంలో, రిలయన్స్ జియోకి నికరంగా 39.06 లక్షలు, భారతి ఎయిర్‌టెల్‌కు 10.33 లక్షల మంది కొత్తగా జత కాగా వొడాఫోన్ 17.15 లక్షల మందిని కోల్పోయింది. బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ వరుసగా 3.16 లక్షలు, 8.96 లక్షల మంది సబ్‌స్క్రయిబర్స్‌ను కోల్పోయాయి. ఈ విభాగంలో ప్రైవేట్ సంస్థల మార్కెట్ వాటా 91.92 శాతంగా ఉండగా, ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ వాటా కేవలం 8.08 శాతంగా ఉంది. మరోవైపు, వైర్‌లైన్ యూజర్ల సంఖ్య నవంబర్‌లో 3.85 కోట్ల నుంచి డిసెంబర్‌లో 3.92 కోట్లకు చేరింది. జియోకి 6.56 లక్షల మంది, భారతి ఎయిర్‌టెల్‌కు 1.62 లక్షలు, టాటా టెలీకి 9,278 మంది యూజర్లు జతయ్యారు. బీఎస్ఎన్ఎల్ ఏకంగా 33,306 యూజర్లను, ఎంటీఎన్ఎల్ 14,054 మంది సబ్‌స్క్రయిబర్స్‌ను కోల్పోయాయి.

బ్రాడ్‌బ్యాండ్ యూజర్లు 94.49 కోట్లు..

మొత్తం బ్రాడ్‌బ్యాండ్ యూజర్లు నవంబర్‌లో 94.47 కోట్లుగా ఉండగా, డిసెంబర్‌లో 94.49 కోట్లకు చేరింది. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ సబ్‌స్క్రయిబర్స్ 47.65 కోట్లుగా, భారతి ఎయిర్‌టెల్ యూజర్లు 28.93 కోట్లు, వొడాఫోన్ ఐడియా 12.63 కోట్లు, భారత్ సంచార్ నిగమ్ 3.53 కోట్లు, ఎట్రియా కన్వర్జెన్స్ టెక్నాలజీస్ యూజర్లు 22.7 లక్షల మంది ఉన్నారు. బ్రాడ్‌బ్యాండ్ మార్కెట్లో 50.43 శాతం వాటాతో జియో అగ్రస్థానంలో ఉండగా, భారతి ఎయిర్‌టెల్ (30.61 శాతం), వొడాఫోన్ ఐడియా (13.37 శాతం) తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

ఫ్లాటుగా ముగిసిన స్టాక్ సూచీలు


సెన్సెక్స్ మైనస్.. నిఫ్టీ ప్లస్



ముంబై: ఆరంభ నష్టాల నుంచి కోలుకున్న స్టాక్ సూచీలు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే 452 పాయింట్లు పతనమై సెన్సెక్స్ చివరికి 13 పాయింట్ల స్వల్ప నష్టంతో 74,102 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 38 పాయింట్లు పెరిగి 22,498 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 145 పాయింట్లు క్షీణించి 22,315 వద్ద కనిష్టాన్ని తాకింది. అమెరికా మాంద్యం భయాలతో సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్ షేరు భారీ క్షీణత(27%), ప్రైవేటు బ్యాంకులు, ఐటీ షేర్లలో తలెత్తిన అమ్మకాలతో నష్టాలు మరింత అధికమయ్యాయి. అయితే అఖరిగంటలో అధిక వెయిటేజీ ఐసీఐసీఐ బ్యాంకు(2.50%), రిలయన్స్ (1%), ఎయిర్‌టెల్ (2%) షేర్లు రాణించడంతో సూచీలు నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. ట్రంప్ వాణిజ్య యుద్ధం ఆర్థిక మందగమనానికి దారితీయొచ్చనే ఆందోళనలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

యాంప్లిట్యూడ్‌పై జైడస్ లైఫ్ కన్ను

- మెజారిటీ వాటా కొనుగోలుకి రెడీ
- ఒప్పందం విలువ రూ. 2444 కోట్లు



న్యూఢిల్లీ: మెడ్‌టెక్ ఫ్రెంచ్ కంపెనీ యాంప్లిట్యూడ్ సర్జికల్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేసేందుకు ప్రత్యేక చర్చలు నిర్వహిస్తున్నట్లు దేశీ హెల్త్‌కేర్ సంస్థ జైడస్ లైఫ్‌సైన్సెస్ పేర్కొంది. మెజారిటీ వాటా సొంతం చేసుకునేందుకు కంపెనీ యాజమాన్యం పీఏఐ పార్ట్‌నర్స్‌సహా రెండు మైనారిటీ వాటాదారు సంస్థలతో డీల్ కుదుర్చుకోనున్నట్లు తెలియజేసింది. వెరసి వోటింగ్ హక్కులతో 85.6% వాటా కొనుగోలుకి 25.68 కోట్ల యూరోలు (రూ.2,444 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. అత్యంత నాణ్యమైన లోయర్ లింబ్ ఆర్థోపెడిక్ టెక్నాలజీలలో యాంప్లిట్యూడ్‌కు పట్టున్నట్లు పేర్కొంది. వీటిలో సమస్యాత్మకంగా మారిన జాయింట్ల రీప్లేస్‌మెంట్‌లో విని యోగించే మెడికల్ ప్రొడక్టుల డిజైన్, డెవలప్‌మెంట్ తదితర కార్యకలాపాలున్నట్లు తెలియజేసింది.

జైడస్ లైఫ్ షేరు బీఎస్‌ఈలో 0.8 శాతం బలపడి రూ. 900 వద్ద ముగిసింది.

మహిళా ఎంట్రప్రెన్యూర్లకు షీట్రేడ్స్ ఇండియా హబ్

ప్రారంభించిన ఎఫ్ఐఈవో



న్యూఢిల్లీ: ఔత్సాహిక మహిళా వ్యాపారవేత్తలకు సాధికారత కల్పించేందుకు, ఎగుమతుల వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఎగుమతి సంస్థల సమాఖ్య ఎఫ్ఐఈవో మంగళవారం షీట్రేడ్స్ ఇండియా హబ్‌ను ఆవిష్కరించింది. ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ (ఐటీసీ) భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ కేంద్రానికి బ్రిటన్ ప్రభుత్వానికి చెందిన షీట్రేడ్స్ కామన్వెల్త్ ప్లస్ ప్రోగ్రాం కింద నిధులు అందుతాయి. ఇది మహిళల సారథ్యంలో ఎగుమతుల వృద్ధికి దోహదపడుతుందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) సంతోష్ కుమార్ సారంగి తెలిపారు. ఇందులో 3 లక్షల మంది మహిళా ఎంట్రప్రెన్యూర్లను ఎన్‌రోల్ చేయడంపై ఎఫ్ఐఈవో, ఐటీసీ దృష్టి పెట్టాలని సూచించారు. దేశవ్యాప్తంగా మహిళల ఆధ్వర్యంలోని వ్యాపారాలకు వనరులను సమకూర్చే సమగ్ర కేంద్రంగా షీట్రేడ్స్ ఇండియా హబ్ ఉంటుంది. ఇందులో సామర్థ్యాలను పెంచుకునేందుకు ఉపయోగపడే వర్క్‌షాప్‌లు, మెంటారింగ్ సెషన్లు మొదలైనవి నిర్వహిస్తారు. భారత్ ఏటా 80,000 కోట్ల డాలర్ల ఉత్పత్తులు, సర్వీసులు ఎగుమతి చేస్తోందని, వచ్చే కొన్నేళ్లలో దీన్ని 2 లక్షల కోట్ల డాలర్లకు చేర్చుకోవాలనేది లక్ష్యంగా నిర్దేశించుకుందని సారంగి చెప్పారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
పర్యాటకానికి పండగ కళ.. | వీసీ ఫండింగ్‌కు చిరునామాగా భారత్

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- జనరల్ ఇంగ్లీష్

లక్ష్యంపై స్పష్టత, హార్డ్‌వర్క్‌తో విజయం

'ఫలితం గురించి ఆందోళన చెందకుండా.. లక్ష్యంపై స్పష్టత ఏర్పరచుకుని ఆ దిశగా సన్నద్ధమైతే.. ఎంతటి పోటీలోనైనా విజయం సాధించే అవకాశం ఉంటుంది. ప్రిపరేషన్ సమయంలో ఎలాంటి అసహనానికి గురవకుండా అడుగులు వేయడం కూడా ఎంతో ముఖ్యం' అంటున్నారు.. టీజీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ విజేత జిన్నా తేజస్విని రెడ్డి. తాజాగా.. టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల్లో ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు.. 900 మార్కులకు గాను 532.5 మార్కులతో టాపర్స్ జాబితాలో నిలిచి, డిప్యూటీ కలెక్టర్ పోస్ట్ వస్తుందని అంటున్న జిన్నా తేజస్విని రెడ్డి సక్సెస్ స్పీక్స్...



సక్సెస్ స్టోరీ

» టీజీపీఎస్సీ గ్రూప్-1 విజేత జిన్నా తేజస్విని రెడ్డి

విద్యాభ్యాసం వరంగల్‌లోనే

మా స్వస్థలం వరంగల్ జిల్లా శాయంపేట మండలం మాంధారిపేట గ్రామం. నాన్న విజయపాల్ రెడ్డి వ్యవసాయం చేస్తుంటారు, అమ్మ హేమలత గృహిణి. నా విద్యాభ్యాసం అంతా.. హనుమకొండ, వరంగల్‌లోనే సాగింది. కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌తో బీటెక్ పూర్తి చేశాను. మొదటి నుంచి క్లాస్ టాపర్‌గానే ఉన్నాను. పదో తరగతిలో 559 మార్కులు, ఇంటర్మీడియెట్‌లో 966 మార్కులు వచ్చాయి. ఆ తర్వాత బీటెక్‌లో చేరాను.

తాతయ్య స్ఫూర్తితో.. ప్రభుత్వ సర్వీసువైపు

నేను గ్రూప్స్ దిశగా దృష్టి పెట్టడానికి ప్రధాన కారణం మా తాతయ్య రమణారెడ్డి. ఆయన మాజీ సైనికాధికారి. ఆయనే ప్రభుత్వ సర్వీసులో చేరితే.. సమాజానికి సేవ చేసే అవకాశం ఉంటుందని.. నన్ను ప్రోత్సహించారు. దీంతో తొలుత సివిల్స్‌కు సిద్ధమవ్వమని సూచించారు. ఆ తర్వాత నాకు కూడా ప్రభుత్వ సర్వీసులు ముఖ్యంగా గ్రూప్స్‌తో ప్రజలకు సేవ చేయొచ్చనే భావన కలిగింది.

2019లో గ్రూప్-2కు ఎంపిక

గ్రూప్స్‌ను లక్ష్యంగా ఎంపిక చేసుకున్నాక.. అందుకు అనుగుణంగా సన్నద్ధమయ్యాను. ఫలితంగా 2019 గ్రూప్-2లో విజయంతో మండల పంచాయతీ ఆఫీసర్ నియామకం లభించింది. ఆ విధుల్లో ఉన్నప్పుడే గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో ఉన్నత లక్ష్యం ఏర్పరచుకుని గ్రూప్-1కు ప్రిపరేషన్ సాగించాను. ప్రిపరేషన్‌లో భాగంగా పరీక్షకు ముందు నుంచి ప్రస్తుత విధులకు సెలవు పెట్టాను.

స్వీయ ప్రిపరేషన్

గ్రూప్స్‌ను లక్ష్యంగా ఎంచుకున్న తర్వాత ఎలాంటి కోచింగ్ లేకుండానే.. స్వీయ ప్రిపరేషన్ సాగించాను. సిలబస్‌ను పరిశీలించి దానికి అనుగుణమైన పుస్తకాలను ఎంచుకుని.. అన్ని టాపిక్స్‌ను విస్తృత అధ్యయనం చేశాను. ఆయా అంశాలకు సంబంధించి ప్రామాణిక మెటీరియల్‌తోపాటు సమకాలీన అంశాలను నిరంతరం చదువుతూ పట్టు సాధించడానికి కృషి చేశాను.

కచ్చితంగా సమయ పాలన

ప్రిపరేషన్ సమయంలో కచ్చితంగా ప్రతి రోజు 8 నుంచి 10 గంటలు చదివేలా సమయ పాలన రూపొందించుకున్నాను. ఎట్టి పరిస్థితుల్లో ఆ ప్రణాళికను విస్మరించకుండా ప్రతి రోజు గ్రూప్-1లోని అన్ని పేపర్లలోని టాపిక్స్ చదివేలా సమయ పాలన పాటించాను. ఫలితంగానే ప్రస్తుతం ఇన్ని మార్కులు సాధించాను.

విసుగు చెందకుండా

గ్రూప్-1 పరీక్ష రెండు సార్లు వాయిదా పడినప్పటికీ ఎలాంటి విసుగు లేకుండా.. ప్రిపరేషన్‌కు లభించిన అదనపు సమయంగా భావించాను. ఈ ఆలోచన కూడా నాలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించింది. అంతేకాకుండా ఎప్పటికప్పుడు కొత్త అంశాలు నేర్చుకునే సమయం కూడా లభించింది.

ఆరో పేపర్ కోసం ప్రత్యేకంగా

తెలంగాణ ఏర్పడిన తర్వాత గ్రూప్-1 మెయిన్స్‌లో పొందుపర్చిన ఆరో పేపర్ (తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం) కోసం ప్రత్యేకంగా ప్రిపరేషన్ సాగించానని చెప్పొచ్చు. ఆ పేపర్‌లోని టాపిక్స్ కోసం పలు రకాల పుస్తకాలను చదివి.. వాటిలోని అంశాలను ఒక చోట అమర్చుకుని చదివాను. ఇందుకోసం అకడమిక్ పుస్తకాలతోపాటు, ఇతర ప్రామాణిక మెటీరియల్స్‌ను కూడా పరిశీలించాను.

డిగ్రీ, ఓపెన్ యూనివర్సిటీ పుస్తకాలు

మరోవైపు అన్ని సబ్జెక్ట్‌ల కోసం ఓపెన్ యూనివర్సిటీ బీఏ పుస్తకాలను చదివాను. అదే విధంగా కొన్ని అంశాల్లో విస్తృత పరిజ్ఞానం కోసం పీజీ స్థాయి పుస్తకాలను కూడా అధ్యయనం చేశాను. దీని వల్ల టాపిక్స్‌లో విస్తృత అవగాహన కోణంలో వాల్యూ ఎడిషన్ అయ్యిందని చెప్పొచ్చు.

కరెంట్ అఫైర్స్.. న్యూస్ పేపర్స్

ఇక కరెంట్ అఫైర్స్ కోసం ప్రతి రోజు క్రమం తప్పకుండా న్యూస్ పేపర్స్ చదివాను. పేపర్లలో ప్రచురితమైన వ్యాసాలు, కథనాల్లో ముఖ్యమైన వాటిని.. టాపిక్ వారీగా విభజించుకుని నోట్స్ రూపొందించుకున్నాను. ఇలా ఆరు టాపిక్స్‌కు సంబంధించి ప్రతి రోజు న్యూస్ పేపర్స్‌లో వచ్చిన అంశాలను ఆరు భాగాలుగా(ఎస్ అండ్ టీ, పాలిటీ, ఎకానమీ, హిస్టరీ, జాగ్రఫీ, గవర్నెన్స్) విభజించుకుని చదివాను.

సొంత నోట్స్, రైటింగ్ ప్రాక్టీస్

ప్రిపరేషన్‌లో భాగంగా.. ఆయా పేపర్లోని టాపిక్స్‌తో సొంత నోట్స్ రూపొందించుకున్నాను. అదే విధంగా పరీక్ష హాల్లో మంచి ప్రతిభ చూపేందుకు రైటింగ్ ప్రాక్టీస్ చేయడం కూడా ఎంతో ఉపకరించింది. అందుబాటులో ఉన్న సమయంలో 15 ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ఇన్నోవేటివ్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉంటుంది. ఇందుకోసం రైటింగ్ ప్రాక్టీస్ ఎంతో మేలు చేస్తుందని గుర్తించాలి. చిన్నప్పటి నుంచి ఇంగ్లిష్ మీడియంలో చదవడంతో పరీక్షలోనూ ఇంగ్లిష్ మీడియంనే ఎంచుకున్నాను. ఈ విషయంలో ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు.

హార్డ్ వర్క్, డిసిప్లిన్

పోటీ పరీక్షల ప్రిపరేషన్‌లో.. వాటి విజయంలో ఎంతో ముఖ్యమైన లక్షణాలు.. కష్టపడే తత్వం, స్వీయ క్రమ శిక్షణ. ఈ రెండింటినీ అలవర్చుకుని.. అభ్యసనం చేస్తే ఎంత క్లిష్టమైన అంశమైనా సులువుగా ఆకళింపు చేసుకోవచ్చు. గ్రూప్స్, సివిల్స్ వంటి పరీక్షలు కొంత సుదీర్ఘంగా జరుగుతాయి. ఈ సమయంలో ఎలాంటి విసుగూ, అసహనం లేకుండా స్థిర చిత్తంతో అడుగులు వేస్తే.. విజయం సొంతం చేసుకునే ఆస్కారం ఉంటుంది. భవిష్యత్తు ఔత్సాహికులకు కూడా నేనిచ్చే సలహా ఇదే.

పథకాలు అందేలా

గ్రూప్-1లో వచ్చిన మార్కుల మేరకు.. డిప్యూటీ కలెక్టర్ పోస్ట్‌కు ఎంపిక అవుతాననే నమ్మకం ఉంది. ఆ హోదాలో.. ప్రభుత్వ పథకాలను నా పరిధిలోని ఆయా వర్గాలకు అందేలా చేయడం, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడం లక్ష్యంగా విధులు నిర్వహిస్తాను.

జిన్నా తేజస్విని రెడ్డి గ్రూప్-1 మెయిన్స్ మార్కులు


- పేపర్-1 (జనరల్ ఎస్సే): 79.5
- పేపర్-2 (హిస్టరీ, కల్చర్, జాగ్రఫీ): 102
- పేపర్-3 (ఇండియన్ సొసైటీ, కాన్‌స్టిట్యూషన్, గవర్నెన్స్): 89.5
- పేపర్-4 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్): 113.5
- పేపర్-5 (ఎస్ అండ్ టీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్): 68
- పేపర్-6 (తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం): 80
- మొత్తం 900 మార్కులకు 532.5 మార్కులు

జిన్నా తేజస్విని రెడ్డి ప్రొఫైల్

- పదో తరగతి మార్కులు: 559
- ఇంటర్మీడియెట్ మార్కులు: 966
- బీటెక్ (సీఎస్ఈ) మార్కులు: 85.51 శాతం
- 2019లో గ్రూప్-2కు ఎంపిక (మండల పంచాయతీ ఆఫీసర్‌గా నియామకం)

ఒకటే లక్ష్యం.. అది సాధించే వరకు ప్రయత్నం

'జీవితంలో స్పష్టంగా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని.. దాని నుంచి దృష్టి మరల్చకుండా కృషి చేస్తే తప్పక విజయం లభిస్తుందని, ఈ క్రమంలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేలా మానసికంగా దృఢంగా ఉండడం ఎంతో ముఖ్యమని' అంటున్నారు టీజీపీఎస్సీ గ్రూప్-2 టాపర్.. నారు వెంకట హరవర్ధన్ రెడ్డి. టీజీపీఎస్సీ తాజాగా విడుదల చేసిన.. గ్రూప్-2 ఫలితాల్లో 447 మార్కులతో టాపర్‌గా నిలిచిన హరవర్ధన్ రెడ్డి సక్సెస్ స్పీక్స్..



సక్సెస్ స్టోరీ

» టీజీపీఎస్సీ గ్రూప్-2 టాపర్ హరవర్ధన్ రెడ్డి

ఏపీ నుంచి టీఎస్‌కు

మా స్వస్థలం ప్రకాశం జిల్లా కంభం. అయితే మా నాన్న రమణా రెడ్డి వృత్తి రీత్యా తెలంగాణలోనే విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కోదాడ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నా విద్యాభ్యాసం 1 నుంచి 7వ తరగతి వరకు ఖమ్మంలో, ఇంటర్మీడియెట్ విజయవాడలో.. ఆ తర్వాత బీటెక్(సీఎస్ఈ)ను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)- తాడేపల్లిగూడెంలో పూర్తి చేశాను.

నాన్న స్ఫూర్తితో

గ్రూప్-2ను ఎంచుకోవడానికి మా నాన్ననే నాకు స్ఫూర్తిగా చెబుతాను. ఆయన ప్రభుత్వ సర్వీసులో ఉండడంతో.. నేను కూడా ప్రభుత్వ ఉద్యోగం సాధించి.. సామాజిక సేవ చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఇదే స్ఫూర్తితో గ్రూప్స్ వైపు అడుగులు వేశాను.

2021 నుంచి ప్రిపరేషన్

గ్రూప్స్ లక్ష్యంగా చేసుకున్నాక.. 2021 నుంచి గ్రూప్స్ ప్రిపరేషన్‌కే సమయం కేటాయించాను. బీటెక్ పూర్తయ్యాక ఎలాంటి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు కూడా ప్రయత్నించలేదు. తొలుత సివిల్స్‌కు ఆన్‌లైన్‌లో కొంత కోచింగ్ తీసుకున్నాను. ఆ తర్వాత గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్లు వెలువడడంతో దృష్టి గ్రూప్స్ వైపు పెట్టాను.

రోజుకు పది గంటలు

ప్రిపరేషన్ క్రమంలో రోజుకు పది గంటల సమయం కేటాయించాను. గ్రూప్-1, గ్రూప్-2 రెండిటికీ ప్రిపరేషన్ సాగించినప్పటికీ.. గ్రూప్-2కు ఎక్కువ దృష్టిపెటాను. గ్రూప్-2లో విజయానికి ఆబ్జెక్టివ్ ప్రశ్నలపై పట్టు సాధించడం ఎంతో ముఖ్యం. ఆ బలం నాలో ఉందని గ్రహించి గ్రూప్-2కు మాత్రమే సమయం కేటాయించాను.

ప్రామాణిక పుస్తకాలు

ప్రిపరేషన్ కోసం ప్రామాణిక పుస్తకాలనే చదివాను. ఇండియన్ హిస్టరీకి నిధి సింఘానియా, తెలంగాణ ఉద్యమానికి సంబంధించి వి ప్రకాశ్ పుస్తకం, అదే విధంగా సైన్స్ అండ్ టెక్నాలజీల కోసం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అనుసరించాను. ప్రతి పుస్తకంలోనూ గ్రూప్స్ సిలబస్‌కు సరితూగే అంశాలను ఎంచుకుని వాటిని మాత్రమే చదివేలా ఫోకస్ పెట్టాను.

ఆన్‌లైన్ టూల్స్, న్యూస్ పేపర్స్

కరెంట్ అఫైర్స్ కోసం కాంపిటీటివ్ వెబ్‌సైట్స్‌ను, అదే విధంగా హిందూ పత్రికను చదివాను. వాటిలోని అంశాలను కోర్ అంశాలతో పోల్చుకుంటూ.. ముఖ్యమైన గణాంకాలను పుస్తకంలో పొందుపర్చుకున్నాను. గత ప్రశ్న పత్రాలను పోల్చుకుంటూ న్యూస్ పేపర్స్ చదవడం ఫలితంగా కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి ప్రశ్నల తీరు, ముఖ్యమైన అంశాలను గుర్తించడం వంటి నైపుణ్యం లభిస్తుంది.

గ్రూప్-2 నోట్స్.. ప్రత్యేకంగా

సాధారణంగా పోటీ పరీక్షలకు సొంత నోట్స్ రూపొందించుకోవడం ఎంతో ముఖ్యమనేది వాస్తవం. అయితే ఈ విషయంలో గ్రూప్-2కు సంబంధించి మరింత ప్రత్యేకంగా వ్యవహరించాలి. గ్రూప్-2 పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.. కాబట్టి.. ఆయా అంశాలకు సంబంధించి నోట్స్‌లో ఎక్కువ శాతం గణాంకాలు ఉండేలా చూసుకుంటే బాగుంటుంది. దీనివల్ల రివిజన్ సమయంలో ఎంతో సమయం ఆదా అవుతుంది. ఆయా అంశాలకు సంబంధించి సదరు గణాంకాలను చదవగానే వాటి పూర్వాపరాలు సైతం జ్ఞప్తికి వస్తాయి.

లక్ష్యం ఒకటే నిర్దేశించుకుంటే

నా అభిప్రాయంలో పోటీ పరీక్షల కోణంలో ఒకేసారి అన్ని పరీక్షలకు సంసిద్ధమవ్వాలనే తపనకంటే.. నిర్దిష్టంగా ఒక పరీక్షను లక్ష్యంగా ఎంచుకుని దాన్ని సాధించే దిశగా కృషి చేస్తే.. సత్ఫలితం వస్తుంది. అందుకే నేను గ్రూప్-2నే లక్ష్యంగా చేసుకుని ఇతర ఏ పరీక్షలకు ప్రిపరేషన్ సాగించలేదు. ఫలితంగా టాపర్‌గా నిలిచానని భావిస్తున్నాను.

అసహనానికి గురవ్వద్దు

పోటీ పరీక్షల ప్రిపరేషన్ కోణంలో ఎలాంటి అసహనానికి గురి కాకూడదు. ముఖ్యంగా పరీక్షలు వాయిదా పడినప్పుడు లేదా సుదీర్ఘ కాలం కొనసాగే పరీక్షల విషయంలో సహనం ఎంతో అవసరం. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా అడుగులు వేసే మానసిక సంసిద్ధత లభిస్తుంది.

డీటీ లేదా ఏఎస్ఓ

భవిష్యత్తులో డిప్యూటీ తహశీల్దార్ లేదా సెక్రటేరియట్‌లో ఏఎస్ఓ ఉద్యోగాన్ని ఎంచుకుంటాను. నా పరిధిలో వీలైనంత మేరకు సర్వీస్ చేసేందుకు కృషి చేస్తాను. అదే విధంగా రానున్న రోజుల్లో గ్రూప్-1, సివిల్స్‌కు కూడా ప్రిపరేషన్ సాగించాలనుకుంటున్నాను.

నారు వెంకట హరవర్ధన్ రెడ్డి గ్రూప్-2 మార్కులు

- పేపర్-1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ): 111
- పేపర్-2 (హిస్టరీ, పాలిటీ, సొసైటీ): 109
- పేపర్-3 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్): 111
- పేపర్-4 (తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం): 115

అకడమిక్ ప్రొఫైల్

- పదో తరగతి: 10 సీజీపీఏ
- ఇంటర్మీడియెట్: 972 మార్కులు
- బీటెక్ (సీఎస్ఈ): 68 శాతం

క్లుప్తంగా...

పోలీస్ అకాడమీలో ఏఎంవీఐ శిక్షణా తరగతులు



బండ్లగూడ(హైదరాబాద్): రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో కొత్తగా ఎంపికైన అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ)ల శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నెల రోజుల పాటు శిక్షణ ఉండేదని... ఇప్పుడు 4 నెలల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. రవాణాశాఖకు సంబంధించి మొదటిసారి లోగో తయారు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ నర్మదా తదితరులు పాల్గొన్నారు.

‘భద్రత’పై డీజీపీ సమీక్ష




సాక్షి, హైదరాబాద్: పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన భద్రత పథకం అమలు తీరుపై డీజీపీ జితేందర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. భద్రత సంస్థ చైర్మన్‌గా వార్షిక ఖాతాలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ సొసైటీస్ చట్టం కింద స్థాపించిన భద్రత పథకంలో ప్రస్తుతం 81,315 మంది పోలీసు సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది సభ్యులుగా ఉన్నారన్నారు. ఈ పథకం పోలీసు సిబ్బందికి సామాజిక భద్రత, ఆర్థిక సహాయం అందించడం లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ పథకం కింద గృహ నిర్మాణ రుణాలు, విద్యా రుణాలు (విదేశాల్లో చదువులకు సహా), కుమార్తెల వివాహాలకు ఆర్థిక సహాయం వంటి పలు ప్రయోజనాలను అందిస్తుందని డీజీపీ తెలిపారు. సమావేశంలో ఇంటెలిజెన్స్ డీజీ బి.శివధర్ రెడ్డి, మల్టీ-జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, భద్రత కార్యదర్శి గోపాల్‌రెడ్డి, అడిషనల్ ఐజీ (లా అండ్ ఆర్డర్) రమణ కుమార్ పాల్గొన్నారు.


‘ఎన్‌హెచ్‌ఏఐ పీడీ’ ఆస్తుల జప్తు


వరంగల్ లీగల్: నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆఫీస్ ఆస్తుల జప్తునకు జనగామ జిల్లా జడ్జి ఆదేశాలు జారీ చేశారు. జనగామ జిల్లా నెల్లుట్ల గ్రామంలో నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం కోసం 2013లో భూసేకరణ చేశారు. భూమిని కోల్పోయిన రైతులకు నష్టపరిహారం తక్కువ రావడంతో కలెక్టర్ ఆర్బిట్రేటర్ అథారిటీ ముందు ఫైల్ చేయగా ఆర్బిట్రేటర్/ కలెక్టర్ నష్టపరిహారం పెంచారు. ఈ కేసులో కొన్నేళ్లుగా రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ నష్టపరిహారం చెల్లించనందున మళ్లీ రైతులు నేషనల్ హైవే ఆస్తుల జప్తునకు ఆదేశాలివ్వాలని జనగామ జిల్లా జడ్జిని కోరారు. దీనికి స్పందించిన జిల్లా ప్రధాన జడ్జి రవీంద్రశర్మ హనుమకొండలో ఉన్న నేషనల్ హైవే ఆఫీసులోని కుర్చీలు, బెంచీలు, అల్మారాలు, కంప్యూటర్లు జప్తు చేయాలని ఆదేశాలు జారీచేశారు.

జనం డబ్బులు.. ఎక్కడెక్కడ?


ఓ వైపు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభ పరిస్థితులు.. అటూ ఇటూ మారిపోతున్న వడ్డీ రేట్లు.. స్టాక్ మార్కెట్లలో హెచ్చుతగ్గులు.. చుక్కలు తాకుతున్న బంగారం ధరలు.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు తమ సొమ్మును ఎక్కడ పెట్టుబడిగా పెడుతున్నారనేది ఆసక్తిగా మారింది. దీనిపై రిజర్వు బ్యాంకు, స్టేట్ బ్యాంకు, ఇతర ప్రముఖ ఆర్థిక సంస్థల గణాంకాలు, స్టాక్‌గ్రో ఇన్వెస్టర్ బిహేవియర్ ఇండెక్స్ ఏం చెబుతున్నాయంటే...








సాక్షి, సెంట్రల్‌డెస్క్





అశ్రద్ధ చేస్తే ‘అంధకారమే’

ప్రమాదకరంగా మారుతున్న కంటి కేన్సర్లు

- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు
- ఆసియా, పసిఫిక్ దేశాల్లోనే కంటి కేన్సర్లు అధికం
- పిల్లల్లో ప్రాణాంతక రెటినోబ్లాస్టోమా కేన్సర్
- ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి వైద్యుల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. కంట్లో ఏదైన నలత పడి కాసేపు చూడలేకపోతేనే అల్లాడిపోతాం. అలాంటిది కంటి చూపు మొత్తమే లేని జీవితాన్ని ఊహించుకోగలమా? అందుకే శరీర భాగాల్లో కంటికి అంతటి ప్రాధాన్యం. కానీ, కళ్లకు సోకే వ్యాధుల గురించి ఇప్పటికీ ప్రజల్లో పెద్దగా అవగాహన లేదు. ఇటీవల కాలంలో వివిధ రకాల కేన్సర్లపై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయితే కేన్సర్ అంటే ఊపిరితిత్తులు, రొమ్ము, చర్మానికి, కిడ్నీ, లివర్ ఇతర అవయవాలకు మాత్రమే సంబంధించినదనే అపోహ ఉంది. కానీ, కేన్సర్ భూతం కళ్లపైనా దాడి చేస్తుంది. వెంటనే గుర్తించకుంటే జీవితమే అంధకారమవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



పెరుగుతున్న కంటి కేన్సర్ బాధితులు

మనదేశంలో కంటి కేన్సర్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. ప్రధానంగా బాల్య కంటి కేన్సర్ల ప్రభావం అధికంగా కనిపిస్తోంది. పిల్లల్లో ప్రాణాంతకమైన రెటినోబ్లాస్టోమా కలవరపెడుతోంది. ఆసియా, పసిఫిక్ దేశాల్లోనే ఈ కేన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు చెప్పారు. పదేళ్ల వయసు పైబడిన వారిలో ఆక్యులర్ సర్ఫేస్ స్క్వామస్ నియోప్లసియా (ఓఎస్ఎస్ఎన్), సెబాసియస్ గ్లాండ్ కార్సినోమా సమస్యలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. కనురెప్పల కేన్సర్లలో 53 శాతం సెబాసియస్ గ్లాండ్ కార్సినోమా ఉంది. కంటిలో ఉన్నట్లుండి కణతులు రావడం, కన్ను నొప్పి పెట్టడం, వాపు రావడం, ఆకారంలో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. రెటినోబ్లాస్టోమా వ్యాధితో బాధపడుతున్న పిల్లల్లో త్వరితగతిన గుర్తించడం, అవగాహన, చికిత్సలు అందించడానికి ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞాన సంస్థ మే నెలలో వార్షిక మైటథాన్ పరుగు నిర్వహించనుంది.

అసాధారణ లక్షణాలు గుర్తిస్తే పరీక్షించుకోవాలి



ఉన్నట్లుండి చూపు తగ్గిపోవడం, అసాధారణ లక్షణాలు, కన్నులో చిన్న కణితులు రావడం గుర్తిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. కంటి కేన్సర్ అరుదుగా వస్తుంది. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా మారుతుంది. కేన్సర్ రకం, స్థాయిని బట్టి టాపికల్, ఇంట్రావీనస్, ఇంట్రా ఆర్టీరియల్ కీమో థెరపీ చికిత్స చేస్తారు. కేన్సర్ కణాలను నాశనం చేయడానికి ప్లాక్ బ్రాకీ థెరపీ, బాహ్య బీమ్ రేడియేషన్ ఉపయోగిస్తారు.

-డా. స్వాతి కలికి, హెడ్ ఆర్బిట్, ఓక్యులర్ అంకాలజీ, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్

స్వయం ఉపాధికి రూ.6 వేల కోట్లు

రాజీవ్ యువ వికాసం పేరుతో కొత్త పథకం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు రూ.3 లక్షల ఆర్థిక సాయం
- మార్చి 15న నోటిఫికేషన్... అదే రోజు నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంజూరు పత్రాలు
- రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మందికి ప్రయోజనం.. చాకలి ఐలమ్మ వర్సిటీకి తక్షణమే రూ.115 కోట్లు


చాకలి ఐలమ్మ వర్సిటీలో విద్యార్థులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం ప్రత్యేక పథకాన్ని అమల్లోకి తేనున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. రాజీవ్ యువ వికాసం పేరుతో అమలు చేయనున్న ఈ పథకం కోసం రూ.6వేల కోట్లు కేటాయిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. మంగళవారం కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులను పట్టించుకోలేదని, ఆయా వర్గాల కోసం పెట్టిన ఆర్థిక కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువత కోసం కొత్త పథకాన్ని తెస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద ఆయా వర్గాలకు చెందిన యువకులకు వ్యక్తిగతంగా రూ.3 లక్షల వరకు ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు. ఇందుకోసం ఈ నెల 15న నోటిఫికేషన్ జారీ చేస్తామని, ఆ రోజు నుంచే ఆన్‌లైన్‌లో రాజీవ్ యువ వికాసం పథకం కోసం నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వచ్చే నెల 5 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని, ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు ఈ దరఖాస్తులను పరిశీలించి, జిల్లాల కలెక్టర్లు అర్హులను ఎంపిక చేస్తారని వివరించారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నిరుద్యోగులకు ఆయా కార్పొరేషన్ల ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తామని, ఇతర వర్గాలకు కూడా భవిష్యత్తులో అమలు చేసే ఆలోచన ఉందని భట్టి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వమే నిరుద్యోగులకు బ్యాంకు లింకేజీతో రుణం ఇప్పిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సమానంగా ప్రయోజనం చేకూరుస్తామన్నారు.

ఐలమ్మ వర్సిటీకి రూ.540 కోట్లు

వీర వనిత చాకలి ఐలమ్మ పేరిట ఏర్పాటు చేసిన మహిళా విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం రూ.540 కోట్లు కేటాయించామని, దేశంలోనే ఉత్తమ వర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి చెప్పారు. ఈ వర్సిటీ ప్రాంగణంలో ఉన్న చారిత్రక కట్టడాలను పునరుద్ధరించేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించినట్టు చెప్పారు. వర్సిటీ ప్రధాన ద్వారం మూసీ నదిని ఆనుకుని ఉందని, మూసీ పునరుజ్జీవం తర్వాత ఈ ప్రధాన గేటును తిరిగి ప్రారంభిస్తామన్నారు. వారసత్వ కట్టడాల పునరుద్ధరణ పనుల ప్రారంభానికి తక్షణమే రూ.15.5 కోట్లు, నూతన భవనాల నిర్మాణానికి రూ.100 కోట్లు విడుదల చేస్తున్నట్టు భట్టి వెల్లడించారు. అనంతరం వర్సిటీ ప్రాంగణంలోని చారిత్రక కట్టడాలను వర్సిటీ వీసీ సూర్య ధనుంజయతో కలిసి భట్టి పరిశీలించారు. భట్టి వెంట ఎంపీ పోరిక బలరాం నాయక్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఐ అండ్ పీఆర్ కమిషనర్ హరీశ్ తదితరులు ఉన్నారు.

డబ్బులిస్తేనే దప్పిక తీరేను

చందాలతో నీళ్ల క్యాన్లు.. • ‘ఆదర్శ’విద్యార్థుల దురవస్థ


ఆదర్శ పాఠశాలలోకి నీళ్ల క్యాన్‌ను మోసుకెళ్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: గొంతు తడుపుకొనే మార్గం లేక.. అక్కడి విద్యార్థులు రూపాయి, రెండు రూపాయల చొప్పున చందాలు వేసుకుని వాటర్ క్యాన్లు తెచ్చుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి నీటి కష్టాలు లేకుండా చూడాలని కోరుతున్నారు. ఇబ్రహీంపట్నం ఆదర్శ పాఠశాలలో తాగునీటి సమస్యతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆదర్శ పాఠశాల ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్ వద్ద కొనసాగుతోంది. ఇక్కడ 6నుంచి 12వ తరగతి వరకు సుమారు 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి మెట్రో వాటర్ సరఫరా లేదు. బోర్లు ఎండిపోవడంతో తాగడానికి, ప్లేట్లు కడుక్కునేందుకు సైతం నీళ్లు లేవు. దీంతో నిత్యం రూ.20 పెట్టి.. స్కూల్ ఎదుట ఉన్న వాటర్ ప్లాంట్ నుంచి 20 లీటర్ల డబ్బాలు కొనుగోలు చేస్తున్నారు.కాగా, విషయం తెలుసుకున్న కలెక్టర్ నారాయణరెడ్డి సమస్య పరిష్కారానికి తక్షణమే రూ.3 లక్షలు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన బుధవారం సాయంత్రంలోపు బోరు మోటారును బాగు చేయాలని సూచించారు.

ఆ అధికారులకూ మెజిస్టీరియల్ పవర్స్

- ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లుగా అదనపు, సంయుక్త సీపీలు
- డీసీపీలతోపాటు జిల్లా ఎస్పీలు కూడా..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పోలీసు కమిషనరేట్లు, జిల్లా ఎస్పీ, ఆపై స్థాయి అధికారులకు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ల హోదా వచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు కేవలం నగర పోలీసు కమిషనర్లకు మాత్రమే ఈ తరహా అధికారాలు ఉండేవి. ఈ నేపథ్యంలో నగరాల్లో నిషేధాజ్ఞలు విధించాలన్నా, కీలక ఉత్తర్వులు జారీ చేయాలన్నా, కొన్ని వివాదాలను పరిష్కరించడానికి కోర్టులు నిర్వహించాలన్నా వీరికే అవకాశం ఉండేది. కమిషనరేట్లకు నేతృత్వం వహించే కమిషనర్లకు మినహాయిస్తే జిల్లాల్లో ఉండే ఎస్పీలకు ఇలాంటి అవకాశం లేదు. వీళ్లు కచ్చితంగా ఆయా జిల్లా కలెక్టర్లకు విజ్ఞప్తి చేయడం ద్వారానే నిషేధాజ్ఞల వంటి ఉత్తర్వులు జారీ చేయించాల్సి వచ్చేది. దీనివల్ల కొన్ని సందర్భాల్లో సమన్వయంతోపాటు ఇతర ఇబ్బందులు తలెత్తేవి. గత ఏడాది నుంచి అమల్లోకి వచ్చిన భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) పోలీసు అధికారులకు స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలు దఖలు పరిచే పవర్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చింది. ఈ చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం కమిషనరేట్లలో విధులు నిర్వర్తించే అదనపు పోలీసు కమిషనర్లు (ఐజీ ర్యాంకు), సంయుక్త పోలీసు కమిషనర్లతో (డీఐజీ ర్యాంకు)పాటు డిప్యూటీ పోలీసు కమిషనర్లకూ ఈ అధికారాలు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా ఎస్పీలకూ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలు ఇచ్చినప్పటికీ.. ఎస్పీ ఆపై స్థాయి వారికి మాత్రమే వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



చరిత్రకు సాక్ష్యం..
భువనగిరి ఖిల్లా

నేటికీ చెక్కు చెదరని కట్టడాలు
- నిత్యం పర్యాటకులతో సందడి
- పూర్వవైభవానికి చర్యలు
- స్వదేశీ దర్శన్ కింద రూ.118 కోట్లు మంజూరు
- మొదలైన తొలి విడత పనులు


ఖిల్లాపైన నిర్మించబడిన రాజప్రసాదం

భువనగిరి: హైదరాబాద్ నగరానికి 47 కిలో మీటర్ల దూరంలో ఉన్న భువనగిరి పట్టణంలోని భువనగిరి ఖిల్లా అనేక పోరాటాలకు, చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తూ చెక్కు చెదరని నిర్మాణంగా ఉంది. సముద్ర మట్టానికి 610 మీటర్ల ఎత్తులో ఏకశిలా రాతిగుట్టపై నాటి రాజులు కోట నిర్మించారు. కోట కింది భాగంలో గుర్రాల కోసం కొట్టాలు, ధాన్యాన్ని నిల్వ చేయడానికి ధాన్యాగారాలు, సైనికుల కోసం సైనిక గారాలున్నాయి. రాజ భవనాల కింద శిలా గర్భంలో అనేక రహస్య మార్గాలున్నాయని స్థానికులు చెబుతుంటారు. చాళుక్యుల శిల్పరీతిని ప్రతిబింబించే రాజప్రసాదాలు, కాకతీయ శైలిలో అనేక శిలాకృతులను చెక్కారు.


త్రిభువనమల్ల విక్రమాదిత్య పేరుతో..

కాకతీయుల కాలంలో భువనగిరి కోట ప్రముఖంగా ప్రసిద్ధి చెందింది. పశ్చిమ చాళుక్య వంశానికి చెందిన పాలకుడైన ఆరవ త్రిభువనమల్ల విక్రమాదిత్య ఖిల్లాపై కోట నిర్మించారు. అతని పేరుమీదుగా దీనికి త్రిభువనగిరి అనే పేరు వచ్చింది. ఈ పేరు క్రమంగా భువనగిరిగా మార్పు చెందింది. అలాగే త్రిభువనమల్లుకి స్థానికులైన గొల్ల దంపతులు ఈ కొండను చూపించారని అరణ్యంలో తీగలతో కప్పబడి ఉన్న ఈ కొండ కోట నిర్మాణానికి అనుకూలంగా ఉందని భావించి దర్గం నిర్మించారు. దీంతో స్థానికులైన బోనయ్య గిరమ్మ దంపతుల పేరుగానే ఈ పట్టణానికి భువనగిరిగా పేరు వచ్చిందని మరో కథనం కూడా ఉంది. ఈ కోట పరిసర ప్రాంతాల్లో మధ్యరాతియుగం, నవీన శిలాయుగం, మధ్య పాతరాతియుగం నాటికి చెందిన బాణాలు, రాతి గొడ్డళ్లు, కత్తులు, సమాధుల ఆనవాళ్లు లభ్యమయ్యాయి. భువనగిరి కోట కొంతకాలం కుతబ్‌షాహీల పరిపాలనతో కూడా ఉంది. 1687లో మొఘలులు గోల్కొండను ఆక్రమించినప్పుడు ఈ కోట కొంత కాలం మొఘలుల పాలనలోకి వెళ్లింది. అనంతరం కల్లు గీత కుటుంబంలో జన్మించిన సర్దార్ సర్వాయి పాపన్న 1708లో ఓరుగల్లును గెలుచుకొని తర్వాత భువనగిరి కోటను జయించి తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు.



ఖిల్లాపై చెక్కుచెదరని నిర్మాణాలు

భువనగిరి కోట మొదటి ద్వారాన్ని ఉక్కు ద్వారం అని పిలుస్తారు. నిజాం రాజు తన సొంత ఖర్చుతో ఈ ద్వారాన్ని నిర్మించినట్లు చెబుతారు. ఇది గోల్కొండ కోటలోని బాలాహిస్సార్ మొదటి ద్వారం ఫతే దర్వాజాను పోలి ఉంటుంది. ఎత్తైన గోడలు, విశాలమైన గదులు, ఇస్లాం సంస్కృతి నిర్మాణ శైలిలో కనిపిస్తాయి. అండాకారపు ఏకశిలాపర్వతం గల కొండ దక్షిణం నుంచి చూస్తే తాబేలుగా, పడమర నుంచి చూస్తే పడుకున్న ఏనుగులాగా కనిపిస్తుంది. ఏనుగుల మోట వాగులు, బైరవకొలను, సప్త కన్యలు అనే పేరుతో నీటి కొలనులు ఉన్నాయి. దిగుడు మెట్ల బావులు, వంట గదులు, అశ్వ శాలలు, ఎనిమిది దిక్కుల్లో ఫిరంగులున్నాయి. ఖిల్లాపైన మూడు అత్యవసర ద్వారాలున్నాయి. ఇందులో రెండు మూసుకుపోగా ఒకటి మాత్రం నామమాత్రంగా ఉంది. శిలాశాసనాలు, దేవాలయాలకు చెందిన శిథిలాలు కూడా ఉన్నాయి. కొండ మధ్య భాగంలో మండపంతో పాటు ఖిల్లా చుట్టూ రక్షణ గోడలలో మూడు అంచెలలో ఎలాంటి మట్టి లేకుండా పూర్తిగా రాతితోనే నిర్మించారు.



ఖిల్లా అభివృద్ధికి చర్యలు

భువనగిరి ఖిల్లా అభివృద్ధికి 2024లో కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ కింద రూ.118 కోట్లు కేటాయించింది. ఇటీవల మళ్లీ అధికారంలోకి వచ్చిన కేంద్రం ప్రభుత్వం తిరిగి ఖిల్లా అభివృద్ధికి మొదటి విడత కింద రూ.58 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ఖిల్లాపై రోప్ వేతో పాటు కింది భాగంగా బీటీ రోడ్డు, ఖిల్లాపై విశ్రాంతి ప్రదేశాలు, పార్కులు, ఆట సామగ్రి, కింది భాగంలో పార్కింగ్ కోసం ప్రదేశాలు ఏర్పాటు చేయడం, విద్యుత్ కాంతులు వెదజల్లేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం వంటి వాటిని ప్రణాళిక కింద తీసుకున్నారు. ఈ అభివృద్ధి పనులను చేసేందుకు ఎల్ అండ్ టీ సంస్థలకు అప్పగించారు. ప్రస్తుతం ఈ పనులకు సంబంధించి చేపట్టేందుకు టెండర్లు దశలో ఉన్నాయి.

సందర్శకుల సందడి..

భువనగిరి ఖిల్లాను సందర్శించేందుకు నిత్యం ఎంతో మంది వస్తుంటారు. ఇందులో ప్రధానంగా జూన్ నుంచి ఫిబ్రవరి వరకు ఖిల్లాలో సందర్శకులతో సందడి కనిపిస్తుంది. భువనగిరి ఖిల్లాను అమెరికా, రష్యా, ఫ్రాన్స్, స్వీడన్, స్విట్జర్లాండ్, ఆస్ట్రేలియా, బ్రిటన్, దేశాలకు చెందిన వారితో పాటు దేశంలోనే అన్ని రాష్ట్రాలకు చెందిన వారు కూడా సందర్శిస్తుంటారు. చారిత్రక చరిత్ర కలిగిన ఖిల్లాపై ఎన్నో బాలీవుడ్ సినిమాలకు సంబంధించి సన్నివేశాలు చిత్రీకరించారు.


భువనగిరి ఖిల్లాపై నీటి కొలను


టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం

నోటిఫికేషన్ నుంచి నియామకం దాకా

ఎన్పీడీసీఎల్‌లో రిక్రూట్‌మెంట్ తీరిదీ...

హనుమకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 497 సబ్ ఇంజనీర్ల పోస్టుల భర్తీకి 2018, మే 24న నోటిఫికేషన్ జారీ చేశారు. అదే ఏడాది జూలై 8న రాత పరీక్ష నిర్వహించారు. అగస్టు 31న ఫలితాలు ప్రకటించారు. పోస్టుకు ఒక్కరు చొప్పున మెరిట్ ఆధారంగా అభ్యర్థులకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సెప్టెంబర్ మాసంలో పూర్వ సర్కిల్ వారీగా వేర్వేరు తేదీల్లో కాల్ లెటర్ పంపించారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మేరకు 497 మందికి కాకుండా 427 మందికి మాత్రమే కాల్ లెటర్ పంపారు. అంటే ఇక్కడ 70 పోస్టులు తగ్గించారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా నియామక ప్రక్రియ నిలిపివేశారు.. ఎన్నిక కోడ్ ఎత్తివేశాక 2018 డిసెంబర్‌లో పూర్వ సర్కిల్‌ల వారీగా మరోసారి సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలని కాల్ లెటర్ పంపారు. ఈ సమయంలో మరో 24 పోస్టులు తగ్గించారని అర్హులైన అభ్యర్థులు వాపోయారు. గతంలో కాల్ లెటర్ అందుకొని రెండోసారి అందని అభ్యర్థులు వెంటనే హైకోర్టును ఆశ్రయించగా అంతకుముందు కాల్‌లెటర్ జారీ చేసిన వారందరికి తిరిగి జారీ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు అధికారులు అనర్హులతో కలిపి 427 మందికి కాల్‌లెటర్ పంపి పోస్టులు భర్తీ చేశారు. ఇక్కడ కోర్టు ఆదేశాలతో కాల్ లెటర్ పొందిన 24 మంది అభ్యర్థులను పక్కన పెట్టారు. ఈ విషయమై తాము అధికారులను సంప్రదిస్తే కోర్టు కాల్ లెటర్ మాత్రమే జారీ చేయమని చెప్పిందని, ఉద్యోగాలు ఇవ్వాలని చెప్పలేదని తప్పించుకున్నారని అభ్యర్థులు వాపోయారు.

పోస్టులు తగ్గించి ఇన్‌సర్వీసు వారితో భర్తీ..

నోటిఫికేషన్‌లో పేర్కొన్న 497 పోస్టులను నిబంధనల మేరకు పూర్తిగా అర్హులైన అభ్యర్థులతో భర్తీ చేయాలి. కానీ పోస్టులు తగ్గించి, జేఎల్‌ఎంలుగా పనిచేస్తున్న వారికి పదోన్నతులు కల్పించి నిబంధనలకు విరుద్ధంగా ఇన్ సర్వీస్ వారితో భర్తీ చేసినట్టు సమాచారం. దీంతోపాటు లోకల్, నాన్ లోకల్ అంశంలో తప్పుడు రోస్టర్ విధానం అనుసరించి ఎన్పీడీసీఎల్ పరిధిలోకి వారికి కాకుండా ఎన్పీడీసీఎల్ పరిధిలోని జిల్లాలకు చెందిన అభ్యర్థులతో భర్తీ చేశారని, ఇక్కడ పెద్ద ఎత్తున అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. గత ప్రభుత్వంలోని పెద్దల ప్రమేయం, గత పాలకవర్గం అండదండలతో అక్రమాలు, అవకతవకలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలున్నాయి.

విచారణ కమిటీ నివేదికను బట్టి నిర్ణయం



సబ్ ఇంజనీర్ల రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు రావడంతోపాటు ఫిర్యాదులందాయి. అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో వాస్తవాల పరిశీలనకు... అక్రమాలు, అవకతవకలు జరిగాయా.. లేదా తెలుసుకోవడానికి సమగ్ర విచారణ జరిపేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ వేశాం. ఈ కమిటీ ఇచ్చే నివేదికను బట్టి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. అనర్హులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచిస్తాం.

– కర్నాటి వరుణ్ రెడ్డి, సీఎండీ, టీజీ ఎన్పీడీసీఎల్

వ్యవసాయ యాంత్రీకరణలో చిన్న, సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి


మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా చిన్న, సన్నకారు రైతులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. 'రైతు నేస్తం'కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన వర్చువల్‌గా పాల్గొని రాజేంద్రనగర్ వరి పరిశోధన స్థానం నుంచి శాస్త్రవేత్తలు రైతులకు వివరించిన యాజమాన్య పద్ధతులను ఆలకించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఆరుతడి పద్ధతిలో వరికి నీరు అందించాలని, దీనివల్ల నీటి ఎద్దడిని అధిగమించడంతోపాటు, అధికదిగుబడులు సాధించ డానికి అవకాశం ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ స్వల్పకాలిక రకాలను నవంబర్‌లోనే సాగు చేస్తే, మార్చి మొదటి వారం వరకు వరికోతకు అవకాశం ఉంటుందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పవర్ టిల్లర్స్, పవర్ వీడర్, రోటోవేటర్, ట్రాక్టర్‌తో నడిపే పరికరాలు, తైవాన్ స్ప్రేయర్స్ మొదలైన వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ సంచాలకురాలు యాస్మిన్ భాషాకు సూచించారు. మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న కందులు, శనగలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు మొదలైన పంటల కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసు కోవాలని మంత్రి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఎండీలు ఉదయ్‌కుమార్, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

'ఈటల' పిటిషన్‌పై కౌంటర్ వేయండి

పోలీసులకు హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: కమలాపూర్ పోలీస్ స్టేషన్‌లో 2021లో దాఖలు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ దాఖలు చేసిన పిటిషన్‌పై.. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఫిర్యాదీ ఎల్కతుర్తి నయాబ్, తహసీల్దార్ ఎస్.విజయ్‌కు కూడా నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేసింది. 2021లో హుజూరాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్‌ను, కరోనా మార్గదర్శకాలను రాజేందర్ ఉల్లంఘించారని ఎస్.విజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కమలాపూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. కేసు ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఈటల రాజేందర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పోలీసులకు, ఫిర్యాదీకి నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

బీఆర్ఎస్ నేత జీవన్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఈర్లపల్లిలో భూవివాదంపై చేవెళ్ల పీఎస్‌లో దాఖలైన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. జీవన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు తన భూమిని కబ్జా చేశారని దామోదర్‌రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో 2024, మేలో కేసు నమోదైంది. తాను ప్రశ్నిస్తే మారణాయుధాలు చూపించి బెదిరింపులకు పాల్పడ్డారని కూడా చెప్పారు. తొలుత ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ జీవన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ ఎదుర్కోవాల్సిందేనని చెబుతూ ఈ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ముందస్తు బెయిల్ కోరుతూ జీవన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఫిర్యాదుదారుకు ఎలాంటి గాయం కాలేదని, అయినా ఫిర్యాదులో గాయపడినట్లు పేర్కొన్నారన్నారు. జీవన్‌రెడ్డి విచారణకు పూర్తిగా సహకరిస్తారని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. పోలీసుల తరఫున ఏపీపీ వాదనలు వినిపిస్తూ.. బెయిల్ మంజూరు చేస్తే ఫిర్యాదుదారుపై జీవన్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడే అవకాశం ఉందన్నారు.

'పసుపు రైతుల ఆందోళనలపై ప్రభుత్వాలు స్పందించాలి'



సాక్షి, హైదరాబాద్: పసుపు రైతుల ఆందోళన కార్యక్రమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు షేర్ నర్సారెడ్డి డిమాండ్ చేశారు. పసుపు పంటకు క్వింటాలుకు రూ.15 వేల మద్దతు ధర ప్రకటించాలని, రైతుల డిమాండ్ పరిష్కరించాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 10న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో, అలాగే 11వ తేదీన జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో పసుపు రైతులు ఆందోళన కార్యక్రమాలను చేపట్టినప్పటికీ ప్రభుత్వాలు ఏమాత్రం స్పందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలుకు సగటు ధర రూ.7 వేల నుంచి రూ.10,500 వరకు దాటని పరిస్థితులు నెలకొన్నాయని, వ్యాపారులు సిండికేట్‌గా మారి పసుపు రైతులను నిట్ట నిలువునా ఆర్థిక దోపిడీకి గురి చేస్తున్నారని ఆరోపించారు.

సీఎం రేవంత్‌రెడ్డి 'డెజావు' స్థితిలో ఉన్నారు

మాజీ ఎంపీ డా.బూర నర్సయ్యగౌడ్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి 'డెజావు' స్థితిలో (మెడికల్ పరిభాషలో గతంలో ఉన్నట్టు ఊహించుకొని మాట్లాడడం) ఉన్నారని బీజేపీ నేత, మాజీ ఎంపీ డా.బూర నర్సయ్యగౌడ్ చెప్పారు. సీఎంగా ఉన్న విషయాన్ని మరిచిపోయి ప్రతిపక్షంలో ఉన్నట్టు రేవంత్ మాట్లాడుతున్నారన్నారు. మంగళవారం నర్సయ్యగౌడ్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్‌ది వంచన విధానమని (డిసీవింగ్ పాలసీ)..అన్ని వర్గాలను వంచించడమే దాని పాలసీ అని మండిపడ్డారు. రాష్ట్రంలో 5డీ పాలన, డైవర్షన్, డిమాలిషన్, డిస్ట్రక్షన్, డిసీవింగ్, ఢిల్లీపై ఆధారపడి నడుస్తోందన్నారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి టెక్స్‌టైల్ ఇండస్ట్రీ కేటాయిస్తే ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించలేదన్నారు. తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ అమలు కాకుండా రేవంత్ సైంధవుడిలా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వివిధ కార్యక్రమాలు, పథకాల కింద కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లక్షల కోట్ల నిధులు తీసుకొస్తే... అది కూడా మరిచి ఆయనపై అనవసర ఆరోపణలు చేస్తున్నారన్నారు.

హరీశ్‌రావు బీజేపీ కోవర్టు

తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బీజేపీ కోవర్టు అని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆరోపించారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మామ, బావమరిదిపై పగతో హరీశ్.. బీఆర్ఎస్ నాశనాన్ని కోరుకుంటున్నారని, హరీశ్‌రావు శకుని కంటే దుర్మార్గుడని అభివర్ణించారు. అబద్ధాన్ని నిజమని నమ్మేలా మాట్లాడటంలో హరీశ్‌రావు దిట్టని, అబద్ధాల యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులతో హరీశ్ వందల సార్లు వాట్సాప్ కాల్స్ మాట్లాడారని మెట్టు సాయికుమార్ ఆరోపించారు.

హరీశ్ నిలదీయడం మానరు

మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి హరీశ్ రావుపై ఎన్ని తప్పుడు ఆరోపణ లు చేసినా.. ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ కాంగ్రెస్‌ను ఎండగట్టడం మానదని, ప్రజల తరఫున హరీశ్ నిలదీయడం మానరని మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ స్పష్టం చేశారు. ఆయన మంగళవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. గాంధీభవన్‌లో కూర్చొని బీఆర్ఎస్, హరీశ్‌రావుపై అవాకులుచెవాకులు మాట్లాడిన మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదు ల్లా కొత్వాల్ ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉండి.. మైనార్టీలకు చేసిందేమిటో ఆయన చెప్పాలని డిమాండ్ చేశారు. షాదీ ముబారక్ కింద తులం బంగారం, మైనార్టీకి మంత్రి పదవి, మైనారీలకు ప్రత్యేక సబ్‌ప్లాన్ హామీలు ఏమయ్యాయో చెప్పాలని నిలదీశారు. రంజాన్ వేళ అబద్ధాలు మాట్లాడితే అల్లా క్షమించదని ఇంతియాజ్ హెచ్చరించారు.

ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు


లొంగిపోయిన మావోయిస్టులను చూపిస్తున్న ఏఎస్పీ

ఏటూరునాగారం: నిషేధిత మావోయిస్టు పార్టీ సభ్యులు ముగ్గురు ములుగు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు ఏటూరునాగారంలోని ఏఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఊసూరు ప్రాంతానికి చెందిన మావోయిస్టు పార్టీ చర్ల, శబరి ఎల్‌ఓఎస్ పార్టీ సభ్యుడు కడితి ఇడుమ అలియాస్ దేవ, ఆర్‌పీసీ కమాండర్ మిడియం దేవయ్య, వెంకటాపురం మండలం చర్ల, శబరి ఎల్‌ఓసీ సభ్యుడు, సీఎస్‌ఎం సభ్యుడు సోడి జోగ అలియాస్ పున్నం లొంగిపోయినట్లు ఏఎస్పీ తెలిపారు. వారికి సరెండర్, రిహాబిలిటేషన్ పాలసీలో భాగంగా అందాల్సిన ఫలాలను అందజేస్తామన్నారు. సోడి జోగ 2018లో మావోయిస్టు పార్టీలో చేరాడని, ఆ తర్వాత పలు కారణాలతో బయటకు వచ్చి సీఎస్‌ఎం సభ్యుడిగా చేరి ప్రస్తుతం పార్టీలో కొనసాగుతున్నాడని చెప్పారు. కడితి ఇడుమ ధర్మారం సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై అటాక్ చేసిన ఘటనలో ఉన్నాడన్నారు. మిడియం దేవయ్య పార్టీలో పనిచేస్తూ కర్రెగుట్ట ఏరియాలో ల్యాండ్ మైన్లు అమర్చిన ఘటనల్లో ఉన్నాడని తెలిపారు. పోలీసుల నిర్బంధం, మావోయిస్టుల సిద్ధాంతాలు నచ్చక వారు పార్టీని వీడినట్లు ఏఎస్పీ తెలిపారు. లొంగిపోయేందుకు సహకరించిన వెంకటాపురం పోలీసులను ఏఎస్పీ అభినందించారు.

వడ్డీలేని రుణాలపై దుమారం!

- మహిళా సంఘాల రుణాలకు కాంగ్రెస్ సర్కార్ వడ్డీలు చెల్లించలేదన్న హరీశ్‌రావు
- మీ హయాంలో రూ.3,075 కోట్లు బకాయి పడ్డారన్న మంత్రి సీతక్క
- ఎవరెంత ఖర్చు చేశారో శాసనసభలో తేలుస్తామని వెల్లడి




సాక్షి, హైదరాబాద్: వడ్డీ లేని రుణాల చుట్టూ రాజకీయ దుమారం రేగుతోంది. ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య ఆరోపణల పర్వం సాగుతోంది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఇరుపక్షాలు పరస్పరం విమర్శలు గుప్పించుకుంటున్నాయి. బుధవారం ప్రారంభంకానున్న శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో మహిళా సంక్షేమపథకాలు, వడ్డీలేని రుణాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వాడీవేడి చర్చ జరిగే అవకాశముంది. మహిళా సంఘాల బ్యాంక్ రుణాలకు కాంగ్రెస్ సర్కార్ వడ్డీలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు సంధించారు. మరోవైపు ప్రభుత్వం గత 15 నెలల పాలనలో చేసిన అప్రాధాన్య అప్పుల గురించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంగ్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ విమర్శలపై పంచాయతీరాజ్, మహిళా సంక్షేమశాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో స్పందించారు. అసెంబ్లీ వేదికగా మీ బండారాన్ని బయటపెడతామని, మహిళా సంక్షేమానికి ఎవరెంత ఖర్చు చేశారో సభలో తేలుస్తామంటూ ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో మహిళల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదంటూ ఎదురుదాడికి దిగారు. బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చాక 2018–23లో మహిళా సంఘాలకు రూ.3,485 కోట్లు చెల్లించాల్సి ఉండగా..కేవలం రూ.409 కోట్లు మాత్రమే చెల్లించారని రూ.3,075 కోట్లు బకాయి పడ్డారని లెక్కలతో సహా వివరించారు. ఆర్థిక మంత్రిగా ఉంటూ చివరి మూడేళ్లలో హరీశ్‌రావు మహిళా సంఘాల వడ్డీల కోసం నయా పైసా చెల్లించలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళలకు పూర్తిస్థాయిలో వడ్డీలు చెల్లించామని తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి మహిళలకు వడ్డీలు చెల్లించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

మొత్తం రూ.4,200 కోట్లు

2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు దాదాపు రూ.1,200 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారవర్గాల సమాచారం. పాత బకాయిలు కలుపుకొంటే దాదాపు రూ.4,200 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. బకాయిల చెల్లింపునకు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆ వర్గాలు చెప్పాయి.

క్లుప్తంగా...

హజ్ కమిటీ ప్రత్యేక అధికారిగా యాకుబ్ బాషా

సాక్షి, అమరావతి: ఏపీ హజ్ కమిటీ ప్రత్యేక అధికారిగా యాకుబ్ బాషాను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బాషాకు ఏపీ హజ్ కమిటీ ప్రత్యేక అధికారి బాధ్యతలు అప్పగించారు.

దినదినగండంగా ఎంఎస్ఎంఈలు

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో ఎంఎస్ఎంఈల మనుగడ దినదినగండంగా మారిందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు విమర్శించారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ.. కందుకూరు ఎమ్మెల్యే రామాయపట్నం పోర్టు కాంట్రాక్టర్‌ను బెదిరించి లారీలు సీజ్ చేయించిన ఘటనపై ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని సభలో ఉదహరించారు. మౌలిక సదుపాయాలు ఉంటేనే ఎంఎస్ఎంఈల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కూటమి నాయకులు కమిషన్ల కోసం పోర్టులను అడ్డుకునే ప్రయత్నం చేస్తే వాటిపై ఆధారపడిన పరిశ్రమలు ఎలా నడుస్తాయని ప్రశ్నించారు.

ఆలయాల ఆస్తుల పరిరక్షణకు కమిటీ

సాక్షి, అమరావతి : రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల ఆస్తులు, దేవతల ఆభరణాలు, ఇతర అంశాల పరిరక్షణకు ప్రత్యేక కమిటీని నియమిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి తెలిపారు. ఈ కమిటీలో రాష్ట్ర స్థాయిలో పోలీస్ అధికారి కూడా సభ్యుడిగా ఉంటారన్నారు. కమిటీ ఎప్పటికప్పుడు సమావేశం అవుతూ ఆలయాల పరిరక్షణకు కృషి చేస్తుందన్నారు. మంగళవారం ఆయన మండలిలో మాట్లాడారు.

ఏపీలో అంబేడ్కర్ వర్సిటీని ఏర్పాటు చేయాలి

సాక్షి, అమరావతి: ఏపీలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి సేవలు కొనసాగించాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్, కార్యదర్శి ఎ.అశోక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నివేదిక

సాక్షి, అమరావతి: షెడ్యూల్డ్ కులాల (ఎస్సీల) ఉప వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన రాజీవ్‌రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. రాజీవ్‌రంజన్ మిశ్రా మంగళవారం సచివాలయంలో సీఎస్ విజయానంద్‌కు ఈ నివేదిక అందజేశారు.

386మంది ఇంజినీర్లపై తదుపరి చర్యలు రద్దు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 386 మంది ఇంజినీర్లపై తదుపరి చర్యలను రద్దుచేస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. 2014–19లో నీరు–చెట్టు పథకం పనులపై విచారణ జరిపిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అక్రమాలు జరిగాయని నిర్ధారించింది. ఆ అక్రమాలకు బాధ్యులైన 386 మంది జలవనరుల శాఖ ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించింది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నిలిపేయాలని సూచించిన నీరు–చెట్టు పథకం బిల్లులను చెల్లించింది. తాజాగా 386 మంది ఇంజనీర్లపై చర్యలను ఉపసంహరించుకుంది.

సులభతర వాణిజ్యానికి అనువుగా చట్టాల్లో మార్పులు

సాక్షి, అమరావతి: సులభతర వాణిజ్యానికి సంబంధించి ప్రస్తుత పరిస్థితులకు అనువుగా లేని పలు చట్టాల్లో మార్పులు తెచ్చేందుకు కృషి జరుగుతోందని సీఎస్ విజయానంద్ చెప్పారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన పలు శాఖల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రానికి నోడల్ అధికారిగా ఉన్న వందన గుర్నాని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సీఎస్ మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తలకు వేగంగా అనుమతుల జారీతో పాటు ప్రభుత్వ పరంగా అందించాల్సిన సహకారం కోసం సింగిల్ విండో డెస్క్ విధానంలో తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

బోరుగడ్డ మధ్యంతర బెయిల్ పొడిగింపునకు హైకోర్టు నిరాకరణ

సాక్షి, అమరావతి: సామాజిక మాధ్యమాల్లో దూషణలకు సంబంధించి గుంటూరు పోలీసులు నమోదు చేసిన కేసులో బోరుగడ్డ అనిల్ కుమార్‌కు గతంలో ఇచ్చిన మధ్యంతర బెయిల్‌ను పొడిగించేందుకు హైకోర్టు నిరాకరించింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఈ నెల 11న రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ముందు లొంగిపోవాల్సిందేనని బోరుగడ్డను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బంగారు అవకాశం.. హద్దు ఆకాశం



ఎన్నాళ్లుగానో మదిలో మెదులుతున్న రూపం కళ్ల ముందు కదలాడే క్షణాలవి.. ఎన్నో కలలు, మరెన్నో ఆశల ప్రతిరూపాలుగా వాహనాలు మెరుపులా దూసుకెళ్లే అపురూప ఘడియలవి. గోకార్టింగ్ అంటే కేవలం వాహనాల పోటీ కాదు. ఎంతో ఇష్టపడి తయారు చేసుకున్న మోడల్, కష్టపడి తయారు చేసుకున్న ఇంజిన్, వాహనంలో ప్రతి విభాగంపై సొంత ముద్ర.. ఇలా ప్రతి అంశంలోనూ విద్యార్థులు తమను తాము చూసుకుంటారు. పోటీలో బండి పరుగులు పెడుతుంటే చూసి మురిసిపోతారు. ఓ కొత్త వాహనానికి పురుడు పోసే దశను గుండెతో ఆస్వాదిస్తారు.

- ఆటోమొబైల్ రంగంలో నూతన ఆవిష్కరణలకు గోకార్టింగ్ వేదిక
  ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా వివిధ రౌండ్లలో ఉత్తీర్ణత సాధిస్తేనే ట్రాక్ పై రైడింగ్
- గో కార్టింగ్‌తో భవిష్యత్‌లో అపారమైన అవకాశాలు ఉంటాయంటున్న నిపుణులు

టెక్కలి:

శ్రీకాకుళం జిల్లాలో జరిగిన జాతీయ స్థాయి గోకార్టింగ్ పోటీలు ఇంజినీరింగ్ విద్యార్థుల మనసు దోచుకున్నాయి. ఆటోమొబైల్ రంగంలో ఎదగాలనుకునే విద్యార్థులకు ఈ పోటీలు ఒకరకంగా తొలి పరీక్ష లాంటివి. ఈ పోటీలు నిర్వహించడం, అందులో పాల్గొనడం, వాహనాలు తయారు చేయడం ఆషామాషీ విషయం కాదు. చాలారకాల దశలు దాటాకే బండిని ట్రాక్ మీదకు ఎక్కించాలి.

గోకార్టింగ్ పోటీలు ఎందుకు నిర్వహిస్తారు..?



ఆటోమొబైల్ రంగంపై ఆసక్తి కలిగిన ఇంజినీరింగ్ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉండే సృజనకు పరీక్ష పెట్టేందుకే ఈ గోకార్టింగ్ పోటీలు నిర్వహిస్తారు. ఇందులో రెండు రకాల వాహనాలు తయారు చేస్తారు.
వాటిలో సీవీ(ఇంజిన్‌తో తయారుచేసినవి) ఈవీ(ఎలక్ట్రికల్ వాహనాలు) ఉంటాయి. వాహనాల తయారీతో పాటు బిజినెస్ ఆలోచనలు సైతం పంచుకునే విధంగా ఈ గోకార్టింగ్ పోటీలు నిర్వహిస్తారు.

అర్హతలు ఉండాల్సిందే..

గోకార్టింగ్ పోటీల్లో పాల్గొనాలంటే కళాశాల స్థాయిలో 'మోటార్ స్పోర్ట్ కార్పొరేషన్' తయారు చేసిన రూల్ బుక్ ఆధారంగా గ్రాఫికల్‌గా డిజైన్ చేస్తూ వాహనాన్ని తయారుచేయాలి. ఆ తర్వాత పోటీల్లో పాల్గొనేందుకు ఆయా కళాశాలలు నిర్వహించే ఆన్‌లైన్ పరీక్ష ఉత్తీర్ణత సాధించాలి. పోటీల్లో పాల్గొనే ముందు కూడా డిజైనింగ్ చెక్, ఇన్నోవేషన్ చెకింగ్‌లో భాగంగా కొత్తగా ఐఓటీ (ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్), ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఆలోచనలకు ప్రాముఖ్యతనిస్తారు. అలాగే బ్రేక్ టెస్ట్, లోడ్ టెస్ట్, స్పీడ్ టెస్ట్, స్టీరింగ్ టెస్ట్ తో పాటు ఇండ్యూరేషన్ టెస్ట్‌కూడా చేస్తారు. చివరగా బిజినెస్ రౌండ్‌లోనూ నెగ్గితేనే అర్హత సాధించినట్టు. ఒక్కో వాహనానికి 20 నుంచి 30 మంది టీమ్ సభ్యులు ఉంటారు. వారిలో కెప్టెన్, రైడర్, కో రైడర్ ఉంటారు.

వాహనం తయారీ



- గోకార్టింగ్ వాహనం తయారీకి సుమారు రూ. 70వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతుంది.
- ఇందులో సీవీ వాహనాలను పూర్తిగా ఇంజిన్‌తో తయారు చేస్తారు. ఇంజిన్, మోటారు, వీల్స్, స్టీరింగ్, ఇతర పార్టులు ఉంటాయి.
- ఈవీ వాహనాలను బ్యాటరీ ఆధారంగా తయారుచేస్తారు. దీనికి బ్యాటరీ, వీల్స్, స్టీరింగ్, మోటారు ఇతర పార్టులు ఉంటాయి. ఒక్కో వాహనం సుమారు 80 నుంచి 100 కిలోల వరకు బరువు ఉంటుంది.

అఫిడవిట్ కచ్చితం..



గోకార్టింగ్ పోటీల్లో రైడర్ల పాత్ర కీలకం. కానీ రైడర్‌గా మారాలంటే విద్యార్థి తల్లిదండ్రులు, కళాశాల సిబ్బంది నుంచి అఫిడవిట్‌ను సమర్పించాల్సిందే.

గోకార్టింగ్‌తో వచ్చే అవకాశాలు

గోకార్టింగ్ పోటీల్లో పాల్గొనే అవకాశం రావడమే విద్యార్థుల విజయానికి తొలిమెట్టు లాంటిది. వాటిలో ప్రముఖ కోర్ కంపెనీల్లో ఉద్యోగవకాశాలు, ఆటోమొబైల్ రంగంలో సొంతంగా వ్యాపారం చేయాలనే ఆలోచన ఉన్న వారికి ప్రాథమిక ప్లాట్‌ఫామ్‌గా గోకార్టింగ్ ఉపయోగపడుతుంది.



గోకార్టింగ్ పోటీల్లో విద్యార్థినులు

ప్రమాదమైనా ఇష్టమే..



గోకార్టింగ్‌లో రైడింగ్ ప్రమాదకరమైనప్పటికీ ఎంతో ఆసక్తిగా ఉండడం వలన రైడర్‌గా మారాను. 60 ఓల్ట్స్ బ్యాటరీ సామర్థ్యంతో వాహనం తయారుచేశాం. మా కళాశాల ప్రిన్సిపాల్ కె.వీ.ఎస్.సునీత, ఫ్యాకల్టీలు రూపత్, గోపీకృష్ణ సహకారంతో గోకార్టింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నాం. అందరి సహకారంతో ఈవీ వెహికల్ రైడ్‌లో మొదటి స్థానంలో నిలిచాం.

– జననీ నాగరాజన్, రైడర్, బీవీఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, హైదరాబాద్.

రెండు సార్లు రైడర్‌గా మొదటి స్థానం



మా కళాశాల సీనియర్స్ ఇన్‌స్పిరేషన్‌తో గోకార్టింగ్ రైడర్‌గా పోటీల్లో పాల్గొంటున్నాను. 150 సీసీ పల్సర్ ఇంజిన్‌తో వాహనం తయారుచేశాం. రైడర్‌గా రెండు సార్లు మొదటి స్థానంలో నిలిచాం. మాది మధ్య తరగతి కుటుంబం. మా నాన్న ఆటోడ్రైవర్, అమ్మ గృహిణి. భవిష్యత్‌లో మంచి కోర్ కంపెనీలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

– వి.సునీల్, రైడర్, రఘు ఇంజినీరింగ్ కళాశాల, విశాఖపట్టణం

న్యాయవాది వెంకటేశ్వర్లుపై కేసులో తదుపరి చర్యలన్నీ నిలుపుదల

సాక్షి, అమరావతి: సినీ నటి కాదంబరి జత్వానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు సెప్టెంబర్ 15న నమోదు చేసిన కేసులో నిందితునిగా ఉన్న న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లుకు హైకోర్టు ఊరటనిచ్చింది. ఆయనపై నమోదైన కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మంగళవారం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఫిర్యాదుదారు జత్వానీకి, పోలీసులకు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జత్వానీ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసు ఆ తరువాత సీఐడీకి బదిలీ అయింది. ఈ కేసులో నిందితులైన సీనియర్ ఐపీఎస్ అధికారులు కాంతిరాణ టాటా, విశాల్ గున్నీ, పోలీసు అధికారులు హనుమంత రావు, ఎం.సత్యనారాయణ, న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లుకు హైకోర్టు గతంలోనే ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ న్యాయవాది వెంకటేశ్వర్లు తాజాగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ హరినాథ్ మంగళవారం విచారణ జరిపారు.

రెండో రోజూ శ్రీచైతన్య కళాశాలలపై ఐటీ సోదాలు

సాక్షి, హైదరాబాద్/ఖమ్మంసహకారనగర్: ఆదాయపన్ను చెల్లింపులలో అకవతవకలపై ఆరా తీస్తున్న ఐటీ అధికారులు రెండో రోజూ దేశవ్యాప్తంగా శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన పలు కార్యాలయాల్లో సోదాలు చేపట్టారు. సోమవారం ఉదయం నుంచి ఏక కాలంలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న శ్రీచైతన్య కార్పొరేట్ కార్యాలయంతోపాటు, ఆంధ్రప్రదేశ్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లోని ప్రాంతీయ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందుకు కొనసాగింపుగా మంగళవారం సైతం రాత్రి వరకు సోదాలు కొనసాగాయి. శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ యలమంచిలి శ్రీధర్ మాదాపూర్‌లో నివాసం ఉండే విల్లాలోనూ ఐటీ అధికారులు సోదాలు చేశారు. ఈ సందర్భంగా పలు కీలక పత్రాలు ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఖమ్మం టౌన్‌లో ఎన్‌టీఆర్ సర్కిల్ శ్రీ చైతన్య కాలేజీలో సోదాలు కొనసాగాయి.

ప్రకాశం జిల్లాలో రెండు అల్ట్రా మెగా సోలార్ విద్యుత్ ప్లాంట్లు

అసెంబ్లీలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

సాక్షి, అమరావతి: ప్రకాశం జిల్లాలో రెండు అల్ట్రా మెగా సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి మంగళవారం సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రాయలసీమ తర్వాత ప్రకాశం జిల్లానే అత్యంత అనువైన ప్రాంతమని ఆయన చెప్పారు. ప్రకాశం జిల్లా దొనకొండ, చంద్రశేఖరపురం(సీఎస్ పురం) ప్రాంతాల్లో అల్ట్రా మెగా సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఒక్కో ప్లాంట్ నిర్మాణానికి సుమారు 5,500 ఎకరాల భూమి అవసరమన్నారు. సోలార్ ప్లాంట్ల నిర్మాణానికి భూ కేటాయింపులకు సంబంధించి ఇప్పటికే ప్రకాశం జిల్లా కలెక్టర్ నుంచి నివేదిక కోరామని వివరించారు. కలెక్టర్ నివేదిక తర్వాత ప్లాంట్ల నిర్మాణానికి చర్యలు చేపడతామని చెప్పారు. ఒక్కో ప్లాంట్ ద్వారా సుమారు 1,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 (ఐసీఈ) ద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఐసీఈ పాలసీ ద్వారా 100 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి గొట్టిపాటి వివరించారు.

'పర్యాటక భూ కేటాయింపు విధానం' విడుదల

సాక్షి, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో పర్యాటక ప్రాజెక్టులకు భూ కేటాయింపుల విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ 'పర్యాటక భూ కేటాయింపు విధానం 2024–25' జీవోను జారీ చేశారు. ఇందులో రూ.50కోట్లకు పైగా విలువైన మెగా ప్రాజెక్టులకు భూమి లీజులను తొలుత 66ఏళ్లు, అదనంగా మరో 33 ఏళ్లకు పెంచుకునేలా వెసులుబాటు కల్పించారు. రూ.50 కోట్ల కంటే తక్కువ ప్రాజెక్టులకు టెండర్ల ప్రకారం భూమి కేటాయించనున్నారు. ఎంఎస్ఎంఈలకు తొలుత 33 ఏళ్లు కేటాయించి మరో 33 ఏళ్లకు భూమి లీజు పొడిగించుకోవచ్చునన్నారు. త్రీస్టార్ నుంచి ఆపై స్థాయి హోటళ్ల నిర్మాణానికి, టెంట్ సిటీ, వినోద సెంటర్లకు 5ఎకరాలలోపు, రిసార్టుల నిర్మాణానికి 15 ఎకరాలలోపు, థీమ్ పార్కులకు 5–25ఎకరాలు, డెస్టినేషన్ వెడ్డింగ్‌కు 10ఎకరాలలోపు, గోల్ఫ్ కోర్సులకు 150, ఇతర పర్యాటక ప్రాజెక్టులకు 10 ఎకరాల వరకు భూములు కేటాయించనున్నారు. మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులకు ప్రభుత్వ నిర్ణయం ప్రకారం భూములు లీజుకు ఇవ్వనున్నారు. ఈ పెద్ద ప్రాజెక్టులకు దీర్ఘకాలిక లీజు/ ఫ్రీహోల్డ్ ప్రాతిపదికన భూమిని కేటాయించేలా పాలసీని రూపొందించారు. ఇక రిజిస్ట్రేషన్ ధరల ప్రకారం భూముల విలువపై 1శాతం వార్షిక లీజుగా నిర్ణయించారు. స్థూల వార్షిక ఆదాయంపై వాటాతో పాటు ప్రతి మూడేళ్లకు 5శాతం లీజు రెంట్ పెరగనుంది. పెద్ద ప్రాజెక్టులు 2–4 ఏళ్లు, ఎంఎస్ఎంఈలు 18నెలల్లో నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఉపాధ్యాయ బదిలీ చట్టం ముసాయిదాలో లోపాలు

వైఎస్సార్‌టీఏ ఆక్షేపణ

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ ఇటీవల విడుదల చేసిన ఉపాధ్యాయ బదిలీ చట్టం ముసాయిదాలో చెప్పిన అంశాలకు, అమలు చేస్తున్న అంశాలకు పొంతన లేదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) ఆక్షేపించింది. ముసాయిదాలో సర్వీస్‌కి ఒక పాయింట్ కేటాయించి, దాన్ని 0.5 పాయింట్‌గా మార్చడం తగదని అసోయేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్‌రెడ్డి, సుధీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాస్తవానికి గుర్తింపు సంఘాల నేతలతో నిర్వహించిన సమావేశాల్లో సర్వీస్ పాయింట్ ఒకటి ఉండాలన్న సంఘాల అభిప్రాయానికి ఆమోదం తెలిపి, ఇప్పుడు తగ్గించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ జరపాలని అన్ని సంఘాలు కోరినా పట్టించుకోకుండా కేవలం వెబ్ కౌన్సెలింగ్‌కి సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఈ చట్టం ముసాయిదా గందరగోళంగా ఉందని, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా చట్ట రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ పేరుతో అనేక ప్రైమరీ పాఠశాలలను మూతపడేలా చేస్తూ పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రజావ్యతిరేక చర్యలు సరికాదని పేర్కొన్నారు. పదోతరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్టులు, ఉపాధ్యాయులు ఇంటర్ పరీక్షల విధుల్లో ఉన్న నేపథ్యంలో బుధవారం జరిగే క్లస్టర్ సమావేశాన్ని వాయిదా వేయాలని వారు డిమాండ్ చేశారు.

అసెంబ్లీలో లిఫ్టులు-ఎస్కలేటర్ల బిల్లు -2025

సాక్షి, అమరావతి: లిఫ్టులు, ఎస్కలేటర్లలో ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఏపీ లిఫ్టులు–ఎస్కలేటర్ల బిల్లు–2025ను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ద్వారా వృద్ధులు, మహిళలు, దివ్యాంగులతో పాటు ప్రజలకు మరింత భద్రత కలుగుతుందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పట్టణీకరణతో పాటు వేగంగా నిర్మాణమవుతున్న బహుళ అంతస్తుల భవనాలు, ఆస్పత్రులు, వ్యాపార సముదాయాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్‌ను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ లిఫ్టులు–ఎస్కలేటర్లు బిల్లు–2025ను రూపొందించినట్లు వివరించారు. లిఫ్టులు, ఎస్కలేటర్ల వినియోగంతో ప్రమాదాలు పెరిగిపోతున్నాయని అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజల భద్రత చాలా ముఖ్యమని పేర్కొన్నారు. కొత్త బిల్లు చట్టరూపం దాల్చితే లిఫ్టులు, ఎస్కలేటర్ల ప్రమాదాలను కట్టడి చేయవచ్చన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం లిఫ్టులు–ఎస్కలేటర్ల బిల్లును 2024లోనే తీసుకొచ్చిందని ఇప్పటికే 15కు పైగా రాష్ట్రాలు ఈ బిల్లును అమలు చేస్తున్నాయని మంత్రి తెలిపారు. అదే విధంగా సీసీ కెమెరాల వినియోగం, డేటాను భద్ర పరచడం వంటి వాటికి సంబంధించిన అంశాలన్నింటినీ బిల్లులో పొందుపరిచామని పేర్కొన్నారు.

ఏడాదిలోగా పాఠశాలల్లో పెండింగ్ పనులు పూర్తి

మంత్రి నారా లోకేశ్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న పనులన్నీ ఏప్రిల్‌లో మొదలు పెట్టి, వచ్చే సంవత్సరంలో పూర్తి చేయాలని లక్ష్యంగా పని చేస్తున్నట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని కోరారు. శారీరక, బుద్ధి మాంద్యం పిల్లల కోసం రాష్ట్రంలో 679 భవిత సెంటర్లు నడుస్తున్నాయని, కొత్తగా 125 ఆర్టిజమ్ సెంటర్ల ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదించినట్టు తెలిపారు. రాష్ట్ర విజభజన తర్వాత పదవ షెడ్యూల్‌లో ఉన్న ప్రాచీన పత్ర బాండాగార శాఖ నుంచి 1953 వరకు ఏపీ రాష్ట్ర అధికారిక పత్రాలు, శాసనాలు, ఇతర రికార్డులు మన రాష్ట్రానికి వచ్చాయని స్పష్టం చేశారు. ఈ శాఖ డిజిటలైజ్ చేయడంతోపాటు రాజధానిలో సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రం నుంచి ఐటీ ఎగుమతులు ప్రస్తుతం రూ.2,500 కోట్లు ఉన్నాయని, వచ్చే ఐదేళ్లలో వాటిని రూ.25,000 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

12 వృద్ధాశ్రమాల మంజూరు

2024–25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం 12 కొత్త వృద్ధాశ్రమాలను రాష్ట్రానికి మంజూరు చేసినట్టు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు, ఎన్‌జీవోల ఆధ్వర్యంలో 69, ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో 119 వృద్ధాశ్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆర్థిక శాఖ అనుమతి రాగానే అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు బిల్లులు చెల్లించడంతోపాటు కొత్త వాటిని కూడా నిర్మిస్తామని మంత్రి సంధ్యా రాణి చెప్పారు. అంతకు ముందు హోంశాఖ పద్దులపై ఆ శాఖ మంత్రి అనిత మాట్లాడుతూ.. ప్రతి పోలీసు స్టేషన్‌కు కనీసం రెండు డ్రోన్లు ఇస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలు బిగిస్తామని తెలిపారు. రూ.152 కోట్లతో అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం హోం శాఖకు రూ.8,570 కోట్లు, పాఠశాల విద్యకు రూ.31,805 కోట్లు, ఉన్నత విద్యకు రూ.2,506 కోట్లు, సాంకేతిక విద్యకు రూ.1,228 కోట్లు, ఐటీకి రూ.533 కోట్లు కేటాయించిన పద్దులకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది.

ఎమ్మెల్యేలు మీ టాలెంట్ చూపండి

- సాంస్కృతిక, క్రీడా పోటీల్లో ఎమ్మెల్యేలు అందరూ పాల్గొనాలి
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపు

సాక్షి, అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు అందరూ పాల్గొని తమ టాలెంట్‌ను చూపించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు పిలుపునిచ్చారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎమ్మెల్యేలకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం శాసనసభలో జీరో అవర్ అనంతరం స్పీకర్ మాట్లాడుతూ 'నియోజకవర్గాల్లో అనేక పనులు, సమస్యలతో ఎమ్మెల్యేలు బిజీగా ఉంటారు. మూడు రోజులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా హ్యాపీగా రిలాక్స్ అవుదాం. ఎమ్మెల్యేలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమకున్న టాలెంట్‌ను స్టేజీపై చూపాలి. మహిళా ఎమ్మెల్యేలు కూడా ఎక్కువ మంది కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొనాలి. చివరి రోజున విజేతలకు బహుమతుల పంపిణీ ఉంటుంది' అని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే వారి నుంచి ఇంకా తమకు పేర్లు అందకపోవడంపై ప్రభుత్వ చీఫ్ విప్‌ను స్పీకర్ ఆరా తీశారు.

వరి, జొన్నపంటకు మద్దతు ధర కల్పించాలి

- పంటలకు ధర దక్కకపోవడంతో రైతులు నష్టపోతున్నారు
- ముఖ్యమంత్రికి మంత్రులు, ఎమ్మెల్యేల విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వరి, జొన్న పంటలకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీఎం చంద్రబాబుకు నంద్యాల జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డితోపాటు నంద్యాల జిల్లా ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిల ప్రియ, జయసూర్యలు మంగళవారం కలిశారు. నంద్యాల జిల్లాలో వరి, జొన్న పంటకు ధర దక్కకపోవడంతో రైతులు నష్టపోతున్నారని, మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. ప్రస్తుతం క్వింటా జొన్నలకు రూ.2,400 మాత్రమే మద్దతు ధర చెల్లిస్తున్నారని, దీనిని రూ.3,400కు పెంచాలని అలాగే.. వరికి మద్దతు ధర రూ.1,200 వస్తోందని, దీన్ని రూ.1,800కు పెంచాలని సీఎంను కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు. ఇదే విషయమై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుని కలిసి విజ్ఞప్తి చేసినట్లు ఫరూక్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు తప్పని తిప్పలు

ఇటు పరీక్షలు.. అటు క్లస్టర్ సమావేశాలు

సాక్షి, అమరావతి: ఓ పక్క ఇంటర్ పరీక్షలు, మరో పక్క 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లలో బిజీగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులను క్లస్టర్ సమావేశాలకు హాజరు కావాలని పాఠశాల విద్యాశాఖ అల్టిమేటం జారీ చేసింది. ప్రతినెలా మూడో శనివారం క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని ఫిబ్రవరిలో నిర్ణయించారు. ఈమేరకు కొత్త క్లస్టర్ల ఆధారంగా కాంప్లెక్స్ సమావేశాలు గతనెల 15న ఎన్నో వివాదాల మధ్య నిర్వహించారు. అయితే, తాజాగా పరీక్షలు జరుగుతున్న వేళ క్లస్టర్ సమావేశాలు నిర్వహించడంపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతనెల మూడో శనివారం ఈ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను రాష్ట్రవ్యాప్తంగా 2809 చోట్ల ప్రారంభించారు. కానీ సాయంత్రం ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరుపై పరిమితులు విధించడంతో చాలామంది తమ హాజరును నమోదు చేయలేకపోయారు. దీంతో 20 శాతం మందికి విద్యాశాఖ షోకాజు నోటీసులు జారీ చేసింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో రెండో సమావేశానికి సమస్యలను సరిదిద్దుతామని అధికారులు ప్రకటించారు. కానీ, తాజాగా గత సమావేశ నిబంధనలతోనే క్లస్టర్ సమావేశాలకు ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి ఈ సమావేశం ఈనెల 15న జరగాల్సి ఉండగా, బుధవారానికి మార్చి, ఉపాధ్యాయులంతా 100 శాతం హాజరు కావాలని నిబంధన విధించారు.

పరీక్షల వేళ సమావేశాలా?

ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. వీటికి ఇన్విజిలేటర్లుగా ఎస్‌జీటీలను నియమించారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు పాఠశాలల్లో మధ్యాహ్నం నుంచి గ్రాండ్ టెస్టులు జరుగుతున్నాయి. మరోపక్క ఈనెల 17 నుంచి ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలో ఈనెల క్లస్టర్ సమావేశం రద్దు చేయాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేసినా విద్యాశాఖ పట్టించుకోలేదు. బుధవారం వోఎస్ఎస్‌సీ, ఎస్ఎస్‌సీ ఒకేషనల్ పరీక్షలకు ప్రభుత్వ విద్యార్థులు ఎవరూ హాజరు కారని, అందుకే కాంప్లెక్స్ నిర్వహిస్తున్నట్టు విద్యాశాఖ చెబుతోంది. ప్రస్తుత రంజాన్ ఉపవాసాల్లో ఉన్న ముస్లిం టీచర్లు క్లస్టర్ సమావేశాల నుంచి సాయంత్రం 4 గంటలకే వెళ్లిపోవచ్చని అధికారులు వెసులుబాటు కల్పించారు. అలాగే, ఉర్దూ మీడియం పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా మినహాయింపునిచ్చారు. ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న 325 పాఠశాలలకు బుధవారం సెలవు ఇచ్చి ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కచ్చితంగా కాంప్లెక్స్ సమావేశాలకు హాజరు కావాలని ఆదేశించారు. ప్రస్తుతం చాలామంది ఉపాధ్యాయులు ఇంటర్ పరీక్షల విధుల్లో ఉన్నారు. వారు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష విధులు పూర్తిచేసుకుని జవాబు పత్రాలు అప్పగించి బయట పడేసరికి మధ్యాహ్న 2 దాటుతుంది. దీంతో వీరి కాంప్లెక్స్ హాజరుపై సందేహం నెలకొంది. ఈనేపథ్యంలో బుధవారం నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ సమావేశం రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. క్లస్టర్ సమావేశం నిర్వహిస్తే ఒత్తిడి తప్ప ప్రయోజనం ఉండదంటున్నాయి.

సాక్షి ప్లస్
బుధవారం ॥ 12-3-2025

సాగుబడి
పూర్వాభాద్ర కార్తె:
మార్చి 17 వరకు





రైతు ఆవిష్కరణ.. ఎస్‌కె-4 పసుపు!

చేసే పని మీద శ్రద్ధాసక్తులు మెండుగా ఉంటే ఫలితాలు అద్భుతంగా ఉంటాయని నిరూపించే విజయగాథ రైతు శాస్త్రవేత్త సచిన్ కమలాకర్ కారేకర్‌ది. పన్నెండో తరగతి ఫెయిల్ అయ్యి వ్యవసాయం చేపట్టిన సచిన్ శ్రద్ధగా వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడినిచ్చే ఒక చక్కని పసుపు వంగడాన్ని అభివృద్ధి చేశారు. దాని పేరు 'ఎస్‌కె-4'. ఈ వంగడం సచిన్‌కు ఉత్తమ ప్లాంట్ బ్రీడర్‌గా, గొప్ప ఆవిష్కర్తగా కీర్తితో పాటు జాతీయ పురస్కారాన్ని తెచ్చిపెట్టింది. ఎస్‌కె-4 పసుపు రకాన్ని ఇప్పుడు 13 రాష్ట్రాల్లో సాగు చేస్తుండటం విశేషం. తాను పండిస్తున్న పసుపు పంటలో మెరుగైన ఫలితాలనిస్తున్న మొక్కల్ని వేరే చేస్తూ కొన్ని సంవత్సరాల పాటు శ్రద్ధగా కొనసాగించిన ఎంపిక ప్రక్రియ ద్వారా ఈ కొత్త వంగడాన్ని ఆయన రూపొందించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ద్వారా కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖకు చెందిన నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ జాతీయ స్థాయి ద్వితీయ ఆవిష్కర్త పురస్కారాన్ని అందుకున్నారు.



ఆవిష్కర్తకు ఆరేళ్ల పాటు ప్రత్యేక హక్కులు

2023లో న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) నిర్వహించిన ద్వైవార్షిక గ్రామస్థాయి ఆవిష్కరణలు మరియు అసాధారణ సంప్రదాయ విజ్ఞాన పురస్కారాల 11 వ మహాసభలో రైతు శాస్త్రవేత్త సచిన్ కమలాకర్ కారేకర్‌కు జాతీయ ద్వితీయ పురస్కారం లభించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు.

ఎన్ఐఎఫ్ గతంలో దరఖాస్తు ఆధారంగా.. ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ అథారిటీ (పిపివి అండ్ ఎఫ్ఆర్ఎ) 2024 డిసెంబర్‌లో సచిన్ అభివృద్ధి చేసిన ఎస్‌కె-4 వంగడానికి ప్రత్యేక వంగడంగా గుర్తింపునిచ్చింది. సచిన్ కమలాకర్ కరేకర్‌ను 'ప్లాంట్ బ్రీడర్'గా గుర్తించి ప్రత్యేక హక్కులను ప్రదానం చేసింది. దీని ప్రకారం ఆరేళ్ల పాటు ఈ వంగడాన్ని పండించి, విత్తనాన్ని అమ్ముకునే ప్రత్యేక హక్కు ఆవిష్కర్త అయిన సచిన్‌కు దఖలుపడింది.





ఔషధ విలువలకు పెట్టింది పేరైన పసుపు పంటకు సంబంధించి దేశవ్యాప్తంగా 30 వంగడాలు సాగులో ఉన్నాయి. మహారాష్ట్రలో రైతులు 70% విస్తీర్ణంలో రాజపురి సేలం వెరైటీని సాగు చేస్తుంటారు. ఇది 20 రాష్ట్రాల్లో విస్తారంగా సాగవుతున్నప్పటికీ మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల్లో ఎక్కువగా సాగవుతోంది. 2022-23లో మన దేశంలో 11.61 లక్షల టన్నుల పసుపు పండింది. పసుపునకు సంబంధించి ప్రపంచంలోనే భారత్ అత్యధిక ఉత్పత్తిదారు, వినియోగదారు, ఎగుమతిదారు కూడా!

సచిన్ కమలాకర్ కరేకర్ (48) స్వస్థలం మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా అబ్లోలి అనే గ్రామం. చిప్లన్‌కు 55 కి.మీ. దూరంలో ఈ ఊరు ఉంది. సచిన్ ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన తర్వాత 22 ఏళ్ల వయసు నుంచి గత 26 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. 500 వక్క చెట్లు, 50 కొబ్బరి చెట్ల మధ్య పసుపును అంతరపంటగా సాగు చేస్తున్నారు. అధిక దిగుబడినిచ్చే వంగడాలను రూపొందించాలన్న ఆకాంక్ష మొదటి నుంచే ఆయనకు ఉంది. నచ్చిన గుణగణాలున్న మొక్కల్ని ఏటేటా వేరుగా సాగు చేస్తూ కొత్త పసుపు వంగడాన్ని ఆవిష్కరించారు. దీన్నే క్లోనల్ సెలక్షన్ మెథడ్ అంటారు.

1998 నుంచి కొత్త వంగడంపై కృషి

సచిన్ తన సేద్య ప్రయాణం గురించి ఇలా చెప్పుకొచ్చారు.. '1998లో నేను ఒక స్థానిక పసుపు రకాన్ని సాగు చేయటం ప్రారంభించాను. పొలంలో కొన్ని మొక్కల పంట కాలం మిగతా వాటికన్నా ముందుగానే ముగుస్తున్నట్లు గుర్తించాను. ఆ మొక్కలు చాలా ఏపుగానూ పెరిగాయి. అట్లా మెరుగ్గా కనిపించిన మొక్కల దుంపలను వెలికి తీసి, విడిగా ఉంచాను. ఆ పసుపు దుంపలు చాలా పెద్దవిగా ఉన్నాయి. ముదురు రంగులో ఆకర్షణీయంగానూ, చీడపీడలను దీటుగా తట్టుకొని బాగా పెరిగాయి. అధిక దిగుబడి కూడా వచ్చింది. అదే విధంగా ఆ మొక్కల్ని ప్రతి ఏటా సాగు చేస్తూ, మెరుగ్గా ఉన్న మొక్కల పసుపు కొమ్ముల్ని నాటి, మళ్లీ వాటిలో నుంచి మంచి వాటిని ఏరి తర్వాత ఏడాది సాగు చేయటం 2007 వరకు కొనసాగించాను. 2008 నాటికి నాకు నచ్చిన (త్వరగా కోతకు రావటం, ఏపుగా చీడపీడలను తట్టుకొని పెరగటం, అధిక దిగుబడి, దుంప రంగు బాగుండటం.. వంటి) మంచి గుణగణాలున్న మెరుగైన కొత్త వంగడం సిద్ధమైంది. దాన్ని ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసి, దానికి ఎస్‌కె-4 అని పేరు పెట్టాను.'

కుర్కుమిన్ 4%

పచ్చి పసుపు హెక్టారుకు 55-56 టన్నుల దిగుబడినిచ్చే వంగడం ఇది. చాలా ఆకర్షణీయంగా ముదురు ఎరుపు-పసుపు రంగు. దీని పంటకాలం 160-170 రోజులు. అధిక వర్షపాతం గల ప్రాంతానికి అనువైనది. దుంపకుళ్లు తెగులును, ఆకు మచ్చ తెగులును తట్టుకునే గుణం దీనికి ఉంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్ఐఎఫ్) ఈ వంగడాన్ని గుర్తించి 2020 ఖరీఫ్‌లో ప్రయోగాత్మకంగా దపోలిలోని డాక్టర్ బాలసాహెబ్ సావంత్ కొంకణ్ కృషి విద్యాపీఠ్ (డిబిఎస్‌కెకెవి) ఆవరణలో సాగు చేయించింది. హెక్టారుకు పచ్చి పసుపు 56 టన్నుల అధిక దిగుబడి వచ్చింది. 28 రకాల కన్నా ఎస్‌కె-4 రకం అధిక దిగుబడినిచ్చింది. ఈ పసుపులో కుర్కుమిన్ 4% ఉంది. దీంతో ఈ రకం పసుపు విత్తనాన్ని పరిసర జిల్లాల్లోని రైతులకు సచిన్ ఇవ్వటం ప్రారంభించారు. ఆ రైతులకు కూడా మంచి దిగుబడి వచ్చింది. ఆ విధంగా ఈ రకం పసుపు సాగు 2021 నాటికే ఎస్‌కె-4 రకం మహారాష్ట్రలో లక్ష ఎకరాలకు విస్తరించింది. దీంతో ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ యాక్ట్ -2001 కింద ఈ సరికొత్త వంగడానికి సంబంధించి సచిన్‌కు ప్రత్యేక జన్యు హక్కులు ఇవ్వమని కోరుతూ ఎన్ఐఎఫ్ దరఖాస్తు చేసింది.

ఎస్‌కె-4 పేరు ఎందుకొచ్చింది?

తన ఆవిష్కరణకు మూలమైన స్థానిక వంగడం సంగ్లి కడప వెరైటీ స్పెషల్ కొంకణ్‌ను ఇచ్చింది షెండ్గే కాక అనే రైతు. అందుకని కొత్త వంగడానికి మొదటి అక్షరం ఆయనది, రెండో అక్షరం తనది కలిపి ఎస్‌కె-4 అని పేరు పెట్టారు. డిబిఎస్‌కెకెవికి చెందిన ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రఫుల్ల మలి మాట్లాడుతూ.. మేం ఈ రకాన్ని రెండేళ్ల వరుసగా సాగు చేసి చూశాం. రాజేంద్ర సోనా అనే రకం మాదిరిగా ఇది కూడా అధిక దిగుబడినిచ్చే రకమని రుజువైంది. రాజేంద్ర సోనా హెక్టారుకు 64 టన్నుల దిగుబడినిచ్చేదైనప్పటికీ దాని విత్తనం అందుబాటులో లేదు. అందువల్ల ఎస్‌కె-4 రకం ప్రత్యామ్నాయంగా అధిక వర్షపాతం నమోదయ్యే కొంకణ్ ప్రాంతానికి ఇది అనువైనదిగా గుర్తించాం. తక్కువ వర్షపాతం ఉండే ప్రాంతాల్లో దీని పనితీరు ఎలా ఉంటుందో ఇంకా పరీక్షించాల్సి ఉంది అన్నారు. సింధ్‌దుర్గ్, రాయ్‌గడ్, రత్నగిరి జిల్లాల్లో చాలా మంది రైతులు ఈ రకాన్ని సాగు చేస్తున్నారు. గుహగర్ తాలూకా వేలాంబ్ గ్రామానికి చెందిన విశ్రాం మలి (58) అనే రైతు గత ఏడాది ఈ పంటను సాగు చేయగా ఒక మొక్క కుదురులోని పసుపు 8.15 కిలోల బరువు తూగింది!

నర్సరీ పెంచి నాట్లు వేయటం మేలు

డాక్టర్ ప్రఫుల్ల మలి ఇంకా ఇలా చెప్పారు.. ఏప్రిల్‌లో నర్సరీ బ్యాగుల్లో పసుపు విత్తనం పెడతాం. జూన్‌లో ఆ మొక్కల్ని పొలంలో నాటుతాం. నాట్లకు ముందు సేంద్రియ ఎరువు వేసి పొలాన్ని దుక్కి చేస్తాం. ఆగస్టులో రెండో దఫా ద్రవ ఎరువును అందిస్తాం. జనవరి ఆఖరు వరకు నీరు ఇస్తుంటాం. ఫిబ్రవరిలో పంట కోత జరుగుతుంది. ప్రతి మొక్కకు సగటున 3.2 కిలోల దుంపలు వస్తాయి. సచిన్ ఈ వంగడాన్ని పదేళ్లుగా రైతులకు ఇస్తున్నారు. దీనితోపాటు దీని యాజమాన్య మెళకువలపై రైతులకు ఆయన తరచూ శిక్షణ ఇస్తున్నారు. పసుపు విత్తనాన్ని నేరుగా పొలంలో నాటే కంటే నర్సరీలో పెంచి నాట్లు వేయటం వల్ల అధిక దిగుబడి వస్తోందని ఇటీవల వరకు గుహాగర్‌లో వ్యవసాయ విస్తరణాధికారిగా పనిచేసిన గజేంద్ర పానికర్ అంటున్నారు.

విత్తనం 500 మంది రైతులకు ఇచ్చా

నేను కొత్తగా అభివృద్ధి చేసిన ఎస్‌కె-4 రకం పసుపు విత్తనాన్ని రత్నగిరి, సింధుదుర్గ్, రాయగడ్ జిల్లాలకు చెందిన దాదాపు 500 మంది రైతులకు ఇచ్చాను. కొత్తగా వేసే రైతులు అతిగా ఆశపడి ఈ రకాన్ని మొదటే ఎక్కువ విస్తీర్ణంలో వేయొద్దు. మొదట ఒక గుంట (వెయ్యి చదరపు అడుగులు)లో వేసి చూడండి. తర్వాత పది గుంటలకు పెంచండి. నేనూ అలాగే చేశా. ఇప్పుడు రెండు ఎకరాల్లో సాగు చేస్తున్నా. ఈ ప్రత్యేక పొలాన్ని చూడటానికి సందర్శకులు వస్తుంటారు.



– సచిన్ కమలాకర్ కారేకర్,
ఎస్‌కె-4 పసుపు రకం ఆవిష్కర్త,
నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్
జాతీయ ద్వితీయ పురస్కార గ్రహీత,
అబ్లోలి, రత్నగిరి జిల్లా, మహారాష్ట్ర.

నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాగుబడి డెస్క్

• ఇన్నోవేషన్

ట్రేసెక్స్ టెక్నాలజీస్

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఏర్పాటైన ఇంక్యుబేషన్ కేంద్రం 'అగ్రిహబ్'లో తుది రూపుదిద్దుకున్న స్టార్టప్‌లలో 'ట్రేసెక్స్ టెక్నాలజీస్' ఒకటి. ఈ స్టార్టప్ పుట్టుపూర్వోత్తరాలు, పనితీరు గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

తాము ఉపయోగిస్తున్న ఆహారోత్పత్తులను, ఇతర ఉత్పత్తులను ఏ విధంగా తయారు చేశారు? ఆ పంట లేదా వస్తువు పుట్టుక నుంచి అనుసరించిన పద్ధతుల్లో పర్యావరణ హితమైన, ఆరోగ్యదాయకమైన, సుస్థిరాభావృద్ధికి దోహదపడే విధానాలను పాటించారా లేదా అనే విషయాన్ని వినియోగదారులు డేటా ఆధారితంగా నిర్ధారించుకునేందుకు దోహదపడేదే ట్రేసబిలిటీ వ్యవస్థ. ఇటువంటి సేవలను బ్లాక్‌చైన్ టెక్నాలజీ ద్వారా అందిస్తున్న సంస్థ ట్రేసెక్స్ టెక్నాలజీస్. బెంగళూరుకు కేంద్రంగా ట్రేసెక్స్ టెక్నాలజీస్ సంస్థను శ్రీవత్స శ్రీనివాసరావు, అనిల్ నాడిగ్ సంయుక్తంగా నెలకొల్పారు.

ఈ టెక్నాలజీ వ్యవసాయ రంగంలో విలువ గొలుసులో, అంటే ఉత్పత్తిని మూలం నుంచి అంటే రైతు దగ్గరి నుంచి కొనుగోలు దారుకు ఉత్పత్తి చేరే వరకు పాటించిన ప్రమాణాలను డిజిటల్‌గా ట్రాక్ చేయటానికి ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. దీంతో పాటు అనేక ఇతర రంగాలకు సంబంధించిన ఉత్పత్తులు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా లేదో తెలుసుకునేందుకు కూడా ఈ ట్రేసబిలిటీ టెక్నాలజీ తోడ్పడుతుందని నిర్వాహకులు చెబుతున్నారు.



సాంకేతికత: బ్లాక్‌చైన్ ట్రేసబిలిటీ

సమస్య:

తాము ఉపయోగిస్తున్న ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రూపొందాయో లేదో తెలుసుకోవాలని వినియోగదారులు తెలుసుకోగోరుతున్నారు.

పరిష్కారాలు:

- బ్లాక్‌చైన్ ట్రేసబిలిటీ సాంకేతికత ద్వారా ట్రేసెక్స్ టెక్నాలజీస్ ఈ సమస్యకు పరిష్కారం చూపుతుంది. వ్యవసాయ ఉత్పత్తులు, విత్తన సరఫరా గొలుసుకు చెందిన రవాణా నాణ్యత గురించి సమాచారాన్ని అందిస్తోంది.
- రైతులు నేరుగా వినియోగదారులతో అనుసంధానం అయ్యేందుకు, వ్యాపారం చేయటానికి సరైన వేదికగా వ్యవహరిస్తుంది.
- రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ఉత్పత్తికి సంబంధించిన విశ్వసనీయ సమాచారాన్ని వినియోగదారులకు అందిస్తుంది.
- పొలం నుంచి వినియోగదారుని వరకు, ఆహారోత్పత్తులకు సంబంధించిన రవాణా, భద్రత, నాణ్యత గురించి వినియోగదారులకు సమాచార హామీ ఇస్తుంది.
- కొనుగోలుదారులు, విత్తన పునరుత్పత్తి సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, విత్తనాభివృద్ధి సంస్థలు, విత్తన ధృవీకరణ సంస్థలు, రైతులు ఈ టెక్నాలజీ ద్వారా ప్రయోజనం పొందవచ్చు.

• టెక్నాలజీ

మండే ఎండల్లోనూ ఆరుబయటే పుట్టగొడుగుల పెంపకం!

పుట్టగొడుగులను పెంచడానికి సాధారణంగా పక్కా భవనంలో లేదా సెమీ పర్మినెంట్ షెడ్లను వినియోగిస్తూ ఉంటారు. అయితే, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టీకల్చర్ రీసెర్చ్ (ఐఐహెచ్ఆర్) ఆరుబయటే ఉంచి సౌర విద్యుత్తుతో పుట్టగొడుగులను పెంచే ఒక ప్రత్యేక పెట్టె వంటి యూనిట్‌ను రూపొందించింది. ఏప్రిల్, మే నెలల్లో మండే ఎండల్లో కూడా ఈ యూనిట్ ద్వారా రూపాయి కరెంటు ఖర్చు లేకుండా పుట్టగొడుగులు పెంచుకోవచ్చని ఐఐహెచ్ఆర్ చెబుతోంది. ఎవాపరేటివ్ కూలింగ్ ప్రిన్సిపల్ ఆధారంగా ఈ 'అర్క మష్రూమ్ గ్రోయింగ్ యూనిట్' పనిచేస్తుండటమే ఇందుకు కారణం. తక్కువ పెట్టుబడి, సులభ నిర్వహణ దీని ప్రత్యేకత ఆకర్షణలు.



పుట్టగొడుగులు పెంచే ఈ ఛాంబర్ సైజు: 1.35 × 0.93 × 1.69 మీటర్లు. అంటే.. దీన్ని పెట్టుకోవటానికి రెండు చదరపు మీటర్ల స్థలం ఉంటే చాలు. 1'' సిపివిసి పైపులు, ఫిట్టింగ్‌లతో దీన్ని తయారు చేశారు. సాధారణ గదుల్లో పుట్టగొడుగులు పెంపకంతో పోల్చితే దీనిలో 51-108% వరకు దిగుబడి పెరిగిం. ఈ యూనిట్ ద్వారా నెలకు 25-28 కిలోల ఎల్మ్ అయిస్టర్, వైట్ మష్రూమ్స్ రకాల పుట్టగొడుగుల్ని పెంచవచ్చని ఐఐహెచ్ఆర్ తెలిపింది.

ఈ యూనిట్‌లో సులభంగా మిద్దె పైన, ఇంటి పెరట్లో కూడా ఎంచక్కా పుట్టగొడుగులు పెంచి, వాటిని పచ్చివి, ఎండువి విక్రయించవచ్చు. వాటితో తయారు చేసిన పోషక విలువలతో కూడిన పొడులను విక్రయించవచ్చు. ఒక్క ఎండు పుట్టగొడుగులు మాత్రమే విటమిన్ డిని అందించగల ఏకైక ఉత్పత్తి అని డా. ఖాదర్‌వలి వంటి శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వ్యాపార దృష్టితో మిద్దె తోటల్లో లేదా ఇంటిపంటల్లో మేడలపైనే పుట్టగొడుగులు పెంపకాన్ని ప్రారంభించదలచిన వారికి ఈ సోలార్ మష్రూమ్ ప్రొడక్షన్ యూనిట్ వరమని చెప్పొచ్చు. ఫాబ్రికేటర్లు ఇటువంటి యూనిట్లను తయారు చేసి విక్రయించుకోవటానికి అవకాశం ఉంది.

ఇతర వివరాలకు.. 90909 49605, 080 – 23086100 (ఎక్స్‌టెన్షన్ : 348-349)
mushroomiihr@gmail.com

బిజినెస్ రీల్

గుర్తింపు పొందిన అంకురాలు 1.61 లక్షలు



న్యూఢిల్లీ: దేశీయంగా జనవరి 31 నాటికి పరిశ్రమలు, అంతర్గత వాణిజ్యం ప్రోత్సాహక విభాగం డీపీఐఐటీ గుర్తింపు పొందిన స్టార్టప్‌లు 1,61,150 ఉన్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ తెలిపారు. మహారాష్ట్రలో 28,511 అంకుర సంస్థలు, కర్ణాటకలో 16,954 స్టార్టప్‌లు ఉన్నట్లు లోక్‌సభకు ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో వివరించారు. ఈ అంకుర సంస్థలకు స్టార్టప్ ఇండియా కార్యాచరణ ప్రణాళిక కింద పన్నుపరమైన మినహాయింపులు పొందేందుకు అర్హత ఉంటుంది.

ఇక రైట్స్‌కి 23 రోజులే



గడువు తగ్గించిన సెబీ

న్యూఢిల్లీ: లిస్టెడ్ కంపెనీలు చేపట్టే రైట్స్ ఇష్యూలను ఇకపై 23 రోజుల్లోగా పూర్తి చేయ వలసి ఉంటుంది. ఇందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజా చర్యలకు తెరతీసింది. దీంతో ముసాయిదా ఆఫర్‌ను దాఖలు చేయవలసిన అవసరం తప్పుతుంది. ఇందుకు బదులుగా స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చి సూత్రప్రాయ అనుమతిని పొందవచ్చు. దీంతో వేగవంత రైట్స్ ఇష్యూలకు దారి చూపింది. తాజా మార్గదర్శకాల ప్రకారం బోర్డు అనుమతించిన 23 పనిదినాల్లోగా రైట్స్ ఇష్యూని పూర్తి చేయవలసి ఉంటుంది. ప్రస్తుత 317 రోజుల గడువును భారీగా కుదిస్తూ సర్క్యులర్‌ను జారీ చేసింది. దీంతో 40 రోజుల గడువున్న ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్‌కంటే రైట్స్‌ను వేగవంతం చేసింది. తద్వారా నిధుల సమీకరణకు ప్రాధాన్యతా మార్గంగా రైట్స్‌కు సెబీ మద్దతు పలికింది.

ఎన్ఎస్ఈలో రోడ్‌స్టార్ ఇన్విట్ లిస్టింగ్

ఐఎల్అండ్ఎఫ్ఎస్ రుణ పునర్వ్యవస్థీకరణ ఎఫెక్ట్



న్యూఢిల్లీ: రుణ పునర్వ్యవస్థీకరణలో భాగంగా రోడ్‌స్టార్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(ఇన్విట్)ను ఎన్ఎస్ఈలో లిస్టింగ్ చేసింది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్(ఐఎల్అండ్ఎఫ్ఎస్)కు చెందిన రోడ్‌స్టార్ ఇన్విట్‌ను రూ. 8,592 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో లిస్ట్ చేసింది. తద్వారా రుణ పరిష్కారంలో గ్రూప్‌నకున్న విభిన్న ఫైనాన్షియల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకుంటున్నట్లు ఐఎల్అండ్ఎఫ్ఎస్ తెలియజేసింది. ఈ బాటలో రుణదాతలకు రూ. 5,000 కోట్ల మధ్యంతర చెల్లింపులను పూర్తి చేసినట్లు ప్రస్తావించింది. ఇన్విట్ యూనిట్ల ద్వారా రూ. 3,500 కోట్లు, మరో రూ. 1,500 కోట్లకు నగదు చెల్లించినట్లు తెలియజేసింది. రహదారి ఆస్తుల(ప్రాజెక్టులు)పై గరిష్ట రిటర్నులు అందుకోవడం ద్వారా సమర్థవంత పరిష్కారాలకు తెరతీస్తున్నట్లు వివరించింది.

పర్యాటకానికి పండగ కళ..



సాక్షి, బిజినెస్ డెస్క్

- హోలీతో సుదీర్ఘ వారాంతం
- ఫ్లైట్ బుకింగ్స్ 25 శాతం, చార్జీలు 18 శాతం అప్
- హోటల్ బుకింగ్స్ 30 శాతం అధికం

మహా కుంభ మేళా హడావిడి ముగిసిన తర్వాత పర్యాటకానికి హోలీ పండుగ రూపంలో మరో కొత్త దన్ను దొరికింది. శుక్రవారం నాడు హోలీ కావడంతో సుదీర్ఘ వారాంతపు సెలవులొస్తున్న నేపథ్యంలో టూరిజానికి డిమాండ్ పెరిగింది. వివిధ ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీల డేటా ప్రకారం గత సీజన్‌తో పోలిస్తే ఫ్లయిట్ బుకింగ్స్ 25–30 శాతం ఎగిశాయి. అలాగే హోటల్ బుకింగ్స్ కూడా 20–30 శాతం పెరిగాయి. ఇక వీటితో పాటు ప్రయాణికులను ఆకట్టుకునేందుకు విమానయాన సంస్థ డిస్కౌంట్లు, ప్రమోషనల్ ఆఫర్లు ఇస్తున్నప్పటికీ చార్జీలు సైతం పెరిగాయి. దేశీ ప్రయాణాలకు సంబంధించి చార్జీలు సగటున 12–18 శాతం, అంతర్జాతీయ రూట్లలో చార్జీలు 8–14 శాతం పెరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి సందర్భాల్లో వీలైనంత ముందుగా ట్రావెల్ ప్రణాళికలు వేసుకోవాలంటూ కస్టమర్లకు సూచిస్తున్నట్లు వివరించాయి.

లగ్జరీ హోటళ్లలో టారిఫ్‌లు జూమ్..

ఇక హోటళ్ల విషయం తీసుకుంటే, సాధారణ వీకెండ్ బుకింగ్స్‌తో పోల్చినప్పుడు లగ్జరీ, ప్రీమియం ప్రాపర్టీల్లో గదుల రేట్లు 30–40 శాతం పెరిగినట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. అదే స్టాండర్డ్ హోటళ్లలో చూస్తే ధరల పెరుగుదల 15–20 శాతం మేర ఉన్నట్లు వివరించాయి. జైపూర్, ఉదయ్‌పూర్, వారణాసి, గోవా, అలీబాగ్, లోనావాలా, రిషికేష్, కూర్గ్, కేరళ వంటి డెస్టినేషన్లలో హోటల్ గదుల బుకింగ్స్ 25–30 శాతం పెరిగాయి. కుటుంబాలు, ఫ్రెండ్స్ బృందాలు ఎక్కువగా ప్రైవేట్ విల్లాలు, లగ్జరీ హోటళ్లు, ప్రీమియం రిసార్టులవైపు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో లగ్జరీ ప్రాపర్టీలు, ప్రైవేట్ విల్లాల బుకింగ్స్ సాధారణ వీకెండ్స్‌తో పోలిస్తే 40–50 శాతం పెరిగాయి. రాజస్థాన్, గోవాతో పాటు ప్రధాన మెట్రోలకు సమీపంలో ఉన్న హిల్ స్టేషన్లలో చాలా మటుకు ప్రీమియం, లగ్జరీ హోటల్స్ ఇప్పటికే 70–80 శాతం బుక్ అయిపోయాయి. కొన్ని రిసార్టుల్లో ఇప్పటికే ఆక్యుపెన్సీ పూర్తి స్థాయికి చేరినట్లు జోస్టెల్ సంస్థ వివరించింది. కాక్స్ అండ్ కింగ్స్ ప్రకారం జైపూర్, వారణాసి, రిషికేష్, గోవాలాంటి ప్రాంతాలకు టూర్ ప్యాకేజీలు, హోటల్ బుకింగ్స్‌కి భారీ డిమాండ్ నెలకొంది. ఇక అంతర్జాతీయంగా చూస్తే దుబాయ్, సింగపూర్, బ్యాంకాక్‌లాంటివి ఫేవరెట్ డెస్టినేషన్లుగా ఉంటున్నాయి.

ఎయిర్‌లైన్స్ ప్రత్యేక ఆఫర్లు..

హోలీ అనంతరం కూడా ప్రయాణాలకు డిమాండ్ భారీగా పడిపోకుండా విమానయాన సంస్థలు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆకాశ ఎయిర్, ఇండిగో తదితర సంస్థలు పరిమిత కాలం పాటు డిస్కౌంట్లు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. పౌర విమానయాన శాఖ డేటా ప్రకారం ఫిబ్రవరి ఆఖరు వారంలో నమోదైన 5.2 లక్షల మంది రోజువారీ విమాన ప్రయాణికుల సంఖ్య మార్చి తొలి రెండు వారాల్లో సుమారు 4.8 లక్షల ప్యాసింజర్లకు పడిపోయినప్పటికీ.. వార్షికంగా చూస్తే మాత్రం మెరుగ్గానే ఉన్నట్లు తెలుస్తోంది.

హైదరాబాద్‌లో పడిపోయిన ఇళ్ల విక్రయాల విలువ

- 2024లో అమ్మకాలు రూ.1.05 లక్షల కోట్లు
- దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో సానుకూలం
- ప్రాప్ ఈక్విటీ సంస్థ నివేదిక విడుదల



న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో గతేడాది ఇళ్ల అమ్మకాల విలువ చెప్పుకోతగ్గ స్థాయిలో పడిపోయింది. 2023తో పోల్చి చూస్తే 18 శాతం తక్కువగా రూ.1.05 లక్షల కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. 2023లో విక్రయాల విలువ రూ.1.28 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం. కానీ, దేశవ్యాప్తంగా టాప్ 9 ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాల విలువ 2024లో నికరంగా 12 శాతం పెరిగి రూ.6,73,000 లక్షల కోట్లుగా ఉండడం గమనార్హం. రియల్ ఎస్టేట్ డేటా అనలైటిక్స్ సంస్థ 'ప్రాప్‌ఈక్విటీ' ఈ మేరకు ఒక నివేదికను విడుదల చేసింది. 2023లో రూ.6,00,143 కోట్ల విలువైన ఇళ్ల విక్రయాలు నమోదయ్యాయి.

ఢిల్లీలో సానుకూల పరిస్థితులు

''ఢిల్లీ–ఎన్‌సీఆర్ మార్కెట్లో సగటు విక్రయ ధర చదరపు అడుగుకి (ఎస్ఎఫ్‌టీ) రూ.12,469గా ఉంది. మౌలిక వసతుల అభివృద్ధి మెరుగ్గా ఉండడం, కార్పొరేట్ కంపెనీల ప్రాతినిధ్యం పెరుగుతుండడం, విస్తృత ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రావడంతో డిమాండ్ పెరుగుతోంది''అని ప్రాప్ ఈక్విటీ వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ జసూజ తెలిపారు.

నగరాల వారీగా అమ్మకాలు..

- గురుగ్రామ్‌లో 2023లో రూ.64,314 కోట్ల ఇళ్ల విక్రయాలు జరిగితే, 2024లో రూ.1,06,739 కోట్లకు పెరిగాయి.
- ఢిల్లీ–ఎన్‌సీఆర్ ప్రాంతంలో గతేడాది ఇళ్ల అమ్మకాలు 63 శాతం పెరిగి రూ.1,53,000 కోట్లకు చేరాయి. 2023లో అమ్మకాల విలువ రూ.94,143 కోట్లుగానే ఉంది.
- ముంబై మార్కెట్లో అమ్మకాల విలువ 13 శాతం పెరిగి రూ.1.38 లక్షల కోట్లకు చేరింది.
- నవీ ముంబైలోనూ 32 శాతం వృద్ధితో ఇళ్ల అమ్మకాలు రూ.25,000 కోట్లకు చేరాయి.
- థానేలో 6 శాతం అధికంగా రూ.56,000 కోట్ల అమ్మకాలు 2024లో జరిగాయి.
- బెంగళూరు మార్కెట్లో రూ.85,000 కోట్ల విలువైన ఇళ్ల విక్రయాలు గతేడాది జరిగాయి. అంతకుముందు ఏడాది విక్రయాలు రూ.75వేల కోట్లతో పోల్చి చూస్తే 13 శాతం పెరిగాయి.
- చెన్నై మార్కెట్లో 5 శాతం వృద్ధితో ఇళ్ల విక్రయాలు రూ.20,000 కోట్లుగా ఉన్నాయి.
- కోల్‌కతాలో రూ.15,000 కోట్ల అమ్మకాలు చోటుచేసుకున్నాయి. 2023లో విక్రయాలు రూ.13,000 కోట్లతో పోల్చి చూస్తే 15 శాతం వృద్ధి నమోదైంది.
- పుణెలో అమ్మకాల విలువ కేవలం ఒక శాతం క్షీణించి రూ.76,000 కోట్లుగా ఉంది. 2023లో ఇక్కడ రూ.77,000 కోట్ల విక్రయాలు జరిగాయి.

త్వరలో టాటా క్యాపిటల్ ఐపీవో

- ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తరువాతే ప్రాస్పెక్టస్ దాఖలు
- ఈ నెలాఖరుకల్లా టాటా మోటార్స్ ఫైనాన్స్ విలీనానికి ఓకే

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ ఫైనాన్షియల్ సర్వీసుల సంస్థ టాటా క్యాపిటల్ త్వరలో పబ్లిక్ ఇష్యూకి రానుంది. అయితే ఇందుకు కంపెనీతో టాటా మోటార్స్ ఫైనాన్స్ విలీనానికి జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) అనుమతించవలసి ఉంది. తదుపరి సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసేందుకు వీలుంటుంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఈ నెల(మార్చి) చివరికల్లా విలీనానికి ఎన్‌సీఎల్‌టీ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నట్లు అంచనా. దీంతో 2 బిలియన్ డాలర్ల(రూ. 17,000 కోట్లు) విలువైన ఐపీవోకు శ్రీకారం చుట్టనుంది. తద్వారా 11 బిలియన్ డాలర్ల విలువైన కంపెనీగా నిలవనున్నట్లు అంచనా. ఆర్‌బీఐ వద్ద అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తింపు పొందిన టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకి ఇప్పటికే సంస్థ బోర్డు అనుమతించింది. ఐపీవోలో భాగంగా 2.3 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా ప్రస్తుత వాటాదారులు సైతం కొంత మేర ఈక్విటీని ఆఫర్ చేయనున్నారు.

ఏథర్ ఎనర్జీ ఐపీవో ఏప్రిల్‌లో

ఈక్విటీగా కన్వర్టిబుల్ షేర్ల మార్పిడి



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కంపెనీ ఏథర్ ఎనర్జీ ఏప్రిల్‌లో పబ్లిక్ ఇష్యూకి వచ్చే సన్నాహాలు చేపట్టింది. ఇందుకు వీలుగా కంపెనీ తప్పనిసరిగా మార్పిడికిలోనయ్యే ప్రిఫరెన్స్ షేర్ల(సీసీపీఎస్)ను ఈక్విటీగా మార్పు చేస్తోంది. కంపెనీల రిజిస్ట్రార్(ఆర్‌వోసీ) సమాచార ప్రకారం 1.73 సీసీపీఎస్‌ను 24.04 కోట్ల ఈక్విటీ షేర్లుగా మార్పిడి చేసేందుకు ఏథర్ బోర్డు తాజాగా అనుమతించింది. సెబీ నిబంధనల ప్రకారం ప్రధాన ప్రాస్పెక్టస్ దాఖలు చేసే ముందుగానే సీసీపీఎస్‌ను ఈక్విటీగా మార్పిడి చేయవలసి ఉంటుంది. వెరసి 2025–26లో పబ్లిక్ ఇష్యూకి వచ్చిన తొలి కంపెనీగా ఏథర్ ఎనర్జీ నిలిచే వీలున్నట్లు మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు పేర్కొన్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో ఏథర్ సెబీకి ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. మహారాష్ట్రలో ఈవీ ద్విచక్ర వాహన తయారీ ప్లాంటు ఏర్పాటు, రుణ చెల్లింపులకుగాను నిధుల సమీకరణ చేపట్టనున్నట్లు పత్రాలలో పేర్కొంది. ఐపీవోలో భాగంగా రూ. 3,100 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 2.2 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. దీంతో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ తదుపరి రెండో ద్విచక్ర ఈవీ కంపెనీగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టికానుంది!

ప్రత్యేక కేసుల్లోనే సోషల్ మీడియా, డిజిటల్ యాక్సెస్

ఆదాయపన్ను శాఖ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: కొత్త ఆదాయపన్ను బిల్లు కింద కేవలం సెర్చ్, సర్వే ఆపరేషన్లలోనే పన్ను చెల్లింపుదారుల డిజిటల్ ఖాతాలు, కంప్యూటర్ పరికరాల ప్రవేశాన్ని ఆదాయపన్ను శాఖ బలవంతంగా తీసుకుంటుందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అది కూడా పాస్‌వర్డ్‌లను పంచుకునేందుకు తిరస్కరించినప్పుడే ఇలా జరుగుతుందన్నారు. అంతేకానీ, సాధారణ పన్ను చెల్లింపుదారులకు సంబంధించి, స్క్రూటినీ కేసుల్లో సైతం ఆన్‌లైన్ గోప్యతకు భంగం కలిగించేది ఉండదని స్పష్టం చేశారు. ఈ తరహా చర్యలు తీసుకునే అధికారం 1961 ఆదాయపన్ను చట్టం కింద ప్రస్తుతం సైతం ఉన్నట్లు చెప్పారు. ఇవే అధికారాలను ఆదాయపన్ను బిల్లు 2025లోనూ పేర్కొన్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ రికార్డులు, పన్ను చెల్లింపుదారుల ఈ–మెయిల్స్, సోషల్ మీడియా హ్యాండిల్స్, క్లౌడ్ స్టోరేజీ నుంచి సమాచారం పొందే అధికారం కొత్త ఆదాయపన్ను బిల్లులోని సెక్షన్ 247 కింద కింద దఖలు పడనున్నాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని తిరస్కరించారు. ఇవి కేవలం భయాన్ని కల్పించేవిగా పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారుల సోషల్ మీడియా ఖాతాలు లేదా ఆన్‌లైన్ కార్యకలాపాలపై పన్ను శాఖ నిఘా పెట్టబోదన్నారు.

ప్రభుత్వ బ్యాంకుల ఔట్‌లుక్ ఓకే

- ఫిచ్ నుంచి 'నిలకడైన' రేటింగ్
- జాబితాలో యూనియన్ బ్యాంక్
- పంజాబ్ నేషనల్ బ్యాంక్



న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజాలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)కు తాజాగా ఫిచ్ స్థిరత్వ(స్టేబుల్) రేటింగ్‌ను ప్రకటించింది. దీంతో ప్రభుత్వ రంగ బ్యాంకులు స్టేబుల్ ఔట్‌లుక్‌తో బీబీబీ రేటింగ్‌ను పొందాయి. ప్రభుత్వ మద్దతు, సానుకూల నిర్వహణా పరిస్థితులు, రిస్క్ ప్రొఫైల్, ఆస్తుల(రుణాలు) నాణ్యత మెరుగుపడుతుండటం, నిధుల సమీకరణ, లిక్విడిటీ వంటి అంశాలు రేటింగ్‌కు ప్రభావం చూపినట్లు ఫిచ్ పేర్కొంది. అంతేకాకుండా బ్యాంక్ సామర్థ్య సంబంధిత వయబిలిటీ రేటింగ్(వీఆర్)ను బీప్లస్ నుంచి బీబీమైనస్‌కు అప్‌గ్రేడ్ చేసింది. ప్రభుత్వ మద్దతు రేటింగ్(జీఎస్ఆర్)ను బీబీబీమైనస్‌గా ప్రకటించింది. బ్యాంకుల రిస్క్ ప్రొఫైల్ మెరుగుపడటం.. ప్రధానంగా ఆర్థిక పనితీరులో ఇది ప్రతిబింబించడం వీఆర్ అప్‌గ్రేడ్‌కు కారణమైనట్లు రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ తెలియజేసింది. ఈ బాటలో యూనియన్ బ్యాంక్, పీఎస్‌బీల దీర్ఘకాలిక జారీ డిఫాల్ట్ రేటింగ్(ఐడీఆర్)కు స్థిరత్వ ఔట్‌లుక్‌తో బీబీబీమైనస్ ఇచ్చింది. యూనియన్ బ్యాంక్‌లో 75 శాతం, పీఎన్‌బీలో 70 శాతం ప్రభుత్వ వాటాతోపాటు.. వ్యవస్థాగత ప్రాధాన్యత ఆధారంగా రేటింగ్‌ను ప్రకటించినట్లు ఫిచ్ వివరించింది. రిస్కులను సమర్ధవంతంగా నిర్వహించగలిగితే.. బ్యాంకుల లాభదాయక బిజినెస్‌కు దేశ ఆర్థిక వృద్ధి మద్దతిస్తుందని అభిప్రాయపడింది. యూనియన్ బ్యాంక్, పీఎన్‌బీ రుణ నాణ్యత రేటింగ్‌లను స్టేబుల్ నుంచి సానుకూలానికి(పాజిటివ్) సవరించింది.

ఎస్‌బీఐ యూపీఐ సేవల్లో అంతరాయం

ముంబై: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కస్టమర్లు యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్ సేవలను పొందడంలో నాలుగు గంటలకు పైగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఈ సమస్య తలెత్తింది. సమస్యను పూర్తిగా పరిష్కరించామని బ్యాంక్ ప్రకటించింది. మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఈ సమస్య ఉత్పన్నమైంది. దీంతో వినియోగదార్లు చాలా మంది తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను సామాజిక మాధ్యమాల వేదికగా ఏకరువు పెట్టారు. 'ఎస్‌బీఐ యూపీఐ యాప్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలు పరిష్కరించాం. సాయంత్రం 5 గంటల నుండి ఆటంకం లేకుండా పనిచేస్తోంది' అని బ్యాంక్ వివరించింది.

నిఫ్టీ కెమికల్ ఇండెక్స్ షురూ

కెమికల్ రంగానికీ ఎన్ఎస్ఈ ప్రాధాన్యత



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ తాజాగా కెమికల్ రంగానికి ఇండెక్స్‌ను ప్రవేశపెట్టింది. నిఫ్టీ కెమికల్స్ పేరుతో ఆవిష్కరించింది. నిఫ్టీ 500 నుంచి కెమికల్ రంగ షేర్ల పనితీరును ఇండెక్స్ ప్రతిఫలించనుంది. అనుబంధ సంస్థ ఎన్ఎస్ఈ ఇండైసెస్ ద్వారా కొత్త ఇండెక్సునకు తెరతీసింది. తాజా ఇండెక్స్ అసెట్ మేనేజర్లకు ప్రామాణికంగా నిలిచే వీలున్నట్లు ఎన్ఎస్ఈ అంచనా వేస్తోంది. ఈటీఎఫ్‌ల రూపంలో ప్యాసివ్ ఫండ్స్ ట్రాక్ చేసే రిఫరెన్స్ ఇండెక్స్‌గా ఉపయోగపడనున్నట్లు అభిప్రాయపడింది. ఆరు నెలల సగటు ఫ్రీ ఫ్లోట్ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఆధారంగా 20 స్టాక్స్‌ను ఎంపిక చేసినట్లు పేర్కొంది. ఎన్ఎస్ఈ డెరివేటివ్స్ విభాగంలో ట్రేడింగ్‌కు అందుబాటులో ఉన్న షేర్లను పరిగణించింది. ఫ్రీ ఫ్లోట్ మార్కెట్ విలువ ఆధారంగా ఒక్కో షేరుకి వెయిట్ ఉంటుందని, 33 శాతానికి మించదని ఎక్స్ఛేంజీ వెల్లడించింది.

వీసీ ఫండింగ్‌కు చిరునామాగా భారత్

- 2024లో 13.7 బిలియన్ డాలర్లు
- మొత్తం 1,270 లావాదేవీలు
- ఆసియాలో రెండో అతిపెద్ద మార్కెట్
- బెయిన్ అండ్ కంపెనీ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: వెంచర్ క్యాపిటల్ (వీసీ) సంస్థల పెట్టుబడులకు భారత్ ప్రముఖ కేంద్రంగా అవతరిస్తోంది. 2024లో వీసీ పెట్టుబడులు అంతక్రితం ఏడాదితో పోల్చి చూసినప్పుడు 43 శాతం పెరిగి 13.7 బిలియన్ డాలర్లకు (రూ.1.19 లక్షల కోట్లు) వృద్ధి చెందాయి. మొత్తం 1,270 లావాదేవీలు చోటుచేసుకున్నాయి. 45 శాతం పెరుగుదల నమోదైంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వీసీ పెట్టుబడులు, గ్రోత్ ఫండింగ్‌కు భారత్ రెండో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నట్లు బెయిన్ అండ్ కంపెనీ, ఐవీసీఏ సంయుక్త నివేదిక వెల్లడించింది. 50 మిలియన్ డాలర్లలోపు విలువైన చిన్న, మధ్య స్థాయి డీల్స్ గతేడాది మొత్తం వీసీ లావాదేవీల్లో 95 శాతంగా ఉన్నాయి. 1.4 రెట్లు పెరిగాయి. ఇక 50 మిలియన్ డాలర్లకు పైన విలువైన లావాదేవీలు కూడా రెట్టింపయ్యాయి. కరోనా ముందస్తు గరిష్ట స్థాయిలకు చేరాయి. 100 మిలియన్ డాలర్లకు పైన విలువైన భారీ ఒప్పందాలు 1.6 రెట్లు అధికమయ్యాయి. గతేడాది మొత్తం వీసీ ఫండింగ్‌లో 60 శాతం మేర కన్జ్యూమర్ టెక్నాలజీ, సాస్ (జనరేటివ్ ఏఐ సహా), ఫిన్‌టెక్ రంగాలు ఆకర్షించాయి. అన్నింటిలోకి కన్జ్యూమర్ టెక్నాలజీ రంగం 5.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులను రాబట్టింది. 2023తో పోల్చితే రెట్టింపైంది.

క్విక్‌కామర్స్, ఎడ్‌టెక్ హవా..

''క్విక్‌కామర్స్, ఎడ్‌టెక్, బీటుసీ కామర్స్‌లో వీసీ ఫండింగ్ పరంగా అధిక వృద్ధి నమోదైంది. జెప్టో 1.4 బిలియన్ డాలర్లు, మీషో 275 మిలియన్ డాలర్లు, లెన్స్‌కార్ట్ 200 మిలియన్ డాలర్ల చొప్పున పెట్టుబడులను ఆకర్షించాయి''అని ఈ నివేదిక వెల్లడించింది. సాఫ్ట్‌వేర్, సాస్ ఫండింగ్ 1.7 బిలియన్ డాలర్లుగా ఉంది. ఏంజెల్ ట్యాక్స్‌ను ఎత్తివేయడం, దీర్ఘకాల మూలధన లాభాల పన్నును (ఎల్‌టీసీజీ) తగ్గించడం, విదేశీ వెంచర్ క్యాపిటల్ ఇన్వెస్టర్ల రిజిస్ట్రేషన్లను సులభతరం చేయడం, ఎన్‌సీఎల్‌టీ ప్రక్రియ నుంచి మినహాయింపు ఇవ్వడం వంటివి స్టార్టప్‌లు, ఇన్వెస్టర్లలో సానుకూల వాతావరణాన్ని కల్పించినట్లు ఈ నివేదిక వివరించింది. ''2024లో అమలు చేసిన విధానపరమైన చర్యలు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచాయి. ఇది 2025కు సానుకూల వాతావరణానికి వీలు కల్పిస్తుంది. పెట్టుబడుల లావాదేవీలు పెరుగుతాయని అంచనా వేస్తున్నాం''అని ఇండియన్ వెంచర్ అండ్ ఆల్టర్నేటివ్ క్యాపిటల్ అసోసియేషన్ (ఐవీసీఏ) పేర్కొంది. 2024లో వీసీ సంస్థలు పెట్టుబడుల ఉపసంహరణ సైతం పెరగడం గమనార్హం. ఈ మొత్తం 6.8 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. వీసీ ఫండింగ్ మద్దతు పొందిన కొన్ని కంపెనీలు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్‌లకు (ఐపీవోలు) వెళ్లినట్లు తెలిపింది. ఐపీవోలు ఏడు రెట్లు పెరిగినట్లు గుర్తు చేసింది. ప్రగతిశీల నియంత్రణలు, వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ సదుపాయాల మద్దతుతో భారత వీసీ ఎకోసిస్టమ్ స్థిరమైన వృద్ధిని చూస్తున్నట్లు తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-3-2025

విశాఖ	415–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	410–00
విజయవాడ	420–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	4,998.00	4.13
BPCL	264.7	3.02
SUNPHARMA	1,657.00	2.82
BEL	277.58	2.49
ICICIBANK	1,244.15	2.41

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	656.8	-27.06
INFY	1,667.00	-2.02
BAJAJFINSV	1,808.20	-1.75
M&M	2,657.85	-1.66
POWERGRID	267.65	-1.35

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,423
ఎన్ఎస్ఈ	86,056
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,47,485
ఎఫ్ఐఐ	- 485
డీఐఐ	+ 263

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	66.30	$ 66.03
బ్రెంట్	69.62	$ 70.07



ఐదో ర్యాంక్‌లో దీప్తి శర్మ

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్ దీప్తి శర్మ ఐదో స్థానానికి దూసుకెళ్లింది. మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ 344 ర్యాంకింగ్ పాయింట్లు సాధించి... న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమేలియా కెర్‌ను వెనక్కి నెట్టి ఐదో ర్యాంక్‌కు చేరింది. ఆ్రస్టేలియాకు చెందిన ఆష్లే గార్డ్‌నర్ 470 పాయింట్లతో అగ్ర స్థానంలో ఉంది. టి20 ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తి మూడో స్థానంలో కొనసాగుతోంది. బౌలర్ల విభాగంలో దీప్తి వన్డేల్లో 4వ ర్యాంక్‌లో, టి20ల్లో మూడో స్థానంలో ఉంది. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన రెండో ర్యాంక్‌లో కొనసాగుతోంది. లారా వాల్వార్ట్ (దక్షిణాఫ్రికా) అగ్రస్థానంలో ఉంది. టాప్–10లో భారత్ నుంచి స్మృతి ఒక్కతే చోటు దక్కించుకుంది. టి20ల్లో స్మృతి మూడో ర్యాంక్‌లో కొనసాగుతోంది.

న్యూజిలాండ్ సారథిగా బ్రేస్‌వెల్

పాక్‌తో టి20 సిరీస్‌కు జట్టు ఎంపిక



వెల్లింగ్టన్: ఆల్‌రౌండర్ మైకేల్ బ్రేస్‌వెల్‌ను న్యూజిలాండ్ టి20 కెప్టెన్‌గా నియమించారు. సొంతగడ్డపై పాకిస్తాన్‌తో జరిగే ద్వైపాక్షిక సిరీస్‌లో పాల్గొనే కివీస్ జట్టును మంగళవారం ప్రకటించారు. చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లో భుజం గాయానికి గురైన హెన్రీకి మొదటి 3 మ్యాచ్‌లకు విశ్రాంతినిచ్చి ఆఖరి 4, 5వ మ్యాచ్‌లకు ఎంపిక చేయగా, జేమీసన్ తొలి మూడు మ్యాచ్‌లు ఆడనున్నాడు. దుబాయ్‌లో ఆదివారం ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్‌తో తలపడిన ఏడుగురు ఆటగాళ్లు ఐపీఎల్, పీఎస్ఎల్ (పాక్) కాంట్రాక్టుల వల్ల జాతీయ జట్టుకు అందుబాటులో ఉండటం లేదు. రెగ్యులర్ కెప్టెన్ సాంట్నర్ సహా కాన్వే, రచిన్ రవీంద్ర, ఫిలిప్స్, ఫెర్గూసన్ ఐపీఎల్ ఆడనుండగా, కేన్ విలియమ్సన్ పాక్ సూపర్ లీగ్ ఆడేందుకు వెళ్లనున్నాడు. కివీస్ జట్టు మార్చి 16, 18, 21, 23, 26 తేదీల్లో పాక్‌తో ఐదు టి20లు ఆడుతుంది. అనంతరం ఇరుజట్ల మధ్య మార్చి 29, ఏప్రిల్ 2, 5వ తేదీల్లో మూడు వన్డేల సిరీస్ కూడా జరుగనుంది. ఈ జట్టును తర్వాత ఎంపిక చేస్తారు.

న్యూజిలాండ్ టి20 జట్టు: బ్రేస్‌వెల్ (కెప్టెన్), అలెన్, చాప్‌మన్, ఫౌల్‌కెస్, మిచెల్ హే, హెన్రీ, జేమీసన్, మిచెల్, నీషమ్, రూర్కే, రాబిన్సన్, బెన్ సీర్స్, సీఫెర్ట్, జేకబ్ డఫీ, ఇష్ సోధి.

తస్కీన్ ఒక్కడికే బంగ్లా ‘ఎ’ప్లస్ కాంట్రాక్టు



ఢాకా: బంగ్లాదేశ్ స్టార్ బౌలర్ తస్కీన్ అహ్మద్ ఒక్కడికే బోర్డు కాంట్రాక్టుల్లో అగ్ర తాంబూలం దక్కింది. బంగ్లా క్రికెట్ బోర్డు (బీసీబీ) ఈ ఏడాది సెంట్రల్ కాంట్రాక్టు దక్కించుకున్న క్రికెటర్ల జాబితాను ప్రకటించింది. కొన్నేళ్లుగా బీసీబీ ఫార్మాట్ల ప్రాతిపదికన కాంట్రాక్టులు ఇస్తూ వచ్చింది. అయితే దీనికి మంగళం పాడిన బోర్డు మళ్లీ పాత పద్ధతిలోనే గ్రేడ్‌లవారీగా కాంట్రాక్టులు ఇచ్చింది. ఇందులో భాగంగా ‘ఎ’ ప్లస్ గ్రేడ్‌లో ఉన్న ఒకే ఒక్కడు తస్కీన్‌కు నెలకు బంగ్లా కరెన్సీలో ఒక మిలియన్ టాకాలు (రూ.7.15 లక్షలు) చెల్లిస్తారు. కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ సహా మెహదీ హసన్ మిరాజ్, లిటన్ దాస్, ముష్ఫికర్ రహీమ్‌లకు ‘ఎ’గ్రేడ్ కాంట్రాక్టు దక్కింది. ఇందులో భాగంగా వీరికి నెలకు 8 లక్షల టాకాలు (రూ.5.75 లక్షలు) లభిస్తాయి. చాంపియన్స్ ట్రోఫీ జట్టుకు ఎంపిక కాని ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌కు బీసీబీ కాంట్రాక్టు లభించ లేదు. 2022 తర్వాత సౌమ్య సర్కార్, షాద్‌మన్ ఇస్లామ్‌లకు సెంట్రల్ కాంట్రాక్టు దక్కింది. ‘సి’ గ్రేడ్‌లో ఉన్న వీరికి నెలకు 4 లక్షల టాకాలు (రూ.2.87 లక్షలు) జీతంగా చెల్లిస్తారు. ‘బి’ గ్రేడ్ ప్లేయర్లకు 6 లక్షల టాకాలు (రూ.4.27 లక్షలు) చెల్లిస్తారు.

ప్రణామ్ ప్రణవ్

అరేళ్ల వయసులో ఎత్తులు వేయడం నేర్చుకున్న ఆ చిన్నారి... పదహారేళ్లు వచ్చే సరికి గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కించుకున్నాడు. మ్యాచ్‌కు ముందు పావులతో ప్రాక్టీస్ చేయడం పక్కనపెట్టి క్రికెట్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ ఇలా వేర్వేరు ఆటల్లో నిమగ్నమయ్యే అలవాటున్న ఆ కుర్రాడు... తాజాగా మరో ఘనత తన పేరిట లిఖించుకున్నాడు. విశ్వ చదరంగ వేదికపై భారత జోరు సాగుతున్న క్రమంలో... ఆ కుర్రాడు ప్రపంచ చాంపియన్‌గా అవతరించాడు. ఇటీవల మోంటెనిగ్రోలో జరిగిన ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్ అండర్–20 ఓపెన్ విభాగంలో విజేతగా నిలిచిన ఆ కుర్రాడే... **ప్రణవ్ వెంకటేశ్!** రెండేళ్ల క్రితమే గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కించుకున్న ఈ తమిళనాడు యువ సంచలనం... భవిష్యత్తులో నిలకడగా విజయాలు సాధించడమే తన లక్ష్యమని అంటున్నాడు. చదరంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన చెన్నైకి చెందిన ఈ కుర్రాడి ప్రస్థానాన్ని ఓసారి పరిశీలిస్తే...

– సాక్షి క్రీడావిభాగం

జూనియర్ ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ప్రారంభానికి సరిగ్గా ఏడాది క్రితం... ప్రణవ్ ప్రయాణం క్రికెట్ మైదానంలో మొదలైంది. అదేంటి అప్పటికే గ్రాండ్‌మాస్టర్ హోదా దక్కించుకున్న ప్రణవ్ క్రికెట్ గ్రౌండ్ నుంచి ప్రాక్టీస్ ప్రారంభించడం ఏంటి అని సందేహిస్తున్నారా? ప్లేయర్లు ఆట విడుపు కోసం అప్పుడప్పుడు వేరే క్రీడలు ఆడటం పరిపాటే! అలాగే చెన్నైలోని పెరంబూరు సమీపంలోని చెస్ అకాడమీలో సీనియర్ గ్రాండ్‌మాస్టర్ శ్యామ్‌సుందర్ నిర్వహిస్తున్న కోచింగ్‌కు వరుణ్ హాజరయ్యాడు. ఆటగాళ్లను శారీరకంగా చురుకుగా ఉంచడంతో పాటు వారిలో ఉత్సాహం నింపేందుకు నిర్వహిస్తున్న క్యాంప్‌లో ప్రణవ్ క్రికెట్ పాఠాలు నేర్చుకున్నాడు. అప్పటి వరకు శ్యామ్‌సుందర్ వద్ద శిక్షణ తీసుకోని వరుణ్... ఆ తర్వాత అతడితో అనుబంధం పెంచుకున్నాడు. గతంలో ఇతర కోచ్‌ల వద్ద ట్రైనింగ్ తీసుకున్న అతడు... శ్యామ్‌లో ఓ సోదరుడిని చూసుకున్నాడు. తన ఆలోచనలకు దగ్గరగా ఉన్న శ్యామ్‌తో ప్రయాణం తనకు లాభసాటి అని భావించి తండ్రి వెంకటేశ్ అనుమతితో అతడి దగ్గర శిష్యరికం ప్రారంభించాడు.

క్లాసికల్ కష్టమైనా...

బ్లిట్జ్ గేమ్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చిన ప్రణవ్ ఇప్పటికే ఆన్‌లైన్ మ్యాచ్‌ల్లో మాగ్నస్ కార్ల్‌సన్ వంటి ప్రపంచ చాంపియన్‌లపై విజయాలు సాధించాడు. ప్రారంభంలో బ్లిట్జ్ నుంచి క్లాసికల్‌కు మారేందుకు కాస్త సమయం తీసుకున్న ప్రణవ్.. ఆ తర్వాత ఫార్మాట్‌తో సంబంధం లేకుండా మెరుగైన ఆటతీరు కనబర్చడం ప్రారంభించాడు. శ్యామ్ వద్ద శిక్షణ ప్రారంభించిన రెండు నెలలకే స్పెయిన్ వేదికగా జరిగిన టోర్నీల్లో పాల్గొనేందుకు వరుణ్ విరామం తీసుకున్నాడు. ఆ సమయంలో సరైన ఫలితాలు రాకపోవడంతో... మరింత సమయం తీసుకున్న శ్యామ్... వరుణ్ ఆటతీరుకు తగ్గట్లు ప్రణాళికలు రూపొందించడం ప్రాంరభించాడు. ఆ దిశగా కసరత్తు చేయడంతో... దుబాయ్ చాంపియన్‌షిప్, షార్జా మాస్టర్స్‌లో అతడు విజేతగా నిలిచాడు. గతేడాది డిసెంబర్‌లో చెన్నై చాలెంజర్స్ ఇన్విటేషనల్ టోర్నీలో విజేతగా నిలవడం ద్వారా ప్రణవ్ ప్రతిష్టాత్మక చెన్నై మాస్టర్స్ టోర్నీకి అర్హత సాధించాడు.

ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గిన యువ గ్రాండ్‌మాస్టర్



జూనియర్ ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ ట్రోఫీతో ప్రణవ్

నిలకడగా విజయాలు సాధించడమే లక్ష్యమంటున్న చెన్నై కుర్రాడు

బాటిల్ మూతలతో క్రికెట్...

మ్యాచ్‌కు ముందు ఆటవిడుపుగా క్రికెట్, టేబుల్ టెన్నిస్, షటిల్ ఆడటం ప్రణవ్‌కు అలవాటు. దీంతో హోటల్ రూమ్‌లో బాటిల్ మూతలను బాల్‌గా భావించి మంచి నీళ్ల సీసాలతోనే కోచ్ శ్యామ్‌తో కలిసి క్రికెట్ ఆడేవాడు. దీంతోనే ఇతర ఆలోచనలు దరిచేరనివ్వకుండా మనసును లగ్నం చేసుకునేవాడు. సామాజిక మాధ్యమాలకు కూడా దూరంగా ఉండేవాడు. ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌సిప్ ప్రారంభానికి ముందు కొన్ని ఆన్‌లైన్ సెషన్‌లలో పాల్గొన్న ప్రణవ్... ప్రత్యర్థిపై కాస్త ఆధిక్యం దక్కినా... దాన్ని కొనసాగిస్తూ మరిన్ని అవకాశాలు సృష్టించుకోవడాన్ని అలవాటుగా చేసుకున్నాడు. శిక్షణ సమయంలో విభిన్న ప్రత్యామ్నాయాలను ప్రయత్నించే ప్రణవ్... ఒక్కసారి మ్యాచ్ ప్రారంభమైతే... ప్రత్యర్థి ఆటతీరును బట్టి ప్రణాళికలు మార్చుకోవడంలో ఆరితేరాడు. దాని ఫలితమే... విశ్వనాథన్ ఆనంద్ (1987), పెంటేల హరికృష్ణ (2004), అభిజిత్ గుప్తా (2008) తర్వాత... ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌గా నిలిచిన నాలుగో భారత ప్లేయర్‌గా ప్రణవ్ గుర్తింపు పొందాడు.

అజేయంగా...

తాజా ప్రపంచ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్ అండర్–20 ఓపెన్ విభాగంలో మొత్తం 11 రౌండ్ల పాటు పోటీలు జరగగా... ప్రణవ్ 9 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో 7 గేమ్‌లు గెలిచిన ప్రణవ్... మిగిలిన 4 గేమ్‌లను ‘డ్రా’ చేసుకొని అజేయంగా వరల్డ్ చాంపియన్ టైటిల్ కైవసం చేసుకున్నాడు. ‘ఆటలో క్లిష్ట పరిస్థితులు ఎదురైనా... ఏమాత్రం వెనక్కి తగ్గని ప్రణవ్... ఏ క్షణంలోనూ ఆత్మవిశ్వాసం కోల్పోడు. ఇద్దరం తమిళనాడుకు చెందిన వాళ్లమే కావడంతో... తమిళంలోనే మాట్లాడుకుంటాం. దీంతో ఒకరి భావాలు మరొకరం సులభంగా అర్థం చేసుకుంటాం. కామెడీ సినిమాలను ఎక్కువ ఇష్టపడే ప్రణవ్.. ఆట తప్ప వేరే ఆలోచనలను దరిచేరనివ్వడు. ఆ క్రమశిక్షణే అతడిని ఈ స్థాయికి తెచ్చింది. చదరంగ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ తరహాలో నిలకడ కొనసాగించడమే ప్రణవ్ లక్ష్యం’ అని 32 ఏళ్ల శ్యామ్ వివరించాడు.



క్రికెట్‌కు వీరాభిమాని...



కోచ్ శ్యామ్‌సుందర్‌తో ప్రణవ్

క్రికెట్‌ను విపరీతంగా అభిమానించే ప్రణవ్‌కు... నేటి తరం ప్రేక్షకుల్లాగే టెస్టుల కన్నా... వన్డే, టి20 ఫార్మాట్‌లంటేనే ఎక్కువ ఇష్టం. చదరంగంలో క్లాసికల్ గేమ్ టెస్టుల మాదిరి కాగా... వన్డే, టి20ల వంటి ర్యాపిడ్, బ్లిట్జ్‌లో ప్రణవ్ వేగం శ్యామ్‌సుందర్‌ను ఆకట్టుకుంది. కాస్త సానబెడితే అద్భుతాలు సాధించగల సత్తా అతడిలో ఉందని గుర్తించిన శ్యామ్ ఆ దిశగా ప్రయాణం ప్రారంభించాడు. ఏడాది శిక్షణలో అతడికిష్టమైన ర్యాపిడ్ బ్లిట్జ్‌లో మరింత మెరుగు పరుస్తూనే... సంప్రదాయ క్లాసికల్‌పై కూడా ఆసక్తి పెరిగేలా చేశాడు. ‘గత సంవత్సరం జనవరి నుంచి అధికారికంగా మేమిద్దరం కలిసి పనిచేస్తున్నాం. అప్పటికే గ్రాండ్‌మాస్టర్ అయిన ప్రణవ్‌ను మరింత మెరుగు పర్చేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాను. టి20 క్రికెట్‌లో దూకుడుగా ఆడేందుకు వీలుంటుంది. అదే టెస్టు క్రికెట్‌లో ఓపిక ముఖ్యం. ప్రణవ్ కూడా క్విక్ ఫార్మాట్‌లో చక్కటి ప్రదర్శన చేస్తున్నాడు. కానీ సుదీర్ఘ ఫార్మాట్ వంటి క్లాసికల్‌లో మరింత ప్రావీణ్యం పొందే విధంగా తర్ఫీదునిచ్చాను’ అని శ్యామ్ సుందర్ విరించాడు.



మయాంక్ యాదవ్ మళ్లీ...

గాయంతో ఐపీఎల్‌లో తొలి దశకు దూరం

లక్నో: కెరీర్ మొదలైన నాటినుంచి వరుసగా గాయాలతో సహవాసం చేస్తున్న పేస్ బౌలర్ మయాంక్ యాదవ్ మళ్లీ గాయంతో ఆటకు దూరమయ్యే అవకాశం కనిపిస్తోంది. వెన్నునొప్పితో గత కొంత కాలంగా బాధపడుతున్న మయాంక్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో రీహాబిలిటేషన్‌లో ఉన్న అతను ప్రస్తుతానికి మ్యాచ్‌లో బౌలింగ్ చేసే స్థితిలో లేడు. దాంతో ఐపీఎల్ ఆరంభ మ్యాచ్‌లకు అతను దూరం కానున్నాడు. అతను ఎప్పటిలోగా కోలుకుంటాడనేదానిపై కూడా స్పష్టత లేదు. ఎన్‌సీఏ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తే ఐపీఎల్ తర్వాతి దశలో అతను ఆడవచ్చు. గత సీజన్‌లో మయాంక్‌ను లక్నో సూపర్ జెయింట్స్ ‘అన్‌క్యాప్డ్’ ప్లేయర్‌గా రూ. 20 లక్షలకు తీసుకుంది. గాయం కారణంగా 4 మ్యాచ్‌లే ఆడిన అతను 7 వికెట్లు పడగొట్టాడు. అయితే 150 కిలో మీటర్ల వేగంతో బంతులు విసిరే తన ప్రతిభను ప్రదర్శిస్తూ అతను అందరి దృష్టిలో పడ్డాడు. ఇదే భారత జట్టులో అవకాశం కల్పించింది. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరిగిన టి20 సిరీస్‌లో 3 మ్యాచ్‌లు ఆడిన మయాంక్ 4 వికెట్లు తీశాడు. ఆ తర్వాత మళ్లీ గాయం బారిన పడి జట్టుకు దూరమయ్యాడు. అయితే భారత్‌కు ఆడటంతో ‘క్యాప్డ్’ ప్లేయర్‌గా మారిన అతడిని లక్నో టీమ్ మేనేజ్‌మెంట్ ఏకంగా రూ.11 కోట్లకు అట్టి పెట్టుకుంది. గాయం నుంచి కోలుకొని ఐపీఎల్‌లో తమ జట్టుకు మయాంక్ పూర్తి సీజన్‌లో అందుబాటులో ఉంటాడని జట్టు డైరెక్టర్ జహీర్ ఖాన్ ఆశాభావం వ్యక్తం చేయగా...ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు.

పాక్ క్రికెట్ ‘ఐసీయూ’లో ఉంది!

షాహిద్ అఫ్రిది వ్యాఖ్య

కరాచీ: పాకిస్తాన్ క్రికెట్ జట్టు ఇటీవలి ప్రదర్శనపై ఆ జట్టు మాజీ ప్లేయర్ షాహిద్ అఫ్రిది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. తప్పుడు నిర్ణయాల వల్ల ప్రస్తుతం జట్టు పరిస్థితి ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లో ఉందని అతను ఘాటుగా వ్యాఖ్యానించాడు. శస్త్రచికిత్స చేసి కోలుకునే పరిస్థితి నుంచి కూడా ఇప్పుడు చేయి దాటిపోయిందని అతను అన్నాడు. ముఖ్యంగా జట్టులో షాదాబ్ ఖాన్ ఎంపికను అతను తీవ్రంగా విమర్శించాడు. గత టి20 వరల్డ్ కప్ తర్వాత జట్టులో స్థానం కోల్పోయిన షాదాబ్‌ను న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ఎంపిక చేయడంతో పాటు వైస్ కెప్టెన్‌గా కూడా నియమించారు. ‘ఏ ప్రాతిపదికన షాదాబ్‌ను మళ్లీ జట్టులోకి తీసుకున్నారు. దేశవాళీలో అతను ఏమాత్రం ప్రదర్శన ఇచ్చాడని ఎంపిక చేశారు. టోర్నీకి ముందు అంతా సన్నాహకాల గురించి మాట్లాడతారు. చిత్తుగా ఓడిపోగానే శస్త్రచికిత్స అవసరమంటారు. ఇప్పుడు అది కూడా సాధ్యం కాదు. పాక్ క్రికెట్ ఐసీయూలోకి చేరింది. బోర్డు విధానాలు, నిర్ణయాల్లో నిలకడ లేదు. కెప్టెన్లు, కోచ్‌లను మార్చడం తప్ప బోర్డు అధికారులకు జవాబుదారీతనం లేదు. వాళ్ల ఉద్యోగాలు కాపాడుకోవడానికి అంతా ఆటగాళ్లను బలి పశువులను చేస్తారు’ అని అఫ్రిది అభిప్రాయ పడ్డాడు.



యూసుఫ్ అవుట్!

పాకిస్తాన్ బ్యాటింగ్ కోచ్ మొహమ్మద్ యూసుఫ్ వ్యక్తిగత కారణాలతో న్యూజిలాండ్‌తో సిరీస్‌కు దూరమయ్యాడు. కివీస్‌తో జరిగే 5 టి20లు, 3 వన్డేల సిరీస్ కోసమే అతడిని పీసీబీ ఎంపిక చేసింది. అయితే తన కూతురు అనారోగ్యం కారణంగా టూర్‌నుంచి అతను తప్పుకున్నాడు. యూసుఫ్ స్థానంలో పీసీబీ ఎవరినీ ఎంపిక చేయలేదు.

లక్ష నుంచి పది వేలకు...

అంతర్జాతీయ క్రికెట్‌లో వరుస పరాజయాలతో పాక్ సీనియర్ జట్టు ఇబ్బంది పడుతుండగా...ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లో ఆటగాళ్లపై మరో దెబ్బ పడింది. ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగా పాక్ దేశవాళీ క్రికెటర్ల మ్యాచ్ ఫీజులను పీసీబీ భారీగా తగ్గించేసింది. ఆ బోర్డు ఆర్థిక స్థితికి ఇది నిదర్శనం! జాతీయ టి20 చాంపియన్‌షిప్‌లో ఇప్పటి వరకు ఒక లక్ష పాకిస్తానీ రూపాయలు (భారత కరెన్సీలో రూ. 31 వేలు) ఫీజుగా ఇస్తుండగా ఇప్పుడు దానిని ఏకంగా 10 వేల రూపాయలకు (రూ.3,100) తగ్గించారు. ఈ 90 శాతం కోతతో పాటు తక్కువ ఖర్చుతో కూడిన హోటల్స్‌లో వసతి, తక్కువ సార్లు మాత్రమే విమానాల్లో ప్రయాణించేలా నిర్ణయం తీసుకున్నారు.

హైదరాబాద్ ఎఫ్‌సీ చివరి పోరు

ఇండియన్ సూపర్ లీగ్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (హెచ్ఎఫ్‌సీ) తమ చివరి మ్యాచ్‌కు సిద్ధమైంది. ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయిన హైదరాబాద్ బుధవారం సొంత మైదానంలోనే ఈ మ్యాచ్ ఆడుతుంది. గచ్చిబౌలి స్టేడియం వేదికగా తమ చివరి పోరులో కేరళ బ్లాస్టర్స్‌తో హెచ్ఎఫ్‌సీ తలపడుతుంది. ఐఎస్ఎల్ తాజా సీజన్‌లో ఇదే చివరి లీగ్ మ్యాచ్ కాగా... విజయంతో టోర్నీని ముగించాలని హైదరాబాద్ జట్టు భావిస్తోంది. మొత్తం 13 జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో 6 జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాయి. ఇప్పటి వరకు 23 మ్యాచ్‌లాడిన హైదరాబాద్ జట్టు 4 విజయాలు, 14 పరాజయాలు, 5 ‘డ్రా’లతో 17 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక కింది నుంచి రెండో స్థానం (12వ)లో నిలిచింది. మరోవైపు కేరళ పరిస్థితి కూడా దీనికి భిన్నంగా లేదు. 23 మ్యాచ్‌లాడిన ఆ జట్టు 8 విజయాలు, 11 పరాజయాలు, 4 ‘డ్రా’లతో 28 పాయింట్లు సాధించి పట్టిక 9వ స్థానంలో నిలిచింది. లీగ్‌లో భాగంగా కేరళతో ఆడిన తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన హైదరాబాద్... ఇప్పుడు అదే ప్రదర్శనను పునరావృతం చేయాలని చూస్తోంది.



శ్రీలంకతో భారత్ తొలి పోరు

న్యూఢిల్లీ: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్–19 బాలుర చాంపియన్‌షిప్‌లో భాగంగా భారత ఫుట్‌బాల్ జట్టు తొలి పోరులో శ్రీలంకతో తలపడనుంది. మే 9 నుంచి 18 వరకు జరగనున్న ఈ టోర్నీకి భారత్ ఆతిథ్యమిస్తుండగా... మొత్తం ఆరు జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ ‘బి’లో నేపాల్, శ్రీలంకతో కలిసి భారత్ పోటీపడుతుండగా... గ్రూప్ ‘ఎ’లో మాల్దీవులు, భూటాన్, బంగ్లాదేశ్ ఉన్నాయి. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనున్న భారత జట్టు మే 9న శ్రీలంకతో తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం 13న నేపాల్‌తో తలపడనుంది. గ్రూప్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు మే 16న సెమీఫైనల్ ఆడతాయి. 18న ఫైనల్ జరగనుంది. ఈ మేరకు మంగళవారం టోర్నీ షెడ్యూల్ విడుదల చేశారు. అరుణాప్రదేశ్‌లోని గోల్డెన్ జూబ్లీ స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. 2023లో నేపాల్ వేదికగా జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో దాయాది పాకిస్తాన్‌పై గెలిచి భారత జట్టు చాంపియన్‌గా అవతరించింది. 2024లో అండర్–20 విభాగంలో నిర్వహించిన ఈ టోర్నీలో భారత్ సెమీఫైనల్లో ఓటమి పాలైంది. వేర్వేరు వయో విభాగాల్లో కలిపి ఇప్పటి వరకు భారత్ మూడు శాఫ్ టోర్నమెంట్‌లకు ఆతిథ్యమిచ్చింది. 2019లో అండర్–15 బాలుర టోర్నీ, 2022లో అండర్–20 పురుషుల, అండర్–18 బాలికల టోర్నీలు భారత్‌లో జరిగాయి.

సాక్షి ప్లస్
బుధవారం। 12-3-2025

నా ఐస్‌క్రీమ్ తినేసింది అమ్మను అరెస్ట్ చేయండి

పోలీసులకు ఫోన్ చేసిన నాలుగేళ్ల బుడతడు ● అమెరికాలో వింత ఘటన


పోలీసులతో చిన్నారి

జీవితంలో కొన్ని పనులు చేయకూడదంటారు. అందులో కొత్తది ఒకటి వచ్చి చేరింది. అదేంటంటే చిన్నారుల చేతుల్లోని ఐస్‌క్రీమ్‌ను పొరపాటున కూడా దొంగలించకూడదు. దొంగలిస్తే పోలీసులు ఖచ్చితంగా వస్తారు. భారత్‌లో వస్తారో లేదో తెలీదుగానీ అమెరికాలో మాత్రం ఖచ్చితంగా వస్తారు. అరెస్ట్‌చేస్తారో లేదో తెలీదుగానీ వారు అవాక్కవడం మాత్రం ఖాయం. ఇటు చిన్నారి తల్లి, అటు పోలీసులు సైతం కొద్దిసేపు నవ్వుకున్న సరదా ఉదంతం అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రంలోని మౌంట్ ప్లీసాంట్ పట్టణంలో గత మంగళవారం జరిగింది.

అటు దొంగతనం.. ఇటు 911కు ఫోన్

ఇష్టంగా తింటున్న ఐస్‌క్రీమ్‌ను కన్న తల్లి గభాలున లాక్కుని తినేసే సరికి నాలుగేళ్ల బుడతడికి పట్టరాని కోపం వచ్చింది. ఏడ్వడం మానేసి తల్లికి ఎలాగైనా గుణపాఠం నేర్పాలని నిశ్చయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా, న్యాయం కోసం ఫోన్‌లైన్లో పోలీసుల తలుపు తట్టాడు. 911 నంబర్‌కు ఫోన్‌చేసి తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పాడు. నాలుగేళ్ల పిల్లాడు చెబుతున్న దాంట్లో నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు ఇద్దరు మహిళా పోలీసులు రంగంలోకి దిగారు. అంతకుముందు పిల్లాడు, పోలీసుల మధ్య కొద్దిసేపు ఫోన్ సంభాషణ జరిగింది. ఇప్పుడా ఆడియో సంభాషణ రికార్డ్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. చిన్నారి వాదన విన్న వారంతా తెగ నవ్వుకున్నారు.

911 డిస్పాచ్ విభాగంలో ఉన్న పోలీసు ఒకరు ఈ పిల్లాడి ఫోన్‌కాల్‌కు స్పందించారు. సమస్య ఏంటని ప్రశ్నించారు. ''మా అమ్మ చెడ్డదైపోయింది''అని చెప్పాడు. సరేగానీ అసలేమైందని అధికారి అడగ్గా.. ''వెంటనే వచ్చి మా అమ్మను బంధించండి''అని సమాధానమిచ్చాడు. లాక్కుని ఐస్‌క్రీమ్ తింటున్న తల్లి.. పిల్లాడు పోలీసులకు ఫోన్‌చేయడం చూసి అవాక్కైంది. వెంటనే తేరుకుని పిల్లాడి నుంచి ఫోన్ లాక్కుని ''ఫోన్ చేయాల్సిన పెద్ద విషయం ఏమీ లేదండి. మా అబ్బాయి వయసు కేవలం నాలుగేళ్లు మాత్రమే. వీడి ఐస్‌క్రీమ్ తిన్నాను. అందుకే మీకు ఫోన్‌చేసి ఉంటాడు''అని చెప్పింది.

అమ్మను తీసుకెళ్లండి

వీళ్లు ఓవైపు మాట్లాడుతుంటే పిల్లాడు మాత్రం తన వాదనను కొనసాగించాడు. ఐస్‌క్రీమ్ లాక్కుని అమ్మ పెద్ద తప్పు చేసిందని పిల్లాడు అరవడం ఆ ఫోన్ కాల్‌లో రికార్డయింది. విషయం అర్థమై నవ్వుకున్న పోలీసులు 911 నిబంధనల ప్రకారం పిల్లాడి ఇంటికెళ్లారు. పోలీసుల రాక గమనించి పిల్లాడు మళ్లీ వాళ్లకు నేరుగా ఫిర్యాదుచేశాడు. అమ్మను అరెస్ట్‌చేసి జైలుకు తీసుకెళ్లాలని డిమాండ్‌చేశాడు. ''సరే. మీ అమ్మను నిజంగానే జైల్లో వేస్తాం. నీకు సంతోషమేగా?''అని పోలీసులు అడగ్గా.. ''వద్దు వద్దు. నాకు కొత్త ఐస్‌క్రీమ్ ఇస్తే సరిపోతుంది''అని అసలు విషయం చివరకు చెప్పాడు. దీంతో పిల్లాడి ఐస్ గోల అక్కడితో ఆగింది. అయితే రెండు రోజుల తర్వాత పోలీసులు మళ్లీ ఆ పిల్లాడి ఇంటికొచ్చారు. మళ్లీ ఎందుకొచ్చారబ్బా అని సందేహంగా చూస్తున్న పిల్లాడి చేతిలో పోలీసులు పెద్ద ఐస్‌క్రీమ్‌ను పెట్టారు. దాంతో చిన్నారి సంతోషానికి అవధుల్లేకుండా పోయింది. ఈ ఐస్‌క్రీమ్ వృత్తాంతాన్ని పోలీసులు మీడియాకు వెల్లడించడంతో ఈ విషయం అందరికీ తెల్సింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

మిస్టరీగా తెలుగమ్మాయి అదృశ్యం

- డొమినికన్ రిపబ్లిక్‌లో అదృశ్యమైన వైనం
- బీచ్‌లో కొట్టుకుపోయిందా, కిడ్నాపైందా?
- పోలీసుల గాలింపు, రంగంలోకి ఎఫ్‌బీఐ


సుదీక్ష

న్యూఢిల్లీ: కరీబియన్ దేశం డొమినికన్ రిపబ్లిక్‌లో తెలుగు విద్యార్థిని అదృశ్యం మిస్టరీగా మారింది. 20 ఏళ్ల సుదీక్ష కోణంకి కుటుంబం అమెరికాలో వర్జీనియాలోని లౌడౌన్ కౌంటీలోని చంటిల్లీలో నివసిస్తోంది. సుదీక్షకు అమెరికా శాశ్వత నివాస హోదా ఉంది. పిట్స్‌బర్గ్ వర్సిటీలో మెడిసిన్ చదువుతోంది. ఐదుగురు తోటి విద్యార్థినులతో వారం క్రితం డొమినికన్ రిపబ్లిక్‌లోని పుంటా కానాకు వెళ్లింది. అక్కడి రియు రిపబ్లికా రిసార్టులో వారికి మరో ఇద్దరు అమెరికా టూరిస్టులు కలిశారు. అంతా మార్చి 5న రాత్రి స్థానిక నైట్ క్లబ్‌కు వెళ్లారు. 6వ తేదీ తెల్లవారుజామున నాలుగింటి సమయంలో అక్కడి బీచ్‌కు చేరుకున్నారు. ఉదయం 5.50 సమయంలో మిగతా వాళ్లు రిసార్టుకు వచ్చేయగా టూరిస్టుల్లో ఒకరైన జాషువా స్టీవెన్ రిబే (24), సుదీక్ష బీచ్‌లోనే ఉండిపోయారు. ఆ తరువాత ఆమె కనిపించలేదు. ఉదయం 9 గంటలప్పుడు రిబే ఒక్కడే బీచ్ నుంచి వెళ్లిపోయినట్లు సీసీటీవీల్లో రికార్డయ్యింది. సాయంత్రమైనా సుదీక్ష ఆచూకీ లేకపోవడంతో స్నేహితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి హెలికాప్టర్లు, డ్రోన్లు, పడవలు, స్కూబా డైవర్లు, ఏటీవీలను మోహరించి తీరం, పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా గాలిస్తున్నారు. నాలుగు రోజులైనా ఆమె ఆచూకీ దొరకలేదు. దీనికి తోడు ఆమె అదృశ్యంపై స్నేహితుల నుంచి విరుద్ధ కథనాలు వస్తుండటంతో కుటుంబీకులు మరింత ఆందోళన చెందుతున్నారు. సుదీక్ష తల్లిదండ్రులు సుబ్బారాయుడు, శ్రీదేవి కూడా పుంటా కానా వెళ్లారు. ఆదివారం వారు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ''కుమార్తె సెల్‌ఫోన్, బ్యాగ్, ఇతర వస్తువులన్నీ స్నేహితుల వద్దే ఉన్నాయి. ఆమెనెవరో కిడ్నాప్ చేసి ఉండొచ్చు''అని అనుమానం వ్యక్తం చేశారు. ఆ దిశగా దర్యాప్తు చేయాలని కోరుతున్నారు. సుదీక్ష ఆచూకీ కోసం తాజాగా ఎఫ్‌బీఐ కూడా రంగంలోకి దిగింది. స్థానిక భారత రాయబార కార్యాలయం కూడా దర్యాప్తును పర్యవేక్షిస్తోంది. సుదీక్ష అదృశ్యంపై ఇంటర్‌పోల్ ఎల్లో నోటీస్ జారీ చేసింది.

భిన్న కథనాలు

సుదీక్షను చివరిసారిగా చూసిన జాషువా ఆమె అదృశ్యంపై భిన్న కథనాలు చెబుతున్నాడు. పెద్ద అలలు రావడంతో బీచ్ నుంచి వెళ్లిపోయానని ఓసారి, సుదీక్ష మోకాలి లోతు నీటిలో ఉండగా చివరగా చూశానని మరోసారి చెప్పాడు. ఆమె తీరంలో నడుస్తుండగా తాను నిద్రపోయానని మరోసారి చెప్పుకొచ్చాడు. పోలీసులు మాత్రం అతన్ని అనుమానితుడిగా భావించడం లేదు. బీచ్ లాంజ్‌లో ఆమె దుస్తులు కనిపించాయి. బహుశా బికినీలో సముద్రంలోకి వెళ్లి మునిగిపోయి ఉంటుందని భావిస్తున్నారు. ఆమె తండ్రి మాత్రం జాషువానే అనుమానిస్తున్నారు.

అమెరికా, బ్రిటన్, కెనడాలకు...

భారత విద్యార్థుల రాం రాం!

2024లో బాగా తగ్గిన వైనం	కెనడాకు 41 శాతం తగ్గుదల	బ్రిటన్‌కు 27, అమెరికాకు 13 శాతం	రష్యా, ఇతర దేశాలవైపు చూపు

ఉన్నత విద్యకోసం అగ్ర రాజ్యాలకు వెళ్తున్న భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. అమెరికా, కెనడా, బ్రిటన్‌లకు వెళ్తున్న వారి సంఖ్యలో భారీ తగ్గుదల నమోదైంది. ప్రత్యామ్నాయ దేశాలైన రష్యా, జర్మనీ, ఉజ్బెకిస్తాన్‌లకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం విశేషం! మొత్తంగా విదేశాలకు వెళ్తున్న విద్యార్థుల సంఖ్య కూడా తగ్గుతోంది. 2023లో 8,92,989 మంది భారత విద్యార్థులు విదేశీ బాట పట్టగా 2024లో ఏకంగా 7,59,064కు తగ్గారు! అంటే దాదాపు 15 శాతం తగ్గుదల!!

ఆ దేశాలవైపు చూపు

కొత్త దేశాలపై భారత విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. 2024లో అత్యధిక మంది విద్యార్థులు రష్యాకు వెళ్లారు! 2023తో పోలిస్తే 34 శాతం పెరుగుదల నమోదైంది. 2024లో జర్మనీకి 34,702 విద్యార్థులు పెరిగారు. ఉజ్బెకిస్తాన్‌కు 9,915 మంది, బంగ్లాదేశ్‌కు 8,864 మంది అధికంగా వెళ్లారు. కోవిడ్ తర్వాత విదేశాల్లో చదువుకునే భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గడం ఇది రెండోసారి.

ఆ మూడు దేశాల్లో...

2024లో ఉన్నత విద్య కోసం వెళ్లిన అమెరికా, కెనడా, బ్రిటన్‌లకు వెళ్లిన భారత విద్యార్థుల సంఖ్య 27 శాతం తగ్గినట్టు ఇమిగ్రేషన్ బ్యూరో గణాంకాలు చెబుతున్నాయి. అంటే ఒక్క ఏడాదిలోనే ఏకంగా 1,64,370 తగ్గుదల! 2023లో కెనడాకు 2,33,532 మంది భారత విద్యార్థులు వెళ్లగా 2024లో 1,37,608కు తగ్గారు. అంటే 41 శాతం తగ్గుదల. బ్రిటన్‌కు 27 శాతం, అమెరికాకు 13 శాతం తగ్గుదల నమోదైంది. కఠినమైన వీసా నిబంధనలు, అధిక ఆర్థిక డిమాండ్లు, ఎక్కువ తిరస్కరణలు, దౌత్య సమస్యల వంటివి ఇందుకు కారణమని గణాంకాలు చెబుతున్నాయి.

ఉద్రిక్తతలు...

ప్రధానంగా కెనడాతో భారత్‌కు దౌత్యపరమైన ఉద్రిక్తతలు పెరగడంతో ఉన్నత విద్యకు ఆ దేశాన్ని ఎంచుకునే భారతీయుల సంఖ్య బాగా తగ్గింది. సిక్కు వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య, అందులో భారత ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపణలతో 2023 నుంచి పరిస్థితి దిగజారుతూ రావడం ఇందుకు కారణమైంది. వీటికి తోడు కెనడా తన వీసా, స్టూడెంట్ పర్మిట్ నిబంధనలను కఠినతరం చేసింది. బ్రిటన్‌లోనే నిబంధనలే అడ్డంకిగా మారాయి. పీజీ రీసెర్చ్, ప్రభుత్వ నిధులతో నడిచే పథకాల్లోని వారు మినహా ఇతర విదేశీ విద్యారులు తమ కుటుంబీకులను బ్రిటన్‌కు తీసుకురావడానికి వీల్లేదంటూ 2023లో నిబంధనలు తెచ్చింది. దాంతో ఉన్నత చదువులకోసం యూకేను ఎంచుకునే విద్యార్థుల సంఖ్య తగ్గింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

■ త్వరలో ఇండియాకు వెళ్తా: తులసి

వాషింగ్టన్: అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ చీఫ్ తులసీ గబ్బార్డ్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. ఇండో–పసిఫిక్ దేశాల సందర్శనలో భాగంగా తనకు బాగా పరిచయమున్న భారత్‌కు వెళ్లనున్నట్లు ఆమె సోమవారం వెల్లడించారు. ఆయా దేశాలతో సంబంధాల బలోపేతానికి, అధ్యక్షుడు ట్రంప్ లక్ష్యాలైన శాంతి, స్వేచ్ఛల సాధనే ఈ పర్యటన ఉద్దేశమని చెప్పారు. జపాన్, థాయ్‌లాండ్, భారత్‌లలో పర్యటించడంతోపాటు తిరుగు ప్రయాణంలో ఫ్రాన్స్‌లో ఆగుతానని చెప్పారు. విమానంలో అడుగుపెడుతున్న ఫొటోను ఆమె 'ఎక్స్'లో షేర్ చేశారు. మొదటగా ఆమె హనొలులులో ఆగుతారు. అక్కడున్న యూఎస్ ఇండో పసిఫిక్ కమాండ్ ప్రధాన కార్యాలయానికి వెళతారు. కాగా, ప్రధాని మోదీ ఆహ్వానంపై భారత్‌కు వస్తున్న తులసీ 18న ఢిల్లీలో 'రైజినా డైలాగ్'కార్యక్రమంలో ప్రసంగిస్తారని న్యూయార్క్ టైమ్స్ తెలిపింది.

■ చావెజ్ నియామకానికి సెనేట్ ఆమోదం

వాషింగ్టన్: అమెరికా కార్మిక మంత్రిగా ట్రంప్ నామినీ లోరీ ఛావెజ్ డీరెమర్ నియామకానికి సెనేట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగులకు మంచి వేతనాలు, సురక్షిత పని పరిస్థితులు, రిటైర్మెంట్ ప్రయోజనాలకోసం పాటుపడతానని అనంతరం చావెజ్ ప్రకటించారు. అమెరికా కార్మికులను ప్రపంచంలోనే తొలి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. వేలాదిమంది ప్రభుత్వోద్యోగులు తమ తొలగింపును కోర్టుల్లో సవాలు చేసిన వేళ ఆమె ఈ ప్రకటన చేయడం విశేషం. ఆమోదం పొందింది. ఆమె నియామకాన్ని ఇంటర్నేషనల్ బ్రదర్‌హుడ్ ఆఫ్ టీమ్‌స్టర్స్‌తో సహా ప్రముఖ కార్మిక సంఘాలు స్వాగతించాయి. అమెరికా కార్మిక శాఖలో దాదాపు 16 వేల మంది ఫుల్‌టైమ్ ఉద్యోగులున్నారు. ఉద్యోగుల తొలగింపుకు ట్రంప్ ప్రభుత్వమే ప్రయత్నిస్తున్న నేపథ్యంలో కార్మిక మంత్రిగా చావెజ్ ఏ మేరకు స్వేచ్ఛగా పని చేయగలరన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

■ పాక్ రాయబారిని అనుమతించని అమెరికా

విమానాశ్రయం నుంచే తిప్పిపంపిన వైనం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ప్రభుత్వానికి అమెరికా షాకిచ్చింది. తుర్క్‌మెనిస్తాన్‌లో పాక్ రాయబారి కేకే అహ్సన్ వాగన్‌ను తమ దేశంలోకి అనుమతించలేదు. సెలవుల రీత్యా లాస్‌ఏంజెలెస్ వెళ్లిన వాగన్‌ను ఇమ్మిగ్రేషన్ అధికారులు విమానాశ్రయంలోనే అడ్డుకున్నారు. చెల్లుబాటయ్యే వీసా, ప్రయాణ పత్రాలున్నా అమెరికాలోకి ప్రవేశించనివ్వకుండా తిప్పి పంపారు. ఇమిగ్రేషన్ అభ్యంతరాలే ఇందుకు కారణమని పాక్ విదేశాంగ శాఖ చెప్పుకొచ్చింది. దీనిపై విచారణకు లాస్ ఏంజెలెస్‌లోని తమ కాన్సులేట్‌ను ఆదేశించింది.

■ జూలై కల్లా పీఐఏను అమ్మేస్తాం: పాక్

ఇస్లామాబాద్: ప్రభుత్వం ఆధీనంలోని పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ (పీఐఏ)ను పాక్ ప్రభుత్వం మరోసారి విక్రయానికి పెట్టింది. గతేడాది అక్టోబర్‌లో చేసిన ప్రయత్నం విఫలం కావడంతో అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఒత్తిడి మేరకు జూలై నెలకల్లా ఎలాగోలా పీఐఏను అమ్మేస్తామని తాజాగా హామీ ఇచ్చింది. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా తీవ్ర నష్టాల్లో నడుస్తున్న సంస్థల్లో ఒకటైన పీఐఏలోని 51 శాతం నుంచి 100 శాతం వరకు వాటాను విక్రయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గతేడాది పాక్‌కే చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీ ఒకటి వెయ్యి కోట్ల రూపాయలకు కొనేందుకు ముందుకు వచ్చింది. మరెవరూ పీఐఏపై ఆసక్తి చూపడం లేదు. అయితే, దీన్ని విక్రయిస్తేనే 7 బిలియన్ డాలర్ల రుణం ఇస్తామంటూ ఐఎంఎఫ్ మెలికపెట్టడంతో ప్రభుత్వం మరోసారి ప్రయత్నాలు ప్రారంభించింది.

■ కశ్మీర్‌లోని రెండు సంస్థలపై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ: చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం–1967 కింద కేంద్ర ప్రభుత్వం మంగళశారం జమ్మూకశ్మీర్‌కు చెందిన రెండు సంస్థలపై ఐదేళ్లపాటు నిషేధం విధించింది. ఇవి ఉమర్ ఫరూక్ సారథ్యంలోని అవామీ యాక్షన్ కమిటీ(ఏఏసీ), మస్రూర్ అబ్బాస్ అన్సారీకి చెందిన జమ్మూకశ్మీర్ ఇత్తిహదుల్ ముస్లిమీన్(జేకేఐఎం). ఈ మేరకు కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. జమ్మూకశ్మీర్‌లో భారత్ వ్యతిరేక, వేర్పాటువాద భావజాలాన్ని వ్యాపింప జేస్తూ, ఉగ్ర కార్యకలాపాల్లో ఏఏసీ పాల్గొంటోందని వివరించింది. ఈ సంస్థ దేశ సమగ్రత, సార్వభౌమత్వం, భద్రతకు ప్రమాదకరంగా మారిందని పేర్కొంది. అదేవిధంగా, జేకేఐఎం చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటోందని, వేర్పాటువాదాన్ని ప్రేరేపిస్తోందని హోం శాఖ తెలిపింది.

■ 'టెంప్లేట్ మోడల్'తో మరిన్ని విమానాశ్రయాలు

న్యూఢిల్లీ: దేశంలో మరిన్ని విమానాశ్రయాలను ఏర్పాటు చేసేందుకు 'టెంప్లేట్ మోడల్'ను తీసుకు వచ్చే యోచనలో ప్రభుత్వం ఉందని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఈ విధానంలో సరుకు రవాణా, శిక్షణ అవసరాలు, తదితరాలకు ప్రత్యేకంగా వేర్వేరు ఎయిర్‌పోర్టులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రపంచంలోని వేగంగా వృద్ధి చెందే పౌర విమానయాన మార్కెట్లలో భారత్ ఒకటన్నారు. మంగళవారం ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. దేశంలో ప్రస్తుతం 159 ఎయిర్‌పోర్టులు పనిచేస్తుండగా, దేశీయ విమానయాన సంస్థలు కొత్తగా 1,700 విమానాల కోసం ఆర్డర్లు పెట్టాయని మంత్రి వివరించారు. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ విమానాశ్రయాలను ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నామని, భూసేకరణ ప్రధాన అవరోధంగా మారిందని తెలిపారు.

■ దళిత విద్యార్థి వేళ్లు నరికేశారు

కబడ్డీలో ఓడించినందుకు కిరాతకం

తిరునల్వేలి: తమిళనాడులోని తిరునల్వేలి జిల్లాలో ఘోరం జరిగింది. పరీక్ష రాయడానికి వెళ్తున్న దేవేంద్రన్ అనే 11వ తరగతి విద్యార్థిపై కొందరు కిరాతకులు దాడి చేసి చేతి వేళ్లు దారుణంగా నరికేశారు. దిన కూలీ అయిన కొడుకైన దేవేంద్రన్ సోమవారం పాళయంకోటలోని పరీక్షా కేంద్రానికి బస్సులో బయలుదేరాడు. మార్గమధ్యంలో క్రాసింగ్ వద్ద ముగ్గురు వ్యక్తులు బస్సును అడ్డగించారు. దేవేంద్రన్‌ను బయటికి లాగి ఎడమ చేతి వేళ్లు నరికేశారు. అడ్డొచ్చిన అతని తండ్రి గణేశ్‌పైనా దాడి చేశారు. అతనికి తల, ఇతర చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ప్రయాణికులు అడ్డుకోవడంతో అగంతకులు పారిపోయారు. తండ్రీకొడుకులను అదే బస్సులో శ్రీవైకుంఠం ప్రభుత్వాస్పత్రికి, తరువాత తిరునల్వేలి ఆస్పత్రికి తరలించారు. దాడికి తెగబడ్డ ముగ్గురు మైనర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కబడ్డీ మ్యాచ్‌లో ఓటమికి ప్రతీకారంగానే దాడికి తెగబడ్డారని దేవేంద్రన్ కుటుంబం ఆరోపించింది.

ప్రజాస్వామ్యాన్ని అధికారులు

బలహీనపర్చడాన్ని సహించరాదు: సుప్రీం

న్యూఢిల్లీ: ప్రజాస్వామ్య పునాదులను అధికార యంత్రాంగం బలహీనపర్చడాన్ని సహించరాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మహారాష్ట్రలోని ఓ గ్రామ సర్పంచికి అధికారం తిరిగి అప్పగిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఆ రాష్ట్రంలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల పట్ల అధికారులు అనుచితంగా ప్రవర్తించిన ఘటనలు ఇటీవల చాలా జరిగాయని ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి రెండు మూడు కేసుల్లో అధికారుల అనుచిత ప్రవర్తన రుజువైందని కూడా తెలిపింది. ఇలాంటివి మహారాష్ట్రలోనే జరుగుతున్నాయంది. అధికారులు ఎన్నికైన ప్రజాప్రతినిధుల వద్ద పనిచేయాలంది. ప్రజాస్వామ్య పునాదులను బలహీనపర్చే అవకాశం వారికి ఇవ్వరాదని స్పష్టం చేసింది. కొన్ని చోట్ల అధికారులు గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులను అనర్హులుగా చేయడానికి పాత కేసులను తిరగదోడుతున్నా రని ధర్మాసనం పేర్కొంది. తొలగింపునకు గురైన రోహా తాలూకా అయింఫర్ గ్రామ సర్పంచి కళావతి రాజేంద్ర కొకాలేకు తిరిగి పదవి అప్పగించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది.

రష్యాపైకి ఉక్రెయిన్ డ్రోన్లు

మాస్కో: ఉక్రెయిన్ మంగళవారం రష్యాపైకి అతిపెద్ద డ్రోన్ల దాడికి దిగింది. రష్యాలోని 10 ప్రాంతాలపైకి దూసుకొచ్చిన 337 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా మిలటరీ తెలిపింది. డ్రోన్ల దాడిలో ఒకరు చనిపోగా పదుల సంఖ్యల జనం గాయపడినట్లు రష్యా తెలిపింది. యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో ఉక్రెయిన్–అమెరికా మధ్య సౌదీ అరేబియాలోని జెడ్డాలో మంగళవారం చర్చలు మొదలవడానికి కొద్ది గంటల ముందు ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. తాజా దాడిపై ఉక్రెయిన్ స్పందించలేదు. అత్యధికంగా సరిహద్దుల్లోని కస్క్ ప్రాంతంలోకి వచ్చిన 126 డ్రోన్లను కూల్చినట్లు రష్యా మిలటరీ తెలిపింది. రాజధాని మాస్కో దిశగా వచ్చిన మరో 91 డ్రోన్లను ధ్వంసం చేశామంది. ఇంకా, సరిహద్దులకు సమీపంలోని బెల్గొరోడ్, బ్రయాన్స్క్, వొరొనెజ్‌తోపాటు సుదూర ప్రాంతాలైన కలుగ, లిపెట్స్క్, నిజ్నీ నొవ్‌గొరోడ్, ఒరియోల్, రైజాన్‌లపైకి కూడా ఇవి వచ్చాయని వివరించింది.

సైనిక తిరుగుబాటుకు కుట్ర

ఢాకా: పాకిస్తాన్‌తో అత్యంత సన్నిహితంగా మెలిగే బంగ్లాదేశ్ సైన్యాధికారి ఒకరు సైన్యంలో తిరుగుబాటుకు ప్రయత్నించారన్న వార్త సంచలనం సృష్టించింది. అతివాద జమాతే ఇస్లామీ బంగ్లాదేశ్ రాజకీయ పార్టీతో చేతులు కలిపి లెఫ్టినెంట్ జనరల్ ఫైజర్ రహ్మాన్ ఈ సైనిక తిరుగుబాటుకు పథక రచన చేశారు. అయితే ఈ సైనిక తిరుగుబాటు కుట్ర వెనుక పాకిస్తాన్ హస్తముందని వార్తలొచ్చాయి. షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయాక గత కొద్దికాలంగా పాకిస్తాన్‌తో బంగ్లాదేశ్ సన్నిహితంగా మెలుగుతున్న విషయం విదితమే. దీనిని అదునుగా చేసుకుని బంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ రాజ్యం, షరియా చట్టాల అమలే లక్ష్యంగా తొలుత సైనిక తిరుగుబాటు తేవాలని పాకిస్తాన్ భావించినట్లు బంగ్లాదేశ్ మీడియాలో వార్తలొచ్చాయి. బంగ్లాదేశ్ సైన్యాధికారుల సాయంతో సైనిక తిరుగుబాటుకు ప్రణాళిక సిద్ధం చేసి లెఫ్టినెంట్ జనరల్ ఫైజర్ సారథ్యంలో దానిని అమలుచేయాలని చూసింది. అయితే బంగ్లాదేశ్‌లో కొలువుతీరిన మొహమ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రభుత్వం ఈ ఆపదను పసిగట్టి సైన్యాధికారులను హెచ్చరించింది. దేశ సమగ్రత, సార్వభౌమత్వాన్ని భంగపరిచే వారికి కఠిన శిక్షలుంటాయని ఆర్మీ చీఫ్ వకార్ ఉజ్జమాన్ ప్రకటించారు.

అప్రమత్తమైన బంగ్లాదేశ్ సర్కార్

అసలేం జరిగింది?

పాకిస్థాన్‌తో సత్సంబంధాలున్న లెఫ్టినెంట్ జనరల్ ఫైజర్ మార్చి నెల మొదటివారంలో డివిజనల్ కమాండర్ల(జీఓసీ)ల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశంపై ఆర్మీకిగానీ, ప్రభుత్వానికిగానీ ఎలాంటి ముందస్తు సమాచారం లేదని తెలుస్తోంది. వాస్తవానికి ఫైజర్ రహ్మాన్ ఆర్మీలో సిబ్బంది, సరకులు, ఇతర సరఫరాల బాధ్యతలను మాత్రమే చూడాలి. అది వదిలేసి కమాండర్లతో సమావేశం ఏర్పాటుచేస్తుండటంపై ఆర్మీకి సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన ఆర్మీ సచివాలయం ఒక ప్రకటన విడుదలచేసింది. ఫైజర్‌తో సమావేశమయ్యే సైన్యాధికారులపై కఠిన చర్యలు తప్పవని విప్‌ను జారీచేసింది. ఫైజర్ ఇప్పటికే జనవరి, ఫిబ్రవరి నెలల్లో పాకిస్తాన్‌కు చెందిన పలువురు దౌత్యవేత్తలు, జమాతే ఇస్లామీ బంగ్లాదేశ్‌కు చెందిన పలువురు కీలక నేతలతో సమావేశమైనట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ ఆర్మీ తాత్కాలిక చీఫ్‌కు వ్యతిరేకంగా బలాన్ని కూడగట్టేందుకు ఫైజర్ కుట్ర పన్నారని ఆయనపై ఆరోపణలున్నాయి. సైనిక తిరుగుబాటు ద్వారా తాను ఆర్మీ చీఫ్‌గా ఎదగాలని ఫైజర్ భావించినట్లు వార్తలొచ్చాయి.

బిర్నిహాట్ ప్రపంచంలోనే టాప్

కాలుష్యంలో అగ్రగామిగా

అస్సాం సిటీ

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యధిక జనాభాతో కిటకిటలాడుతున్న మన దేశం కాలుష్య నగరాల జాబితాలోనూ టాప్‌లో ఉంది. ప్రపంచంలోనే అత్యంత కలుషితమైన మొదటి 20 నగరాల్లో మనవి ఏకంగా 13 నగరాలున్నాయి. ఇందులో మొదటి స్థానంలో అస్సాంలోని బిర్నిహాట్ నిలిచింది. దేశ రాజధానుల్లో ప్రపంచంలోనే అత్యంత కలుషితమైందిగా ఢిల్లీ అగ్రస్థానంలో ఉంది. స్విట్జర్లాండ్ కంపెనీ ఐక్యూ ఎయిర్ మంగళవారం వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్–2024 పేరిట ఈ నివేదిక విడుదల చేసింది. ప్రపంచంలోనే అత్యంత కలుషిత దేశాల్లో భారత్ 2023లో మూడో ర్యాంకులో ఉండగా తాజాగా కాస్తంత మెరుగ్గా ఐదో స్థానానికి చేరింది. టాప్–20లోని అత్యంత కలుషితమైన నగరాల్లో పొరుగు దేశం పాక్‌లోనివి నాలుగు ఉండగా, చైనాకు చెందిన ఒక నగరముంది.

టాప్–20లో..బర్నిహాట్, ఢిల్లీ, పంజాబ్‌లోని ముల్లన్‌పూర్, ఫరీదాబాద్, లోని, గురుగ్రామ్, గంగానగర్, గ్రేటర్ నోయిడా, భివాడి, ముజఫర్‌నగర్, హనుమాన్‌గఢ్, నోయిడా ఉన్నాయి. భారత్‌లోని 35 శాతం నగరాల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతించిన పరిమితికి మించి వార్షిక పీఎం 2.5 స్థాయిలు పది రెట్లు ఎక్కువగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. కాగా, అస్సాం–మేఘాలయ సరిహద్దుల్లోని బర్నిహాట్‌లో డిస్టిలరీలు, ఐరన్, స్టీల్ ప్లాంట్ల కారణంగా ఎక్కువ కలుషిత ఉద్గారాలు ఉన్నట్లు నివేదిక వివరించింది. గాలి కాలుష్యం భారత్‌లో ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా పరిణమించిందని, ఆయుర్దాయం సగటున 5.2 ఏళ్లు తగ్గుతోందని తెలిపింది. భారత్ ఏటా 15 లక్షల మంది గాలి కాలుష్యం కారణంగా చనిపోతున్నట్లు లాన్సెట్ తెలిపింది.

బంగారం స్మగ్లింగ్ కేసులో మరో మలుపు

బెంగళూరు: కన్నడ సినీ నటి రన్యా రావు బంగారం స్మగ్లింగ్ కేసు మరో మలుపు తిరిగింది. ఈ కేసులో ఆమె సవతి తండ్రి, డీజీపీ స్థాయి అధికారి కె.రామచంద్రరావు ప్రమేయంపై నిగ్గు తేల్చాలని కర్ణాటక ప్రభుత్వం అదనపు చీఫ్ సెక్రటరీ గౌరవ్ గుప్తాను ఆదేశించింది. ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయినట్లు సీఎం కార్యాలయం మంగళవారం తెలిపింది. అదే సమయంలో, కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో విధి నిర్వహణలో పోలీసు అధికారుల నిర్లక్ష్యం, లోటుపాట్లపైనా విచారణ చేపట్టాలని సీఐడీ విభాగాన్ని ఆదేశించింది. తక్షణమే దర్యాప్తు చేపట్టి, వారం లోగా నివేదిక అందించాలని స్పష్టం చేసింది. విచారణకు సహకరించాల్సిందిగా సంబంధిత పోలీసు విభాగాలను సీఎంవో కోరింది. రామచంద్రరావు ప్రస్తుతం కర్ణాటక స్టేట్ పోలీస్ హౌసింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ నెల 3వ తేదీన దుబాయ్ నుంచి బెంగళూరుకు చేరుకున్న రన్యా రావు వద్ద డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ)అధికారులు రూ.12.56 కోట్ల విలువైన బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. మరునాడు ఆమె ఇంట్లో మరికొంత బంగారం, డబ్బు స్వాధీనం చేసుకోవడం తెలిసిందే. తరచూ దుబాయి వెళ్లి వస్తూ ఆమె బంగారాన్ని దొంగచాటుగా తీసుకువస్తోందని, విమానాశ్రయంలోని పోలీసు సిబ్బంది సోదాలు జరపకుండా ఆమెను పంపించి వేస్తున్నట్లు తేలింది. ఈ వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టించడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. కాగా, రన్యా రావు బంగారం స్మగ్లింగ్ వ్యవహారంతో మంత్రులకు సంబంధాలున్నట్లు వస్తున్న వార్తలన్నీ రాజకీయ పుకార్లేనని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కొట్టిపారేశారు. కేంద్ర విభాగాలు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

రామచంద్రరావు పాత్రపై విచారణకు కర్ణాటక సర్కార్ ఆదేశం

హోటల్ యజమాని మనవడు అరెస్ట్

ఇదే కేసులో డీఆర్ఐ అధికారులు మంగళవారం బెంగళూరులోని అట్రియా హోటల్ యజమాని మనవడు తరుణ్ రాజును అరెస్ట్ చేశారు. అతడిని బెంగళూరులోని ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో హాజరు పరచగా ఐదు రోజుల కస్టడీకి అనుమతించిందని డీఆర్ఐ తెలిపింది. రన్యా రావు, తరుణ్ రాజులకు సన్నిహిత సంబంధాలున్నాయని, విదేశాల నుంచి బంగారాన్ని దొంగచాటుగా తేవడం వీరు కూడబలుక్కుని చేసిందేనని అంటోంది. రన్యా రావు వేరొకరిని పెళ్లి చేసుకోవడంతో వీరి మధ్య సంబంధాలు బెడిసి కొట్టినా చట్ట విరుద్ధ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారంది. దుబాయి నుంచి బంగారాన్ని తీసుకు వచ్చేటప్పుడు రన్యా రావు తరుణ్ రాజుతో ఫోన్‌లో మాట్లాడినట్లు డీఆర్ఐ తెలిపింది. వీరిద్దరినీ వేర్వేరుగా, కలిపి సైతం విచారించినట్లు వివరించింది. అయితే, విచారణ సమయంలో అధికారులు తనను బెదిరించారని, మానసికంగా వేధించారని సోమవారం కోర్టు విచారణ సమయంలో రన్యా రావు ఆరోపించింది. తనను కొట్టలేదు కానీ, పరుషంగా దూషించారని తెలిపింది. ఇష్టం లేకున్నా తనతో కొన్ని పత్రాలపై సంతకాలు చేయించారని రోదిస్తూ జడ్జికి ఫిర్యాదు చేసింది.

మనిషిని కుక్క షూట్ చేసింది!!

మెంఫిస్ సిటీ: కుక్క మనిషిని కరవడం వార్తకాదు.. మనిషే కుక్కను కరవడం వార్త అని గతంలో ఒక ఫేమస్ వాక్యం ఉండేది. ఇప్పుడు దానిని ''మనిషి కుక్కను షూట్ చేయడంకాదు.. కుక్క మనిషిని షూట్ చేయడం వార్త'' అని మార్చి రాసుకోవాలేమో. ఇలాంటి ఉదంతం సోమవారం తెల్లవారుజామున అమెరికాలో జరిగింది. టెన్నిస్సీ రాష్ట్రంలోని మెంఫిస్ సిటీ సమీప ఫ్రేసర్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. జెరాల్డ్ కిర్క్‌వుడ్ అనే వ్యక్తి తన గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి బెడ్‌పై నిద్రిస్తుండగా తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఏడాది వయస్సున్న పిట్‌బుల్ జాతి పెంపుడు శునకం ఆ గదికి వచ్చింది. వీళ్లిద్దరూ నిద్రిస్తూ బెడ్ మీద ఒక గన్‌ను అలాగే వదిలేశారు. దాంట్లో బుల్లెట్లు లోడ్‌చేసి ఉన్నాయి. శునకం ఒక్క ఉదుటున బెడ్ మీదకు దూకింది. అది సరిగ్గా గన్ ట్రిగ్గర్‌పై దూకడంతో ట్రిగ్గర్ నొక్కుకుని గన్ పేలింది. దీంతో దూసుకొచ్చిన బుల్లెట్ ఆ వ్యక్తి ఎడమ తొడను పైపైన చీలిస్తూ బయటకు దూసుకెళ్లింది. బుల్లెట్ గాయంతో జెరాల్డ్, అతని గర్ల్‌ఫ్రెండ్‌ల నిద్ర మొత్తం ఒక్క దెబ్బతో పోయింది. రక్తమోడుతున్న జెరాల్డ్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆయనకు ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు. శునకం కారణంగా గన్ పేలిన ఘటనపై బాధితుడిని మీడియా ప్రశ్నించింది. కుక్క దూకడంతో నిద్రలేచారా? బుల్లెట్ గాయంతో లేచారా? అని ప్రశ్నించగా రెండూ ఒకేసారి జరిగాయని ఆయన నవ్వుతూ చెప్పడం విశేషం. ఆ ఆయుధాన్ని అతని గర్ల్‌ఫ్రెండ్ తర్వాత తీసుకెళ్లింది. ఓరియో పేరున్న ఆ కుక్కపై పోలీసులు ఎలాంటి కేసు నమోదుచేయలేదు.

సాక్షి ప్లస్
బుధవారం। 12-3-2025

సునీత బాలసమాజ స్థాపకులు.. అరిగె రామస్వామి

తెలంగాణ వైతాళికులు

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు

తెలుగు భాష సాంస్కృతిక, సారస్వత పునరుజ్జీవనానికి కొమర్రాజు వెంకట లక్ష్మణరావు విశేష కృషి చేశారు. తెలుగులో చరిత్ర, పరిశోధనలు, వైజ్ఞానిక గ్రంథాలు లేని కొరతను తీర్చడానికి ఆయన మహోద్యమం నడిపారు. తెలుగు చరిత్ర పరిశోధనా పితామహుడిగా పేరొందిన కొమర్రాజు 1877లో కృష్ణాజిల్లా, నందిగామ తాలూకా పెనుగంచిప్రోలులో జన్మించారు. తండ్రి వెంకటప్పయ్య, తల్లి గంగమ్మ. ఇతడి పూర్వీకులు సాహిత్యాభిమానులు. వీరు మునగాల సంస్థానంలో దివాన్‌గా పనిచేశారు.

కొమర్రాజు లక్ష్మణరావు నాగపూర్‌లో విద్యాభ్యాసం చేశారు. కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ పట్టా పొందారు. నాగపూర్‌లో చదివిన రోజుల్లో ఆయన మరాఠీ నేర్చుకున్నారు. తిలక్, అగార్కర్, గోఖలే, రనడే లాంటి జాతీయ నాయకుల ప్రభావం కొమర్రాజుపై పడింది. 'కేసరి' అనే మరాఠీ పత్రికలో ఆయన వ్యాసాలు రాసేవారు. 'మోరోపంత్' అనే మహారాష్ట్ర కవి రచించిన మహాభారత కర్ణపర్వానికి పరిష్కర్త (ఎడిటర్)గా కొమర్రాజు పనిచేశారు. 1898లో 'జనానా' అనే తెలుగు పత్రికలో వ్యాసాలు ప్రచురించారు. 1900లో మునగాల సంస్థానంలో రాజా నాయని వెంకట రంగారావు వద్ద దివాన్‌గా చేరారు. స్వదేశీ ఉద్యమానికి తోడ్పాటు అందించేలా మునగాల రాజును ప్రోత్సహించారు. బెంగాలీ, గుజరాతీ, ప్రాకృతం, సంస్కృతంతోపాటు దక్షిణాది భాషల్లోనూ లక్ష్మణరావుకు ప్రావీణ్యం ఉంది.

భాషా సేవ: గ్రంథాలయోద్యమం తెలంగాణలో తెలుగు జాతిని జాగృతం చేసింది. గ్రంథాలయోద్యమంలో భాగంగా రావిచెట్టు రంగారావు, మునగాల రాజా నాయని వెంకట రంగారావు, ఆదిపూడి సోమనాథరావు లాంటి ప్రముఖుల ప్రోత్సాహంతో కొమర్రాజు లక్ష్మణరావు 1901లో హైదరాబాద్‌లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయాన్ని స్థాపించారు. 1904లో హనుమకొండలో శ్రీ రాజరాజ నరేంద్ర భాషానిలయం, 1905లో సికింద్రాబాద్‌లో ఆంధ్రసంవర్ధినీ గ్రంథాలయాన్ని నెలకొల్పారు. 1906లో హైదరాబాద్‌లో 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి' ముద్రణాలయాన్ని స్థాపించారు. నాయని వెంకట రంగారావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావుతో కలిసి కొమర్రాజు ఈ మండలిని స్థాపించారు. ఈ మండలి ఆంధ్రా-తెలంగాణ ప్రాంత ప్రజల మధ్య సాంస్కృతిక వారధిగా పనిచేసింది. సంఘ సంస్కరణ, జాతీయోద్యమం వ్యాప్తి లక్ష్యాలుగా ఈ సంస్థ పనిచేసింది. అందుకే ఈ ముద్రణాలయంలో ప్రపంచ మహాపురుషుల జీవిత చరిత్రలను ప్రచురించారు. 1906-11 మధ్య కాలంలో విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి సుమారు 30 గ్రంథాలను ప్రచురించింది.

- 12వ శతాబ్దంలో మల్లికార్జున శివాచార్యుడు రచించిన 'శివతత్వసారం' శతకానికి లక్ష్మణరావు పీఠిక రాశారు. విష్ణుకుండినుల మూడో రాజైన మాధవ వర్మ శాసనాన్ని 1923లో కలకత్తా జర్నల్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ లెటర్స్‌లో ప్రచురించారు.
- తెలుగు భాషకు విశేషంగా సేవలందించిన కొమర్రాజు లక్ష్మణరావు 46 ఏళ్లకే మరణించారు.

అరిగె రామస్వామి

సమాజంలో ఏళ్ల తరబడి పీడనకు గురి అవుతోన్న నిమ్నజాతుల సముద్ధరణకు నిరంతరం కృషి చేసిన దీనజనోద్ధారకుడు అరిగె రామస్వామి. ఈయన సంఘ సంస్కర్త, దేశభక్తుడు. నిజాం నిరంకుశ పాలనలో వెనుకబడిన వర్గాల ప్రజల పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉండేది. అంటరానివారిపై ఉన్నత వర్గాలు, ప్రభుత్వోద్యోగులు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలతో తెలంగాణ గ్రామీణ వ్యవస్థ అల్లాడిపోయింది. అరిగె రామస్వామి, భాగ్యరెడ్డి వర్మ, బి.ఎస్. వెంకట్రావు తదితరులు హైదరాబాద్ రాజ్యంలో ప్రముఖ హరిజన నాయకులుగా పేరొందారు. అరిగె రామస్వామి ఆధ్యాత్మిక చింతనాపరుడు, గాంధేయవాది. ఈయన మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, కొండా వెంకట రంగారెడ్డి లాంటి కాంగ్రెసు నాయకులతో కలిసి పనిచేశారు. నిజాం రాష్ట్రాంధ్ర మహాసభ నాయకుడిగా తెలంగాణ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు.

అరిగె రామస్వామి 1895లో సికింద్రాబాద్‌లోని నిరుపేద హరిజన కుటుంబంలో జన్మించారు. పెద్దగా చదువుకోలేదు. రైల్వే తనిఖీ కార్యాలయంలో ఆఫీస్ బాయ్‌గా జీవితాన్ని ప్రారంభించారు. కొంతకాలం రైల్వేలో టిక్కెట్ కలెక్టర్‌గా పనిచేశారు. 1912లో సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడలో సునీత బాలసమాజాన్ని స్థాపించారు.

ఈ సమాజం ముఖ్యోద్దేశాలు

మద్యం తాగే దురలవాటును మాన్పించడం, నిరక్షరాస్యతా నిర్మూలన, మాల, మాదిగ, మాల దాసరి మొదలైన హరిజన ఉపతెగలను సమైక్యం చేయడం లక్ష్యాలుగా ఈ సంస్థ పనిచేసింది. మూఢాచారాలు, మూఢ విశ్వాసాలను పోగొట్టడం, సాంఘిక న్యాయ సాధన, జంతు బలుల నిషేధం కోసం ఈ సంస్థ పనిచేసింది. హరిజనులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఈ సంస్థ కృషి చేసింది. దళిత వర్గాల అభ్యున్నతి కోసం జాతీయోన్నత సభ, ఆదిహిందూ మహాసభ, ఆదిహిందూ సోషల్ సర్వీస్ లీగ్ లాంటి సంస్థలు హైదరాబాద్‌లో ఏర్పడ్డాయి. ఈ సంస్థల కార్యకర్తలైన భాగ్యరెడ్డి వర్మ, ఆర్.లక్ష్మయ్య, ఎం.ఎల్.ఆదయ్య, సి.ఎస్.యతిరాజులు మొదలైన వారితో అరిగె రామస్వామి అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 1930లో రామస్వామి రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తి సమయాన్ని సంఘసేవకే కేటాయించారు. తన ఆధ్యాత్మిక గురువైన భూమానందస్వామి పేరు మీద గురుమండలి స్థాపించి పేదలకు ఉచితంగా సామూహిక వివాహాలు జరిపించారు. నిజాం ప్రభుత్వం హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సభ్యుడిగా దళితుడికి అవకాశం ఇవ్వాలని భావించింది. ఈ పదవిలో నియమితుడైన తొలి హరిజనుడు ఈయనే.



- 1933లో మహాత్మాగాంధీ హైదరాబాద్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా నగరంలో ఏర్పాటైన ఆహ్వాన సంఘంలో రామస్వామి సభ్యుడు. హైదరాబాద్ సంస్థానంలో హరిజనోద్ధరణకు పూర్తి సమయాన్ని వెచ్చించాలని అరిగె రామస్వామికి గాంధీ సలహా ఇచ్చారు.
- హైదరాబాద్‌లో తోళ్లపరిశ్రమ కార్ఖానా స్థాపన కోసం రామస్వామి కృషిచేశారు.
- తెలంగాణ గ్రంథాలయోద్యమానికి విశేష సేవలందించారు.
- నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలో ఏకైక హరిజన సభ్యుడు రామస్వామి. అస్పృశ్యతా నివారణ, వెట్టిచాకిరీ నిర్మూలన, హరిజన సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారు. 1935లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన దళిత జాతుల మహాసభకు అరిగె రామస్వామి అధ్యక్షత వహించారు.
- 'అరుంధతీ మహాసభ' ద్వారా అనాథలు, హరిజన కుటుంబాలను ఆదుకున్నారు. ఈ సభ ద్వారా వారికి ఉద్యోగాలు, జీవన భృతి కల్పించేందుకు కృషి చేశారు.
- రామస్వామి నిజాం రాష్ట్రాంధ్ర మహాసభ కార్యవర్గ సభ్యులుగా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా, నిజాం రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా పనిచేశారు.
- 1950-52లో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ జిల్లా బోర్డు సభ్యులుగా సేవ చేశారు.
- పోలీసు చర్య అనంతరం కేంద్ర ప్రభుత్వం రామస్వామిని పార్లమెంట్ సభ్యుడిగా నామినేట్ చేసింది. 1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో వికారాబాద్ ద్విసభ్య నియోజకవర్గం నుంచి చెన్నారెడ్డితోపాటు హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు రామస్వామి ఎన్నికయ్యారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

- 1954-56 మధ్య బూర్గుల మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు.
- తిరుమల-తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు.
- దళితుల అభ్యున్నతి కోసం కృషి చేసిన రామస్వామి 1973 జనవరి 26న మరణించారు.

షోయబుల్లాఖాన్

షోయబుల్లాఖాన్ 1920 అక్టోబర్ 12న జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడై పత్రికా రచయితగా జీవితం ప్రారంభించారు. మొదట తేజ్ వారపత్రికలో చేరి నిజాం నిరంకుశ పాలనను, ఇత్తెహాదుల్ ముసల్మీన్ మత సంస్థ విధి విధానాలను, దాని అధిపతి సయ్యద్ ఖాసీం రజ్వీని ఘాటుగా విమర్శించారు. ఫలితంగా తేజ్ పత్రికను నిజాం ప్రభుత్వం నిషేధించింది. తర్వాత మందుముల నరసింగరావు నిర్వహించిన రయ్యత్ ఉర్దూ పత్రికలో షోయబుల్లాఖాన్ చేరారు. నిజాం ప్రభుత్వ దమననీతిని, పాక్షపాత వైఖరిని విమర్శించినందుకు ఈ పత్రిక కూడా నిషేధానికి గురైంది. దీంతో షోయబుల్లాఖాన్ స్వయంగా ఇమ్రోజ్ అనే ఉర్దూ పత్రికను స్థాపించారు. పత్రిక స్థాపనలో షోయెబ్‌కు బూర్గుల రామకృష్ణారావు సాయం చేశారు.

నిజాం రాష్ట్రంలో నానాటికి దిగజారుతున్న పరిస్థితులను చూసి సహించలేక హైదరాబాద్‌కు చెందిన కొంత మంది మేధావులు నిజాం ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ లేఖలో శాంతిభద్రతల పరిస్థితిని కళ్లకు కట్టినట్లుగా వివరించారు. రజాకార్ల దళాన్ని రద్దుచేయాలని, లాయక్ అలీని ప్రధానమంత్రి పదవి నుంచి తొలగించాలని, హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలని ఆ లేఖలో కోరారు. ఈ మేధావుల సలహాలను నిజాం ఖాతరు చేయలేదు. వీరిలో ఏడుగురు ప్రముఖ ముస్లిం నాయకులున్నారు. వారు.. మంజూర్ జంగ్, బాకర్ అలీ మీర్జా, ఫరీద్ మీర్జా, ముల్లా అబ్దుల్ బాసిత్, మహమ్మద్ మీర్జా, హుసేన్ అబ్దుల్ మునీం, మహ్మద్ హుస్సేన్ జాఫిరి.

వీరు రాసిన లేఖను షోయబుల్లాఖాన్ 'ఇమ్రోజ్' పత్రికలో యథాతథంగా ప్రచురించారు. దీంతో పత్రిక సంపాదకుడైన షోయబుల్లాఖాన్ చేతులు నరికివేయాలని ఖాసీం రజ్వీ రజాకార్లను ఆదేశించాడు. 1948 ఆగస్టు 21న అర్ధరాత్రి సమయంలో 'ఇమ్రోజ్' కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తున్న షోయబుల్లాఖాన్‌పై రజాకార్లు ఆయుధాలతో దాడి చేసి అతడి చేతులు, తలను నరికి హతమార్చారు. షోయబుల్లాఖాన్ బలిదానం హైదరాబాద్ సంస్థాన స్వాతంత్ర్య సమరంలో ఒక మైలురాయి.

మాదిరి ప్రశ్నలు

1. 1906లో 'విజ్ఞాన చంద్రికామండలి' ముద్రణాలయాన్ని ఎవరు ప్రారంభించారు?
   1) కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
   2) సురవరం ప్రతాపరెడ్డి
   3) రఘుపతి వెంకటరత్నం నాయుడు
   4) ముట్నూరి కృష్ణారావు
2. 'ఆంధ్ర చారిత్రక పరిశోధన పితామహుడు' అనే బిరుదు ఎవరికి ఉంది?
   1) రాళ్లబండి సుబ్బారావు
   2) చిలుకూరి వీరభద్రరావు
   3) కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
   4) ఆదిరాజు వీరభద్రరావు
3. 1904లో శ్రీ రాజరాజ నరేంద్ర భాషా నిలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు?
   1) సికింద్రాబాద్ 2) మెదక్
   3) వరంగల్ 4) హనుమకొండ
4. సికింద్రాబాద్‌లో ఆంధ్రసంవర్ధినీ గ్రంథాలయం ఏర్పాటైన సంవత్సరం?
   1) 1901 2) 1905
   3) 1906 4) 1900
5. 1912లో ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని మూడు భాగాలుగా ప్రచురించినవారు?
   1) జయంతి రామయ్య పంతులు
   2) మల్లంపల్లి సోమశేఖర శర్మ
   3) సురవరం ప్రతాపరెడ్డి
   4) కొమర్రాజు వెంకట లక్ష్మణరావు
6. 1912లో సికింద్రాబాద్‌లో సునీత బాల సమాజం అనే సంస్థను స్థాపించినవారు?
   1) రంగారెడ్డి 2) భాగ్యరెడ్డి వర్మ
   3) అరిగె రామస్వామి
   4) బి.యస్. వెంకట్రావు
7. 1935లో మహబూబ్‌నగర్‌లో జరిగిన దళిత జాతుల మహాసభకు అధ్యక్షత వహించిందెవరు?
   1) బి.యస్. వెంకట్రావు
   2) అరిగె రామస్వామి 3) భాగ్యరెడ్డి వర్మ
   4) రావి నారాయణ రెడ్డి
8. ఇమ్రోజ్ అనే ఉర్దూ పత్రిక స్థాపకులు?
   1) మందుముల నరసింగరావు
   2) సురవరం ప్రతాపరెడ్డి
   3) షోయబుల్లాఖాన్ 4) ఖాసీం రజ్వీ
9. 'రయ్యత్' ఉర్దూ పత్రిక సంపాదకుడు?
   1) షోయబుల్లాఖాన్
   2) ఫరీదు మీర్జా 3) మంజూర్ జంగ్
   4) మందుముల నరసింగరావు

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 2; 5) 4; 6) 3; 7) 2; 8) 3; 9) 4.

అప్రయత్నంగా మెరిసిన భావాల అక్షరాకృతి?

ఆధునిక కవితోద్యమాలు

భావ కవిత్వం

తెలుగులో భావ కవిత్వానికి ఆద్యుడు రాయప్రోలు సుబ్బారావు. తొలి తెలుగు భావ కవితా రచన రాయప్రోలు రాసిన 'లలిత'.

భావ కవిత్వాన్ని వివిధ కవులు వివిధ పేర్లతో పిలిచారు.

1. రాయప్రోలు సుబ్బారావు - అభినవ కవిత
2. దేవులపల్లి కృష్ణశాస్త్రి - కాల్పనిక కవిత్వం
3. నోరి నరసింహశాస్త్రి - నవ్య కవిత్వం
4. దువ్వూరి రామిరెడ్డి - గీత కవిత్వం

- భావ కవిత్వం అనే పదాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ఆంధ్రపత్రిక సహాయ సంపాదకులుగా ఉన్నప్పుడు సృష్టించారని డాక్టర్ గిడుగు సీతాపతి 'హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్' అనే గ్రంథంలో పేర్కొన్నారు.
- ఆంగ్లంలోని '**లిరికల్ పోయెట్రీ**'నే తెలుగులో '**భావ కవిత్వం**' అని పిలుస్తున్నారు.
- 'లిరిక్' అంటే '**గాన గుణం అమరిన రచన**' అని అర్థం.
- భావ కవులు వియోగ శృంగారానికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చారు.
- తెలుగులో నవ్య కవిత్వానికి కట్టమంచి రామలింగారెడ్డి '**ముసలమ్మ మరణం**' నాందిగా చెప్పవచ్చు.
- భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్తగా **కట్టమంచి రామలింగారెడ్డి**ని పిలుస్తారు.
- తెలుగులో నవ్య సాహిత్య యుగానికి **రాయప్రోలు, గురజాడ**ను ఆద్యులుగా చెబుతారు.
- తెలుగులో భావ కవిత్వానికి మూలం **కాల్పనికవాదం**. దీనికి మూల పురుషుడు **రూసో**.
- ఆధునిక కాల్పనికతకు న్యాయనిర్ణేత - **రూసో**.
- ఫ్రెంచ్ సాహిత్యంలో జనించిన '**రొమాంటిసిజమ్**'ను అనుసరించిన కవులనే '**కాల్పనికవాద కవులు**' అంటారు.
- రొమాంటిసిజంనే ఆంగ్ల సాహిత్యంలో లిరికల్ పోయెట్రీగా పిలుస్తారు.
- '**లిరికల్ పోయెట్రీ**'ని తెలుగులో **ఆత్మాశ్రయ కవిత్వం** అంటారు.
- కాల్పనికోద్యమ పితామహునిగా **రూసో**ను (1712-88) పాశ్చాత్యులు అంగీకరించారు.
- రూసో 'న్యూ హెలాయిస్' రచనలో ప్రణయతత్వాన్ని, 'సోషల్ కాంట్రాక్ట్' గ్రంథంలో మానవతావాదాన్ని ప్రతిపాదించారు.
- కాల్పనికోద్యమానికి మూలసూత్రం - **ఆత్మాశ్రయ సిద్ధాంతం**.
- భావకవితోద్యమం మూడు (1910-40) దశాబ్దాల పాటు విలసిల్లింది.

భావ కవిత్వం - నిర్వచనాలు

1. 'కవికి తన్మయజ్యోతి మెఱుపువలె చటాలున ఒక్కసారి మెరయును. దానికి ప్రతిఫలమే ఉత్తమ కవిత లేక భావకవిత' - **వేలూరి శివరామశాస్త్రి** (1929 భారతి పత్రికలో)
2. 'కవి అవిస్పష్ట వాంఛాంకురము, ఒక అంతర్నిగూఢ తాపము ఒక చిన్న కావ్యంలో ఊదబడినచో అది భావ కవిత్వం' - **విశ్వనాథ సత్యనారాయణ**.
3. 'కవి హృదయంలో తటిల్లత లాగా అప్రయత్నంగా మెరసిపోయిన భావాల అక్షరాకృతి భావ కవిత' - **శ్రీశ్రీ**.
4. 'వస్తు, భావ రచనల్లో భావానికి ప్రాధాన్యత అగ్రతాంబూలమిచ్చిన కవిత భావకవిత్వం' - సి.నా.రె.

భావ కవిత్వం - శాఖలు

- డాక్టర్ సి.నారాయణరెడ్డి భావ కవిత్వాన్ని ఆరు శాఖలుగా విభజించారు.
- భావ కవిత్వంలోని ప్రధాన శాఖలు
  1) ప్రకృతి కవిత్వం 2) ప్రణయ కవిత్వం
  3) సంఘ సంస్కరణ కవిత్వం
  4) దేశ భక్తి కవిత్వం
  5) స్మృతి కవిత్వం 6) మర్మ కవిత్వం

సుప్రసిద్ధ భావకవులు - వారి రచనలు

రాయప్రోలు సుబ్బారావు -లలిత,అనుమితి,తృణకంకణము, ఆంధ్రావళి, మధుకలశం,స్నేహలత, కష్టకమల, వనమాల, జడకుచ్చులు మొదలైనవి.

బసవరాజు అప్పారావు - సెలయేటి గానం, ప్రేమతత్వం, బసవరాజు అప్పారావు గీతాలు.

పింగళి- కాటూరి కవులు - తొలకరి, సంక్రాంతి, సౌందర నందనం.

కాటూరి వెంకటేశ్వరరావు- గుడిగంటలు, పౌలస్త్య హృదయం.

దేవులపల్లి కృష్ణశాస్త్రి - కృష్ణపక్షం, ప్రవాసం, ఊర్వశి, పల్లకి, సంస్కర్త మొదలైనవి.

దువ్వూరి రామిరెడ్డి - పానశాల, భగ్నహృదయం, కడపటి వీడ్కోలు, స్వప్నశేషం, నలజారమ్మ అగ్ని ప్రవేశం, కృషీవలుడు, వనకుమారి, జలదాంగన మొదలైనవి.

నండూరి సుబ్బారావు - యెంకి పాటలు

నాయని సుబ్బారావు - సౌభద్రుని ప్రణయ యాత్ర, మాతృగీతాలు, విషాదమోహనం, వేదనా వాసుదేవం, భాగ్యనగర కోకిల మొదలైనవి.

వేదుల సత్యనారాయణశాస్త్రి-దీపావళి, ముక్తఝరి.

అబ్బూరి రామకృష్ణారావు-మల్లికాంబ, జలాంజలి, ఊహాగానం,నదీ సుందరి, ఎర్రగన్నేరు, రసపిపాసి,కాపుపాలు,మాతృ భూమి,తిక్కన మొదలైనవి.

అడవి బాపిరాజు - శశికళ, గోధూళి, గంగిరెద్దు, వరద గోదావరి, చిగురుటాకులు, గడ్డిపూల పళ్ళెం, తరంగిణి, శిల్పబాల.

విశ్వనాథ సత్యనారాయణ - ఆంధ్రప్రశస్తి, ఆంధ్ర పౌరుషం, వరలక్ష్మి త్రిశతి, శశిదూతం, కిన్నెరసాని, కోకిలమ్మ పెళ్ళి, గిరికుమారుని ప్రేమగీతాలు, భ్రష్టయోగి.

అభ్యుదయ కవిత్వం



టెట్/డీఎస్సీ ప్రత్యేకం
తెలుగు

సామాజిక సిద్ధాంత బలాన్ని సమన్వయించుకొని వెల్లువెత్తిన తొలి ఆధునిక కవితోద్యమం **అభ్యుదయ కవిత్వం**. ఇది ఆంధ్రదేశంలో 1940 నుంచి 1960 చివరి వరకు ఉధృతంగా సాగింది. అభ్యుదయం అనే పదానికి **మంగళం, శుభం** అనే నైఘంటికార్థాలున్నాయి. ఆంగ్లంలోని '**ప్రోగ్రెస్**' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో '**అభ్యుదయం**' అనే పదాన్ని వాడుతున్నారు. ప్రస్తుతం ఈ పదానికి '**పురోగమనం, ప్రగతి శీలం, చైతన్యం**' అనే స్థూలార్థాలను గ్రహిస్తున్నాం. తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం శ్రామిక జన పక్షపాతం, వాస్తవికత, పీడితజన పక్షం, సమసమాజ నిర్మాణం మొదలైన అంశాలను ప్రవేశపెట్టింది **అభ్యుదయ కవిత్వమే**.

- సంస్కృతి పరిరక్షణ కోసం 1935లో '**పారిస్**' లో అంతర్జాతీయ రచయితల సదస్సు జరిగింది.
- 1935లో డిసెంబర్‌లో అలహాబాద్‌లో '**ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్**'ను ఏర్పాటు చేశారు.
- 1936 ఫిబ్రవరిలో లండన్ నుంచి వెలువడే '**ది డెయిలీ ట్రిబ్యూన్**' పత్రికలో భారత అభ్యుదయ రచయితల ప్రణాళికను ప్రకటించారు.
- 1936 ఏప్రిల్ 9,10 తేదీల్లో లక్నోలో '**మున్షీ ప్రేమ్ చంద్**' అధ్యక్షతన అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ మహాసభ నిర్వహించారు.
- 1932లో ఆడెన్ తదితర కవులు ఆంగ్లంలో '**న్యూ సిగ్నేచర్స్**' అనే కవితా సంకలనాన్ని వెలువరించారు.
- 1850 దశకంలో వెలువడిన కారల్ మార్క్స్ రచనలు ప్రపంచ వ్యాప్తంగా కవులు, కళాకారుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి.
- తెలుగునాట అభ్యుదయ సాహిత్యోద్యమానికి **మార్క్సిజమే** పునాది. 1943లో **అభ్యుదయ రచయితల సంఘాన్ని** ఏర్పరిచారు.
- 1943లో తెనాలిలో జరిగిన తొలి అభ్యుదయ రచయితల మహాసభలకు **తాపీ ధర్మారావు** అధ్యక్షత వహించారు.
- 1955లో బెజవాడలో **శ్రీశ్రీ** అధ్యక్షతన 5వ మహాసభలు జరిగాయి.
- చిట్టచివరి సమైక్య అభ్యుదయ రచయితల సభలను 1974లో **వాగంటి సోమయాజులు** అధ్యక్షతన ఒంగోలులో నిర్వహించారు.

అభ్యుదయ కవిత్వం - నిర్వచనాలు

1. 'ఊహాలోకాల్లో విహరిస్తున్న ఆధునిక కవిత్వాన్ని భూమార్గం పట్టించిందీ, సామాన్య మానవున్ని సాహిత్యానికి మకుటధారిని చేసిందీ **అభ్యుదయ కవిత్వం**'.
2. 'ధనిక సమాజం మారాలనుకోవడమే అభ్యుదయం' - **దేవులపల్లి కృష్ణశాస్త్రి**.
3. 'చైతన్యమే పర్యవసానంగా కలది అభ్యుదయ సాహిత్యం' - **వేల్చేరు నారాయణరావు**.

అభ్యుదయ కవిత్వం - లక్షణాలు

1. అంతర్జాతీయ దృక్పథంలో మానవాభ్యుదయాన్ని కాంక్షించడం.
2. ఆర్థిక అసమానతలు తొలగించి సామ్యవాద సమాజాన్ని నెలకొల్పడం.
3. పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోయడం.
4. వర్ణ, వర్గ రహిత సమ సమాజ స్థాపన.
5. శ్రమ దోపిడీ లేని సమాజం.
6. దేశ పారిశ్రామికీకరణం.
7. నవసమాజ నిర్మాణం.

తెలుగులో అభ్యుదయ కవిత్వ ప్రస్థానం

- తెలుగునాట అభ్యుదయ సాహిత్య మూలవిరాట్-**శ్రీశ్రీ** అని సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు.
- **శ్రీశ్రీ** 1934 ఏప్రిల్ 12న మహాప్రస్థానం గేయాన్ని రాశారు. ఇది ముద్దుకృష్ణ '**జ్వాల**' పత్రికలో మొదటగా ప్రచురితమైంది.
- తెలుగులో వెలువడిన తొలి అభ్యుదయ కవితా సంకలనం '**నయాగరా**'. 1944లో దీన్ని బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రమణ్యం కలసి రచించారు.
- **శ్రీశ్రీ మహాప్రస్థానం** సంపూర్ణ కావ్యంగా 1950లో ప్రచురితమైంది.

ప్రసిద్ధ కవులు - అభ్యుదయ రచనలు

శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ):
మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి

ఆరుద్ర:
త్వమేవాహం, సినీవాలి,
గాయాలు - గేయాలు

ఆవంత్స సోమసుందర్: వజ్రాయుధం (తెలంగాణ సాయుధ పోరాటం)

కాళోజీ నారాయణరావు: నా గొడవ (అభ్యుదయ కవితా సంపుటాలు)

దాశరథి కృష్ణమాచార్యులు: అగ్నిధార, రుద్రవీణ, పునర్నవం, ఆలోచనాలోచనలు, తిమిరంతో సమరం, మహోంధ్రోదయం.

రెంటాల గోపాలకృష్ణ:
సర్పయాగం, సంఘర్షణ

అనిసెట్టి సుబ్బారావు: అగ్నివీణ

కె.వి. రమణారెడ్డి: అడవి,
భువనఘోష, అంగారవల్లరి

సి. నారాయణరెడ్డి: మంటలు - మానవుడు, అక్షర గవాక్షం, విశ్వంభర, ప్రపంచ పదులు, నాగార్జున సాగరం, సినారె గజళ్ళు.

పురిపండా అప్పలస్వామి: పులిపంజా, అనల పతాకం, సంధ్యావందనం, స్వర్గానికి - నరకానికి.

పఠాభి: ఫిడేలు రాగాల డజన్,
పఠాభి పంచాంగం (1964)

శిష్టా ఉమామహేశ్వరరావు: నవమిచిలుక, విష్ణుధనువు

శ్రీరంగం నారాయణబాబు: మౌనశంఖం, రుధిరజ్యోతి

గతంలో అడిగిన ప్రశ్నలు

1. **ఆధునిక కవిత్వంలో రాయప్రోలు సుబ్బారావు మొదటగా లేవనెత్తిన ప్రణయ సిద్ధాంతం?**
   1) కులపాలికా ప్రణయం
   2) కరుణ విప్రలంభం
   3) అమలిన శృంగారం
   4) విప్రలంభ శృంగారం
2. **'కవి అవిస్పష్ట వాంఛాంకురం, ఒక అంతర్నిగూఢ తాపం ఒక చిన్న కావ్యంలో ఊదబడితే' అది?**
   1) విప్లవ కవిత్వం
   2) అభ్యుదయ కవిత్వం
   3) ఆధ్యాత్మిక కవిత్వం 4) భావ కవిత్వం
3. **'వేదాంతాలు జీవితాన్నీ, ప్రకృతినీ అవగాహన చేసుకున్నారు; మేం లోకాన్ని, జీవితాన్ని, ప్రకృతినీ కూడా మారుస్తాం' అనే శ్రీరంగం నారాయణ బాబు మాటలు దేనికి ప్రాతినిధ్యం వహిస్తాయి?**
   1) దిగంబర కవిత 2) అభ్యుదయ కవిత
   3) భావ కవిత 4) విప్లవ కవిత
4. **అభ్యుదయ కవిత్వ ప్రధాన లక్షణం?**
   1) వర్గ సామరస్యం 2) వర్గ సంఘర్షణ
   3) ప్రణయ బోధన 4) దేశభక్తి ప్రబోధం

సమాధానాలు

1) 3; 2) 4; 3) 2; 4) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్-సీబీఆర్ఐ, రూర్కీలో 31 సైంటిస్ట్ పోస్టులు

రూర్కీ (ఉత్తరాఖండ్)లోని సీఎస్ఐఆర్-సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీబీఆర్ఐ) సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 31.
» **పోస్టుల వివరాలు:** ప్రిన్సిపల్ సైంటిస్ట్-02, సీనియర్ సైంటిస్ట్-02, సైంటిస్ట్-27.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, ఎంఆర్క్, ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు 45 ఏళ్లు, సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏళ్లు, సైంటిస్ట్‌కు 32 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు రూ.1,23,100, సీనియర్ సైంటిస్ట్‌కు రూ.78,800, సైంటిస్ట్‌కు రూ.67,700.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.03.2025
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.04.2025
» **వెబ్‌సైట్:** https://cbri.res.in

ఐఐఎస్ఈఆర్, తిరుపతిలో కౌన్సిలర్ పోస్టులు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్).. ఒప్పంద ప్రాతిపదికన కౌన్సిలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 28.03.2025 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.84,150.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.03.2025.
» **వెబ్‌సైట్:** https://www.iisertirupati.ac.in/



కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

పట్టు వస్త్రాల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న రాష్ట్రం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భారతదేశంలో పారిశ్రామిక రంగం

భారతదేశంలో భారీ పరిశ్రమల స్థాపన 19వ శతాబ్దం రెండో అర్ధ భాగం నుంచి ప్రారంభమైంది. అదే సమయంలో దేశంలో రైల్వేల నిర్మాణాన్ని చేపట్టడం, బ్రిటిష్ పెట్టుబడిదారులు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి సుముఖత వ్యక్తం చేయడం, కోల్‌కతా, మద్రాసు, ముంబై ప్రెసిడెన్సీల్లో యూనివర్సిటీల స్థాపన తదితరాలు దీనికి దోహదం చేశాయి.

ముడి పదార్థాల స్వభావం ఆధారంగా పరిశ్రమలను 3 రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

1) వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు
2) అటవీ ఆధారిత పరిశ్రమలు
3) ఖనిజ ఆధారిత పరిశ్రమలు

> ఆధునిక యుగంలో దేశ ప్రగతి, ఆర్థికాభివృద్ధి పరిశ్రమల పైనే ఆధారపడి ఉందని చెప్పవచ్చు. పారిశ్రామికాభివృద్ధి అనేది పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అనువైన స్థలాల ఎంపిక, ముడి పదార్థాల లభ్యత, మార్కెట్ సౌకర్యాలు, పెట్టుబడుల లభ్యత, నాణ్యమైన, తక్కువ వేతనాలతో లభ్యమయ్యే కార్మికులు, రవాణా సౌకర్యాలు, విద్యుత్ లభ్యత లాంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు

ఎ) వస్త్ర (జౌళి) పరిశ్రమ

జౌళి అనేది విస్తృతమైన పదం. ఇందులో నూలు వస్త్ర పరిశ్రమ, జనపనార, ఉన్ని, పట్టు, సింథటిక్ వస్త్ర పరిశ్రమలు వస్తాయి.

నూలు వస్త్ర పరిశ్రమ: దేశంలో నూలు వస్త్ర పరిశ్రమ అతి పురాతనమైన, అతిపెద్ద వ్యవస్థీకృత పరిశ్రమ. ఇది ఎక్కువ మంది శ్రామికులకు ఉపాధి కల్పిస్తోంది. ఇందులో 45 మిలియన్ల శ్రామికులు పని చేస్తున్నారు. దేశంలో మొదటిసారిగా నూలు మిల్లును 1818లో కోల్‌కతా సమీపంలోని 'ఫోర్‌గ్లాస్టర్'లో ఏర్పాటు చేశారు. మొట్టమొదటి అధునాతన నూలు వస్త్ర పరిశ్రమను 1854లో పార్శీ పెట్టుబడిదారుల సహాయంతో ముంబైలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో నూలు వస్త్రాల ఉత్పత్తిలో చైనా, అమెరికా, భారత్ వరుసగా మొదటి 3 స్థానాల్లో ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో నూలు వస్త్రాల ఉత్పత్తికి ముంబై ప్రధాన కేంద్రంగా ఉంది. అందువల్ల ముంబైని 'మాంచెస్టర్ ఆఫ్ ఇండియా'గా పిలుస్తారు. అహ్మదాబాద్, కోయంబత్తూర్ తర్వాతి స్థానంలో ఉన్నాయి.

ముంబై నూలు వస్త్రాల ఉత్పత్తికి ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందడానికి దోహదపడిన అంశాలు:

- పత్తి పండే నల్లరేగడి భూములు ముంబై పరిసరాల్లో అధికంగా ఉండటం.
- తేమతో కూడిన వాతావరణం.
- తక్కువ వేతనాలతో కార్మికులు లభ్యమవడం.
- నిరంతర విద్యుత్ సరఫరా.
- పెట్టుబడులు లభించడం.
- రోడ్డు, రైల్వే మార్గాల ద్వారా ముంబై దేశంలోని ఇతర నగరాలతో బాగా అనుసంధానించి ఉండటం.
- ఓడరేవు సౌకర్యాలు ఉండటం.

దేశంలో నూలు వస్త్రాల ఉత్పత్తి ఎక్కువగా మరమగ్గాల ద్వారా జరుగుతోంది. తర్వాత స్థానాల్లో చేనేత, మిల్ సెక్టార్‌లు ఉన్నాయి. దేశంలో మరమగ్గాలు ఎక్కువ సంఖ్యలో మహారాష్ట్రలో ఉండగా, తర్వాత స్థానంలో తమిళనాడు ఉంది. గుజరాత్‌లో మిల్ సెక్టార్‌లో నూలు వస్త్రాల ఉత్పత్తి ఎక్కువగా ఉంది.

జనుము వస్త్ర పరిశ్రమ: దేశంలో మొదటి జనుము వస్త్ర పరిశ్రమను 1855లో కోల్‌కతా సమీపంలోని శ్రీరాంపూర్ వద్ద ఉన్న 'రిష్రా' అనే ప్రదేశంలో ఏర్పాటు చేశారు. దేశంలో జనుము వస్త్ర పరిశ్రమ ప్రధానంగా పశ్చిమ బెంగాల్‌లోని 'హుగ్లీ' నదీపరీవాహక ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది.

దేశంలో జనుపనార మిల్లులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు వరుసగా పశ్చిమబెంగాల్. ఆంధ్రప్రదేశ్ (విజయనగరం జిల్లా), బిహార్, ఉత్తర ప్రదేశ్. ప్రపంచంలో జనుము వస్త్రాల ఉత్పత్తిలో భారత్ మొదటి స్థానంలో ఉంది. ఎగుమతుల్లో బంగ్లాదేశ్ తర్వాత రెండో స్థానంలో ఉంది.

హుగ్లీ బేసిన్‌లో జనుపనార మిల్లులు కేంద్రీకృతం కావడానికి కారణాలు:

- ఈస్ట్ ఇండియా కంపెనీ ద్వారా బ్రిటిష్ వర్తకులు ముందే కోల్‌కతా రావడం.
- హుగ్లీ పరీవాహకంలో జనుము పంటకు అనువైన నేలలు, వ్యవసాయ సంబంధిత శీతోష్ణస్థితి, రుతువులు అనుకూలంగా ఉండటం.
- జనుపనారను శుద్ధి చేయడానికి కావాల్సినంత నీటి లభ్యత ఉండటం.
- హుగ్లీ జలమార్గం ద్వారా జనుము ఉత్పత్తి ప్రాంతాలను మిల్లులతో కలిపే సౌకర్యం ఉండటం.
- తేమతో కూడిన వాతావరణం.
- ఎగుమతులకు కోల్‌కతా రేవు అనుకూలంగా ఉండటం.
- కార్మికులు చౌకగా లభ్యమవడం.
- రాణీగంజ్, ఝరియా బొగ్గు గనుల నుంచి బొగ్గు; దామోదర వ్యాలీ కార్పొరేషన్ నుంచి విద్యుత్తు చౌకగా అందుబాటులో ఉండటం.



జనుము సంబంధిత ముఖ్యమైన ఉత్పత్తులు: గోనె సంచులు, కన్‌వాస్, ప్యాక్‌షీట్లు, జూట్ వెబ్బింగ్, గోనెగుడ్డ, తాళ్లు, రంగులు, తివాచీలు, టార్పాలీన్లు మొదలైనవి. జనుప నార, దాని ఉత్పత్తుల ద్వారా పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యం లభ్యమవుతోంది. అందువల్ల దీన్ని 'గోల్డెన్ ఫైబర్ ఆఫ్ ఇండియా'గా పేర్కొంటారు.

ఉన్ని వస్త్ర పరిశ్రమ: దేశంలో మొదటి ఉన్ని వస్త్ర పరిశ్రమను 1876లో 'కాన్పూర్'లో ఏర్పాటు చేశారు. దీనికి కారణం ఇది బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ ప్రధాన స్థావరంగా ఉండేది. ప్రస్తుతం ఉన్ని వస్త్రాల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న రాష్ట్రం పంజాబ్. గురుదాస్‌పూర్, లూధియానా, అమృత్‌సర్ ప్రాంతాల్లో ఉన్ని వస్త్రాలను అధికంగా ఉత్పత్తి చేస్తున్నారు. ఉన్ని ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న రాష్ట్రం రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌లోని గద్దీలు, ఉత్తరాఖండ్‌లోని గుజ్జార్లు, జమ్ము-కశ్మీర్‌లోని బేకర్స్ వాల్స్ పెంచే గొర్రెలకు చెందిన ఉన్ని.. ఉత్పత్తి కేంద్రాలకు అధికంగా సరఫరా అవుతోంది. కానీ, దేశంలో ఉన్ని వస్త్ర పరిశ్రమ అనుకున్న స్థాయిలో అభివృద్ధి చెందలేదు. దీనికి కారణాలు..

1. దేశంలో శీతాకాల నిడివి తక్కువగా ఉండటం.
2. దేశంలో ఉత్పత్తి అయ్యే ఉన్నికి నాణ్యత తక్కువ ఉంది. అందువల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ ఉన్ని వస్త్రాలకు గిరాకీ తక్కువగా ఉంది.

పట్టు వస్త్ర పరిశ్రమ: దేశంలో మొదటిసారిగా పట్టు వస్త్ర పరిశ్రమను 1932లో పశ్చిమ బెంగాల్‌లోని 'హౌరా' వద్ద స్థాపించారు.

పట్టు వస్త్రాల ఉత్పత్తిలో చైనా ప్రథమ స్థానంలో ఉంది. భారత్ రెండో స్థానంలో ఉంది. భారత దేశంలో మాత్రమే 4 రకాల పట్టును (మల్బరీ, టస్సార్, ఎరి, ముగ) ఉత్పత్తి చేస్తున్నారు. దేశంలో పట్టు వస్త్రాల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న రాష్ట్రం కర్ణాటక. పశ్చిమ బెంగాల్ రెండో స్థానంలో ఉంది.

సింథటిక్ పరిశ్రమ: 'పాలిమెరైజేషన్' ప్రక్రియ ద్వారా వృక్షాల సెల్యులోజ్ నుంచి సింథటిక్ దారాలను తీస్తారు. వాటి నుంచి సింథటిక్ వస్త్రాలను తయారు చేస్తారు. రేయాన్, నైలాన్, పాలిఎస్టర్, టెర్రీకాటన్ మొదలైనవి సింథటిక్ వస్త్రాలు. ప్రపంచంలో ఈ వస్త్రాల ఉత్పత్తిలో యూఎస్ఏ ప్రథమ స్థానంలో ఉంది. భారత్‌లో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంది.

సింథటిక్ వస్త్రాల ఉత్పత్తి కేంద్రాలు:

1. రేయాన్ యూనిట్లు: కేరళలో 'రేయానో పురం', తెలంగాణలోని కాగజ్‌నగర్.
2. నైలాన్ యూనిట్లు: రాజస్థాన్‌లోని కోట, మహారాష్ట్రలోని పింప్రీ, ముంబై.
3. పాలిఎస్టర్ యూనిట్లు: ముంబై, థానే, అహ్మదాబాద్.

బి) పంచదార పరిశ్రమ

దేశంలో రెండో అతిపెద్ద వ్యవసాయ ఆధారిత పరిశ్రమ ఇది. సుమారు 4 లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. దేశంలో మొదటిసారిగా పంచదార పరిశ్రమను 1840లో డచ్‌వారు బిహార్‌లో స్థాపించారు. పంచదార, దాని ఉప ఉత్పాదితాలైన బెల్లం, ఖండసారిలను కలుపుకుంటే భారతదేశం పంచదార పరిశ్రమలో ప్రపంచంలోనే ప్రథమస్థానంలో ఉంది.

చక్కెర పరిశ్రమకు ప్రత్యేకంగా ఇంధనం అవసరం లేదు. ఈ పరిశ్రమలో తయారయ్యే ఉప ఉత్పాదితమైన బగస్సీని ఇంధనంగా ఉపయోగించుకోవచ్చు. ఈ బగస్సీని ఉపయోగించి తణుకులోని ఆంధ్రా సుగర్స్‌లో రాకెట్లలో ఉపయోగించే ఇంధనాన్ని తయారు చేస్తున్నారు. మొలాసిస్‌ను ఉపయోగించి చాక్లెట్లను తయారు చేస్తున్నారు.

దేశంలో పంచదార మిల్లులు ఎక్కువగా ఉత్తర ప్రదేశ్‌లో (81) ఉన్నాయి. మహారాష్ట్ర (68), కర్ణాటక (32), తమిళనాడు (22) తర్వాతి స్థానంలో ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో పంచదార ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర. తర్వాత స్థానంలో ఉత్తరప్రదేశ్ ఉంది. పంచదార ఉత్పాదకత దక్షిణ భారత రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉంది. దీనికి కారణాలు..

1. చెరకు ఉష్ణమండల పంట. దక్షిణ భారత రాష్ట్రాల్లో దానికి తగిన శీతోష్ణస్థితులు ఉన్నందువల్ల ఇక్కడ ఉత్పాదకత ఎక్కువగా ఉంది.
2. దక్షిణ భారత రాష్ట్రాల్లో పండే చెరకులో సుక్రోజ్ శాతం ఎక్కువగా ఉంటుంది.
3. దక్షిణాదిలో చెరకు క్రషింగ్ సీజన్ (అక్టోబర్ - జూన్) ఎక్కువగా ఉంది. ఇది ఉత్తరాది రాష్ట్రాల్లో నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు మాత్రమే ఉంది.

అటవీ ఆధారిత పరిశ్రమలు

కాగితం పరిశ్రమ: దేశంలో మొదటి కాగితం పరిశ్రమను 1832లో కోల్‌కతా సమీపంలో 'షెరంపూర్'లో ఏర్పాటు చేశారు. మొదటి అధునాతన కాగితపు పరిశ్రమ (రాయల్ బెంగాల్ పేపర్ మిల్)ను 'బాలిగంజ్'లో 1870లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కాగితం ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర.

కాగితం తయారీలో ఉపయోగించే ముడి పదార్థాలు: కొయ్యగుజ్జు, సబాయ్, సలాయ్, వెదురు, ఎలిఫెంట్ లాంటి గడ్డిజాతులు, రాగులు, వృథా కాగితం. కర్ణాటకలోని బెళగొళలో కాగితపు పరిశ్రమలో బగస్సీ (చెరకు పిప్పి)ని ఉపయోగించి కాగితాన్ని తయారు చేస్తున్నారు.

కాగితపు ఉత్పాదితాల తయారీ కేంద్రాలు:

1. మధ్యప్రదేశ్‌లోని దేవాస్, హోసంగాబాద్ యూనిట్లలో కరెన్సీ పేపర్‌ను తయారు చేస్తున్నారు.
2. 1981లో మొదటిసారిగా న్యూస్‌ప్రింట్ కాగితాన్ని ఉత్పత్తి చేసే యూనిట్‌ను మధ్యప్రదేశ్‌లోని నేపానగర్‌లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో న్యూస్ ప్రింట్ తయారీ యూనిట్లు 26 ఉన్నాయి.

The name Touhou is coined by..

BANK EXAMS
GENERAL ENGLISH



1. God helps those_______help themselves.
   1) Whom 2) which
   3) them 4) who
2. His character is different _______ yours.
   1) With 2) for
   3) from 4) at
3. The old mother advised her sons to live together in peace. (Change into Direct speech)
   1) The old mother said, "her sons live together in peace."
   2) "Live together in peace", said the old mother.
   3) The old mother said, "My dear sons, live together in peace."
   4) The old mother said, "live together in peace sons."
4. Work hard _______ you should fail.
   1) unless 2) as if
   3) although 4) lest
5. I am obliged to you _______ your kindness.
   1) for 2) upon 3) of 4) with
6. They robbed him _______ his money.
   1) with 2) from
   3) for 4) of
7. I gave her a rupee. (Change into Passive)
   1) A rupee was given to her by me.
   2) She gave a rupee to me.
   3) She was gave a rupee to her.
   4) I was given a rupee.
8. Let the doors be shut. (Change into Active)
   1) Somebody be shut the doors.
   2) He will shut the doors.
   3) He may shut the doors.
   4) Shut the doors.
9. Please try_______. (Use an appropriate word to fill the blank)
   1) to help 2) in helping
   3) helping 4) for help
10. Which sentence is correct?
    1) He has gone to Mumbai last Monday.
    2) They go to school by foot.
    3) Neither Aruna nor Amita are present.
    4) The sweets were distributed between the children.
11. She seldom makes a mistake. The sentence which is similar in meaning is_______
    1) She rarely makes a mistake.
    2) She regularly makes a mistake.
    3) She often makes a mistake.
    4) She was doing mistakes on and off.
12. _______ cotton of Egypt is superior to that of _______ India.
    1) the, the 2) the, a
    3) a, the 4) the, no article
13. Health is better than _______ wealth.
    1) a 2) an 3) the
    4) no article
14. Raghu loves music. (Use an appropriate question tag)
    1) Is he? 2) Isn't raju?
    3) doesn't he?4) Haven't he?
15. They will come with you to the restaurant _______?
    1) will they 2) does they
    3) won't they 4) doesn't they
16. Her short hair <u>accentuated</u> her. The underlined word means
    1) emphasized 2) heightened
    3) shortened 4) minimized
17. He has ants in pants, means
    1) he is happy
    2) he is sad
    3) he is excited
    4) he is disappointed
18. Which of the sentence is correct?
    1) "Raju went to a movie", Ramani said.
    2) Ramani said "raju gone to a movie?"
    3) "raju going to movie" Ramani said
    4) Ramani said, "Raju see a movie?"
19. Identify the sentence with correct use of punctuation
    1) Alexander the conqueror of the world began to weep.
    2) Alexander, the conqueror of the world, began to weep.
    3) alexander the conqueror of the world began to weep
    4) Alexander the conqueror, of the world began to weep
20. The noise drove him mad. The structure of the sentence is
    1) S + V + object + complement
    2) S + V + O1 + O2
    3) S + V + IO
    4) S + V + O
21. Identify the silent letters in 'fight'
    1) f, t 2) f, h, g
    3) h, g 4) g, i, t
22. 'Dear' can be used in _______
    1) formal letters
    2) semi formal letters
    3) personal letters
    4) all the above
23. Subject line is not mandatory in _______
    1) formal letters
    2) letters of complaint
    3) personal letters
    4) letter to the editor
24. His performance was <u>abysmal</u>. The opposite of the underlined word is _______
    1) terrible 2) sad
    3) tremendous 4) appreciable
25. The agitating workers have decided to_______their strike.
    1) call in 2) call on
    3) call upon 4) call off
26. The college's geology department has a large <u>rock</u> collection. The parts of speech of the underlined word is _______
    1) adjective 2) verb
    3) noun 4) pronoun
27. I want to go <u>now</u>. The parts of speech of the underlined word is-_______
    1) pronoun 2) preposition
    3) conjunction 4) adverb
28. We need a house to live in. (Change into complex sentence)
    1) We need a house where we can live in.
    2) We need a house can live in.
    3) We need a house where we can live on.
    4) We need a house and we can live.
29. Investigation is a word with _______ syllables.
    1) Two 2) Three
    3) Four 4) Five
30. /d3 / sound is present in
    1) jam 2) again
    3) glass 4) mega
31. /al/ sound is present in
    1) bay 2) eye 3) Bat 4) Bond
32. The jigsaw puzzle kept the children <u>frenzied</u>. The underlined word means
    1) hyperactive 2) dull
    3) Surprised 4) Comedy

Passage

About a hundred and thirty years ago, people at Waikanae, north of Wellington, saw great numbers of strange birds. They were little green birds with a white ring of feathers around their eyes. Scientists soon found out that these birds had come all the way across the Tasman Sea by very strong winds. The Maoris called the new bird "tauhou", word for "stranger". Today they are also known as wax-eyes, white-eyes, or silver-eyes. Because they can eat all sorts of food, and because they can live in many different kinds of places, wax-eyes have increased in numbers. They are now found all over New Zealand – along the coasts, round the islands, in scrub, in tussock country, in the bush, on farms and in city gardens. There are probably more wax-eyes in New Zealand than any other kind of bird. Usually, you see them in groups, hopping very quickly through bushes and trees. They make a high twittering noise most of the time as they work along, eating insects, nectar and berries. Their noise may help them to recognize each other and to keep the group together.

33. Which birds are more in number in New Zealand?
    1) Tauhou 2) green eyes
    3) garden birds 4) strange birds
34. The name Touhou is coined by-_______
    1) Newzealand 2) scientists 3) people 4) Maoris
35. How did the birds travel?
    1) Across the gardens
    2) Through the bushes
    3) Eating nectar
    4) By strong winds
36. They keep together in group through_______
    1) Noise 2) trees
    3) farms 4) bushes
37. The antonym of recognize is
    1) familiar 2) identify
    3) classify 4) forget
38. Mind your own business.
    1) a statement 2) request
    3) interrogation 4) order
39. Identify the correct spelt word from the following
    1) parsel 2) parsil
    3) perceal 4) parcel
40. The police arrived. The crowd dispersed. The sentence which is similar in meaning is
    1) The police dispersed the crowd.
    2) The crowd dispersed the police.
    3) The police having arrived, the crowd dispersed.
    4) Upon arrival the crowd dispersed.

Key

1) 4;	2) 3;	3) 3;	4) 4;
5) 1;	6) 4;	7) 1;	8) 4;
9) 1;	10) 3;	11) 1;	12) 4;
13) 4;	14) 3;	15) 3;	16) 1;
17) 3;	18) 1;	19) 2;	20) 1;
21) 3;	22) 4;	23) 3;	24) 1;
25) 4;	26) 1;	27) 4;	28) 1;
29) 4;	30) 1;	31) 2;	32) 1;
33) 1;	34) 4;	35) 4;	36) 1;
37) 4;	38) 4;	39) 4;	40) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

దీన్ దయాల్ పోర్ట్ అథారిటీలో మేనేజర్ పోస్టులు

కచ్(గుజరాత్)లోని దీన్ దయాల్ పోర్ట్ అథారిటీ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
- **పోస్టుల వివరాలు:** చీఫ్ మేనేజర్-04, సీనియర్ మేనేజర్-04, మేనేజర్-08.
- **విభాగాలు:** ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, కార్పొరేట్ లీగల్, ఇన్విరాన్‌మెంట్ అండ్ సేఫ్టీ, బిజినెస్ డెవలప్‌మెంట్ అండ్ ట్రేడ్ ప్రమోషన్.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్(కంప్యూటర్ సైన్స్, ఐటీ), లా, పీజీ(ఇన్విరాన్‌మెంటల్ సైన్స్, ఎంబీఏ), డిప్లొమా(సేఫ్టీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** మేనేజర్‌కు 40 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 45 ఏళ్లు, చీఫ్ మేనేజర్‌కు 55 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది సెక్రటరీ, దీన్ దయాల్ పోర్ట్ అథారిటీ, పోస్ట్ బ్యాగ్ నెం.50, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ బిల్డింగ్, ఠాగూర్ రోడ్, గాంధీధమ్(కచ్), గుజరాత్-370201 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 20.03.2025.
- **వెబ్‌సైట్:** http://irfc.co.in/

ఐఆర్‌ఎఫ్‌సీ, న్యూఢిల్లీలో 11 పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఆర్‌ఎఫ్‌సీ) వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
- **పోస్టుల వివరాలు:** గ్రూప్ జనరల్ మేనేజర్(ఐటీ)-01, అడిషనల్ జనరల్ మేనేజర్(ఫైనాన్స్)-02, అడిషనల్ జనరల్ మేనేజర్(ఫైనాన్స్-ఇంటర్నల్ ఆడిట్)-01, మేనేజర్(ఫైనాన్స్)-05, మేనేజర్(ఐటీ)-01, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్(కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఎంసీఏ, ఎంబీఏ), సీఏ, సీఎంఏ, డిగ్రీ(కామర్స్), పీజీ, డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 01.03.2025 నాటికి గ్రూప్ మేనేజర్‌కు 55 ఏళ్లు, అడిషనల్ జనరల్ మేనేజర్, పీఆర్‌వోకు 50 ఏళ్లు, మేనేజర్(ఫైనాన్స్)కు 47 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జీఎం/హెచ్‌ఆర్ అండ్ అడ్మిన్, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్, యూజీ ఫ్లోర్, ఈస్ట్ టవర్, ఎన్‌బీసీసీ ప్లేస్, భీష్మ పితామహ మార్గ్, లోధి రోడ్, ప్రగతి విహార్, న్యూఢిల్లీ-110003 చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 20.03.2025.
- **వెబ్‌సైట్:** https://irfc.co.in/